సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50


సంపుటి: 17 సంచిక: 254

గురువారం 5-12-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



టైటాన్స్‌కు మరో పరాజయం

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టుకు ఏడో పరాజయం ఎదురైంది. బుధవారం హోరాహోరీగా సాగిన పోరులో టైటాన్స్ 33-36తో యూపీ యోధాస్ చేతిలో ఓటమి పాలైంది. స్టార్ రెయిడర్ విజయ్ 11 పాయింట్లతో సత్తా చాటినా... కీలక సమయాల్లో ఆధిక్యం కనబర్చిన యోధాస్ విజేతగా నిలిచింది. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో టైటాన్స్ 19 రెయిడ్ పాయింట్లు సాధించగా... యూపీ యోధాస్ 24 పాయింట్లతో ముందంజ వేసింది. యూపీ యోధాస్ ప్రధాన రెయిడర్ గగన్ నారంగ్ 15 పాయింట్లతో విజృంభించాడు. తాజా సీజన్‌లో 16 మ్యాచ్‌లాడిన టైటాన్స్ తొమ్మిందిట గెలిచింది. ఏడింటిలో ఓడింది. 49 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 39-32తో హరియాణా స్టీలర్స్‌ను ఓడించింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో దబంగ్ ఢిల్లీతో యూపీ యోధాస్ (రాత్రి 8 గంటలకు), జైపూర్ పింక్ పాంథర్స్‌తో యు ముంబా (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

పోరాడి ఓడిన భారత్


భావన

న్యూఢిల్లీ: ఆసియా మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. ఇరాన్ జట్టుతో బుధవారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 30-32 గోల్స్ తేడాతో పోరాడి ఓడిపోయింది. భారత్ తరఫున భావన శర్మ అత్యధికంగా 7 గోల్స్‌తో రాణించింది. ప్రియాంక ఠాకూర్, షాలిని ఠాకూర్, గుల్షన్ శర్మ, మేనిక, ప్రియాంక 4 గోల్స్ చొప్పున సాధించారు. సుష్మా మూడు గోల్స్ చేసింది. ఇరాన్ జట్టు తరఫున నస్తారన్ 7 గోల్స్ చేయగా... నొరూజీ, అరెజూ, సెతారె 5 గోల్స్ చొప్పున సాధించారు. శుక్రవారం జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో జపాన్‌తో భారత్; హాంకాంగ్‌తో ఇరాన్ తలపడతాయి. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన జపాన్ జట్టుకు సెమీఫైనల్ బెర్త్ ఖరారు కాగా... మరో సెమీఫైనల్ బెర్త్ కోసం భారత్, ఇరాన్, హాంకాంగ్ రేసులో ఉన్నాయి.

మళ్లీ ఓడిన హైదరాబాద్



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) టోర్నీలో మాజీ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (హెచ్ఎఫ్‌సీ) మరో పరాజయాన్ని మూటగట్టుకుంది. సొంత మైదానమైన గచ్చిబౌలి స్టేడియంలో బుధవారం జరిగిన పోరులో ఎఫ్‌సీ గోవా 2-0 గోల్స్ తేడాతో హైదరాబాద్‌ను ఓడించింది. లీగ్‌కు హెచ్ఎఫ్‌సీకి ఇది వరుసగా మూడో ఓటమి. గోవా తరఫున తొలి అర్ధభాగంలోనే ఉదాంత సింగ్ (33వ నిమిషంలో), ఐకర్ గ్వారొటెనా (44వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. ఈ సీజన్‌లో 10 మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ 2 విజయాలు సాధించింది. 7 మ్యాచ్‌లలో ఓడి మరో మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించింది. ఓవరాల్‌గా 7 పాయింట్లతో ప్రస్తుతం 11వ స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు వరుసగా నాలుగో విజయంతో గోవా మూడో స్థానానికి చేరుకుంది.



'ఆసియా' యువ భారత్‌దే

ఐదోసారి ఆసియా కప్ టైటిల్ నెగ్గిన టీమిండియా ● ఫైనల్లో పాకిస్తాన్‌పై 5-3తో విజయం

మస్కట్: ఒకే విజయంతో యువ భారత జట్టు రెండు లక్ష్యాలను సాధించింది. పురుషుల అండర్-21 ఆసియా కప్ హాకీ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన భారత జట్టు టోర్నీని అజేయంగా ముగించింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ జట్టుతో బుధవారం జరిగిన ఫైనల్లో శర్దానంద్ తివారి సారథ్యంలోని టీమిండియా 5-3 గోల్స్ తేడాతో గెలుపొందింది. తద్వారా ఈ టోర్నీ టైటిల్‌ను ఐదోసారి సొంతం చేసుకుంది. గతంలో భారత జట్టు 2004, 2008, 2015, 2023లలో ఈ టైటిల్‌ను సాధించింది. తాజా విజయంతో భారత జట్టు వచ్చే ఏడాది జరిగే జూనియర్ ప్రపంచకప్ టోర్నీకి కూడా అర్హత సాధించింది. ఇదే టోర్నీలో గతంలో రెండుసార్లు ఫైనల్లో పాకిస్తాన్‌ను ఓడించిన భారత జట్టు మూడోసారి అదే ఫలితాన్ని పునరావృతం చేసింది. భారత్ తరఫున అరిజీత్ సింగ్ హుండల్ ఏకంగా నాలుగు గోల్స్ (4వ, 18వ, 47వ, 54వ నిమిషాల్లో) సాధించగా... దిల్‌రాజ్ సింగ్ (19వ నిమిషంలో) ఒక గోల్ చేశాడు. పాకిస్తాన్ జట్టు తరఫున సూఫియాన్ ఖాన్ (30వ, 39వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... హన్నాన్ షాహిద్ (3వ నిమిషంలో) ఒక గోల్ సాధించాడు. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో జపాన్ 2-1తో మలేసియాను ఓడించింది. పాకిస్తాన్, జపాన్, మలేసియా జట్లు కూడా వచ్చే ఏడాది జరిగే జూనియర్ ప్రపంచకప్ టోర్నీకి అర్హత పొందాయి. పాక్‌తో జరిగిన తుది పోరులో భారత జట్టుకు ఆరంభంలోనే షాక్ తగిలింది. మూడో నిమిషంలో హన్నాన్ చేసిన గోల్‌తో పాకిస్తాన్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే వెంటనే తేరుకున్న భారత జట్టు మరుసటి నిమిషంలోనే గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేసింది. 14 నిమిషాల తర్వాత భారత్ రెండు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేసి 3-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం పాక్ పోరాడి మూడో క్వార్టర్ ముగిసేసరికి మరో రెండు గోల్స్ చేసి భారత ఆధిక్యాన్ని 3-4కి తగ్గించింది. చివరి క్వార్టర్‌లో భారత్ జోరు కొనసాగించి ఏడు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేసి 5-3తో ముందంజ వేసింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకున్న టీమిండియా ఆసియా కప్ టైటిల్‌ను హస్తగతం చేసుకుంది. మ్యాచ్ మొత్తంలో భారత జట్టుకు ఆరు పెనాల్టీ కార్నర్‌లు లభించాయి. ఇందులో టీమిండియా నాలుగింటిని సద్వినియోగం చేసుకొని, రెండింటిని వృథా చేసింది. మరోవైపు పాక్ జట్టు సంపాదించిన రెండు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచింది.

ఎనిమిదో గేమ్ కూడా 'డ్రా'



సింగపూర్ సిటీ: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో మరో 'డ్రా' నమోదైంది. భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్, ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా) మధ్య జరిగిన ఎనిమిదో గేమ్ 51 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. ఇద్దరి మధ్య మొత్తం 14 గేమ్‌లు జరుగుతాయి. ఇప్పటికి ఎనిమిది గేమ్‌లు పూర్తయ్యాయి. ఇద్దరూ 4 పాయింట్లతో సమఉజ్జీగా ఉన్నారు. మొదట 7.5 పాయింట్లు సాధించిన ప్లేయర్ విశ్వవిజేతగా నిలుస్తాడు. 32 ఏళ్ల డింగ్ లిరెన్ తొలి గేమ్‌లో గెలుపొందగా... చెన్నైకి చెందిన 18 ఏళ్ల గుకేశ్ మూడో గేమ్‌లో నెగ్గాడు. మిగతా ఆరు గేమ్‌లు 'డ్రా'గా ముగిశాయి. నేడు తొమ్మిదో రౌండ్ గేమ్ జరుగుతుంది.

సూర్యవంశీ, ఆయుశ్ మెరుపులు

- యూఏఈపై యువ భారత్ 10 వికెట్లతో ఘనవిజయం
- అండర్-19 ఆసియా కప్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశం
- ఫైనల్లో చోటు కోసం రేపు శ్రీలంకతో భారత్ పోరు


సూర్యవంశీ, ఆయుశ్

షార్జా: సెమీఫైనల్‌కు చేరాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో యువ భారత జట్టు అదరగొట్టింది. అండర్-19 ఆసియా కప్ క్రికెట్ టోర్నీలో భాగంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టుతో జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. యూఏఈ నిర్దేశించిన 138 పరుగుల లక్ష్యాన్ని భారత జట్టు 16.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 143 పరుగులు చేసి గెలిచింది. 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ (46 బంతుల్లో 76 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు)తో కలిసి ఆయుశ్ మాత్రే (51 బంతుల్లో 67 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 143 పరుగులు జత చేశాడు. స్కోర్లు సమమైన వేళ ఆయుశ్ సిక్స్ కొట్టి భారత విజయాన్ని ఖరారు చేశాడు. ఇటీవల ఐపీఎల్ మెగా వేలంలో రూ. ఒక కోటీ 10 లక్షలకు అమ్ముడుపోయి అందరి దృష్టిని ఆకర్షించిన బిహార్ టీనేజర్ వైభవ్ సూర్యవంశీ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న యూఏఈ 44 ఓవర్లలో 137 పరుగులకే కుప్పకూలింది. మొహమ్మద్ రయాన్ (35; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో యుధాజిత్ గుహ 3 వికెట్లు తీయగా... చేతన్ శర్మ, హార్దిక్ రాజ్ 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. కార్తికేయ, ఆయుశ్ మాత్రేలకు ఒక్కో వికెట్ దక్కింది. ఈ గెలుపుతో భారత జట్టు గ్రూప్ 'ఎ'లో నాలుగు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. జపాన్‌తో జరిగిన మరో మ్యాచ్‌లో పాకిస్తాన్ 180 పరుగుల ఆధిక్యంతో గెలిచింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన పాకిస్తాన్ ఆరు పాయింట్లతో గ్రూప్ 'ఎ' టాపర్‌గా నిలిచింది. గ్రూప్ 'బి'లో శ్రీలంక ఆరు పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకోగా... బంగ్లాదేశ్ నాలుగు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. శుక్రవారం జరిగే సెమీఫైనల్స్‌లో శ్రీలంకతో భారత్; బంగ్లాదేశ్‌తో పాకిస్తాన్ తలపడతాయి.

'బ్రిస్బేన్'తో జొకోవిచ్ సీజన్ మొదలు




బెల్‌గ్రేడ్: కొత్త ఏడాదిలో మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటకు టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిచ్ సిద్ధమయ్యాడు. జనవరి 12 నుంచి జరిగే సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్ లక్ష్యంగా బరిలోకి దిగనున్న జొకోవిచ్... దానికి ముందు మరో టోర్నీతో తన సీజన్ మొదలు పెడుతున్నాడు. డిసెంబర్ 29 నుంచి జనవరి 5 వరకు జరిగే బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టోర్నీలో ఈ సెర్బియా దిగ్గజం ఆడతాడు. 2009 తర్వాత అతను ఈ టోర్నీలో బరిలోకి దిగడం ఇదే మొదటిసారి కావడం విశేషం. జొకోవిచ్‌తో పాటు దిమిత్రోవ్, రూన్, టియాఫో, కిరియోస్ తదితర అగ్రశ్రేణి ఆటగాళ్లు బ్రిస్బేన్ టోర్నీలో పాల్గొంటున్నారు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను 10 సార్లు గెలిచిన జొకోవిచ్ మరోసారి టైటిల్ సాధిస్తే రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ ట్రోఫీ అతని ఖాతాలో చేరుతుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

● రాజ్ కపూర్ శత జయంతి ఉత్సవాలకు సన్నాహాలు

గ్రేటెస్ట్ షో మేన్‌కి గ్రాండ్ షో



భారతీయ సినీ పరిశ్రమ ఖ్యాతిని పెంచడంలో కృషి చేసిన ఎందరో సినీ ప్రముఖుల్లో నటుడు-దర్శక-నిర్మాత రాజ్‌కపూర్ ఒకరు. రాజ్ సాహెబ్, ది షో మేన్ ది గ్రేటెస్ట్ షో మేన్ ఆఫ్ ఇండియన్ సినిమా, చార్లీ చాప్లిన్ ఆఫ్ ఇండియన్ సినిమా... ఇలా రాజ్‌కుమార్‌ను ఆయన ఫ్యాన్స్, సన్నిహితులు, ప్రేక్షకులు పిలుచుకునేవారు. రాజ్ కపూర్ చేసిన ఎన్నో అద్భుత చిత్రాలు ఆయన్ను ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయేలా చేశాయి. కాగా ఈ నెల 14న రాజ్‌కపూర్ శత జయంతి. ఈ సందర్భంగా డిసెంబరు 13 నుంచి 15 వరకు రాజ్ కుమార్ ఐకానిక్ సినిమాలను దేశంలోని 40 నగరాల్లో దాదాపు 150 థియేటర్లలో ప్రదర్శించనున్నారు. 'రాజ్‌కపూర్ – 100 సెలబ్రేటింగ్ ది సెంచరీ ఆఫ్ ది గ్రేటెస్ట్ షో మేన్' పేరిట 'ఆర్‌కే ఫిలిమ్స్, ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్, నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియా'ల నేతృత్వంలో ఈ సినిమాల ప్రదర్శన ఉంటుంది. రాజ్‌కపూర్ కెరీర్‌లోని ఐకానిక్ ఫిల్మ్స్ 'ఆగ్ (1948), బర్సాత్ (1949), ఆవారా (1951), శ్రీ 420 (1955), జాగ్తే రహో (1956), జిష్ దేశ్ మే గంగా బహీతీ హై (1960), సంగం (1964), మేరే నామ్ జోకర్ (1970), బాబీ (1973), రామ్ తేరీ గంగా మైలీ (1985)' వంటి సినిమాలు 'రాజ్‌కపూర్ – 100 సెలబ్రేటింగ్ ది సెంచరీ ఆఫ్ ది గ్రేటెస్ట్ షో మేన్' వేడుకల్లో ప్రదర్శితం కానున్నాయి. పీవీఆర్ ఐనాక్స్, సినీ పోలీస్ సినిమాస్‌లో ఈ సినిమాల ప్రదర్శన ఉంటుందని బాలీవుడ్ సమాచారం. ఈ చిత్రాల టికెట్ ధర వంద రూపాయలుగా నిర్ణయించారు.

భారతీయ సినిమా దార్శనికుడు

"రాజ్‌కపూర్ భారతీయ సినీ తెరకు భావోద్వేగాలు అద్దిన దార్శనికుడు. ఆయన విజన్‌కు ఈ ఫెస్టివల్ ఓ నివాళి" అన్నారు రణ్‌ధీర్ కపూర్ (రాజ్‌కపూర్ తనయుడు). "రాజ్ కపూర్ సినిమాలు మాలో స్ఫూర్తి నింపుతూనే ఉంటాయి" అన్నారు రణ్‌బీర్ కపూర్ (రాజ్‌కపూర్ మనవడు).



అవిభక్త భారతదేశంలోని పెషావర్‌లో పృథ్వీ రాజ్ కపూర్, రామ్ సర్నీదేవి దంపతులకు డిసెంబరు 14, 1924లో జన్మించారు రాజ్‌కపూర్ (అసలు పేరు సృష్టినాథ్ కపూర్). యాక్టర్‌గా పృథ్వీరాజ్ కపూర్ కెరీర్‌ను బిల్డ్ చేసుకునే క్రమంలో ఆయన పలు ప్రాంతాలకు మకాం మార్చాల్సి వచ్చింది. ఇలా రాజ్ కపూర్ చదువు వివిధ స్కూల్స్‌లో జరిగింది. ఇక తన తండ్రి ఓ లీడ్ రోల్‌లో నటించిన 'ఇన్‌క్విలాబ్' (1935) చిత్రంతో బాల నటుడిగా పదేళ్ల వయసులో తెరపైకి వచ్చారు రాజ్ కపూర్. 'నీల్ కమల్' (1947) మూవీతో లీడ్ యాక్టర్‌గా కెరీర్ ఆరంభించారు. ఆ తర్వాత హీరోగా 'బర్సాత్'తో తొలి బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నారు. ఆ సినిమాతో రాజ్‌కపూర్ పేరు దేశవ్యాప్తంగా మారుమోగిపోయింది. ఇక 1951లో విడుదలైన 'అవారా' చిత్రం రాజ్ కపూర్ కెరీర్‌ను అమాంతం పెంచేసింది. ఈ సినిమాకు విదేశీ ప్రేక్షకుల ఆదరణ కూడా లభించిందంటే ఆయన కెరీర్ ఈ టైమ్‌లో ఎంతటి పీక్ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలా నాటి తరంలో ఇండియన్ సినిమాలను ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లిన వారిలో రాజ్ కపూర్ ముందు వరుసలో ఉంటారు. ఆయన స్టార్‌డమ్ కొనసాగేలా 'శ్రీ 420, సంగం' వంటి సినిమాలు సూపర్‌హిట్స్‌గా నిలిచాయి. ఇక రాజ్‌కపూర్ ఎన్నో ఆశలు పెట్టుకున్న 'మేరా నామ్ జోకర్' చిత్రం ఆయన్ను నిరాశకు గురిచేసింది. ఈ సినిమాకు ఆశించిన ఫలితం దక్కలేదు. నాలుగు గంటల నిడివితో రెండు ఇంట్రవెల్స్‌తో రిలీజైన ఈ చిత్రం అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైంది. ఇదే సినిమాకు కాలక్రమేణ కల్ట్ మూవీ స్టేటస్ దక్కడం విశేషం. ఇక 1948లో ఆర్కే స్టూడియో సంస్థను స్థాపించి, సినిమాలు నిర్మించారు రాజ్ కపూర్. తన కుమారుడు రిషి కపూర్‌ను హీరోగా పరిచయం చేస్తూ రాజ్ కపూర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'బాబీ' సినిమా 1973లో విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దర్శకుడిగానూ రాజ్ కపూర్ సూపర్‌హిట్. 'బర్సాత్, ఆవారా, శ్రీ 420, సంగం, మేరా నామ్ జోకర్' వంటి చిత్రాలు అందుకు ఓ నిదర్శనం. సినిమా రంగంలో ఆయన చేసిన సేవలను భారత ప్రభుత్వం గుర్తించి, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, పద్మ భూషణ్ పురస్కారాలతో సత్కరించింది. ఇంకా జాతీయ అవార్డులతో పాటు పలు అవార్డులు అందుకున్నారు రాజ్ కపూర్. ఈ గ్రేట్ షో మేన్ 1988 జూన్ 2న ఢిల్లీలో కన్నుమూశారు.

కల్యాణ వైభోగమే



"చై, శోభిత జీవితాల్లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించటం చూడ్డానికి నాకెంతో ప్రత్యేకంగా ఉంది. ఇది నాకొక ఎమోషనల్ మూమెంట్. నా ప్రియమైన చైకి శుభాకాంక్షలు, శోభితను కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నాను. ఇప్పటికే మా జీవితాల్లో నువ్వు ఎంతో ఆనందాన్ని తెచ్చావు. ఈ వేడుక మా అందరికీ ఎంతో అర్థవంతమైంది. ఎందుకంటే ఇది ఏఎన్ఆర్‌గారి శతజయంతి సందర్భంగా స్థాపించిన ఆయన విగ్రహం వద్ద జరిగింది. మా ప్రతి అడుగులోనూ ఆయన ప్రేమ, దిశా నిర్దేశం మాతోపాటు ఉన్నట్లుగా భావిస్తున్నాం. ఈ వేడుకకి విచ్చేసి అపరిమితమైన ఆశీర్వాదాలు మాకు అందించినందుకు అందరికీ థ్యాంక్స్" అని సామాజిక మాధ్యమం ద్వారా అక్కినేని నాగార్జున పేర్కొన్నారు. ఆయన పెద్ద కుమారుడు, హీరో అక్కినేని నాగచైతన్య, హీరోయిన్ శోభితా ధూళిపాళ్ల వివాహం బుధవారం ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో ప్రత్యేకంగా రూపొందించిన భారీ వేదికపై రాత్రి 8:13 గంటలకు కల్యాణం జరిగింది. హిందూ సంప్రదాయ ప్రకారం ఈ వేడుక అంగరంగవైభవంగా జరిగింది. చిరంజీవి, వెంకటేష్, రామ్‌చరణ్, ఎన్టీఆర్, అల్లు అర్జున్, రానా, టి.సుబ్బరామి రెడ్డి, అల్లు అరవింద్ తదితర ప్రముఖులు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.





ఇండస్ట్రీ నాకు ఎంతో ఇచ్చింది - బెల్లంకొండ సురేష్



"శ్రీహరి హీరోగా నటించిన 'సాంబయ్య' (1999) సినిమాతో నిర్మాతగా నా ప్రయాణం ప్రారంభమైంది. ప్రొడ్యూసర్‌గా 25 ఏళ్లు పూర్తి చేసుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇన్నేళ్లలో 38 సినిమాలు చేశాను. ఇండస్ట్రీ నాకు ఎంతో ఇచ్చింది. డబ్బు, పేరు, హోదా అన్నీ ఇక్కడే సంపాదించుకున్నాను. ఈ ప్రయాణం పట్ల సంతోషంగా ఉన్నాను" అని నిర్మాత బెల్లంకొండ సురేష్ అన్నారు. నిర్మాతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు, నేడు (డిసెంబర్ 5) తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం బెల్లంకొండ సురేష్ విలేకరులతో మాట్లాడుతూ– "ఇండస్ట్రీలో మోహన్‌బాబుగారు నాకు గాడ్ ఫాదర్. నాకు ఎవరూ సపోర్ట్ లేనప్పుడు ఆయన తన సినిమాకి ప్రొడక్షన్ మేనేజర్‌ని చేశారు. శ్రీహరిగారితో తీసిన 'సాంబయ్య' 25 ఏళ్లు పూర్తి చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది. అయితే శ్రీహరిగారు, ఆ సినిమా డైరెక్టర్ కేఎస్ నాగేశ్వర రావుగారు మన మధ్య లేకపోవడం చాలా బాధగా ఉంది. శ్రీహరిగారు మంచి నటుడే కాదు గొప్ప వ్యక్తి కూడా. ఒక ఫ్రెండ్‌గా ఆయన పిల్లల భవిష్యత్‌కి నా వంతు బాధ్యతగా అవసరమైనప్పుడు చేయూతనిస్తాను. 2015లో వచ్చిన 'గంగ' సినిమా సూపర్ హిట్ అయ్యింది. ఆ తర్వాత తొమ్మిదేళ్ల పాటు సినిమా నిర్మించలేదు నేను. మా అబ్బాయిలు సాయి శ్రీనివాస్, సాయి గణేశ్ బయట బ్యానర్లలో సినిమాలు చేస్తున్నారు... అందుకే ఇన్నేళ్ల విరామం ఇవ్వాల్సి వచ్చింది. శ్రీనివాస్ కెరీర్ సెట్ అయ్యింది. పెళ్లి కూడా కుదిరింది. వచ్చే ఏడాది చేసుకుంటాడు. ప్రస్తుతం నాలుగు సినిమాలు చేస్తున్నాడు. గణేశ్ తన కెరీర్ సెట్ చేసుకుంటున్నాడు. రెండు మంచి ప్రాజెక్ట్స్ తన చేతిలో ఉన్నాయి. నా రీ ఎంట్రీలో భాగంగా మా అబ్బాయిలతోనే ఫిబ్రవరి, ఏప్రిల్‌లో రెండు కొత్త ప్రాజెక్ట్స్ ప్రారంభిస్తాను. ఈ రెండు సినిమాలతో కొత్త దర్శకులని పరిచయం చేస్తున్నాను. 'నా ఆటోగ్రాఫ్ స్వీట్ మెమొరీస్'ని 4కే క్వాలిటీలో సిద్ధం చేశాను. రవితేజ బర్త్‌డేకి (జనవరి 26) రీ రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం" అన్నారు.

రెండు దశాబ్దాల తర్వాత...


● భూమిక, గుణశేఖర్

మహేశ్‌బాబు హీరోగా గుణశేఖర్ దర్శకత్వం వహించిన 'ఒక్కడు' (2003) సినిమా సూపర్‌హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించారు భూమిక. కాగా 20 ఏళ్ల తర్వాత మళ్లీ గుణశేఖర్ దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు భూమిక. ప్రస్తుతం గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'యుఫోరియా' చిత్రంలో భూమిక ఓ పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నారు. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ నిర్మిస్తున్న ఈ చిత్రం సెకండ్ షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా సెట్స్ నుంచి ఓ వీడియోను విడుదల చేశారు. "వైవిధ్యమైన, హిట్ సినిమాలకు పెట్టింది పేరైన గుణశేఖర్ ప్రస్తుతం యూత్‌ఫుల్ సోషల్ డ్రామాగా 'యుఫోరియా'ను తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న దురాగతాలపై ఈ చిత్రం రూపొందుతోంది. భూమిక కోసం గుణశేఖర్ ఓ పవర్‌ఫుల్ పాత్రను సృష్టించారు. ఇటీవలే ఫస్ట్ షెడ్యూల్ పూర్తయింది" అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: ప్రవీణ్ కె. పోతన్, సంగీతం: కాల భైరవ.

ఆదిత్య 999 మ్యాక్స్‌లో...


● మోక్షజ్ఞ

బాలకృష్ణ కెరీర్‌లోని ఐకానిక్ చిత్రాల్లో 'ఆదిత్య 369' ఒకటి. సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన ఈ సైన్స్ ఫిక్షన్ సినిమా 1991 ఆగస్టు 18న విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఆదిత్య 999 మ్యాక్స్' సినిమా రూపొందనుంది. ఓ టాక్ షోలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు బాలకృష్ణ. 'ఆదిత్య 999 మ్యాక్స్'లో ఆయన తనయుడు మోక్షజ్ఞ హీరోగా నటించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోందట. అయితే ఈ సినిమా దర్శకుడు, నిర్మాత వంటి వివరాలు తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే... బాలకృష్ణ హీరోగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'డాకు మహారాజ్'. బాబీ కొల్లి దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదల కానుంది.


'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 254

గురువారం 5-12-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ప్రోబా3లో సాంకేతిక లోపం

పీఎస్ఎల్వీ సీ–59 ప్రయోగం గురువారానికి వాయిదా - 6లో



సూర్యవంశీ, ఆయుష్ మెరుపులు

ఆసియా కప్ క్రికెట్ టోర్నీ సెమీఫైనల్లోకి ప్రవేశించిన యువ భారత్ జట్టు -స్పోర్ట్స్‌లో



మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్

మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బీజేపీ నేత ఫడ్నవీస్ పేరు ఖరారైంది. నేడు ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

వివరాలు 6లో ▸



నమీబియాకు తొలి అధ్యక్షురాలు

నమీబియా అధ్యక్షురాలిగా నెటుంబో ఎన్నిక య్యారు. దేశ అత్యున్నత పీఠం అధిష్టించిన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు.

వివరాలు 6లో ▸



తాగడానికి పనికిరాదు

హరిద్వార్‌లో గంగా నది నీరు తాగడానికి పనికి రాదని ఉత్తరాఖండ్ కాలుష్య నియంత్రణ మండలి తేల్చింది.

వివరాలు 6లో ▸



ఒక్కడినే వెళ్తానన్నా ఒప్పుకోరా?

యూపీ సంభాల్‌లో హింసాత్మక ఘటనల్లో బాధితులను పరామర్శించేందుకు బయలు దేరిన రాహుల్‌ను పోలీసులు అడ్డుకున్నారు.

వివరాలు 6లో ▸


లాకప్‌లో సాగర్‌ను అర్ధనగ్నంగా నిలబెట్టిన పోలీసులు

దళితులంటే ఇంత చిన్నచూపా?

రాజమహేంద్రవరంలో కాలనీ సమస్యపై పోస్టు పెట్టిన దళిత యువకుడు సాగర్‌పై అమానుషం

- పోలీసుస్టేషన్‌లో అర్ధ నగ్నంగా నిలబెట్టి తీవ్ర దుర్భాషలు, బెదిరింపులు
- కొవ్వుపట్టి కొట్టుకుంటున్నావురా నా..కొ.. అంటూ రెచ్చిపోయిన సీఐ 8లో
- పందిలా ఉన్నావు.. నిన్ను కోసి రైలు పట్టాలపై పడేస్తే దిక్కెవరు?
- నీ గొంతుకోసి గోదావరిలో పడేస్తే శవం కూడా దొరకదని బెదిరింపులు.. ఇంత అవమానం జరిగాక బతకాలని లేదని వాపోయిన బాధితుడు
- కూటమి ప్రభుత్వ కక్షసాధింపుపై మండిపడ్డ వైఎస్సార్‌సీపీ నేతలు మార్గాని భరత్, సుధాకర్‌బాబు, కొమ్మూరి కనకారావు

ప్రజల గొంతుకగా ప్రశ్నిద్దాం



కూటమి ప్రభుత్వ మోసాలను నిలదీద్దాం.. ప్రజా సమస్యలపై ఉద్యమ బాట పడదాం

వైఎస్సార్‌సీపీ నేతలకు ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ దిశా నిర్దేశం

ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

- ఇంతటి వ్యతిరేకత ఎప్పుడూ, ఎక్కడా చూడలేదు
- సూపర్ సిక్స్, సూపర్ సెవెన్.. గాలికెగిరిపోయాయి
- చెప్పిన అబద్ధాలు, చేసిన మోసాలు ప్రజల్లో కోపంగా మారాయి.. ప్రజలు ప్రశ్నించే పరిస్థితి వచ్చింది
- రైతులు, విద్యార్థులు, అన్ని వర్గాల వారు ఇబ్బంది పడుతున్నారు
- అయినా నిరసన వ్యక్తం చేసే పరిస్థితి లేదు
- ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారు
- ఈ పరిస్థితిలో మనం ప్రజలకు అండగా నిలబడాలి
- వారి తరఫున అందరం పోరాటం చేద్దాం

2లో

ఈనెల 11న రైతుల సమస్యలపై ఆందోళన

27న కరెంటు ఛార్జీల మోతపై నిరసన

జనవరి 3న విద్యార్థులకు బాసటగా నిలదీత

వీటితో పాటు సూపర్ సిక్స్ హామీల అమలుకు డిమాండ్

"కేవలం ఆరు నెలల్లోనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజలు కోపంతో రగిలిపోతున్నారు. ఓ వైపు ఎక్కడ చూసినా అక్రమాలు, కమీషన్లు, మామూళ్ల గోల. పరిశ్రమ నడుపుకోవాలన్నా, వ్యాపారాలు చేయాలన్నా కప్పం కట్టాల్సిందే. వేలం పాటలుపెట్టి ఊరూరా బెల్ట్ షాపులు కేటాయిస్తున్నారు. అన్నింటికీ నీకింత.. నాకింత అని పంచుకుంటున్నారు. ఎమ్మెల్యే మొదలు సీఎం వరకు వాటాలు. ఇంకో వైపు సంక్షేమ పథకాలన్నీ పడకేశాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదు. ఆరోగ్యశ్రీ నిర్వీర్యమై పోతోంది. భరోసా ఇచ్చే వారు లేక అన్నదాతలు విలవిల్లాడిపోతున్నారు. విద్యుత్ చార్జీల షాక్‌లతో ప్రజలకు దిక్కుతోచడం లేదు. ఈ పరిస్థితిలో బాధిత వర్గ ప్రజల తరఫున నిలబడాల్సింది మనమే. వారి గొంతుకగా నిలిచి ఈ దుర్మార్గ ప్రభుత్వంపై పోరాడుదాం."

- పార్టీ శ్రేణులతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మీ వైఫల్యాన్ని దళారులపై

నెట్టేస్తారా?

అడుగడుగునా మంత్రి నాదెండ్లను నిలదీసిన అన్నదాతలు

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత

- ధాన్యం కొనడంలేదని దారిపొడవునా మంత్రికి సమస్యలు
- కూలీలను పెట్టి 20 రోజులుగా ఆరబెట్టుకుంటున్నామని మహిళా రైతు ఆవేదన
- చిరుద్యోగులపై చిర్రుబుర్రులు.. వీరిపై చర్యలకు ఆదేశం
- కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో అమాత్యునికి మరోమారు చేదు అనుభవం
- దీంతో ముందుగా ప్రకటించిన సమీక్ష, మీడియా సమావేశాలకు మంత్రి డుమ్మా
- గత వారం పెడన, పెనమలూరు నియోజకవర్గాల్లోనూ పరాభవం

7లో


మంత్రి మనోహర్‌ను నిలదీస్తున్న రైతులు

ధాన్యం దళారీగా సర్కారు

- మిల్లర్లు దోచుకుంటుంటే చోద్యం చూస్తోంది.. రైతులకు మిల్లర్లకు మధ్యవర్తిత్వం నడుపుతోంది.. మిల్లర్లు చెప్పిన ధరకు ఇవ్వాలంటూ ఒత్తిడి చేస్తోంది
- రాష్ట్రంలో ఏ ఒక్క రైతుకూ 'మద్దతు' లభించడంలేదు
- 14 శాతం తేమ ఉన్నా మద్దతు ధర ఇవ్వడం లేదు
- కొనే నాథుడులేక రెండు వారాలుగా రోడ్ల మీదే ధాన్యం రాశులు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున రైతుల నిరసన

7లో

సుఖ్‌బీర్‌పై హత్యాయత్నం

అమృత్‌సర్ స్వర్ణ దేవాలయంలో శిరోమణి అకాలీదళ్ నాయకుడు, పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుఖ్‌బీర్‌సింగ్ బాదల్‌పై హత్యాయత్నం జరిగింది. మాజీ ఉగ్రవాది నారైన్ సింగ్ కాల్పులు జరపగా పోలీసులు అడ్డుకున్నారు. 6లో





వణికించిన భూకంపం

ఏపీలో తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 2.9గా నమోదు

తెలంగాణలో 5.3గా నమోదు

ప్రమాదం లేదన్న ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ


ఎన్టీఆర్ జిల్లా తిరువూరు రాజుపేటలో భూ ప్రకంపనలకు గోడపై ఏర్పడిన బీటలు

2లో

భేతాళ కథ.. అంతా

బాబు కుట్ర!

కాకినాడ పోర్టులో వాటాలు కొల్లగొట్టే కుతంత్రం

ముందుగా పవన్, నాదెండ్లతో బియ్యం హైడ్రామా

- అనంతరం బాబు సన్నిహితుడు కేవీ రావుతో తప్పుడు ఫిర్యాదు
- ఏమీ లేని అంశంలో వెంటనే సీఐడీ అక్రమ కేసు...
- చంద్రబాబు స్క్రిప్ట్‌తోనే వాటాలు కొల్లగొట్టే కుట్ర సినిమా
- సహేతుకంగానే వాటాల విలువ నిర్ధారణ
- కేవీ రావు సమ్మతితోనే వాటాల విక్రయం.. విక్రయం మొత్తం రూ.494 కోట్లను మరోచోట పెట్టుబడి పెట్టిన వైనం
- నాలుగున్నరేళ్లలో ఏనాడూ, ఎవరికీ ఫిర్యాదు చేయని కేవీ రావు
- టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే ఫిర్యాదు వెనుక బాబు కుతంత్రం.. దాదాపు రూ.500 కోట్లతో కొనుగోలు చేస్తే బెదిరింపు అంటూ కొత్త నిర్వచనం
- నిజంగా బెదిరించి ఉంటే ఫ్రీగానే తీసుకునేవారు కదా.. వాటాలు ఎందుకు కొంటారు?
- అదీ 41 శాతంతో మైనారిటీ వాటాదారుగా ఎందుకు ఉంటారు?
- 51 శాతం వాటాతో మెజార్టీ వాటాదారుగానే ఉంటారు కదా!
- ఇప్పటికీ 59 శాతం వాటాతో నిర్ణయాధికారం కేవీ రావు గుప్పిట్లోనే.. అంతర్జాతీయ సంస్థ అరబిందో గ్రూప్‌పై కూటమి పెద్దల దుష్ప్రచారం
- నాడు కాకినాడ పోర్టును కేవీ రావుకు కారుచౌకగా కట్టబెట్టింది బాబు ప్రభుత్వమే.. తాజాగా ప్రైవేటు లావాదేవీల్లో చంద్రబాబు సర్కార్ జోక్యం వెనుక భారీ కుట్ర


3లో

ల్యాండ్ గ్రాబింగ్ పరిధిలోకి

వస్తుందేమో చూస్తున్నాం

- కాకినాడ పోర్టు వ్యవహారంపై మీడియాతో సీఎం చంద్రబాబు
- తుపాకీ చూపించి ఆస్తులు లాక్కోవడం ఎప్పుడూ జరగలేదు
- గత ప్రభుత్వంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలపై అధ్యయనం

3లో






పన్నుల ఆదాయం భళా

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ - అక్టోబర్ మధ్య కాలంలో మొత్తంగా పన్ను వసూళ్లు మంచి వృద్ధినే సాధించాయి. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 9.7 శాతం పెరిగాయి. కార్పొరేషన్ ట్యాక్స్, వ్యక్తిగత ఆదాయపు పన్ను వంటి ప్రత్యక్ష పన్నులు 11.1 శాతం పెరిగాయి. కానీ 2023 అక్టోబరుతో పోలిస్తే ఈ అక్టోబరులో కార్పొరేషన్ ట్యాక్స్ 16.4 శాతం, వ్యక్తిగత ఆదాయపు పన్ను 12.3 శాతం, ఎక్సైజ్ సుంకం 12 శాతం తగ్గాయి. మొత్తంగా పన్ను వసూళ్లు రూ.20.32 లక్షల కోట్లు దాటాయి.

ఏప్రిల్ - అక్టోబరు (రూ.కోట్లలో)



ఆధారం: కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్

క్లుప్తంగా...

నేడు శ్రీకాకుళం నేతలతో వైఎస్ జగన్ సమావేశం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం శ్రీకాకుళం జిల్లా నేతలతో సమావేశం కానున్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

మాజీ సీఎం రోశయ్యకు వైఎస్ జగన్ ఘన నివాళి

సాక్షి, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. 'పెద్దలు, మా కుటుంబానికి దగ్గరి మనిషి, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా నివాళులు' అంటూ వైఎస్ జగన్ బుధవారం తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.

మీ నిస్వార్థ సేవకు వందనం

భారత నౌకాదళ దినోత్సవం సందర్భంగా వైఎస్ జగన్ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: భారత నౌకాదళ దినోత్సవం సందర్భంగా ఇండియన్ నేవీ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. 'భారత నౌకాదళంలోని పరాక్రమవంతులైన పురుషులు, మహిళల అచంచలమైన అంకిత భావం, నిస్వార్థ సేవలకు వందనం చేస్తున్నాం. మన సముద్ర సరిహద్దులను కాపాడటంలో వారి ధైర్యం అపారమైన గర్వాన్ని నింపుతోంది. ఈరోజు వారి త్యాగాలను, వారి కుటుంబాల దృఢమైన మద్దతును గౌరవిద్దాం. వారి శౌర్యాన్ని, మనదేశ గొప్ప సముద్ర వారసత్వాన్ని నౌకాదళ దినోత్సవంగా జరుపుకుందాం' అని వైఎస్ జగన్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

సీఎం కార్యక్రమాల సమన్వయకర్తగా పెందుర్తి వెంకటేశ్



సాక్షి, అమరావతి: సీఎం కార్యక్రమాల సమన్వయకర్తగా తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేశ్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ(రాజకీయ) కార్యదర్శి సురేశ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇక నుంచి నెలకు రెండుసార్లు కేబినెట్ భేటీ

సాక్షి, అమరావతి: ఇక నుంచి నెలకు రెండుసార్లు కేబినెట్ సమావేశం కావాలని సీఎం చంద్రబాబు నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీన్లోభాగంగా ఈనెల 19వ తేదీ మళ్లీ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నాయి.

సీపీఎస్ ఉద్యోగుల మహాసభకు మద్దతు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల పాత పెన్షన్ సాధనకు ఏపీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 10న విజయవాడలో నిర్వహించనున్న మహాసభకు గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఫెడరేషన్ అధ్యక్షుడు ఎం.డి.జానీ పాషా తెలిపారు.

ప్రజల గొంతుకగా ప్రశ్నిద్దాం

కూటమి ప్రభుత్వ మోసాలను నిలదీద్దాం.. ప్రజా సమస్యలపై ఉద్యమ బాట పడదాం

వైఎస్సార్‌సీపీ నేతలకు ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ దిశా నిర్దేశం


ప్రజల సమస్యలపై పోరాటం చేయాలని నేతలకు దిశానిర్దేశం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీలను తుంగలో తొక్కి.. అన్ని వర్గాలనూ దగా చేస్తున్న చంద్రబాబునాయుడి ప్రభుత్వంపై ఆరు నెలల్లోనే ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత పెల్లుబుకుతోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. కనీస మద్దతు ధర దక్కక రైతులు.. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు.. కరెంటు ఛార్జీల బాదుడుతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ మోసాలు, అక్రమాలు, వైఫల్యాలపై ప్రశ్నించే స్వరం వినిపించకూడదనే దురాలోచనలతో అక్రమ కేసులు పెడుతూ అరాచక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. సమస్యల్లో ఉన్న ప్రజలకు అండగా నిలబడి, వారి తరఫున కూటమి ప్రభుత్వంపై పోరాటం చేయాలని ఆ పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, ప్రాంతీయ సమన్వయకర్తలతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి.. ప్రజల పక్షాన కూటమి ప్రభుత్వంపై పోరాటం చేయడానికి కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేశారు. పార్టీని మరింతగా బలోపేతం చేయడంలో భాగంగా చేపట్టాల్సిన చర్యలపై నేతలకు మార్గ నిర్దేశం చేశారు. 'చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైంది. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఎప్పుడూ చూడని విధంగా విపరీతమైన వ్యతిరేకత కనిపిస్తోంది. కేవలం ఆరు నెలల వ్యవధిలోనే ఇంతటి వ్యతిరేకత ఎక్కడా చూడలేదు. ఎన్నికలప్పుడు చెప్పిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ వాగ్దానాలు గాలికెగిరిపోయాయి. వాటిని పక్కన పెట్టి మిగిలినవి చూస్తే.. చెప్పిన అబద్ధాలు, చేసిన మోసాలు ప్రజల్లో కోపం కింద మారి ఎక్కడికక్కడ వారు ప్రశ్నించే పరిస్థితి వచ్చింది. మరోవైపు రాష్ట్రంలో వ్యవస్థలన్నీ నీరు గారిపోయాయి. నానాటికీ వ్యవస్థలన్నీ దిగజారిపోతున్నాయి' అని చెప్పారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడం లేదు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ చూస్తే.. మన ప్రభుత్వ హయాంలో ప్రతి క్వార్టర్ (మూడు నెలలు) అయిపోయిన వెంటనే అంటే.. జనవరి, ఫిబ్రవరి, మార్చి ముగిసిన వెంటనే ఏప్రిల్‌లో వెరిఫికేషన్ చేసి మే నెలలో విడుదల చేసే వాళ్లం. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత జూన్‌లో ఇవ్వాల్సిన ఆ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదు సరి కదా.. ఏకంగా మూడు త్రైమాసికాల సొమ్ము పెండింగ్‌లో పెట్టారు.
- ఈ డిసెంబర్ గడిస్తే నాలుగు క్వార్టర్లు ఇవ్వని పరిస్థితి. జనవరి వస్తే ఏకంగా రూ.2,800 కోట్లు విద్యా దీవెన బకాయిలు పిల్లలకు ఇవ్వాల్సి ఉంటుంది. వసతి దీవెనకు సంబంధించి రూ.1,100 కోట్లు పెండింగ్ ఉంది. మొత్తంగా రూ.3,900 కోట్లు పెండింగ్ పెట్టారు. మరో వైపు ఫీజులు కడితే తప్ప కాలేజీలకు రావొద్దని పిల్లలకు యాజమాన్యాలు చెబుతున్నాయి. దీంతో పిల్లలు చదువులు మానేసి పనులకు వెళ్తున్నారు.

ఆరోగ్యశ్రీకి అనారోగ్యం

ఆరోగ్య శ్రీ బకాయిలు కూడా అలాగే ఉన్నాయి. మార్చి నుంచి ఇంత వరకు నెట్‌వర్క్ ఆస్పత్రులకు సంబంధించిన బకాయిలు ఇవ్వలేదు. మార్చి నుంచి నవంబరు వరకు దాదాపు 9 నెలలకు సుమారు రూ.2,400 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. నెట్‌వర్క్ ఆస్పత్రులు గొడవ చేస్తే ఏదో రూ.200 కోట్లు ఇచ్చారు. పేషంట్లు ఆస్పత్రులకు వెళ్తే ఉచితంగా వైద్యం అందే పరిస్థితి లేదు. ఆరోగ్యశ్రీ పూర్తిగా నీరుగారిపోతోంది. ఇంకా 108, 104 ఉద్యోగులకు సంబంధించి నాలుగు నెలల జీతాలు పెండింగ్. వాళ్లు సర్వీసు అందించే పరిస్థితి లేదు.

ధాన్యం సేకరణ.. మద్దతు ధర లేదు

- ఏ జిల్లాలో కూడా రైతులకు ధాన్యం సేకరణలో కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ) లభించడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ–క్రాప్ చేసి, ఆర్బీకేల ఆధ్వర్యంలో కొనుగోలు చేసే వాళ్లం. ప్రతి రైతుకూ కనీస మద్దతు ధర వచ్చేది. ఇదొక్కటే కాకుండా జీఎల్‌టీ (గన్నీ బ్యాగ్స్, లేబర్, ట్రాన్స్‌పోర్ట్) ఛార్జీలు కూడా చెల్లించే వాళ్లం. జీఎల్‌టీ కింద ప్రతి రైతుకు, ప్రతి ఎకరాకు అదనంగా రూ.10 వేలు వచ్చే పరిస్థితి ఉండేది.
- ఇవాళ రైతులకు కనీస మద్దతు ధర కూడా అందడం లేదు. 75 కేజీల బస్తా కనీస మద్దతు ధర రూ.1,725 అయితే ఆ ధర ఎక్కడా ఇవ్వడం లేదు. కావాలనే ధాన్యం కొనుగోలు చేసే కార్యక్రమం నిలిపివేశారు. గత్యంతరం లేక రైతులు దళారులు, రైస్ మిల్లర్లకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది. వాళ్లు రైతుల నుంచి రూ.300 నుంచి రూ.400 తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం సేకరణ చాలా అన్యాయమైన పరిస్థితుల్లో జరుగుతోంది. మరోవైపు వర్షాలతో రైతులు పూర్తిగా దెబ్బతిని కుదేలవుతున్నారు. ధాన్యం రంగు మారుతోంది. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

కరెంటు ఛార్జీలు బాదుడే బాదుడు

- కరెంటుకు సంబంధించి ఇప్పటికే రూ.6 వేల కోట్ల బాదుడు మొదలైంది. మరో రూ.9 వేల కోట్ల బాదుడు వచ్చే నెల నుంచి ప్రారంభం అవుతుంది. ఈ స్థాయిలో రూ.15 వేల కోట్ల బాదుడు కార్యక్రమాన్ని భారతదేశ చరిత్రలో చంద్రబాబు తప్ప మరెవ్వరూ చేసి ఉండరు. ఆరు నెలల్లోనే ఎవరూ రోడ్డు మీదకు రాకూడని, ఎవరూ నిరసన వ్యక్తం చేయకూడదని తప్పుడు కేసులు పెడుతున్నారు. సోషల్ మీడియా కార్యకర్తలు, ఎమ్మెల్యే అభ్యర్థుల మీద కూడా తప్పుడు కేసులు పెడుతున్నారు.
- కేసులు మ్యానుఫ్యాక్చర్ చేసి, ఎవిడెన్సెస్ మ్యానుఫ్యాక్చర్ చేసి ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా ఎప్పుడూ జరగలేదు. రాష్ట్రమంతా భయాందోళన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఆయన చేస్తున్న బాదుడు కార్యక్రమాన్ని నిరసిస్తూ ఎవరూ రోడ్డు మీదకు రాకూడదని ఇలా చేస్తున్నారు. ఎవరైనా ఆందోళన చేయాలనుకుంటే కేసులు పెడతారేమోనని భయపడే పరిస్థితులు కల్పిస్తూ పోలీసులను ఉపయోగించుకున్నారు. అవినీతి విచ్చలవిడిగా సాగుతోంది. రెడ్‌బుక్ రాజ్యాంగం యథేచ్ఛగా నడుస్తోంది.

ఇసుక, మద్యం మాఫియా

- అధికారంలోకి వస్తే ఇసుక ఉచితంగా ఇస్తామన్నారు. కానీ, దాన్ని అమలు చేయడం లేదు. ఇప్పుడు ప్రభుత్వానికి పైసా ఆదాయం రాకపోగా, మన ప్రభుత్వం కంటే డబుల్ రేట్లకు ఇసుక అమ్ముతున్నారు. నీకింత.. నాకింత అని.. చంద్రబాబు, లోకేష్ మొదలు ఎమ్మెల్యేల వరకు పంచుకుంటున్నారు. గతంలో ప్రభుత్వం నడిపిన మద్యం షాపులను పూర్తిగా ఎత్తివేశారు. మొత్తం షాపులన్నింటినీ చంద్రబాబు, ఆయన మనుషులు చేతిలోకి తీసుకున్నారు. దాని కోసం కిడ్నాప్‌లతో పాటు, పోలీసుల ద్వారా బెదిరింపులకు కూడా పాల్పడ్డారు. లాటరీలో ఎవరికైనా షాపులు వస్తే వారి దగ్గర నుంచి బలవంతంగా రాయించుకున్నారు. పైగా గ్రామంలో వీళ్లే వేలం పాటలు పెట్టి బెల్ట్‌షాపులు కేటాయిస్తున్నారు.
- ఈ రోజు బెల్ట్‌షాప్‌లు లేని వీధి, గ్రామం లేదు. ఒక్కో బెల్ట్‌షాప్‌కు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వేలం పాట పెడుతున్నారు. ప్రతి నియోజకవర్గంలో పేకాట క్లబ్బులు నడుస్తున్నాయి. ఏ నియోజకవర్గంలో పరిశ్రమ నడుపుకోవాలన్నా, మైనింగ్ యాక్టివిటీ జరగాలన్నా, ఏది కావాలన్నా ఎమ్మెల్యేకు ఇంత.. కడితే తప్ప జరిగే పరిస్థితి లేదు. ప్రతి దానికీ కమీషన్లు ఇచ్చుకోవాల్సిందే. మాఫియా సామ్రాజ్యాన్ని నడుపుతున్నారు. ఎమ్మెల్యేలకు ఇంత, చంద్రబాబుకు ఇంత అని చెల్లించుకోవాల్సిందే. రౌడీ మామూళ్ల కోసం కూడా గొడవలు జరుగుతున్నాయి. నెల్లూరులో ఏకంగా క్వార్ట్జ్ గనులు కొట్టేయడానికి పక్కా ప్లాన్ చేశారు.

ప్రజల పక్షాన నిలబడదాం.. వారి గొంతుక వినిపిద్దాం

- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో కోపం ఈరోజు తీవ్ర స్థాయిలో కనిపిస్తోంది. మనం కూడా ప్రజల తరఫున గళం విప్పాల్సిన సమయం వచ్చింది. అనుకున్న దానికంటే ముందుగానే ఆ సమయం వచ్చింది. మామూలుగా ఏడాది వరకు వేచి చూసే పరిస్థితి నుంచి.. ఆరు నెలలకే అలాంటి పరిస్థితి తలెత్తింది.
- కరెంటు ఛార్జీల పెంపు, ధాన్యం సేకరణలో దళారీల రాజ్యం, మద్దతు ధర దక్కక పోవడం, ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాలు ప్రజలను ఇప్పుడు ఇబ్బంది పెడుతున్నాయి. మీ మీ నియోజకవర్గాల్లో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే అభ్యర్థులు, సమన్వయకర్తలతో కలిసి వారిని ఇన్వాల్వ్ చేస్తూ, కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అవసరం అయినప్పుడు మనం వారి తరఫున నిలబడాలి. వారి పక్షాన పోరాడాలి. అటువైపు ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నప్పుడు మనం వారికి దగ్గరగా ఉంటూ వారి తరఫున పోరాటం చేయాలి. వారి తరఫున నిలబడాలి. ప్రతి ఎమ్మెల్యే అభ్యర్థి ఇది కచ్చితంగా చేయాలి.

సంక్రాంతి తర్వాత జిల్లాల పర్యటన

సంక్రాంతి తర్వాత నా జిల్లాల పర్యటన కార్యక్రమం మొదలవుతుంది. ప్రతి బుధ, గురువారాల్లో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో సమావేశం అవుతాను. 'జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం' పేరుతో నేను పర్యటిస్తాను. నా పర్యటన వచ్చేసరికి మీరు జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల నియామకాలు పూర్తి చేయాలి. ప్రతి కార్యకర్తకు ఫేస్ బుక్, ఎక్స్ (ట్విట్టర్), యూట్యూబ్ అకౌంట్ ఉండాలి. జరుగుతున్న అన్యాయాన్ని ప్రతి కార్యకర్త ప్రశ్నించాలి. అప్పుడే గ్రామ స్థాయిలో తెలుస్తుంది. మా ఆస్పత్రులు ఎందుకు ఇలా ఉన్నాయి? మా స్కూళ్లు ఎందుకు ఇలా ఉన్నాయి? మా ధాన్యాన్ని ఎందుకు కనీస మద్దతు ధరకు అమ్ముకోలేకపోతున్నాం.. అని ప్రశ్నించాలి. రాబోయే రెండున్నరేళ్లు మనం, మన పార్టీని మరింత బలోపేతం చేయాలి. అప్పుడే మనం చేయబోయే పోరాటాలకు మద్దతు బలంగా ఉంటుంది. ఇదంతా పక్కాగా జరగాలంటే జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న పార్టీ కమిటీల నియామకాలను త్వరితగతిన పూర్తి చేయాలి.

మూడు ప్రధాన అంశాలపై కార్యాచరణ

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి ముఖ్యంగా మూడు ప్రధానమైన అంశాలు.. రైతుల ఇబ్బందులు, కరెంటు ఛార్జీల బాదుడే బాదుడు, ఫీజులు కట్టలేని పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యల మీద వైఎస్సార్‌సీపీ ఉద్యమ బాట పట్టే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం.

ఈ నెల 11న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలెక్టర్ల కార్యాలయాల వద్ద రైతులకు సంబంధించి ధాన్యం సేకరణలో జరుగుతున్న అన్యాయంపై నిలదీయాలి. ధాన్యం సేకరణలో వారికి కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేయాలి. పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయాలి. ఇప్పటి వరకు రైతులకు అందుతున్న ఉచిత పంటల బీమాను వర్తింప చేయాలని కూడా డిమాండ్ చేయాలి. రైతులతో కలిసి ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్లకు వినతిపత్రం ఇవ్వాలి.



చంద్రబాబు ప్రభుత్వ కరెంటు ఛార్జీల బాదుడే బాదుడు కార్యక్రమానికి నిరసనగా డిసెంబర్ 27న ఆందోళన చేపట్టాలి. ఎన్నికలప్పుడు తాను కరెంటు ఛార్జీలు తగ్గిస్తానని ఇచ్చిన హామీని విస్మరించిన నేపథ్యంలో పెంచిన కరెంటు ఛార్జీలు, జనవరిలో పెంచబోయే కరెంటు ఛార్జీలు కూడా తగ్గించాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే రూ.6 వేల కోట్ల బాదుడుతో పాటు, రానున్న నెలలో మరో రూ.9 వేల కోట్ల ఛార్జీల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లాల్లో ఎస్ఈ, సీఎండీ కార్యాలయాల వద్ద ప్రజల తరఫున నిరసన తెలపాలి. ప్రజలతో కలిసి భారీ ర్యాలీగా వెళ్లి.. పెంచిన కరెంటు ఛార్జీలు తగ్గించమని చంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందజేయాలి.

జనవరి 3న అన్ని జిల్లాల కలెక్టర్ల కార్యాలయాల వద్ద ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆందోళన చేపట్టబోతున్నాం. పిల్లలకు అందించాల్సిన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన.. మొత్తంగా దాదాపు రూ.3,900 కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేయాలి. ఇప్పటి వరకు ఏడాదిగా అంటే నాలుగు త్రైమాసికాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజులు చెల్లించాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీస్తూ.. చదువుకుంటున్న పిల్లలకు తోడుగా నిలబడే కార్యక్రమంలో భాగంగా పిల్లలతో కలిసి కలెక్టర్ల కార్యాలయాలకు వెళ్లి, వినతి పత్రాలు సమర్పించి, డిమాండ్ చేయాలి.

ఈ మూడు సమస్యలతో పాటు సూపర్ సిక్స్ హామీల అమలుకు డిమాండ్ చేద్దాం.

పేదరిక నిర్మూలనకు సంపన్నుల సాయం తీసుకోండి

అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



సాక్షి, అమరావతి: పేదరిక నిర్మూలనకు సంపన్నుల సాయం తీసుకోవాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. కార్పొరేట్ సంస్థలు ముందుకొచ్చేలా చైతన్య పరచాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని కుటుంబసభ్యుల ప్రొఫైల్‌కు తగ్గట్టు ప్రభుత్వ పథకాలు అందించడంపై అధ్యయనం చేయాలన్నారు. ఆయన బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సామాజిక, ఆరోగ్య భద్రత అందించే బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. పీపుల్, పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీ–4) కింద మరిన్ని ప్రాజెక్టులు ప్రవేశపెడితే మనది పేదరికం లేని రాష్ట్రంగా అవతరిస్తుందన్నారు. పీ-4 ప్రాజెక్ట్‌కు అమరావతి నిర్మాణం ఉత్తమ ఉదాహరణ అని అభివర్ణించారు. రాష్ట్రంలో జనాభా వృద్ధిరేటు పెరిగేలా జపాన్, చైనా, ఆస్ట్రేలియా వంటి దేశాలు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించాలన్నారు. దేశంలో జనాభా వృద్ధిరేటు 9 శాతం ఉంటే, రాష్ట్రంలో 3.5 శాతం మాత్రమే ఉందని చెప్పారు. ఒక్కో కుటుంబంలోని సగటు సభ్యుల సంఖ్య జాతీయ స్థాయితో పోల్చుకుంటే రాష్ట్రంలో తక్కువగా ఉందన్నారు. దేశంలో ఒక్కో కుటుంబంలో సగటున 4.1 మంది ఉండగా, రాష్ట్రంలో 3.2 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. ఈ సమావేశంలో సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు క్రమం తప్పకుండా జరగాలని సీఎం చంద్రబాబునాయుడు మరో సమీక్ష సమావేశంలో అధికారులకు స్పష్టం చేశారు. పౌరసరఫరాలశాఖ, వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చిన్నచిన్న సమస్యలు సాకుగా చూపి రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకోబోమన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 1,30,580 మంది రైతుల నుంచి 9,14,680 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి సకాలంలోనే డబ్బులు చెల్లించినట్లు అధికారులు తెలిపారు.

ప్రజల వ్యక్తిగత సమాచారం జనసేన చేతికి ఎలా వెళ్లింది?

సామాన్య పౌరులను వేధిస్తున్న జనసేన పార్టీ కార్యకర్తలు

'ఎక్స్'లో ఆందోళన వ్యక్తం చేసిన వైఎస్సార్‌సీపీ



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో భారీ డేటా ఉల్లంఘన జరుగుతోందని వైఎస్సార్‌సీపీ ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారం పార్టీ 'ఎక్స్' ఖాతాలో ఈ మేరకు పోస్టు చేసింది. ప్రభుత్వం వద్ద ఉండాల్సిన రహస్య సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడమే కాకుండా.. ఆ డేటాను అడ్డంపెట్టుకొని సామాన్య పౌరులను జనసేన కార్యకర్తలు వేధిస్తున్నారని ఆరోపించింది. ఇది పాలనా పతనాన్ని బట్టబయలు చేస్తోందని పేర్కొంది. కూటమి ప్రభుత్వ ఒత్తిళ్లతో పోలీసులు పట్టించుకోకపోవడం వల్ల రాష్ట్రంలో రాజకీయ గూండాయిజం రాజ్యమేలుతోందని, ఫలితంగా ప్రజల భద్రత ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలకు రక్షణ కల్పిస్తామని చెబుతున్న జనసేన పార్టీ నాయకత్వం రాష్ట్రంలో జరుగుతున్న దౌర్జన్యాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది. ప్రజల సున్నితమైన డేటా నిమిషాల్లోనే జనసేన కార్యకర్తలకు ఎలా చేరుతోందని ప్రశ్నించింది. పోలీసులు, కూటమి కార్యకర్తలు కుమ్మక్కై పని చేస్తున్నారా లేక పోలీసులే తమ వద్ద ఉండాల్సిన పరికరాలను వారి చేతికే ఇచ్చేసి వాడుకోమని చెప్పారా అనే అనుమానాలు తలెత్తుతున్నాయని పేర్కొంది. డేటా ఉల్లంఘన విషయంలో పరిశోధించడానికి పోలీసులను జవాబుదారీగా ఉంచడానికి, బెదిరింపులను అరికట్టడానికి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది.

స్వచ్ఛ భారత్ 3.0

అమలుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు

సాక్షి, అమరావతి: స్వచ్ఛ భారత్ 3.0 అమలుకు కేంద్రం కసరత్తు ప్రారంభించింది. 2014 అక్టోబర్ 2 నుంచి పదేళ్లుగా స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా రెండు విడతల్లో వివిధ రకాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టిన కేంద్రం.. మూడో విడతలో వ్యక్తిగత పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. స్వచ్ఛ భారత్ 3.0లో చేపట్టే కార్యక్రమాలకు సంబంధించి ఇప్పటికే అక్టోబర్ 28న అన్ని రాష్ట్రాల అధికారులకు ఢిల్లీలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందుకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. మూడో విడతలో సురక్షిత తాగునీరు–పరిసరాల పరిశుభ్రత–వ్యక్తిగత పరిశుభ్రత లక్ష్యాలుగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న దానిపై కసరత్తు కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపారు. ఆగస్టు 15 లేదా అక్టోబర్ 2న మూడో విడత స్వచ్ఛ భారత్ 3.0 కార్యక్రమాన్ని కేంద్రం ప్రారంభించే అవకాశం ఉంది.

గ్రామీణాభివృద్ధికి మరింతగా సహకరిస్తాం

- నాబార్డు ఐకానిక్ భవనాన్ని ఏడాదిన్నరలో పూర్తి చేస్తాం
- సీఎం చంద్రబాబుతో భేటీ సందర్భంగా నాబార్డు చైర్మన్ షాజీ వెల్లడి


విజయవాడలో నాబార్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి మరింత రుణం అందించేందుకు తగిన సహకారం అందిస్తామని నాబార్డు చైర్మన్ షాజీ కేవీ చెప్పారు. బుధవారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబుతో షాజీ సమావేశమయ్యారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు, మత్స్యరంగానికి సహకారం తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వ ప్రయత్నాలకు నాబార్డు మద్దతుగా నిలుస్తుందని షాజీ చెప్పారు. ఏపీకి రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్(ఆర్ఐడీఎఫ్) కింద కేటాయింపులు, సహకార సంఘాలకు రాయితీలు మరింతగా అందిస్తామని పేర్కొన్నారు. అమరావతిలో నాబార్డు ఐకానిక్ భవనాన్ని ఏడాదిన్నరలో పూర్తి చేస్తామని షాజీ తెలిపారు. ఆర్ఐడీఎఫ్ కింద రాష్ట్ర వాటా నిధులను ప్రభుత్వం సమకూర్చుతుందని సీఎం తెలిపారు.

విజయవాడలో ప్రాంతీయ కార్యాలయం

నాబార్డు ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయాన్ని బుధవారం విజయవాడలో మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, నాబార్డు చైర్మన్ షాజీ కేవీ ప్రారంభించారు.

వణుకు పుట్టించిన భూకంపం

- ఏపీలో తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 2.9గా నమోదు
- తెలంగాణలో 5.3గా నమోదు

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: తెలుగు రాష్ట్రాల్లో భూమి కంపించింది. బుధవారం ఉదయం 7.27 గంటలకు ఏపీలో పలుచోట్ల స్వల్ప ప్రకంపనలు రావడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. కొన్నిచోట్ల ప్రజలు భయంతో ఇళ్లల్లోంచి బయటకు పరుగులు తీశారు. కొన్నిచోట్ల ఇళ్లలో సామాన్లు, బీరువాలు ఊగడాన్ని స్పష్టంగా గుర్తించారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నుంచి విశాఖపట్నం జిల్లా వరకు స్వల్ప ప్రకంపనలు వచ్చినట్టు గుర్తించారు. ఏపీలో దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3 పాయింట్ల లోపే నమోదైనట్టు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్రంలో పలుచోట్ల రెండు నుంచి మూడు సెకన్లు మాత్రమే భూమి కంపించింది. భూప్రకంపనల కారణంగా తిరువూరు రాజుపేటలోని ఓ గృహంలో గోడలు బీటలు వారాయి. సుందరయ్య కాలనీలోని మోటూరు చింతయ్య ఇంట్లోని సామగ్రి కిందపడిపోయింది. భూకంప కేంద్రం తెలంగాణలోని ములుగు జిల్లాలో ఉండగా.. అక్కడ దాని తీవ్రత 5.3గా నమోదైంది. రాష్ట్రంలో రాజమండ్రి వరకు 230 కిలోమీటర్ల మేర వాయువ్య దిశలో దాని ప్రభావం రిక్టర్ స్కేల్‌పై 2.9గా ఉందని అధికారులు తెలిపారు.

ఏపీ సేఫ్ జోన్‌లోనే..

రాష్ట్రంలో చాలా స్వల్ప స్థాయిలో భూమి కంపించిందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు. 12 స్థాయిలతో కూడిన భూకంప తీవ్రత జాబితాలో ఇక్కడ వచ్చింది రెండో స్థానమేనని పేర్కొన్నారు. దీన్ని ఫీబుల్ స్థాయి అని పిలుస్తారని, ఈ స్థాయిలో భూకంపం సంభవిస్తే ప్రమాదాలకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

ప్రకంపనలు ఎక్కడెక్కడ వచ్చాయంటే..

విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, కృష్ణా జిల్లా పెనమలూరు, ఎన్టీఆర్ జిల్లా తిరువూరు, ఏలూరు జిల్లా బుట్టాయగూడెం, కృష్ణాపురం, కొమ్ముగూడెం, దుద్దుకూరు, దాసియ్యపాలెం, వేలేరుపాడు, రుద్రమకోట, కన్నాయిగుట్ట, కుక్కునూరు మండలం సీతారామనగరం, వేలేరు, శ్రీధర్, ఉప్పేరు, కుక్కునూరు, రాజానగరం, మాధవరం, కొయ్యలగూడెం, కన్నాపురం, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, కామవరపుకోట, చాట్రాయి మండలం, ఆగిరిపల్లి, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు, ప్రకాశం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లా, పల్నాడు జిల్లా సత్తెనపల్లి, పిడుగురాళ్ల, క్రోసూరు తదితర ప్రాంతాల్లోనూ భూమి కంపించింది.



శరవేగంగా రైల్వేల విద్యుదీకరణ

భారతీయ రైల్వేలు.. దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ ప్రజా రవాణా వ్యవస్థ. రోజూ కొన్నివేల రైళ్ల ద్వారా కోట్లాదిమందిని గమ్య స్థానాలకు చేరుస్తున్నాయి. రైళ్లను పూర్తిగా విద్యుత్‌తో నడిపేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు దాదాపు 97 శాతం విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. ఫలితంగా డీజిల్ ద్వారా నడిచే రైళ్లకోసం చేసే వ్యయం గణనీయంగా తగ్గింది.

1.9 కోట్లు ప్రతి రోజూ రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులు

99,809 2024 మార్చి 31 నాటికి రైల్వేల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు. వీరిలో **2,037** మంది లోకో పైలట్లు (డ్రైవర్లు)

13,000 దేశంలోని మొత్తం రైళ్లు

రూ.20,892 కోట్లు 2023-24లో విద్యుత్ సరఫరా ద్వారా రైళ్లు నడిపేందుకు రైల్వే శాఖ చేసిన వ్యయం. 2024-25 బడ్జెట్‌లో ఇది రూ.**23,745** కోట్లు

రూ.14,156 కోట్లు 2023-24లో డీజిల్‌తో నడిచే రైళ్ల కోసం రైల్వే శాఖ చేసిన వ్యయం. 2024-25 బడ్జెట్‌లో ఇది రూ.**10,817** కోట్లు.

19.7 కి.మీ. రోజుకు సగటున విద్యుదీకరణ జరుగుతున్న రైల్వే ట్రాక్ (ఆర్‌కేఎమ్).

ఆధారం: రైల్వే శాఖ

104 ఉద్యోగులపై ఎస్మా ఎత్తివేయాలి


సాక్షి, అమరావతి: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని 104 విభాగంపై ఎస్మా ఎత్తివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను బుధవారం విడుదల చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని 104 ఉద్యోగులు కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారని, సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, ఎస్మా చట్టం ప్రయోగించడం సరి కాదని పేర్కొన్నారు. వారి న్యాయమైన కోర్కెల కోసం ఉద్యోగులు ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేస్తుంటే ఎస్మా ప్రయోగిస్తానని ప్రకటించడం గర్హనీయమని తెలిపారు.

నెలాఖరులోగా ఇళ్లకు భూములు గుర్తించండి



సాక్షి, అమరావతి: ఈ నెలాఖరులోగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల (యూడీఏల) పరిధిలో మిడిల్ ఇన్‌కమ్ గ్రూప్ (ఎంఐజీ), హయ్యర్ ఇన్‌కమ్ గ్రూప్ (హెచ్‌ఐజీ) ఇళ్ల నిర్మాణాలకు భూములు గుర్తించాలని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. కర్నూలు, కడప, అనంతపురం–హిందూపురం యూడీఏల అధికారులు, చైర్మన్లతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యూడీఏల ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణం, లేఅవుట్లను అభివృద్ధి చేసి అమ్మటం ద్వారా ఆర్థికంగా పరిపుష్టి సాధించాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పురపాలకశాఖ కార్యదర్శి కన్నబాబు, డైరెక్టర్ హరినారాయణన్ పాల్గొన్నారు.

పర్యాటక ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేయాలి



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ పథకం 'సాస్కి' నిధులతో చేపట్టనున్న అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు తీసుకుని జనవరిలో పనులు ప్రారంభించాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో పర్యాటక అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ప్రతిష్టాత్మక హేవలాక్ వంతెన పునర్నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిడదవోలు కోట సత్తెమ్మ ఆలయం అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలన్నారు. గండికోటలో అడ్వెంచర్ టూరిజాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీల్లో అర్హులందరికీ 200 యూనిట్లు ఉచితం

సాక్షి, అమరావతి: ఎస్సీ, ఎస్టీల్లో అర్హులందరికీ 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా 15,17,298 ఎస్సీ, 4,75,557 ఎస్టీ చొప్పున 19,92,855 కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని వెల్లడించారు. ఇందుకోసం ప్రతి నెలా ప్రభుత్వం రూ.477.30 కోట్లు వెచ్చిస్తున్నట్లు మంత్రి వివరించారు. ఈ పథకంపై ఎవరికైనా సందేహాలుంటే 1912కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

భేతాళ కథ..

అంతా బాబు కుట్ర

కాకినాడ పోర్టులో వాటాలు కొల్లగొట్టే కుతంత్రం

ముఖ్యమంత్రి చంద్రబాబు అసలు కుట్ర బట్టబయలైంది! తన పార్ట్‌నర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కాకినాడలో చేయించిన బియ్యం హైడ్రామా వెనుక పన్నాగం బయటపడింది. 'సీజ్ ద షిప్' అంటూ పవన్ కళ్యాణ్, నాదెండ్ల ద్వయం చేసిన రాజకీయ రాద్ధాంతం అంతా చంద్రబాబు కుట్ర సినిమా టీజర్ అన్నది స్పష్టమైంది. సీఐడీ అక్రమ కేసులతో బెదిరించి కాకినాడ డీప్ వాటర్‌పోర్ట్‌లో వాటాలను కొల్లగొట్టాలన్నదే అసలు కుట్ర అన్నది నిగ్గు తేలింది. భారీ ఆర్థిక దోపిడీ ధ్యేయంగా చంద్రబాబు అల్లిన భేతాళ కథ వెనుక కుట్ర బట్టబయలైంది. పవన్, నాదెండ్ల ద్వారా వీధి నాటకం... అనంతరం తనకు అత్యంత సన్నిహితుడైన కాకినాడ డీప్ వాటర్ పోర్ట్ ప్రమోటర్ కేవీ రావుతో తప్పుడు ఫిర్యాదు ...సీఐడీ అక్రమ కేసు నమోదు ...ఇలా చంద్రబాబు పక్కా పన్నాగంతో పావులు కదిపారన్నది స్పష్టమైంది. ఎన్నికల హామీల అమలులో వైఫల్యం... టీడీపీ కూటమి పెద్దల దోపిడీతో వెల్లువెత్తుతున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు నెలకో డైవర్షన్ కుట్రను తెరపైకి తెస్తున్న చంద్రబాబు పన్నాగంలోని తాజా అంకమే ఈ అక్రమ కేసు. రాష్ట్రంలో ప్రైవేటు ఆస్తులను కొల్లగొట్టడమే ఏకైక అజెండాగా సాగుతున్న పచ్చ నాటకం ఇదిగో ఇలా ఉంది.

– సాక్షి, అమరావతి

అంతా బాబు కుట్ర స్క్రిప్టే
బియ్యం రాద్ధాంతం డ్రామానే

కాకినాడ డీప్ వాటర్ పోర్టులో వాటాలను అడ్డగోలుగా హస్తగతం చేసుకునేందుకు చంద్రబాబు పన్నాగం పన్నారు. ఈ క్రమంలో కాకినాడ పోర్ట్ నుంచి బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారనే దుష్ప్రచారాన్ని తెరపైకి తెచ్చారు. జనసేనలోని తన కోవర్ట్, మంత్రి నాదెండ్ల మనోహర్ కొద్ది నెలలుగా కాకినాడలో పర్యటిస్తూ చంద్రబాబు పన్నాగానికి రంగం సిద్ధం చేశారు. ఇక కుట్రను వేగవంతం చేయాలని నిర్ణయించిన తరువాత చంద్రబాబు ఇందుకు పవన్ కళ్యాణ్‌ను పైలట్‌గా వాడుకున్నారు. ఆయన డైరెక్షన్‌లోనే పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ గత నెల 29న ఢిల్లీ నుంచి హఠాత్తుగా రాజమహేంద్రవరం చేరుకుని కాకినాడలో వాలారు. అనంతరం కాకినాడ యాంకరేజ్ పోర్ట్ వద్దకు రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారంటూ డ్రోన్ కెమెరాలతో రికార్డ్ చేస్తూ డ్రామా పండించారు. పౌరసరఫరాల శాఖ, పోర్టు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం ద్వారా తమ నాటకాన్ని టీడీపీ కూటమి అనుకూల మీడియా, సోషల్ మీడియాలో హడావుడి చేసేందుకు యత్నించారు. అసలు విషయం ఏమిటంటే... బియ్యం ఎగుమతి చేసే యాంకరేజ్ పోర్ట్‌ను ప్రభుత్వమే నిర్వహిస్తోంది. మరి అక్కడ నుంచి రేషన్ బియ్యం స్మగ్లింగ్ జరిగితే ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించాలి కదా! దీన్ని విస్మరిస్తూ కాకినాడ డీప్ వాటర్ పోర్టుపై పవన్ కల్యాణ్ ఆరోపణలు చేయడం గమనార్హం. అరబిందో సంస్థ కాకినాడ డీప్ వాటర్ పోర్ట్‌లో మైనారిటీ వాటాలు కొనుగోలు చేసినప్పటి నుంచే బియ్యం స్మగ్లింగ్ జరుగుతోందని దుష్ప్రచారం చేశారు. అనంతరం ఈ నెల 2న (సోమవారం) పవన్ ఉండవల్లిలో చంద్రబాబుతో సమావేశమై తాను డ్రామాను ఎలా పండించిందీ వివరించారు.



కేవీరావు తప్పుడు ఫిర్యాదు... వెంటనే సీఐడీ అక్రమ కేసు

తమ కుట్ర సీన్ పండిందని భావించిన చంద్రబాబు అసలు పాత్రధారిని తెరపైకి తెచ్చారు. తనకు అత్యంత సన్నిహితుడైన కాకినాడ డీప్ వాటర్‌పోర్ట్ ప్రమోటర్ కేవీ రావుతో ఈ నెల 2న సీఐడీకి ఫిర్యాదు ఇప్పించారు. 2020లో తనను బెదిరించి కాకినాడ డీప్ వాటర్ పోర్ట్‌లో 41శాతం వాటాను అరబిందో సంస్థకు చెందిన ఆరో రియాల్టీ సంస్థ కొనుగోలు చేసిందని ఆయన తాపీగా నాలుగేళ్ల తరువాత ఫిర్యాదు చేయడం చంద్రబాబు పక్కా కుట్రను స్పష్టం చేస్తోంది. విచిత్రం ఏమిటంటే... అదే రోజు సీఐడీ కేసు నమోదు చేసేయడం గమనార్హం.

పోర్టు విలువపై అవాస్తవ ప్రచారం

కాకినాడ పోర్టు వాటాలను తక్కువగా విలువ కట్టారన్న కేవీ రావు ఫిర్యాదులో నిజం లేదు. వాటాల విక్రయం కోసం దాదాపు ఐదేళ్ల క్రితం అరబిందో సంస్థతో ఆయన ఒప్పందం చేసుకున్నారు. అప్పటి మార్కెట్ విలువ వేరు. ప్రస్తుతం ఐదేళ్ల తరువాత మార్కెట్ విలువ వేరు. ఆ రెండూ ఒకటే అన్నట్టుగా ఫిర్యాదులో పేర్కొనడం ప్రజల్ని తప్పుదోవ పట్టించడమే. మరి అదే విధానమైతే... ఈనాడు రామోజీరావు కుటుంబం ఫిల్మ్ సిటీ కోసం 20 ఏళ్ల క్రితం హైదరాబాద్ శివార్లలో దాదాపు 2 వేల ఎకరాలు కారుచౌకగా కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఆ భూముల విలువ పెరిగింది కాబట్టి... ఆనాడు భూములు అమ్మిన రైతులు వచ్చి ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేస్తారా? ఆ భూములను తిరిగి రైతులకు ఇచ్చేస్తారా? మరి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేసరికి కేవీ రావు, అరబిందో సంస్థ మధ్య జరిగిన ప్రైవేటు లావాదేవీని వక్రీకరిస్తూ చంద్రబాబు ప్రభుత్వం విష ప్రచారం చేస్తుండటం రాజకీయ కుట్రే.

బెదిరించి ఉంటే ఫ్రీగానే తీసుకునేవారు కదా..!
ఏకంగా 51 శాతం వాటా దక్కించుకునేవారు

తనను బెదిరించి కాకినాడ డీప్ వాటర్ పోర్ట్‌లో వాటాలను అరబిందో సంస్థ కొనుగోలు చేసిందని కేవీ రావు చేసిన ఫిర్యాదు పూర్తిగా అవాస్తవం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేరిట నిజంగా బెదిరించి ఉంటే అరబిందో సంస్థ వాటాలను ఎందుకు కొనుగోలు చేస్తుంది? ఫ్రీగానే వాటాలను తీసేసుకునేది. ఒకవేళ బెదిరించి కొనుగోలు చేయాలన్నా కేవలం 41 శాతం వాటానే ఎందుకు కొనుగోలు చేస్తుంది ? కనీసం 51 శాతం వాటాను కొనుగోలు చేస్తుంది కదా! 41 శాతం వాటా అంటే పోర్టులో మైనారిటీ భాగస్వామే అవుతుంది. అంటే నిర్ణయాధికారం ఉండదు. కనీసం 51 శాతం వాటా ఉంటేనే నిర్ణయాధికారం ఉంటుంది. కానీ కేవీ రావుకే 59 శాతం వాటా ఉంది. అంటే పోర్టుపై నిర్ణయాధికారం ఇప్పటికీ కేవీరావుకే ఉంది. అందుకే ఆయనే కాకినాడ డీప్ వాటర్ పోర్ట్ ఎండీగా కొనసాగుతున్నారు. సీఈవో, ఇతర కీలక స్థానాల్లో ఆయన సన్నిహితులే ఉన్నారు.

అంతా కట్టు కథ... ఇదీ బాబు కుట్ర

కేవీ రావు సీఐడీకి ఇచ్చిన ఫిర్యాదు పూర్తిగా కట్టు కథే! పోర్టులో 41 శాతం వాటాలను అరబిందో సంస్థకు కేవీ రావు 2020లో విక్రయించారు. ఆయన పూర్తి సమ్మతితోనే వాటాలు విక్రయించబట్టే అరబిందో సంస్థ చెల్లించిన ఆ వాటాల విలువ రూ.494 కోట్లను స్వీకరించారు. ఆ మొత్తాన్ని మరో సంస్థలో పెట్టుబడిగా పెట్టారు కూడా. కాకినాడ పోర్ట్‌లో వాటాల విక్రయంపై ఆయనకు ఏమాత్రం అభ్యంతరం ఉన్నా ఆ మొత్తాన్ని తిరస్కరించేవారు. అప్పుడే రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, స్టాక్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ), నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) తదితర సంస్థలకు ఫిర్యాదు చేసేవారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించేవారు. కానీ కేవీ రావు ఈ నాలుగున్నరేళ్లలో ఎవరికి ఫిర్యాదు చేయలేదు. కేవీ రావుకు అభ్యంతరం ఉంటే వాటాల బదిలీ పూర్తయ్యేలోగా వివిధ దశల్లో ఎప్పుడైనా సరే ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంది. కానీ ఆయన ఏ దశలోనూ ఫిర్యాదు చేయలేదు. అంటే ఆయన పూర్తి సమ్మతితోనే వాటాలను విక్రయించారన్నది స్పష్టమవుతోంది. ఆ వాటాల విక్రయం కోసం మంతనాలు, అనంతరం ఒప్పందం, విక్రయం అంతా హైదరాబాద్ కేంద్రంగా సాగాయి. మరి తెలంగాణలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో లేదు కదా! హైదరాబాద్‌లో పోలీసులకుగానీ సీఐడీకి గానీ అప్పుడే ఎందుకు ఫిర్యాదు చేయలేదు ? కాకినాడ డీప్ వాటర్ పోర్ట్‌లో అరబిందో సంస్థ వాటాలను అక్రమంగా కొల్లగొట్టేందుకు చంద్రబాబు కుట్రలో కేవీ రావు పాత్రధారన్నది స్పష్టమవుతోంది.

అంతర్జాతీయస్థాయి సంస్థపై దుష్ప్రచారం

అరబిందో సంస్థ 150 దేశాల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ అంతర్జాతీయంగా విశేష గుర్తింపు పొందిన గ్రూప్. ఏటా రూ.72 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తోంది. అరబిందో సంస్థ ఏటా రూ.3 వేల కోట్ల నికర లాభం చూపుతోంది. ఎంతో ఆర్థిక క్రమశిక్షణ పాటించే అరబిందో సంస్థ పూర్తి స్థాయిలో విశ్లేషించిన అనంతరం సహేతుకంగా, చట్టబద్ధంగానే కొత్త సంస్థల్లో పెట్టుబడి పెడుతుంది. అదే రీతిలో కాకినాడ డీప్ వాటర్ పోర్ట్‌లో కూడా వ్యూహాత్మక పెట్టుబడిగానే 41 శాతం వాటాలను కొనుగోలు చేసింది. పోర్ట్‌ను ఆనుకుని ఉన్న జీఎంఆర్ సెజ్‌లో వాటాలను అరబిందో సంస్థ కొనుగోలు చేసింది. ఆ సెజ్‌లో కొత్త పోర్టును నిర్మిస్తోంది. దాంతో ఆ సెజ్‌ను ఆనుకుని ఉన్న కాకినాడ డీప్ వాటర్ పోర్టులో కూడా తమకు వాటాలు ఉంటే వ్యూహాత్మకంగా ప్రయోజనకరమని అరబిందో సంస్థ భావించింది. భవిష్యత్‌లో కాకినాడ డీప్ వాటర్ పోర్టులోని తన మెజార్టీ వాటాలను ప్రమోటర్ కేవీ రావు విక్రయించాలని భావిస్తే ముందుగా అప్పటికే వాటాదారుగా ఉన్న అరబిందో సంస్థకే అవకాశం ఇవ్వాలి. ఆ నిబంధన (రైట్ టు ఫస్ట్ రెఫ్యూజల్) ఒప్పందంలో ప్రధానాంశం. దాంతో రెండు పోర్టులను నిర్వహించవచ్చన్న వ్యాపార విస్తరణ ప్రణాళికలో భాగంగానే కాకినాడ డీప్ వాటర్ పోర్టులో అరబిందో సంస్థ వాటాలు కొనుగోలు చేసింది. అది పూర్తిగా ఆ సంస్థ వ్యాపార ప్రణాళిక. అరబిందో, కేవీ రావు మధ్య ప్రైవేట్ ఒప్పందం. దాంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికిగానీ ఇతరులకుగానీ ఎలాంటి సంబంధం లేదు.

ప్రభుత్వ పోర్టును కారుచౌకగా కట్టబెట్టింది చంద్రబాబే

కాకినాడ డీప్ వాటర్ పోర్టును ప్రైవేటుపరం చేసింది గతంలో చంద్రబాబు ప్రభుత్వమే నన్నది అసలు వాస్తవం. రాష్ట్రంలోని ప్రభుత్వ సంస్థలను కారుచౌకగా తన సన్నిహితులు, బినామీలకు కట్టబెట్టిన చరిత్ర చంద్రబాబు సొంతం. లాభాల్లో ఉన్న ఆ పోర్టును 1999లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబే కారు చౌక ధరకు ప్రైవేటుపరం చేశారు. ఓ మలేషియా కంపెనీని ముందు పెట్టి కాకినాడ డీప్‌వాటర్ పోర్టును కారు చౌకగా చంద్రబాబు సన్నిహితుడు కేవీ రావుకు కట్టబెట్టేశారు. అదే కేవీ రావుతో తప్పుడు ఫిర్యాదు చేయించడం ద్వారా మరోసారి కుట్రకు చంద్రబాబు తెర తీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదలు పెట్టిన రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టులను కూడా చంద్రబాబు ప్రస్తుతం తన బినామీలకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేస్తుండటం గమనార్హం.

ప్రైవేటు లావాదేవీలకు వక్రభాష్యం... అదే బాబు ప్రభుత్వ పన్నాగం

కాకినాడ డీప్ వాటర్ పోర్టులో వాటాల విక్రయం అన్నది పూర్తిగా రెండు ప్రైవేటు సంస్థల మధ్య వ్యవహారం. ఐదేళ్ల తరువాత చంద్రబాబు ప్రభుత్వం ఆ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని భావిస్తుండటం వెనుక పక్కా కుట్ర ఉందని స్పష్టమవుతోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా ప్రైవేటు ఆస్తుల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ దందా సాగిస్తుండటం విభ్రాంతికరం. రెండు సంస్థల మధ్య ప్రైవేటు వ్యవహారంలో టీడీపీ కూటమి ప్రభుత్వం తలదూరుస్తుండటం వెనుక మర్మం ఏమిటి? ప్రభుత్వం మారగానే అంతకుముందు జరిగిన ప్రైవేటు వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటామంటే రాష్ట్రంలోనే కాదు దేశంలో కూడా ఓ దుష్ట సంప్రదాయానికి తెరతీసినట్టు అవుతుంది. ఎందుకంటే పరస్పర అంగీకారంతో ప్రైవేటు ఆస్తుల కొనుగోలు అమ్మకాలు సాగుతుంటాయి. ఐదేళ్ల తరువాత సహజంగానే ఆ ఆస్తుల మార్కెట్ విలువ పెరుగుతుంది. మార్కెట్ విలువ పెరిగింది కాబట్టి ఐదేళ్ల క్రితం తనను బెదిరించి ఆస్తిని అమ్మేలా చేశారని ఫిర్యాదు చేస్తామంటే ఎలా..? వాటిలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటే పరిస్థితి ఎంతవరకు వెళుతుంది?

తెలుగు సినిమా మసాలా స్క్రిప్ట్

తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై వి.విజయసాయిరెడ్డి

- కేవీ రావును బెదిరించినట్లు ఆధారాలున్నాయా?
- చంద్రబాబు తొత్తు అయిన అతనిపై పరువు నష్టం దావా వేస్తాను
- ఈ కట్టప్ప కుట్రలన్నీ మా విజయానికి దోహదం
- రాష్ట్రంలో భావ ప్రకటన హక్కుకు విఘాతం




సాక్షి, అమరావతి: కేవీ రావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై కేసు నమోదు చేయడం రాష్ట్ర ప్రభుత్వ చౌకబారుతనానికి నిదర్శనం అని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'నాలుగున్నరేళ్ల తర్వాత బయటకు వచ్చి కేవీ రావు ఎందుకు అబద్ధాలు చెబుతున్నారు? నేను కేవీ రావును బెదిరించినట్లు, అలా ఫోన్ చేసినట్లు ఆధారాలు లేవు. వ్యాల్యుయేషన్ అనేది ఎప్పుడూ చర్చలకు లోబడి ఉంటుంది. ఆ సంస్థలతో నాకు ఎలాంటి సంబంధం లేదు. ఈ సంస్థల భాగస్వాములు ఎవరూ కూడా నాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా తెలియదు. అసలు కేవీ రావును నేనెప్పుడూ కలవలేదు. చూడలేదు. నాపై తప్పుడు కేసు పెట్టేందుకు టీడీపీ వాడుకున్న తొత్తు. నాపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్.. తెలుగు సినిమా మసాలా స్క్రిప్ట్. నాపై అసత్య ఆరోపణలు చేసిన కేవీ రావుపై పరువు నష్టం దావా వేస్తాను. కాలిఫోర్నియాలో ఎక్కువగా ఉండే అతని మనీలాండరింగ్ వ్యవహారాలన్నీ లాస్ ఎంజిల్స్‌లోని ఎఫ్‌బీఐ దృష్టికి వెళ్తాయి. నాపై ఎఫ్ఐఆర్ చంద్రబాబు కట్టుకథ. ఈ కట్టప్ప స్క్రిప్ట్ రైటర్‌గా మారి నన్ను భయపెట్టడానికి చేస్తున్న యత్నమిది. చంద్రబాబు ఎన్ని చేసినా అవన్నీ మా విజయానికి దోహదపడతాయి' అని వాటిలో పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం 1997లో కాకినాడ పోర్ట్‌ను ఏడీబీ నిధులను ఉపయోగించి పబ్లిక్ సంస్థగా ఏర్పాటు చేసిందని, ఆ తర్వాత ప్రైవేట్ సంస్థగా మార్చిందని చెప్పారు. తన కుల మిత్రుడు కేవీరావును బ్యాక్ డోర్ ఎంట్రీలో చైర్మన్, ఎండీగా చంద్రబాబు నియమించారని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై కక్ష్య సాధింపులకు పాల్పడుతూ దక్షిణ భారత కిమ్‌జోంగ్‌ఉన్‌లా చంద్రబాబు తయారయ్యారని దుయ్యబట్టారు. ఆయన విధానాలకు ఎల్లో మీడియా వంత పాడుతోందన్నారు. పోలీసులు రాజ్యాంగ బద్ధంగా పని చేయాలని, టీడీపీ రాజ్యాంగం ప్రకారం కాదన్నారు. అభద్రతా భావంతో చంద్రబాబు వేలాది మందిని వేధింపులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దంలో తనను తాను చూసుకోలేని స్థితికి బాబు దిగజారారని చెప్పారు. దేశంలో రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు గడిచిన నేపథ్యంలో రాష్ట్రంలో మాత్రం ప్రజలు భావ ప్రకటన హక్కుకు, స్వేచ్ఛకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ల్యాండ్ గ్రాబింగ్ పరిధిలోకి వస్తుందేమో చూస్తున్నాం

కాకినాడ పోర్టు వ్యవహారంపై మీడియాతో సీఎం చంద్రబాబు

- తుపాకీ చూపించి ఆస్తులు లాక్కోవడం ఎప్పుడూ జరగలేదు
- రెవెన్యూ సదస్సుల తరువాత భూ వివాదాలపై స్పష్టత వచ్చే అవకాశం
- గత ప్రభుత్వంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలపై అధ్యయనం



సాక్షి, అమరావతి: కాకినాడ పోర్టు, సెజ్‌లలో వాటాల విషయం ల్యాండ్ గ్రాబింగ్ చట్టం పరిధిలోకి వస్తుందేమో చూడాల్సి ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అధికారం ఉందని తుపాకీ చూపించి ఆస్తులు రాయించుకోవడం, వ్యాపారాల్లో వాటాలు తీసుకున్న ఘటనలు దేశ చరిత్రలోనే లేవని తెలిపారు. మాఫియా బృందాలు లాక్కున్న ఆస్తులను సీజ్ చేసే చట్టం ముంబైలో ఉందని.. దాని గురించి సమాచారం తెప్పించుకుంటామన్నారు. ఆస్తులు పోగొట్టుకున్న వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపారు. కుటుంబ వివాదాల్లో జోక్యం చేసుకోలేమని, అదే సందర్భంలో అన్యాయం జరిగిన వారికి ఎంతవరకు న్యాయం చేయగలమో చూస్తున్నామన్నారు. భూములకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని, అందులో 22ఏ వంటి చిక్కుముడులు చాలా ఉన్నాయన్నారు. వినతులపై అధికారులు పరిష్కారం చూపకుండా తమ సీటు నుంచి వేరొకరికి బదిలీ చేయటమే పరిష్కారం అనుకోవటం సరికాదన్నారు. ఫిర్యాదు చేసిన వారికి పరిష్కారం లభించేలా చూడాలన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలపై ఏం చేయాలో పరిశీలిస్తున్నామని, ఒకసారి కుదిరిన ఒప్పందాన్ని రద్దు చేస్తే జరిమానా కట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందుకే ఏం చేయాలనే దానిపై చర్చిస్తున్నామన్నారు.

కాకినాడ పోర్టులో 'పట్టాభి' బియ్యం లారీలు

తన వియ్యంకుడు రా రైస్ ఎగుమతి చేయడం లేదని బుకాయించిన మంత్రి పయ్యావుల
ఇండోనేషియాకు పచ్చి బియ్యం ఎగుమతి


పట్టాభి ఆగ్రోఫుడ్స్ లారీలలో పచ్చి బియ్యం రవాణా చేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాకినాడ పోర్టులో పర్యటన సందర్భంగా స్టెల్లా–ఎల్ నౌకను తనిఖీ చేసి రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోందంటూ హడావుడి చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అక్కడే సముద్ర జలాల్లో ఉన్న కెన్‌స్టార్ నౌకను కనీసం కన్నెత్తి కూడా చూడకపోవడం వెనుక అసలు నిజాలు బయటకు వస్తున్నాయి. కెన్‌స్టార్ నౌకలో బియ్యాన్ని ఎగుమతి చేస్తున్న కంపెనీ స్వయంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వియ్యంకుడిది కావడమే దీనికి కారణం. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పట్టాభి ఆగ్రో ఫుడ్స్ అధినేత కేవీ కృష్ణారావు బియ్యాన్ని కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే ఆర్థిక మంత్రి పయ్యావుల తన వియ్యంకుడు కేవలం బాయిల్డ్ రైస్ మాత్రమే ఎగుమతి చేస్తున్నాడని, ముడి బియ్యం ఎగుమతి చేయడంలేదని మంగళవారం చెప్పారు. మూడు తరాలుగా ఈ వ్యాపారంలో ఉన్న తన వియ్యంకుడు అసలు ఇప్పుడు ఇక్కడ వ్యాపారం చేయడం లేదన్నారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో మాత్రమే వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. అయితే తన వియ్యంకుడి సంస్థ గురించి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పిన మాటలన్నీ 'పచ్చి' అబద్ధాలని తాజాగా తేలిపోయింది.

పోర్టులో పట్టాభి బియ్యం లారీలు..

కాకినాడ యాంకరేజ్ పోర్టులో బియ్యం ఎగుమతి కార్యకలాపాలను బుధవారం పరిశీలించగా మంత్రి పయ్యావుల మాటలు పచ్చి బూటకమని తేలిపోయింది. పట్టాభి ఆగ్రోఫుడ్స్ లిమిటెడ్ పేరుతోనే ఆ లారీలు రా రైస్‌ను పోర్టులో దిగుమతి చేస్తున్నాయి. ఓమ్ సాయి–2 ఏపీ ఏవీ కే 0024 బార్జ్‌లో పట్టాభి ఆగ్రోఫుడ్స్ పచ్చి బియ్యాన్ని 'బిరస్ బుల్లోగ్' ప్యాకింగ్‌తో పోర్టులో ఉన్న ఎంవీడీడీఎస్ మెరీనా అనే నౌకకు తరలిస్తున్నారు. 12 వేల మెట్రిక్ టన్నుల పచ్చి బియ్యాన్ని ఇండోనేషియాకు ఎగుమతి చేసేందుకు పట్టాభి ఆగ్రోఫుడ్స్ ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. కాకినాడ పోర్టు నుంచి బియ్యం ఎగుమతుల్లో మంత్రి పయ్యావుల వియ్యంకుడి సంస్థ పట్టాభి ఆగ్రో ప్రైవేటు లిమిటెడ్ చురుగ్గా వ్యవహరిస్తోంది. వాస్తవాలు ఇలా ఉండగా మంత్రి పయ్యావుల తన వియ్యంకుడికి వత్తాసు పలుకుతూ పచ్చి అబద్ధాలు వల్లించడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

పచ్చ మీడియాకే అనుమతి..

కాకినాడ యాంకరేజ్ పోర్టులో నిలిపివేసిన స్టెల్లా–ఎల్ నౌకలో పీడీఎస్ బియ్యం తనిఖీల కోసం నియమించిన అధికారుల కమిటీ బుధవారం నౌకను పరిశీలించింది. టీవీ–5, ఈటీవీ, ఈనాడు, ఏబీఎన్ ఆంధ్రజ్యోతిని మాత్రమే తనిఖీల సందర్భంగా కమిటీ తమ వెంట తీసుకెళ్లడం గమనార్హం. నౌకలో తనిఖీకి వెళుతున్నట్లు ఎల్లో మీడియాకు మాత్రమే సమాచారం ఇచ్చి గుట్టుగా వ్యవహరించారు.

తెర ముందు కేవీ రావు.. వెనకున్నది చంద్రబాబే

కాకినాడ పోర్టులో ఆరు నెలలుగా బియ్యం అక్రమ రవాణా
వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం చంద్రబాబు కొత్త దుష్ట సంప్రదాయాన్ని తెచ్చారని వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. గతంలో చట్టబద్ధంగా జరిగిన వ్యవహారాలపై బలవంతంగా ఫిర్యాదులు ఇప్పిస్తూ, శత్రువులుగా భావించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్న దారుణమైన పరిస్థితి ఇప్పుడు రాష్ట్రంలో ఉందని చెప్పారు. కాకినాడ పోర్టు విషయంలోనూ చంద్రబాబు కొత్త కుట్ర పన్నారన్నారు. తెర ముందు కేవీ రావును పెట్టినా, వెనుక ఉన్నది చంద్రబాబేనని స్పష్టం చేశారు. గోవర్ధన్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కాకినాడ పోర్టులో ఆరు నెలలుగా బియ్యం అక్రమ రవాణా జరుగుతోందని, దాన్నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కాకినాడ సీ పోర్ట్ లిమిటెడ్ (కెఎస్‌పీఎల్)లో బలవంతంగా వాటాలు లాక్కున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. దానిపై తప్పుడు ఫిర్యాదు చేయించడమే కాకుండా, అనుకూల పత్రికల్లో వైఎస్ జగన్ పైన, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడిపైన, విజయసాయిరెడ్డి పైన అసత్య కథనాలు రాయించి, తప్పుడు కేసులు పెట్టించేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న కాకినాడ పోర్టును ప్రైవేటు పరం చేసింది చంద్రబాబేనని, ఆయన అనుయాయుడైన కేవీ రావు సంస్థకు పోర్టును కట్టబెట్టారని తెలిపారు. కేవీ రావు వెనుక ఉన్నదీ చంద్రబాబేనన్న ఆరోపణలు కూడా ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న పవన్ కళ్యాణ్ 2019లో 'ఏమాత్రం అర్హత లేని కేవీ రావు సంస్థకు కాకినాడ పోర్టును ఎలా కట్టబెట్టారు' అంటూ ఆనాటి సీఎం చంద్రబాబును నిలదీశారని చెప్పారు. అదే ఇప్పుడు పవన్‌కు సరైనదిగా కనిపిస్తోందా అని ప్రశ్నించారు. బాబు చేసింది సరైనదని పవన్ భావిస్తే ఆనాడు అన్న మాటలు తప్పు అని అంగీకరించాలని, లేదంటే చంద్రబాబు తప్పు చేశారని మరోసారి చెప్పాలని అన్నారు.



ఒక మనిషి తనలో తాను సంతోషం కనుక్కోవడం కష్టమే. కానీ ఇంకోచోట కనుక్కోవడం అసాధ్యం.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
గురువారం, 5 డిసెంబర్ 2024

అకాలీల ప్రస్థానం ఎటువైపు?

పంజాబ్‌లో అవసానదశలో పడిన అకాలీదళ్‌కు కాయకల్ప చికిత్స చేసి రక్షించటానికి చేసిన ప్రయత్నం కాస్తా ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ప్రాణానికి ముప్పు తెచ్చింది. బుధవారం ఆయనపై కాల్పులు జరపబోయిన ఖలిస్తానీ మిలిటెంట్ నారాయణ్ సింగ్ చౌరాను అక్కడున్నవారు సకాలంలో నిరోధించకపోయివుంటే పంజాబ్‌లో మరో నెత్తుటి అధ్యాయం మొదలయ్యేది. గత తప్పిదాలకు బాదల్‌నూ, ఇతర నేతలనూ సిక్కు అత్యున్నత పీఠం అకల్‌తఖ్త్ మతద్రోహులుగా ప్రకటించి విధించిన శిక్షలు అమలవుతుండగా ఈ ఉదంతం చోటుచేసుకుంది. పంజాబ్ స్థితిగతులు ప్రత్యేకమైనవి. మతమూ, రాజకీయాలూ కలగలిసి పోవటాన్ని వ్యతిరేకించేవారు సైతం ఈ ప్రత్యేకతను గమనించబట్టే అక్కడ అకాలీదళ్ వంటి మధ్యేవాద పక్షం అవసరమని భావిస్తారు. లేనట్టయితే మతాన్ని తలకెక్కించుకున్న అతివాదులది అక్కడ పైచేయి అవుతుందని వారి వాదన. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు అకాలీదళ్‌ను బలహీనపరచటానికి భింద్రన్‌వాలే వంటి మిలిటెంట్లకు మొదట్లో అందించిన పరోక్ష ప్రోత్సాహం పంజాబ్‌కు శాపంగా మారింది. పరిస్థితి చేయిదాటాక అమృత్‌సర్ స్వర్ణాలయంలో తలదాచుకున్న భింద్రన్‌వాలేను, అతని ముఠాను అదుపు చేయటానికి సైన్యంతో నిర్వహించిన 'ఆపరేషన్ బ్లూ స్టార్' కాస్తా వికటించి చివరకు ఇందిర ప్రాణాలనే బలితీసుకుంది. ఆ హత్యకు ప్రతీకారమన్నట్టు ఢిల్లీతోసహా దేశంలో అనేకచోట్ల కాంగ్రెస్ నేతలు వెనకుండి సిక్కులపై సాగించిన హత్యాకాండ పర్యవసానంగా ఉగ్రవాద గ్రూపులు పుట్టుకొచ్చాయి. దశాబ్దంపాటు పంజాబ్ కనీవినీ ఎరుగని కల్లోలం చవిచూసింది. వేలాదిమంది అమాయక పౌరులు ఆహుతయ్యారు. ఉగ్రవాదాన్ని అదుపుచేయటం కోసమంటూ భద్రతా బలగాలు సాగించిన ఎన్‌కౌంటర్లు, అపహరణలు, అదృశ్యాలు సరేసరి. మన దేశంలో నామరూపాల్లేకుండా పోయిన ఆ ఉద్యమం ప్రస్తుతం కెనడాలో సాగిస్తున్న కార్యకలాపాల పర్యవసానమేమిటో కనబడుతూనే వుంది.

అయిదుగురు సిక్కు మత పూజారుల అత్యున్నత పీఠం అకల్‌తఖ్త్ సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌ను స్వర్ణాలయ ప్రధానద్వారం వద్ద సాధారణ సేవాదార్‌గా పనిచేయాలని తీర్మానించింది. ఆయన తన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకుంటున్నానని తెలిపే పలకను మెడలో ధరించారు. ఇతర అకాలీ నేతలకు స్వర్ణాలయంలో అంట్లు తోమటం నుంచి మరుగుదొడ్లు శుభ్రం చేయటం వరకూ వేర్వేరు శిక్షలు విధించింది. ఈ శిక్షలకు 2007–17 మధ్య పంజాబ్‌లో ఆ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగిన కూటమి సర్కారులోని భాగస్వామ్య పక్షమైన బీజేపీ అత్యుత్సాహం కారణం. పంథ్ కోసం ప్రాణత్యాగాలు చేసిన వ్యక్తులను విస్మరించి, సిక్కులను అనేకవిధాల హింసించి చంపిన రిటైర్డ్ పోలీసు అధికారుల కుటుంబ సభ్యులకు పదవులు పంచిపెట్టడం అకాలీదళ్ నేతలు చేసిన 'ప్రధాన నేరం'. వీరిలో చాలామంది బీజేపీవారు కాగా, అకాలీ తరఫున ఎంపికైనవారు కూడా ఉన్నారు. అలాగే మతాన్ని అపవిత్రం చేసిన దేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రాం రహీంపై ఉన్న కేసుల్ని ఆయన కోరకుండానే రద్దుచేయటం, దాన్ని సమర్థించుకోవటానికి తమకు అనుకూలంగా ప్రకటన ఇవ్వాల్సిందిగా జతేదార్లను పిలిపించి ఒత్తిడి చేయటం వంటివి ఇతర ఆరోపణలు.

అధికారంలో ఉండగా చేసిన పనులకు అకాలీదళ్ భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వచ్చింది. 1920లో ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న రైతాంగం దూరమైంది. రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగం విచ్చలవిడిగా పెరిగింది. దానికితోడు సాగు సంక్షోభం, ఉపాధి లేమివంటి సమస్యలు మధ్యతరగతిని, ఇతర వర్గాలవారినీ అసంతృప్తిలో ముంచెత్తాయి. అందుకే అకాలీలను వరస ఓటములు వెంటాడాయి. పర్యవసానంగా అంతర్గత కుమ్ములాటలు అధికమయ్యాయి. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ రంగప్రవేశం అకాలీని నిలువునా ముంచింది. ఆ పార్టీ మొన్న జరిగిన ఉప ఎన్నికల్లో అభ్యర్థుల్ని కూడా నిలబెట్టలేకపోయింది. తన భాగస్వామ్య పక్షాన్ని బలహీనపరిచి ఎదగాలని చూసే బీజేపీ ఎత్తుగడలు ఆ రాష్ట్రంలో ఫలించలేదు. అందుకే అకాలీ నేతల 'తప్పుల'కు తగిన శిక్ష విధించి, వారికి ప్రాయశ్చిత్తం చేసుకునే అవకాశమీయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ జాఖడ్ గత నెలలో అకల్‌తఖ్త్‌కు విజ్ఞప్తి చేశారు. అయితే ఉగ్రవాదం విస్తరిస్తుందన్న సాకుతో రాజకీయాల్లో మత సంస్థల ప్రాబల్యం పెంచటం ఎంతవరకూ సబబన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. నిజానికి ఆప్ ఆగమనం, అది అధికార పీఠాన్ని కైవసం చేసుకోవటం విశ్లేషిస్తే మత రాజకీయాల ప్రాబల్యం బలహీన పడిందన్న అభిప్రాయం కలుగుతుంది. అకాలీదళ్ 1977 తర్వాత బాదల్ కుటుంబ ప్రాబల్యంలోకొచ్చాక రాష్ట్రంలో సిక్కు–నిరంకారీ ఘర్షణలు పెరిగాయి. అటూ ఇటూ పదులకొద్దీ మంది మరణించారు. ఇందిర పుణ్యమా అని ఉగ్రవాదం విస్తరించింది. ఈ అయోమయ పరిస్థితుల్లో 1996లో బీజేపీతో కలిసి ప్రయాణించటానికి నిర్ణయించుకుని మోగాలో జరిగిన పార్టీ సమావేశాల్లో సిక్కు మత మూలాలున్న అకాలీదళ్‌ను సెక్యులర్ పార్టీగా మారుస్తూ తీర్మానించటం పంథ్ అనుకూల ఓటర్లను క్రమేపీ పార్టీకి దూరం చేసింది. బీజేపీ ఆ పని చేయకపోవటాన్ని అందరూ వేలెత్తి చూపారు. అకాలీ సీనియర్ నేత, మాజీ మంత్రి అనిల్ జోషి పార్టీ తిరిగి పంథ్ అనుకూల వైఖరి తీసుకుని శిక్షలకు తలొగ్గటాన్ని నిరసిస్తూ అకాలీదళ్‌కు రాజీనామా చేశారు. ఈ అంతర్మథనం బాదల్‌పై జరిగిన తాజా దాడితో ఏయే మలుపులు తీసుకుంటుందో, అకాలీదళ్ ప్రస్థానం ఎలా కొనసాగుతుందో ముందుముందు చూడాలి.

ఢిల్లీ బహుత్ దూర్ హై!

విశ్లేషణ



దిలీప్ రెడ్డి

ఢిల్లీ బాద్‌షా ఎవరు? కేంద్ర సర్కార్ బడానేతలు మోదీ–షా ద్వయానికి అతిపెద్ద రాజకీయ సవాల్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నిక. దశాబ్దంగా దేశ ఎన్నికల రాజకీయాలను దాదాపు శాసిస్తున్న బీజేపీ నాయకత్వానికి మింగుడు పడని గరళ గుళిక 'ఢిల్లీ'! పదేళ్లలో, వరుసగా 2014, 2019, 2024 మూడు ఎన్నికల్లో ఏడుకు ఏడు లోక్‌సభ స్థానాలు అలవోకగా గెలుస్తూ వస్తున్న బీజేపీ... ఢిల్లీ రాష్ట్రాధికార పీఠాన్ని ఎడబాసి పాతికేళ్లు! దేశ రాజధానిలో పునర్వైభవం కోసం రెండున్నర దశాబ్దాలుగా అది చేయని యత్నం, వేయని ఎత్తు లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే ఆధిపత్యానికి కొంత గండిపడ్డా.... హరియాణా, మహారాష్ట్ర ప్రభుత్వాలను తిరిగి నిలబెట్టుకున్న ఆత్మవిశ్వాసంతో పార్టీ నాయకత్వం ఢిల్లీ అసెంబ్లీ పోరుకు సిద్ధమౌతోంది.

భూమ్మీద రెండో అతిపెద్ద జనాభా (3.4 కోట్లు) నగరం మన రాజధాని ఢిల్లీ. 3.7 కోట్ల జనాభా కలిగిన టోక్యో (జపాన్) తర్వాత మనదే ఎక్కువ జనాభా నగరం. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను వేర్వేరుగా చూస్తూ ఓటేసే తెలివిపరుల బరి ఇది. అదే, ప్రపంచంలో అతిపెద్ద రాజకీయ పార్టీ బీజేపీకి చిక్కులు తెచ్చిపెడ్తోంది. ఏకులా వచ్చి మేకులా, స్థానిక రాజకీయ శక్తిగా ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) స్థిరపడిపోవడం బీజేపీకి మింగుడుపడట్లేదు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్, పదకొండేళ్లుగా ఢిల్లీని ఏలుతున్న ఆప్‌లకు ఒక లోక్‌సభ సీటు కూడా దక్కనీకుండా బీజేపీ, దశాబ్దకాలంగా సున్నాకే పరిమితం చేసింది. కానీ, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్ని వరసగా మూడు పర్యాయాలు కాంగ్రెస్, మరో మూడుమార్లు ఆప్ గెలవటంతో 26 ఏళ్లుగా బీజేపీ ప్రతిపక్ష పాత్రకే పరిమితమౌతోంది. రాజకీయ ఆటుపోట్ల నడుమ కూడా, 70లో 11 స్థానాలకు ఆప్ అప్పుడే అభ్యర్థులను ప్రకటించి బరిలో దూకింది. ఫిబ్రవరిలో ఢిల్లీ కొత్త ప్రభుత్వం ఏర్పడాలి. మోదీ నాయకత్వంలోని బీజేపీని ఎదుర్కొనేందుకు ఆప్ అస్త్రశస్త్రాలు సన్నద్ధం చేసుకుంటోంది. ఎన్నికలవేళ ఓటర్లను ఆకట్టుకునే 'ఉచితాల మీద ('రేవడీ పే') చర్చ' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ విషయంలో బీజేపీది రెండు నాల్కల ధోరణి అని విమర్శించే ఆప్, మహారాష్ట్ర హామీల ఉదాహరణలతో వారిని ఎండగట్టాలని ఎత్తుగడ. మరో పక్క కాంగ్రెస్ 'ఢిల్లీ న్యాయయాత్ర' ప్రారంభించింది. ఆప్ పాలన బాగోలేదనే విమర్శతో...'ఢిల్లీ ఇక సహించదు' అనే నినాదాన్ని ప్రచారం చేస్తోంది.

పొత్తుతో 'ఆప్'కి మేలా, కీడా?

ఢిల్లీలో 70 సీట్లకు ఒంటరిగానే పోటీచేస్తామని అటు కాంగ్రెస్, ఇటు 'ఆప్' ప్రకటించాయి. ఇక రాబోయేది మూడు ముక్కలాటే! సహజంగానే 'ఇండియా' కూటమి మిత్రులుగా ఆప్, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తాయనుకుంటారు. లోక్‌సభ ఎన్నికల్లో అలాగే చేశాయి. కానీ, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో వేర్వేరుగా బరిలోకి దిగాయి. 2013 నుంచి ఢిల్లీ రాజకీయాల్లో సమీకరణాలు మారుతూ వస్తున్నాయి. షీలా దీక్షిత్ సీఎంగా మూడు పర్యాయాలు ఢిల్లీలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పతనం 2013 నుంచే మొదలైంది. ఆ ఎన్నికల్లో 24.7 శాతం ఓట్లు పొందిన కాంగ్రెస్‌కు 2015లో 9.7%, 2020లో 4.3% ఓట్లే దక్కాయి. 2013లోనే 29.7% ఓట్లతో ఆధిక్యత ప్రారంభించిన ఆప్, 2015లో 54.5% ఓట్లు సాధిస్తే, 2020లో 53.8% ఓట్లు దక్కించుకుంది. మూడు మార్లూ గెలిచింది. పదేళ్లుగా పాలకపక్షం 'ఆప్' మీద ప్రభుత్వ వ్యతిరేకత ఉందనీ, దాన్ని సొమ్ము చేసుకుంటూ తాను పూర్వవైభవం సాధించాలనీ కాంగ్రెస్ భావిస్తోంది. ఇదే ఆలోచన బీజేపీది. కాంగ్రెస్ – బీజేపీ మధ్య ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలితే... అది 'ఆప్'కే లాభం! కాంగ్రెస్‌తో కలిసి ఆప్ పోటీ చేస్తే, లాభం ఉంటుందనే గ్యారెంటీ లేక పోగా ప్రభుత్వ వ్యతిరేక ఓటులో కాంగ్రెస్ అంటే గిట్టని వారి ఓటు...



బీజేపీకి అనుకూలంగా కేంద్రీకృతమయ్యే ఆస్కారాన్ని శంకిస్తున్నారు. మూడు పార్టీల వ్యూహకర్తలు ఎలా ఆలోచిస్తారో చూడాలి. 2013లో 70 చోట్ల పోటీ చేసిన కాంగ్రెస్ 8 స్థానాల్లో నెగ్గితే, 69 పోటీ చేసిన ఆప్ 28 సీట్లు. 66 పోటీ చేసిన బీజేపీ 31 సీట్లు గెలిచాయి. 2015లో ఫలితాల సునామీ సృష్టించిన ఆప్ 70 చోట్ల పోటీ చేసి 67 గెలిచి, ప్రత్యర్థుల్ని 'చీపురు' పెట్టి ఊడ్చింది. 69 చోట్ల పోటీ చేసిన బీజేపీకి 3 సీట్లు లభిస్తే, మొత్తం 70 స్థానాలకూ పోటీ చేసిన కాంగ్రెస్ ఒకచోట కూడా గెలువలేకపోయింది. 2020 లోనూ సుమారు అటువంటి పరిస్థితే! కాంగ్రెస్ (0), బీజేపీ (8) లపై మళ్లీ ఆప్ (62) ఏకపక్ష ఆధిక్యత సాధించింది.

ఓటరు పరిణతి వేరు

పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్ని ఢిల్లీ ఓటర్లెప్పుడూ వేర్వేరు వేదికలుగానే చూస్తారు. జాతీయాంశాల పరంగా లోక్‌సభ ఎన్నికల్లో తీర్పిస్తే, దైనందినాంశాలు, పౌర సదుపాయాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలను, వాటి పనితీరును కొలుస్తుంటారు. అక్కడే 'ఆప్' క్లిక్ అయింది. తాగునీరు, విద్యుత్తు, విద్య, వైద్యం, రవాణా వంటి అంశాల్లో శ్రద్ధ వహిస్తూ, ఢిల్లీ ఓటర్లతో తన నిబద్ధత చాటుకుంది. అర్బన్ ఓటర్లను ఆకట్టుకోగలిగింది. సర్కారు బడుల్ని మెరుగుపరచడం, మొహల్లా ఆస్పత్రుల్ని బాగుచేయడం, ఉచితంగా 400 లీటర్ల వరకు తాగునీరు, 200 యూనిట్ల వరకు విద్యుత్తు, మహిళలకు బస్సుల్లో ప్రయాణ సదుపాయం వంటివి కల్పించడం సంక్షేమపరంగా పెద్ద ముందడుగు. పన్ను చెల్లింపుదారలకు న్యాయం చేసే సర్కారు జవాబుదారీతనం, అవినీతి రహిత పాలననూ ఆప్ ప్రచారం చేసుకుంది. కానీ, ఢిల్లీ మద్యం పాలసీ కేసు వల్ల ఆప్ ప్రభుత్వం అవినీతిలో పీకల్లోతు కూరుకుపోయిందంటూ ప్రత్యర్థులు ప్రచారం చేసే ఆస్కారం వచ్చింది. దీన్ని బీజేపీ ఎలా వాడుకుంటుందో చూడాలి. ఆ కేసులో, ముఖ్యమంత్రి హోదాలో అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఎంపీ సంజయ్ సింగ్ తదితర ఆప్ ముఖ్యులు అరెస్టయ్యారు. కేజ్రీవాల్ సీఎం పదవికే రాజీనామా చేశారు. అది కేవలం బీజేపీ కక్ష సాధింపేనని తిప్పికొట్టిన ఆప్ నాయకత్వం, నిర్దోషులుగానే నేతలు బయటపడతారని చెబుతోంది. 'పాక్షిక రాష్ట్ర హోదా కల్గిన ఢిల్లీపై, లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా దొడ్డిదారి అధికారం చలాయిస్తూ, ఆప్ ప్రతిష్ఠ మసకబారేలా బీజేపీ నాయకత్వం కుయుక్తులు పన్నుతోందని ఆప్ విమర్శిస్తోంది.

నాడి పట్టడంలో బీజేపీ విఫలం

ఎక్కువ నగర, తక్కువ గ్రామీణ జనాభాతో ఉండే ఢిల్లీ ఒకప్పుడు బీజేపీకి ఓటు బ్యాంకు. కానీ, 1998 తర్వాత సీన్ మారింది. ప్రస్తుత సమీకరణాల్లో ఢిల్లీ వాసుల నాడి పట్టలేకపోతోంది. పాతతరం – కొత్త తరం, సంపన్నులు–పేదలు, స్థానికులు–వలసజీవులు... ఇలా వైవిధ్యంగా ఉన్న సమూహాల్లో బీజేపీకి ఆధిపత్యం దొరకటం లేదు. ఒకప్పుడు తిరుగులేని పట్టున్న ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎమ్సీడీ) ఎన్నికల్లోనూ బీజేపీకి క్రమంగా పట్టు జారుతోంది. 98 శాతం ఢిల్లీ అర్బన్ జనాభా 75 శాతం విస్తీర్ణంలో నివాసముంటుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 7 పార్లమెంటు స్థానాలూ గెలిచిన బీజేపీకి, 52 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆధిక్యత దక్కింది. ఆప్ (10), కాంగ్రెస్ (8) కు నాలుగోవంతు సీట్లలోనే ఆధిక్యత వచ్చింది. కలిసి పోటీ చేసిన ఆప్ (24.17%), కాంగ్రెస్ (18.19%)ల ఉమ్మడి ఓటు వాటా (42.36%) కన్నా బీజేపీ వాటా (54.35%) ఎక్కువ! 2008 నుంచీ బీజేపీ గెలవని అసెంబ్లీ స్థానాలు 23 ఉంటే, కాంగ్రెస్ గెలవని స్థానాలు 25 ఉన్నాయి. 2013 నుంచి ఆప్ గెలవని స్థానం ఒకటే! 2013, 2015, 2020 అన్ని ఎన్నికల్లోనూ వారు గెలుస్తూ వస్తున్న స్థానాలు 26 ఉన్నాయి.

ఆప్ ఓ నాలుగు లోక్‌సభ స్థానాలు పంజాబ్‌లోనైనా గెలిచింది తప్ప ఢిల్లీలో ఖాతాయే తెరవలేదు. ఢిల్లీ మహానగరంలో సామాజిక వర్గాల సమీకరణం కూడా ఈ వైవిధ్య ఫలితాలకు కారణమే! ఢిల్లీ 70 అసెంబ్లీ సీట్లలో... బిహార్, యూపీ రాష్ట్రాల వలసదారుల ఆధిపత్యమున్నవి 17 స్థానాలయితే, అంతే సంఖ్య స్థానాల్లో పంజాబీలు (14 శాతం జనాభా) నిర్ణాయకశక్తిగా ఉంటారు. స్థానికంగా పట్టు కలిగిన గుజ్జర్లు, జాట్లవి ఓ 10 స్థానాలు. ఢిల్లీ మొత్తంలో 12% జనాభా కలిగిన ముస్లింలు 30% మించిన ఓటర్లతో, నిర్ణాయకంగా ఉన్నవి 6 నియోజకవర్గాలు. అన్ని వర్గాలు మిళితమై నిర్దిష్టంగా ఎవరికీ ఆధిక్యత లేని నియోజకవర్గాలు 20 వరకుంటాయి. ఇన్ని వైవిధ్యాల మధ్యనున్న దేశ రాజధాని అసెంబ్లీ పీఠం గురించి ఎన్ని ఎత్తుగడలేసినా... బీజేపీకి, ఇంకా ఢిల్లీ బహుదూరమే (అభీ ఢిల్లీ బహుత్ దూర్ హై)!

వ్యాసకర్త పొలిటికల్ ఎనలిస్ట్,
పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ డైరెక్టర్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ప్రచారమేనా?



నవంబర్ నెలలో బంగ్లాదేశ్‌లో ఎంతమంది హిందువులను చంపేశారు? మీరంతా నరమేధం జరుగుతోందని అంటున్నప్పుడు, సంఖ్యలు భయానకంగా ఉండాలి కదా!

– జాఫర్ శోభన్, బంగ్లాదేశ్ సంపాదకుడు

ఏది భయానకం?



ఇస్లామిక్ అతివాదం లేనట్టుగా మీరొక సినిమా తీస్తే, హిందూ రైట్ వింగ్ నుంచి మీకు ట్రోలింగ్ ఎదురవుతుంది. అదే ఇస్లామిక్ కథనాన్ని సవాల్ చేసేట్టు గానో, లేదా చరిత్రను సత్య పూరితంగానో చూపితే మీ కుటుంబంతో సహా తలలు తెగుతాయనే బెదిరింపులు వస్తాయి. అన్నట్టు, నిజమైన భయం హిందుత్వనే కదా!

– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

కాదా రుజువు?



గతంలో ఒక ముఖ్య మంత్రి దారుణ హత్యకు పంజాబ్ సాక్షిగా నిలిచింది. ఇప్పుడు ఒక ఖలిస్తానీ ఉగ్రవాది చేతిలో ఒక మాజీ ఉప ముఖ్యమంత్రి దాదాపుగా హత్యకు గురి కాబోయారు. మరెందుకు పంజాబ్ ముఖ్య మంత్రి అసమర్థత, విఫల నాయకత్వం విమర్శకు గురికావడం లేదు?

– తుషార్ గుప్తా, జర్నలిస్ట్

విలువ



ఇంటెల్ సంస్థలో 1,24,800 మంది ఉద్యోగులు ఉన్నారు. దాని మార్కెట్ విలువ 104 బిలియన్ డాలర్లు. అదే ఎన్విడియాలో ఉద్యోగులు 29,600 మంది మాత్రమే. దాని మార్కెట్ విలువ 3.4 ట్రిలియన్ డాలర్లు. ఊరికే చెబుతున్నా.

– అపూర్వ గోవింద్, ఆంట్రప్రెన్యూర్

అవసరమైన నాలుగు




ఈ నాలుగింటినీ నిరోధించేట్టుగా నిర్మితమైన ఈ ప్రపంచంలో ఆధునిక విలాసం ఏమిటంటే– స్పష్టంగా ఆలోచించడం, గాఢంగా నిద్రపోవడం, నెమ్మదిగా పని చేసుకోవడం, నిశ్శబ్దంగా జీవించడం.

– జస్టిన్ వెల్ష్, ఆంట్రప్రెన్యూర్

గాయక సార్వభౌముడు

భారతీయ సంగీత పండితుల్లో ఒకరు. త్యాగరాజస్వామి శిష్యపరంపరలో మూడవ తరానికి చెందినవారు. సాక్షాత్తు త్యాగరాజస్వామి శిష్యుడూ, తంజావూరులోని మానాంబుచావడి గ్రామ నివాసీ అయిన ఆకుమడుల వెంకట సుబ్బయ్యకు శిష్యుడైన సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి శిష్యులే పారుపల్లి రామకృష్ణయ్య పంతులు. దక్షిణామూర్తి శాస్త్రి వద్ద తన సంగీత శిక్షణ కొనసాగించి గాయకుడిగా, వాయులీన విద్వాంసునిగా అసమాన ప్రతిభ గడించారు. తాను గడించిన విద్యను జీవితాంతం భక్తిభావంతో అభివృద్ధి చేసుకుంటూ తెలుగు నేలపై శాస్త్రీయ సంగీత పునరుజ్జీవనానికి మూలపురుషులయ్యారు.



పారుపల్లి రామకృష్ణయ్య పంతులు

ఆయన 1882 డిసెంబర్ 5న కృష్ణా జిల్లా శ్రీకాకుళంలో జన్మించారు. సంగీత సంప్రదాయాన్ని తన ఆసీస్వరాలతో మనసా, వాచా, కర్మణా... జాతి, కుల, మత వర్గ విభేదాల కతీతంగా శిష్యకోటికి ప్రసాదించారు. విజయవాడను కేంద్రబిందువుగా చేసుకొని శాస్త్రీయ సంగీత ప్రాచుర్యానికి పునాదులు వేశారు. శిష్యుల సంగీత అధ్యయనం, సాధనలతో నిత్యమూ గురుకులం కళకళలాడుతుండేది. అన్ని వర్గాల వారు ఈ గురుకులంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు అందుకొని శ్రద్ధగా సంగీతం నేర్చుకొని వృద్ధిలోకి వచ్చారనటంలో సందేహం లేదు.

పంతులుగారి శిష్యులు నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు గురువుగారి గురించి చెబుతూ 'వారు పాఠం చెప్పే తీరు, పాడే తీరుకూడా నేర్చుకునేవారికి సుబోధకంగానూ, మార్గదర్శకంగానూ ఉండేది. వారు కచేరీలలో రాగం పాడినా, నెరవు చేసినా, స్వర ప్రస్తారం చేసినా ప్రతి విషయం నమూనాలుగా భాసించేవి' అన్నారు. ప్రముఖ వాగ్గేయకారుడు మంగళంపల్లి బాలమురళీ కృష్ణ, వయొలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి, నేతి శ్రీరామ శర్మ, టి.కె. యశోద దేవి, జి. వి. రామకుమారి వంటివారు ఆయన శిష్యులే.

పారుపల్లివారు మద్రాసు సంగీత అకాడమీ నిపుణుల సంఘంలో సభ్యుడుగా చాలాకాలం పనిచేశారు. తిరువాయూరులోని త్యాగబ్రహ్మ ఆరాధన ఉత్సవ కార్యక్రమ నిర్వాహక సభ్యునిగా ఉన్నారు. ఆ రోజులలో కొలంబియా గ్రామఫోన్ కంపెనీ ఆయన కార్యక్రమాలను రికార్డు చేసింది. పంతులుగారి కృషి, ప్రోద్బలంతో ఆంధ్ర రాష్ట్రంలో విజయవాడ పట్టణంలో ప్రప్రథమంగా ఆకాశవాణి కేంద్రం, తదుపరి సంగీత కళాశాల ప్రారంభమయ్యాయి. 1951 జూలై 7న ఏకాదశి పర్వదినాన గురువులు దక్షిణామూర్తిశాస్త్రి ఆరాధనోత్సవాలు జరుపుతున్న వేళ సంగీత సరస్వతి ఒడికి చేరుకున్న మహర్షి పారుపల్లి. భారతీయ సంగీతం ఉన్నంత వరకూ ఆయన పేరు నిలిచి ఉంటుంది.

– యనమండ్ర వెంకట కృష్ణయ్య । 9849986679

(విజయవాడ శివరామకృష్ణ క్షేత్రంలో నేటి నుంచి 5 రోజుల పాటు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు జయంతి ఉత్సవాలు జరుగుతాయి.)

ఏపీజీబీ తరలింపు అన్యాయం!

అభిప్రాయం



ఎ. రఘునాథరెడ్డి

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ)తో మరో మూడు గ్రామీణ బ్యాంకుల్ని విలీనం చేసి, విలీనానంతర బ్యాంకును అమరావతికి తరలిస్తారన్న వార్తలు వస్తున్నాయి. ఈ తరలింపు ఆలోచన ఔచిత్యాన్ని పరిశీలించడం అవసరం. దేశంలోని గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి వాటి సంఖ్యను 43 నుంచి 28కి కుదించాలనీ, ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు గ్రామీణ బ్యాంకుల్ని విలీనం చేసి ఒకే రాష్ట్రస్థాయి బ్యాంకుని ఏర్పాటు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను మొదటగా స్వాగతించాలి. దేశ వ్యాప్తంగా గ్రామీణ బ్యాంకుల సిబ్బంది తమ బ్యాంకులను విలీనం చేసి రాష్ట్రానికి ఒక్క గ్రామీణ బ్యాంకు ఏర్పాటు చేయాలని దీర్ఘకాలంగా కోరుతూ వస్తున్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తాజాగా 'వన్ స్టేట్ – వన్ ఆర్ఆర్‌బీ' విధానానికి అనుగుణంగా ఈ ఆకాంక్షను మన్నించింది. ఇందులో భాగంగా నూతన ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు గ్రామీణ బ్యాంకులు కలిసి రాష్ట్ర స్థాయిలో ఒకే బ్యాంకుగా మారబోతున్నాయి. ఇప్పటివరకు ఈ నాలుగు బ్యాంకుల్లో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కడపలో, సప్తగిరి గ్రామీణ బ్యాంకు చిత్తూరులో, చైతన్య గ్రామీణ బ్యాంకు గుంటూరులో, ఉత్తరాంధ్రలోని గ్రామీణ బ్యాంకులు వరంగల్ ప్రధాన కార్యాలయాలుగా పనిచేస్తున్నాయి.

ఇప్పుడు ఏపీలోని 26 జిల్లాల్లోని గ్రామీణ బ్యాంకుల విలీనానంతర రాష్ట్రస్థాయి బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉండాలన్నది ప్రశ్న. ఈ విషయంలో సంప్రదాయాలు, మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నా ఈ ప్రధాన కార్యాలయాన్ని కడపలో కాకుండా అమరావతికి తరలించాలని ప్రభుత్వం చూస్తోంది. ఇది వివాదాస్పద నిర్ణయం. సంప్రదాయం విషయానికొస్తే... గత నమూనా ఒకటి ఉంది. రాయలసీమ గ్రామీణ బ్యాంకుతో అనంత గ్రామీణ బ్యాంకు, పినాకిని గ్రామీణ బ్యాంకులు 2006లో విలీనమయ్యాయి. విలీనానంతర బ్యాంకుగా 'ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు'ను ఏర్పాటు చేసి... రాయలసీమ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలో ఉంది కాబట్టి దాని ప్రధాన కార్యాలయాన్నీ కడపలోనే ఏర్పాటు చేశారు. మార్గదర్శకాల ప్రాతిపదికన చూస్తే... తాజాగా 2024 నవంబర్ 4న కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఆర్ఆర్‌బీ సెక్షన్ విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు: గ్రామీణ బ్యాంకులు ఏదైనా ఒక పెద్ద గ్రామీణ బ్యాంకులో విలీనమైనప్పుడు, ఆ పెద్ద గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎక్కడుందో, అక్కడే విలీనం తర్వాత ఏర్పడే రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయాలి. సంప్రదాయమే కాకుండా, ఇలా చూసినా, ఏపీ రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కడపలోని ఏర్పాటు కావాలి.

వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి ఇప్పటికే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు పోషించిన పాత్ర విస్మరించలేనిది.



ఏపీజీబీ రైతులకు రుణాలు ఇచ్చింది. స్వయం సహాయక బృందాలకు అండగా నిలిచింది. చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు అక్కడక్కడైనా నిడదొక్కుకోవడానికి ఊపిరి పోసింది. ఏపీజీబీ ఇలా చేయగలగడానికి కారణం రాయలసీమ నేపథ్యం, అవసరాలే! ఏపీజీబీ స్పాన్సర్ బ్యాంక్ అయిన కెనరా బ్యాంకుతో సహా మిగతా మూడు గ్రామీణ బ్యాంకుల స్పాన్సర్ బ్యాంకుల ముఖ్య అధికారుల వ్యక్తిగత అజెండాలూ, ఆ బ్యాంకుల వ్యాపార ప్రయోజనాలూ ఏపీజీబీ విలీన బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించాలన్న వాదన వెనక ఉన్నాయని బలంగా వినిపిస్తున్నది. ఇది సరైనది కాదు. ఇది ప్రజల అవసరాలు, దీర్ఘకాల దృష్టితో, బాధ్యతతో పాలకులు నిర్ణయించాల్సిన అంశం.

కడపలో ఇప్పుడున్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయానికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సహకరించి స్థలమివ్వడం వల్ల 2015 లోనే చాలా మంచి సొంత ప్రధాన కార్యాలయం ఉంది. 50 సెంట్లలో, 47 వేల చదరపు అడుగులలో, ఒక సెల్లార్, నాలుగు అంతస్తులలో అధునాతనమైన కార్యాలయంగా ఇది ప్రారంభమైంది. కడపలో ఆకర్షణీయమైన ఆఫీస్ ప్రెమిసెస్‌లో కలెక్టరేట్ తర్వాత ఇదే అత్యుత్తమమైనది.

ఇక రాష్ట్రంలోని నాలుగు గ్రామీణ బ్యాంకుల వ్యాపార ఫలితాల విషయానికొస్తే, ఏపీజీబీ తర్వాతే ఏదైనా! రాష్ట్రంలో గ్రామీణ బ్యాంకుల మొత్తం వ్యాపారంలో 43 శాతం వ్యాపారం ఏపీజీబీదే. నష్టాలు తట్టుకునే సామర్థ్యం, మూలధన అవసరాల్ని తీర్చే శక్తి ఏపీజీబీకే ఎక్కువ (25.65%). కరెంట్ అకౌంట్, సేవింగ్ అకౌంట్ లలో కస్టమర్లను బాగా ఆకర్షించే కాసా నిష్పత్తిలో ఏపీజీబీదే అగ్రస్థానం.

అన్ని బ్యాంకుల మొత్తం కస్టమర్ల కంటే ఎక్కువగా ఏపీజీబీకే (86.75 లక్షల మంది కస్టమర్లు) ఉన్నారు. బ్రాంచ్‌ల సంఖ్య ఏ ఇతర గ్రామీణ బ్యాంకుతో పోల్చుకున్నా కూడా రెట్టింపే. రాష్ట్రంలోని మిగతా గ్రామీణ బ్యాంకులకు లేని చెస్ట్ సదుపాయం ఆర్బీఐ అనుమతితో కడప ఏపీజీబీకి ఎప్పటి నుంచో ఉంది. మిగతా గ్రామీణ బ్యాంకుల మొత్తం రిజర్వుల కంటే ఏపీజీబీ రిజర్వులు 1400 కోట్లు ఎక్కువ.

విభజన హామీల అమలు విషయంలో ఇప్పటికే న్యాయం జరగలేదు. పైగా, ఇటీవలే కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్‌లో భాగమైన ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ఇప్పుడు అమరావతిలో బుద్ధిగా ఒదిగిపోయింది. తాజాగా, రాయలసీమ నుంచి లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, ఏపీఈఆర్సీ, వక్ఫ్ ట్రిబ్యునల్, సీబీఐ కోర్టు అమరావతికి తరలిస్తున్నారన్న వార్తలు వస్తున్నాయి. వచ్చేవి రాకపోయె, విశాల రాయలసీమ నడిబొడ్డున ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కూడా అమరావతికి తరలించాలన్న కృత నిశ్చయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉందని వస్తున్న సంకేతాలు అనుబంధాలకు అతీతంగా ఇక్కడి ప్రజల మనోభావాల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. అందుకే ఇప్పటికే వామపక్ష సంఘాలు ఆందోళన బాట పట్టాయి. పార్టీలకు అతీతంగా అనేకమంది రాజకీయ నాయకులూ ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజానుకూలంగా, దీర్ఘకాలిక దృష్టితో వ్యవహరిస్తుందని ఆశిద్దాం!

వ్యాసకర్త సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్

మానసిక సంస్కారం

నచ్చిన వస్తువుల లక్షణాలను గ్రహించడమే మనసు సంస్కారం. మనసును బాహ్య విషయాల వైపు మళ్ళిస్తే అది వాటినే గ్రహించి ప్రతిబింబింప చేస్తుంది. మంచి కార్యాలు, ఆధ్యాత్మిక విషయాలపై లగ్నం చేస్తే, అది తనంతట తానుగా మంచినే గ్రహిస్తుంది. మంచినే ప్రతిబింబింప చేస్తుంది.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ఆధ్యాత్మికంగా పురోగతి సాధించాలంటే గొప్ప, గొప్ప ఆధ్యాత్మిక లక్ష్యాల పైననే మనసును లగ్నం చేయాలి. అల్పమైన ప్రాపంచిక విషయాలవైపు అత్యంత స్వల్ప దృష్టినే ఉంచాలి. నీవు దేవుని ఆరాధించినట్లయితే, నీలో దైవత్వం ప్రతిబింబిస్తుంది. మహాత్ముల, సాధువుల సాంగత్యం నిన్ను భగవంతుని ద్వారం దగ్గరకు తీసుకొని వెళ్తుంది. దీనికి భిన్నంగా నీవు ఈ ప్రపంచమందున్న వస్తు సముదాయాలతో సాన్నిహిత్యాన్ని పెంచుకుంటే, అది నిన్ను ఈ సంసారంతో బంధించివేస్తుంది. అందుకే వెంటనే సరైనన నిర్ణయం తీసుకోవాలి.

జీవిత ప్రయాణంలో సుఖ దుఃఖాలు ఎల్లప్పుడూ ఉంటాయి. ఇప్పుడు లభించిన సుఖం రేపటికి ఉండదు. అదే విధంగా దుఃఖం కూడా చిరకాలం ఉండదు. సుఖ, దుఃఖాలు నిరంతరం ఒకదాని తర్వాత ఒకటి వస్తూ పోతుంటాయి. వాటిని అతిథులుగా పరిగణించాలి. అతిథులు మనతో తాత్కాలికంగా కలసి ఉంటారు. ఒకవేళ నీవు నీ దృష్టిని (మనస్సును) భగవంతునిపై లగ్నం చేసినట్లయితే ఈ ఆగంతకాలు (సుఖ దుఃఖాలు) నీకు ఏవిధమైన నష్టం చేయలేవు. రావడం, పోవడం అనేవి వాటి సహజ లక్షణం.

కాని ఏ మానవుడు రాగ ద్వేషాలతో ప్రాపంచిక విషయాల్లో మునిగి ఉంటాడో... ఆ మనిషిని ఈ ఆగంతకాలు పాడుచేస్తాయి. అంతేకాకుండా సుఖ శాంతులు లేకుండా చేస్తాయి. వాటి చావు దెబ్బల నుండి రక్షించుకోవాలంటే... భగవంతుని లేక గురువును శరణాగతి చేయాలి.



గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిరమాసం, **తిథి:** శు.చవితి ఉ.11.52 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ సా.5.14 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** రా.9.10 నుండి 10.42 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.02 నుండి 10.50 వరకు తదుపరి ప.2.29 నుండి 3.17 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.44 నుండి 12.21 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.20, **సూర్యాస్తమయం:** 5.21.

ఉరి తాడే గతి



సమస్యలు పరిష్కరించాలని 19 రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు పట్టడం లేదని గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక తమకు ఉరే గతి అంటూ దీక్షలు చేస్తున్న ప్రదేశంలో మెడకు తాళ్లతో ఉరి వేసుకున్నట్లు స్థానిక ఐటీడీఏ వద్ద తమ నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే ఇకపై ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ నిరసనకు సీపీఎం మద్దతు తెలిపింది. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీసింది. సమ్మె కారణంగా విద్యాబోధన పూర్తిగా కుంటుపడిందని పేర్కొంది.

– పాడేరు

టీడీపీ నేతలకు కాసుల 'పండుగ'





అందరూ అనుకున్నట్లుగా టీడీపీ చేపట్టిన పల్లె పండుగ.. ఆ పార్టీ నేతలకు కాసుల పండగ్గా మారింది. పల్లెల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులంటూ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ పనులను అడ్డదారిలో టీడీపీ నాయకులకు కట్టబెట్టింది. శిథిలావస్థలో ఉన్న రహదారులను అభివృద్ధి చేయాల్సింది పోయి, స్థానికంగా ఉన్న ఓ టీడీపీ నేత ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ భద్రంగా ఉన్న పాత రోడ్డుపై కొత్త రోడ్డు వేయడం నియోజకవర్గ ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. కర్నూలు జిల్లా, కౌతాళం మండలం కుంబళనూరు క్యాంపు–1లో నిబంధనలకు విరుద్ధంగా గతంలో సిమెంటు రోడ్డు వేసిన రామాలయం వీధిలోనే మళ్లీ సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారు. అధికారులు ముందు... వెనుక.. చూడకుండా అనుమతులివ్వడంపై స్థానికులు మండిపడుతున్నారు.


– కౌతాళం

వన్య ప్రాణుల వన విహారం..!





సఫారీ వీక్షకుల ముందు నుంచి నింపాదిగా వెళ్తున్న ఏనుగు... ఆదమరిచి విశ్రాంతి తీసుకుంటున్న పులి రాజు... ఫొటోకు పోజిస్తున్న మరో ఏనుగు. ఇవన్నీ మైసూరు–కొడగు జిల్లాల్లోని నాగరహొళె అభయారణ్యంలో అంతరసంత అనేచోట బుధవారం కెమెరాకు చిక్కాయి. నిత్యం పర్యాటకులు వస్తూ ఉండడంతో ఏనుగులు, పులులు మానవ సంచారానికి అలవాటుపడిపోయాయి. సఫారీ వాహనాలు వాటి ముందు నుంచి వెళుతున్నా పెద్దగా స్పందించడం లేదు.



– మైసూరు

● అనంతపురం జిల్లా కంబదూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రాఘవేంద్ర (44) మంగళవారం రాత్రి కార్యాలయంలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. రాయదుర్గానికి చెందిన రాఘవేంద్ర రెండేళ్లుగా కంబదూరు గ్రామ పంచాయతీ గ్రేడ్–3 కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇటీవల కంబదూరు పంచాయతీతో పాటు ఇతర పంచాయతీలకు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. దీంతో పని ఒత్తిడి అధికమైంది. మానసికంగా కుంగిపోయి జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నారు.

'వాటర్ హీరో'కు మరో ప్రతిష్టాత్మక అవార్డు



డాక్టర్ రాజశేఖరరాజు

తెనాలి: వర్షం నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ, సమర్థ నీటి యాజమాన్యం అంశాల్లో కేంద్ర ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖచే 'వాటర్ హీరో' అవార్డు పొందిన తెనాలికి చెందిన డాక్టర్ పాదిలి రాజశేఖరరాజు మరో ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ వివిధ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో ఇండియా వాటర్ ఫౌండేషన్ న్యూఢిల్లీలో 5, 6 తేదీల్లో 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ డిసిఫెరింగ్ ట్రాన్స్‌వర్సాలిటీ ఆఫ్ వాటర్–ఎనర్జీ–ఎన్విరాన్‌మెంట్ నెక్సస్' సదస్సు చేపట్టనున్నది. ఈ సదస్సులోనే 'ట్రాన్స్‌వర్సాలిటీ గ్లోబల్ అవార్డు–2024'ను రాజశేఖరరాజుకు అందజేయనున్నది.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు వేగవంతం

సాక్షి, అమరావతి: కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన ప్రతిభాదేవి ఆ తర్వాత మంత్రి ఫరూక్‌ను కలిశారు. ఈ సందర్భంగా ప్రతిభాదేవి, మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్ సీహెచ్ శ్రీధర్‌తో మంత్రి ఫరూక్ వివిధ అంశాలపై చర్చించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడమే కాకుండా, శాసనసభ, శాసనమండలిలో ఏకగ్రీవంగా ఆమోదించిందని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఉపాధ్యాయుడు మృతి



ఏజియాస్ (ఫైల్)

రాయచోటి: తరగతి గదిలో ఉపాధ్యాయుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మేథ్స్ టీచర్‌గా పనిచేస్తున్న మహమ్మద్ ఏజియాస్ (46) పాఠాలు చెప్పేందుకు 9వ తరగతి గదిలోకి వెళ్లాడు. కొద్దిసేపటికి కుర్చీలో కూర్చుని వాంతులు చేసుకున్నట్టు తోటి ఉపాధ్యాయులు గుర్తించారు. గుండెపోటు వచ్చినట్టు భావించి ప్రథమ చికిత్సగా టాబ్లెట్ అందించి ఏజియాస్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు నిర్ధారించారని హెడ్మాస్టర్ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. విద్యార్థులు దాడి చేయడంతోనే ఉపాధ్యాయుడు మృతి చెందారని స్థానికులు చెబుతుండగా.. ఇదే విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఘటనపై అర్బన్ సీఐ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందినట్టు ప్రధానోపాధ్యాయుడు షబ్బీర్ ఫిర్యాదు చేశారన్నారు. గురువారం పాఠశాలకు వెళ్లి అన్ని కోణాల్లో విచారణ చేస్తామన్నారు. తన భర్త ఏజియాస్‌ను విద్యార్థులతోపాటు ఆ పాఠశాల ఉపాధ్యాయులు కూడా కారణమని ఏజియాస్ భార్య రేహిమాని కన్నీటి పర్యంతమయ్యారు. తన భర్తకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవన్నారు. దోషులెవరో గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుడు ఏజియాస్ మృతిపై లోతైన విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని తోటి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

పాఠశాల ప్రహరీ కూలి బాలిక మృతి

నందికొట్కూరు: పాఠశాల ప్రహరీ కూలి బాలిక మృతి చెందిన ఘటన నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలో విషాదాన్ని నింపింది. పట్టణానికి చెందిన షేక్ శాలుబాషా, రుక్షానా దంపతులకు కుమార్తె, కమారుడు ఉన్నారు. కుమార్తె షేక్ అస్త మహిన్(7) విద్యానగర్‌లోని ఉర్దూ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పాఠశాల వదిలాకఇంటికొస్తుండగా..చిన్నారిపై పాఠశాల ప్రహరీ ఒక్కసారిగా కూలిపోయింది. స్థానికులు వచ్చి బాలికను బయటకు తీశారు. అప్పటికే చిన్నారి ప్రాణాలు కోల్పోయింది.

'టీజీ'కో టీఎంసీ!

మంత్రి కుటుంబం ఫ్యాక్టరీల నీటి అవసరాల కోసం తుంగభద్రపై చెక్‌డ్యాం



కర్నూలు నగరంలో తుంగభద్ర నది ఆవలి వైపు టీజీ వెంకటేష్‌కు చెందిన ఆల్కలీస్ ఫ్యాక్టరీ

- కర్నూలు తాగునీటి అవసరాల పేరుతో తన ఫ్యాక్టరీలకు నీటిని మళ్లించుకునే ఎత్తుగడ
- కిరణ్‌కుమార్ హయాంలో రూ.64.89 కోట్లతో ప్రతిపాదనలు.. 2017లో రూ.177 కోట్లతో రివైజ్
- నాడు తిరస్కరించిన నీటిపారుదలశాఖ.. తాజాగా మరోసారి ప్రతిపాదనలు
- రూ.300 కోట్లకుపైగా ఖర్చవుతుందంటున్న అధికారులు

తుంగభద్ర ఒడ్డున ఫ్యాక్టరీలు..! రూ.వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యం! చేతిలో మంత్రి పదవి..! ఏకంగా పరిశ్రమలశాఖ! ఇంకేముంది..? దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే చందంగా అధికారంలో ఉండగానే తన ఫ్యాక్టరీల నీటి అవసరాల కోసం చెక్‌డ్యాం నిర్మాణానికి మంత్రి టీజీ భరత్ ఉపక్రమించారు. ఆయన తండ్రి టీజీ వెంకటేశ్ మంత్రిగా ఉన్న సమయంలో చేసిన ప్రయత్నాలన్నీ బెడిసికొట్టడంతో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీజీ భరత్‌ను మంత్రి పదవి వరించడంతో కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల పేరుతో తుంగభద్ర నదిపై చెక్‌డ్యాం నిర్మించి నది ఒడ్డున ఉన్న తమ ఫ్యాక్టరీల నీటి అవసరాలను తీర్చుకునే ఎత్తుగడ వేశారు. అధికార పార్టీ! పైగా మంత్రి పదవిలో ఉండటంతో అధికారులు 'జీ హుజూర్' అంటూ ఆగమేఘాలపై ఫైళ్లు కదుపుతున్నారు.

– సాక్షి ప్రతినిధి కర్నూలు

కర్నూలు ఎమ్మెల్యే, మంత్రి టీజీ భరత్ కుటుంబానికి తుంగభద్ర నది సమీపంలో రెండు ఆల్కలీస్ ఫ్యాక్టరీలున్నాయి. వీటికి వేసవిలో నీటి సమస్య ఉత్పన్నమవుతోంది. ఫిబ్రవరి–జూన్ మధ్య ఫ్యాక్టరీకి నీటి సరఫరా ఇబ్బందిగా మారింది. ఏళ్ల తరబడి ఈ సమస్య ఉంది. దీంతో టీజీ వెంకటేశ్ తన ఫ్యాక్టరీకి సమీపంలో తుంగభద్రపై చెక్‌డ్యాం నిర్మించాలని భావించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో టీజీ మంత్రిగా ఉన్న సమయంలో తుంగభద్రపై చెక్‌డ్యాం నిర్మించేందుకు 2013 జూన్ 18న జీవో 56 జారీ చేయించారు. రూ.64.89 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించి 0.50 టీఎంసీలు నిల్వ చేసేలా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ శిలా ఫలకాన్ని కూడా కిరణ్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర విభజన పరిణామాలతో జీవో కార్యరూపం దాల్చలేదు. ఆపై టీడీపీ ప్రభుత్వం కొలువుదీరడంతో 2017లో మరోసారి అధికారులు రూ.177 కోట్లతో డీపీఆర్ రివైజ్ చేసి పరిపాలన అనుమతుల కోసం పంపారు. అయితే సీడబ్ల్యూసీ అనుమతి, నీటి కేటాయింపుల సమస్య, చెక్‌డ్యాం నిర్మిస్తే ఉత్పన్నమయ్యే ఇబ్బందులతో ఉన్నతాధికారులు ఆ ప్రతిపాదనను తిరస్కరించారు.

కూటమి రాగానే మరోసారి ప్రతిపాదనలు

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, టీజీ భరత్ మంత్రి పదవిలో ఉండటంతో చెక్‌డ్యాం నిర్మాణం అంశాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు. కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు గత నెల 21న ఇరిగేషన్ ఎస్ఈకి ఓ లేఖ రాశారు. నగర భవిష్యత్తు తాగునీటి అవసరాల కోసం తుంగభద్ర, హంద్రీపై చెక్‌డ్యాం నిర్మించేందుకు సాంకేతిక అనుమతులు ఇవ్వాలని, 12 నెలల్లో దీన్ని పూర్తి చేస్తామని ప్రతిపాదించారు. దీనిపై అదే నెల 27న ఇరిగేషన్ ఎస్ఈ తిరిగి కార్పొరేషన్ ఎస్ఈకి లేఖ రాశారు. చెక్‌డ్యాం నిర్మాణానికి టెక్నికల్ కమిటీ, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్, ఇంజనీరింగ్ రీసెర్చ్ లాబొరేటరీ ఆఫ్ వాటర్ రిసోర్స్ డిపార్ట్‌మెంట్ నుంచి అనుకూలతలు, ప్రతికూలతలతోపాటు సమీపంలో రైల్వే బ్రిడ్జి ఉన్నందున ఆ శాఖ నుంచి అభ్యంతరాలు తదితర అంశాలన్నీ పరిశీలించి ఫీజుబులిటీ నివేదిక ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే అభ్యంతరాలను అధిగమించి ప్రభుత్వం నుంచి జీవో జారీ చేయించే పనిలో మంత్రి భరత్ ఉన్నట్లు అధికారులు చర్చించుకుంటున్నారు.

ఇప్పటి అధికారుల ప్రతిపాదన ఇదీ..

కర్నూలు కార్పొరేషన్ పరిధిలో తాగునీటి అవసరాల కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉండగా ప్రత్యేక చర్యలు తీసుకుంది. శివారు కాలనీలకు తాగునీటి సమస్య ఉండటంతో మునగాలపాడు వద్ద రూ.15 కోట్లతో మరో నీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించారు. దీంతోపాటు అమృత్ ద్వారా హంద్రీ–నీవా నుంచి నీటిని సరఫరా చేసేందుకు రూ.130 కోట్లు మంజూరు చేశారు. ఈ పథకానికి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. అయితే ఇప్పుడు ఆ ప్రాజెక్టును రద్దు చేసి చెక్‌డ్యాం నిర్మించాలని కార్పొరేషన్ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి లెక్కల ప్రకారం చెక్‌డ్యాం నిర్మించేందుకు రూ.300 కోట్లకు పైగా ఖర్చవుతుందని తెలుస్తోంది. అమృత్ పథకం కింద మంజూరైన రూ.130 కోట్లు కాకుండా తక్కిన మొత్తాన్ని మంజూరు చేయించుకుని చెక్‌డ్యాం నిర్మించాలని భావిస్తున్నారు. చెక్‌డ్యాం నిర్మిస్తే 0.50 టీఎంసీలు నీరు నిల్వ ఉంటుందని, అందులో 0.30 టీఎంసీలు కర్నూలు తాగునీటి అవసరాలకు, తక్కిన 0.20 టీఎంసీలు తన పరిశ్రమలకు వినియోగించుకునేలా జీవో మంజూరు చేసేలా మంత్రి టీజీ భరత్ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

రివర్స్ పంపింగ్ చేస్తారా?

కర్నూలు తాగునీటి అవసరాల కోసం ఇప్పటికే హంద్రీ–నీవా నుంచి ప్రతిపాదనలు ఉన్నపుడు దాన్ని పూర్తి చేయకుండా చెక్‌డ్యాంను తెరపైకి తేవడంపై అధికార వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. కేవలం టీజీ ఫ్యాక్టరీల కోసమే మంత్రి చెప్పినట్లు నడుచుకుంటున్నారని పేర్కొంటున్నారు. ఒకవేళ చెక్‌డ్యాం నిర్మించాల్సి వస్తే మునగాలపాడు సమీపంలో నిర్మిస్తే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు దగ్గరవుతుంది. అలా కాకుండా రాఘవేంద్ర మఠం సమీపంలో చెక్‌డ్యాం నిర్మించి తిరిగి రివర్స్ పంపింగ్ చేయాలని అంటున్నారు. పైగా కర్నూలు మురుగునీరు మొత్తం అందులో నిల్వ ఉంటుందని, తుంగభద్రలో నీటి ప్రవాహం లేనపుడు కేవలం మురుగునీటి మడుగుగా మారే అవకాశం ఉందని, ఆ నీటిని తాగునీటికి ఎలా వినియోగిస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈ నీటితో కేవలం టీజీ ఫ్యాక్టరీల అవసరాలు మాత్రమే తీరుతాయని చర్చించుకుంటున్నారు.

ఇళ్ల పైకప్పులు కూలి ఐదుగురి దుర్మరణం

అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో విషాదం

కుందుర్పి/చిలమత్తూరు : ఇళ్ల పైకప్పులు కూలిన రెండు వేర్వేరు ఘటనల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. అనంత జిల్లాలో పాత మిద్దె కూలిపోయి ముగ్గురు, శ్రీసత్యసాయి జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఇంటి కప్పు కూలి ఇద్దరు మృత్యువాత పడ్డారు. అనంతపురం జిల్లా రుద్రంపల్లిలో కురుబ గంగన్న పాత మిద్దెకు సంబంధించిన దూలం ఇటీవల దెబ్బతింది. అది కిందకు పడకుండా కట్టెను నిలిపాడు. వారం రోజులుగా కురుస్తున్న జడివానకు మిద్దె బాగా తడిసిపోయింది. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున గది పైకప్పు కూలిపోయింది. గదిలో నిద్రిస్తున్న గంగన్న(45), భార్య శ్రీదేవి(42), కుమార్తె సంధ్య(14) అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. కాగా, గంగన్న రెండో సంతానం ఈశ్వర్. కూలి పనులకు వెళుతుంటాడు. మంగళవారం రాత్రి అదే గ్రామానికి చెందిన ఓ రైతు టమాటా పంటను వాహనంలో అనంతపురం మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు కూలీగా వెళ్లాడు. దీంతో అతను మృత్యువు నుంచి తప్పించుకున్నాడు. కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు, కుందుర్పి తహసీల్దార్ శ్రీనివాసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మరో ప్రమాదంలో..

శ్రీసత్యసాయి శెట్టిపల్లి సమీపంలోని పొలంలో శివారెడ్డి నిర్మాణంలో ఉన్న ఇంటిపై కప్పు పనులు మొదలెట్టాడు. కూలీలు ఐరన్ తీర్లు వేసి బండలు పరిచి మోల్డ్ వేస్తుండగా ఒక్కసారిగా అది కూలిపోయింది. అదే సమయంలో కింద సపోర్ట్‌గా కట్టెలు నాటుతున్న లక్ష్మీనారాయణరెడ్డి (48), శివారెడ్డి(50), శివారెడ్డి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి శిథిలాల్లో చిక్కుకున్నారు. స్థానికులు వెంటనే వారిని బయటకు తీశారు. అప్పటికే లక్ష్మీనారాయణరెడ్డి మృతి చెందాడు. కొన ఊపిరితో ఉన్న శివారెడ్డిని, తీవ్రంగా గాయపడిన ఆయన కుమారుడిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలిస్తుండగా మార్గంమధ్యలో శివారెడ్డి ప్రాణాలు విడిచాడు. అయితే నాసిరకం తీర్లు వాడటంతోనే ప్రమాదం సంభవించినట్టు తెలుస్తోంది. రెండు ఘటనల్లో పోలీసులు కేసులు నమోదుచేశారు.



పాతమిద్దె శిథిలాల్లో మృతదేహాలు



లక్ష్మీనారాయణరెడ్డి (ఫైల్)



శివారెడ్డి (ఫైల్)

సబ్‌స్టేషన్ ఆపరేటర్ ఉద్యోగానికి వేలం

రూ.6.70 లక్షలకు దక్కించుకున్న యువకుడు

ఏలూరు రూరల్: ఏదైనా ఒక పోస్టు ఖాళీ అయితే.. నిబంధనలను అనుసరించి అన్ని అర్హతలున్న వారిని ప్రభుత్వం ఎంపిక చేస్తుంటుంది. కానీ కూటమి ప్రభుత్వంలో ఒక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్ ఉద్యోగానికి ఏకంగా వేలం నిర్వహించారు. ఈ ఉదంతం బుధవారం ఏలూరు జిల్లా కొల్లేరు ప్రాంతంలోని గుడివాడలంకలో చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.4.50 కోట్లతో గ్రామ సమీపంలో అధికారులు సబ్‌స్టేషన్ నిర్మించారు. ఇక్కడ పనిచేసేందుకు కాంట్రాక్ట్ పద్ధతిలో కొల్లేరు గ్రామాలకు చెందిన ఐటీఐ, ఎలక్ట్రికల్ ట్రైనింగ్ పూర్తి చేసిన ముగ్గురు సిబ్బందిని అధికారులు నియమించారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గుడివాకలంకకు చెందిన ఆపరేటర్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఖాళీగా ఉన్న ఈ పోస్టుకు బుధవారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గ్రామ మల్లు జయమంగళ బాలకృష్ణ, పతాని బలే చక్రవర్తితో పాటు పది మంది బంటా పెద్దల సమక్షంలో వేలం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఓ యువకుడు సుమారు రూ.6.70 లక్షలకు ఆపరేటర్ ఉద్యోగాన్ని దక్కించుకున్నాడు.

జ్వరంతో ఏడో తరగతి చిన్నారి మృతి

బంగారుపాళెం: చిత్తూరు జిల్లా బంగారుపాళెం మండలం శేషాపురం దళితవాడలో ఓ బాలిక జ్వరంతో మృతి చెందింది. రాజా, భార్గవిల కుమార్తె గుణశ్రీ(12) ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. మంగళవారం స్కూల్‌కు వెళ్లింది. మధ్యాహ్నం గుణశ్రీకి జ్వరం రావడంతో టీచర్లు టాబ్లెట్ ఇచ్చారు. అయితే సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికొచ్చాక అపస్మారక స్థితికి వెళ్లడంతో తల్లిదండ్రులు ప్రైవేట్ డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. డాక్టర్ ఇంజెక్షన్ ఇచ్చి పెద్దాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించాడు. పాపను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మరణించినట్టు వైద్యులు చెప్పారంటూ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో బుధవారం బంగారుపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. చిన్నారి మృతిపై విచారణచేస్తున్నామని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ చెప్పారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై శ్రీవారి పట్టపురాణి



సూర్యప్రభ వాహనంపై పద్మావతీ అమ్మవారు

చంద్రగిరి: శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజు బుధవారం అమ్మవారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం వేకువజామున అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 8గంటలకు వేద నారాయణుడి అలంకరణలో అమ్మవారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఆలయంలో నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం, సాయంత్రం 6గంటలకు ఆస్థానమండపంలో ఊంజల్ సేవ జరిగింది. సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారిని ఆస్థానమండపం నుంచి వేంచేపుగా వాహనమండపానికి తీసుకొచ్చి దర్బార్ కృష్ణుడి అలంకరణలో చంద్రప్రభ వాహనంపై కొలువుదీర్చారు. రాత్రి 7గంటలకు భక్తుల కోలాటాలు, భజన బృందాలు, మంగళ వాయిద్యాలు, జీయర్ల ప్రబంధ పారాయణం నడుమ అమ్మవారు చంద్రప్రభ వాహనంపై ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్యదర్శనం కల్పించారు.

విద్యార్థులతో మట్టిపని చేయించిన టీచర్

తణుకు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 7వ తేదీన నిర్వహించనున్న పేరెంట్స్–టీచర్స్ మీటింగ్ (పీటీఎం) నిర్వహణ విద్యార్థులపాలిట శాపంగా మారింది. నిర్వహణకు సంబంధించిన డబ్బులు ఇంకా పాఠశాలలకు చేరకపోవడమో, మరే కారణమో కానీ సదరు పనుల కోసం విద్యార్థులను కూలీలుగా మార్చివేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులు పాఠశాల క్రీడా ప్రాంగణంలోని చెత్త, వ్యర్థాలున్న మట్టిని పారలతో తొలగించే పని చేపట్టారు. దీనిపై 'సాక్షి' విద్యార్థులతో మాట్లాడగా ఈనెల 7న పీటీఎం కార్యక్రమం సందర్భంగా క్రీడా ప్రాంగణంలో ఆటలపోటీలు నిర్వహిస్తారని, అందుకోసం ఈ స్థలాన్ని బాగుచేయమని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు నాగరాజ్యం తమకు పారలు ఇచ్చి మట్టి తొలగించమని చెప్పారని అన్నారు. ఈ విషయంపై డీఈఓ ఎం.నారాయణను 'సాక్షి' వివరణ కోరగా పాఠశాలల్లో విద్యార్థులతో అటువంటి పనులు చేయించడం సబబు కాదని ఈ ఘటనపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



చెత్త, వ్యర్థాలను పారలతో పక్కకు లాగుతున్న విద్యార్థులు

స్వర్ణ దేవాలయంలో పేలిన తూటా...

సుఖ్‌బీర్‌పై హత్యాయత్నం

కాపలాదారుగా ప్రాయశ్చిత్త దీక్షలో ఉండగా కాల్పులు ● దగ్గర్నుంచి కాల్పులకు తెగబడ్డ ఉగ్రవాది నారైన్ సింగ్

ఖలిస్తానీ ఉద్యమాన్ని వ్యతిరేకిస్తున్నందుకే అఘాయిత్యం! ● అప్రమత్తమై అడ్డుకున్న పోలీసులు, తప్పిన ప్రమాదం

అమృత్‌సర్/చండీగఢ్: సిక్కులకు పరమ పవిత్రమైన అమృత్‌సర్ స్వర్ణ దేవాలయంలో దారుణం చోటుచేసుకుంది. శిరోమణి అకాలీదళ్ సీనియర్ నాయకుడు, పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ (62)పై బుధవారం హత్యాయత్నం జరిగింది. ఉదయం 9.30 గంటలకు నారైన్ సింగ్ చౌరా అనే మాజీ ఉగ్రవాది అత్యంత సమీపానికి దూసుకొచ్చి ఆయనపై పిస్తోల్‌తో కాల్పులు జరిపాడు. మఫ్టీలో ఉన్న పోలీసులు వెంటనే అప్రమత్తమై అతడిని అడ్డుకొని దూరంగా లాక్కెళ్లారు. తూటా గురి తప్పడంతో సుఖ్‌బీర్ సింగ్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. మీడియా కెమెరాల్లో రికార్డయిన ఈ హత్యాయత్నం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

2007 నుంచి 2017 దాకా పంజాబ్‌లో అకాలీదళ్ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులకు ప్రాయశ్చిత్తంగా మతాచారం ప్రకారం స్వర్ణదేవాలయం ప్రవేశద్వారం వద్ద సుఖ్‌బీర్ సింగ్ మంగళవారం కాపలాదారు (సేవాదార్)గా మారారు. బుధవారం ఆయన దీక్ష రెండో రోజుకు చేరుకుంది. కాపలాదారు దీక్షలో ఉండగానే హత్యాయత్నం జరిగింది. కాలికి గాయమవడంతో చక్రాల కుర్చీలో కూర్చొని ఉన్న సుఖ్‌బీర్ వైపు నారైన్ నెమ్మదిగా నడుస్తూ వచ్చాడు. అంతా చూస్తుండగానే జేబులోంచి పిస్తోల్ బయటకు తీసి సుఖ్‌బీర్‌పై గురిపెట్టాడు. ఆయన పక్కనే నిల్చున్న ఏఎస్సై జస్బీర్ సింగ్ వెంటనే నారైన్ చేతిని దొరకబుచ్చుకొని వెనక్కి నెట్టేశాడు. దాంతో తూటా గురి తప్పి ఆలయ ప్రవేశద్వారం గోడలోకి దూసుకెళ్లింది. ఇతర పోలీసు సిబ్బంది సుఖ్‌బీర్ చుట్టూ రక్షణ వలయంగా నిల్చున్నారు. భద్రతా సిబ్బందితో పాటు శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ టాస్క్ ఫోర్స్ సిబ్బంది ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. కాల్పుల సమాచారం తెలియగానే సుఖ్‌బీర్ భార్య, ఎంపీ హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుఖ్‌బీర్‌కు జెడ్ ప్లస్ భద్రత ఉంది. నారైన్‌ను డేరాబాబా నానక్ ప్రాంతానికి చెందిన మాజీ ఉగ్రవాదిగా గుర్తించారు. అతడిని అరెస్టు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పిస్తోల్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండడం వల్లే సుఖ్‌బీర్‌సింగ్‌కు ప్రాణాపాయం తప్పిందని అమృత్‌సర్ పోలీసు కమిషనర్ గురుప్రీత్‌సింగ్ భుల్లార్ చెప్పారు. నిందితుడు ఒంటరిగానే స్వర్ణదేవాలయానికి వచ్చాడని తెలిపారు. హత్యాయత్నానికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. నిందితుడిని చాకచక్యంగా అడ్డుకున్న ఏఎస్ఐ జస్బీర్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. సుఖ్‌బీర్‌పై కాల్పుల ఘటనను వివిధ పార్టీల నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ సంఘటన వెనుక కారణాలు నిగ్గుతేల్చి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆఖల్ తక్త్ నిర్దేశం ప్రకారం స్వర్ణ మందిరంలో మతపరమైన సేవ అందిస్తున్న సుఖ్‌బీర్‌ను హత్య చేయాలని చూడడం చాలా బాధాకరమని శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ చీఫ్ హర్జీందర్ సింగ్ ధామీ అన్నారు. ఇదిలా ఉండగా, ఖలిస్తాన్ ఉద్యమాన్ని సుఖ్‌బీర్ సింగ్ వ్యతిరేకిస్తున్నందుకే ఆయనను హత్య చేయాలని చౌరా ప్రయత్నించినట్లు తెలుస్తోంది.


బుధవారం దాడి సమయంలో స్వర్ణ దేవాలయం ప్రవేశ ద్వారం వద్ద సేవాదార్ విధుల్లో సుఖ్‌బీర్ (వీల్‌చైర్‌లో)

పంజాబ్‌పై బీజేపీ కుట్ర: కేజ్రీవాల్

సుఖ్‌బీర్‌పై హత్యాయత్నాన్ని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఖండించారు. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వాన్ని, రాష్ట్ర ప్రజలను, పోలీసులను అప్రతిష్టపాలు చేయడానికి బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపించారు. శాంతిభద్రతలను ఎలా కాపాడాలో పోలీసులు చూపించారని కొనియాడారు. హత్యాయత్నంపై సమగ్ర దర్యాప్తు జరపాలని పోలీసులను పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఆదేశించారు. పంజాబ్‌లో ఆప్ పాలనలో శాంతి భద్రతలు పూర్తిగా దిగజారాయని బీజేపీ ఎంపీ సుధాంశు త్రివేది ఆరోపించారు. ఆప్ సర్కారు అసమర్థత వల్లే ఈ సంఘటన జరిగిందని మండిపడ్డారు. దీనికి మాన్ బదులివ్వాలని డిమాండ్ చేశారు.

ఎవరీ చౌరా?

సుఖ్‌బీర్‌సింగ్ బాదల్‌పై కాల్పులు జరిపిన నారైన్ సింగ్ చౌరా (68) గతంలో కరడుగట్టిన ఉగ్రవాది అని పోలీసులు చెప్పారు. తీవ్రవాద ఘటనల్లో, ఖలిస్తానీ ఉగ్రవాద కార్యకలాపాల్లో అతడి హస్తముందని వెల్లడించారు. బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (బీకేఐ) వంటి నిషేధిత ఉగ్రవాద సంస్థల్లో చురుగ్గా పని చేశాడని తెలిపారు. అతడిపై ఆయుధాలు, పేలుడు పదార్థాల అక్రమ రవాణా సహా 12కుపైగా కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.

- చౌరా 1984లో పంజాబ్‌లో ఉగ్రవాదం ప్రాథమిక దశలో ఉన్నప్పుడు పాకిస్తాన్‌కు పారిపోయాడు. అక్కడి నుంచే పంజాబ్‌లో ఉగ్రవాదాన్ని ప్రేరేపించాడు. ఆయుధాలు, పేలుడు పదార్థాలు అందజేశాడు.
- పాకిస్తాన్‌లో ఉన్నప్పుడే గెరిల్లా యుద్ధరీతులపై, దేశద్రోహంపై పుస్తకాలు రాశాడు. ఖలిస్తాన్ విరుద్ధ్ సాజిష్ అనే వివాదాస్పద పుస్తకం అతడు రాసిందే.
- పంజాబ్‌లో రాజకీయంగా ప్రాబల్యం కలిగిన బాదల్ కుటుంబం అంటే చౌరాకు మంట. మితవాదులంటే అతడికి నచ్చదు. 1980వ దశకం నుంచి బాదల్ కుటుంబానికి వ్యతిరేకంగా పోరాడుతున్న హవారా గ్రూప్‌లో చౌరా కూడా సభ్యుడే.
- గురుదాస్‌పూర్ జిల్లా చౌరా గ్రామంలో పుట్టిన చౌరా చిన్నప్పుడే ఖలిస్తానీ తీవ్రవాదం పట్ల ఆకర్షితుడయ్యాడు.
- ఖలిస్తాన్ లిబరేషన్ ఫోర్స్, అకల్ ఫెడరేషన్ వంటి సంస్థల్లో పని చేశాడు. పంజాబ్ మాజీ సీఎం బియాంత్‌సింగ్ హత్య కేసు నిందితులతో అతనికి సన్నిహిత సంబంధాలున్నాయి.
- బురైల్ జైలును బద్దలు కొట్టి, ఖైదీలు తప్పించుకొని పారిపోయిన ఘటనకు చౌరాయే సూత్రధారి అని ఆరోపణలున్నాయి.
- చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం కింద అతడిపై పలు కేసులు నమోదయ్యాయి.
- చౌరా తొలిసారిగా 2013 ఫిబ్రవరి 28న పంజాబ్‌లోని తార్న్ తరన్‌లో అరెస్టయ్యాడు. అప్పట్లో మొహాలీలోని అతడి నివాసంలో భారీ ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.


దాడికి పాల్పడ్డ చౌరా (వృత్తంలో)


గవర్నర్ రాధాకృష్ణన్‌కు లేఖ సమర్పిస్తున్న అజిత్, ఫడ్నవీస్, షిండే. చిత్రంలో మంత్రి నిర్మల తదితరులు

మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్

బీజేఎల్పీ నేతగా ఎన్నిక
- నేడు ప్రమాణస్వీకారం
- డిప్యూటీగా అజిత్ కూడా
- షిండే ప్రమాణంపై సస్పెన్స్

ముంబై: మహారాష్ట్రలో పది రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ముఖ్యమంత్రిగా బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ (54) పేరు ఖరారైంది. బీజేపీ శాసనసభాపక్షం బుధవారం ముంబైలో సమావేశమై ఆయన్ను తమ నాయకుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అడ్డంకులన్నీ తొలగిపోవడంతో ఆయన గురువారం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఆయనతో పాటు ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు కూడా ప్రమాణం చేయనున్నారు. వారిలో ఎన్సీపీ చీఫ్ అజిత్ పేరు ఖరారైంది. ఆపద్ధర్మ సీఎం, శివసేన చీఫ్ ఏక్‌నాథ్ షిండే మాత్రం డిప్యూటీ సీఎం పదవి తీసుకోవడంపై ఏ విషయమూ తేల్చకుండా సస్పెన్స్ కొనసాగిస్తున్నారు. డిప్యూటీగా ప్రభుత్వంలో చేరాల్సిందిగా ఫడ్నవీస్ ఆయన్ను కోరారు. బీజేపీ అధిష్టానం పరిశీలకులుగా వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం బీజేపీ కోర్ కమిటీ సమావేశమైంది. సీఎంగా ఫడ్నవీస్ పేరును ఖరారు చేశారు. అనంతరం విధాన్ భవన్‌లో బీజేపీ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. శాసనసభాపక్ష నేతగా ఫడ్నవీస్ పేరును బీజేపీ సీనియర్ నాయకుడు చంద్రకాంత్ పాటిల్ ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. వారికి ఫడ్నవీస్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుందని నిర్మల పేర్కొన్నారు.

ఫడ్నవీస్‌ను ప్రతిపాదిస్తున్నా: షిండే

అనంతరం ఫడ్నవీస్ నేతృత్వంలో షిండే, అజిత్ సహా మహాయుతి కూటమి నేతలు గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌తో సమావేశమయ్యారు. నూతన ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. బీజేఎల్పీ నేతగా ఫడ్నవీస్ ఎన్నికైనట్లు లేఖ అందజేశారు. కూటమిని ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించారు. గురువారం సాయంత్రం 5.30కు ఆజాద్ మైదాన్‌లో కార్యక్రమం ఉంటుందని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. ''సీఎంతో పాటు ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరవుతారు'' అని తెలిపాయి. అనంతరం షిండే, అజిత్‌లతో కలిసి ఫడ్నవీస్ మీడియాతో మాట్లాడారు. ''మా కొత్త ప్రభుత్వం ముందు ఎన్నో సవాళ్లున్నాయి. కలిసుంటే క్షేమంగా ఉంటాం. ప్రధాని మోదీతో ఏదైనా సాధ్యమే. సీఎం పదవి కేవలం సాంకేతిక సర్దుబాటే. మహాయుతి పక్షాలన్నీ కలిసికట్టుగా పని చేస్తాయి. షిండే, అజిత్ తోడ్పాటుతో ప్రభుత్వాన్ని సజావుగా నడిపిస్తాం'' అన్నారు. తనను సీఎంగా ఎంపిక చేసినందుకు మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు. రెండున్నరేళ్లపాటు సీఎంగా చేశానని, అందుకు సంతృప్తిగా ఉన్నానని షిండే పేర్కొన్నారు. ''నాడు నన్ను సీఎం పదవికి ఫడ్నవీస్ ప్రతిపాదించారు. నేడు ఆయనను ఆ పదవికి నేను ప్రతిపాదిస్తున్నా. మేమంతా బృందంగా కలిసికట్టుగా పని చేస్తాం'' అన్నారు.

పరస్పర ఛలోక్తులు

మీడియా భేటీలో మహాయుతి నేతలు పరస్పరం ఛలోక్తులు విసురుకున్నారు. డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారా అని విలేకరులు ప్రశ్నించగా సాయంత్రం దాకా వేచి చూడండని షిండే బదులిచ్చారు. అజిత్ కల్పించుకుని తాను మాత్రం కచ్చితంగా ప్రమా ణం చేస్తానని అనడంతో గొల్లుమన్నారు. ''అవునవును. ప్రమాణ స్వీకారాల్లో దాదా (అజిత్)కు చాలా అనుభవముంది. ఉదయం, సాయంత్రం ప్ర మాణం చేసిన అనుభవముంది'' అనడంతో మరో సారి నవ్వు లు విరిశాయి. 2019లో అజిత్ తెల్లవారుజామున డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేయడం తెలిసిందే.

పదవి తీసుకోండి

షిండేపై సొంత ఎమ్మెల్యేల ఒత్తిడి

ఉప ముఖ్యమంత్రి పదవి తీసుకోవాలంటూ షిండేపై సొంత పార్టీ ఎమ్మెల్యేలు ఒత్తిడి తెచ్చారు. బుధవారం షిండేతో భేటీలో వారు స్పష్టం చేశారు. ఫడ్నవీస్ రాజీనామాతో ఖాళీ అయిన డిప్యూటీ సీఎం పోస్టును షిండే తీసుకుంటే పొత్తు ధర్మాన్ని గౌరవించినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వంలో చేరితే పార్టీనీ బలోపేతం చేసుకోవచ్చన్నారు.

హరిద్వార్‌లో గంగాజలం తాగడానికి పనికిరాదు

ఉత్తరాఖండ్ కాలుష్య మండలి వెల్లడి

డెహ్రాడూన్: దేశంలో నదులు కాలుష్యం బారినపడుతున్నాయి. మురికి కూపాలుగా మారుతున్నాయి. ఆయా నదుల్లో ప్రవహించే నీరు తాగడానికి వీల్లేకుండా పోతోంది. హిందువులు చాలా పవిత్రంగా భావించే గంగా నది జలాలకు సైతం ఇదే పరిస్థితి దాపురించింది. ఉత్తరాఖండ్ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) తాజా నివేదిక ఇదే విషయం బహిర్గతం చేసింది. హరిద్వార్‌లో గంగా నదిలో ప్రవహించే నీటిపై అధ్యయనం చేశారు. 8 ప్రాంతాల్లో నీటి నమూనాలు సేకరించి, క్షుణ్నంగా పరిశీలించారు. ఈ నీరు బీ కేటగిరీలోకి వస్తుందని.. స్నానానికి తప్ప తాగడానికి పనికిరాదని పీసీబీ తేల్చిచెప్పింది. గంగా జలం కాలుష్యమయం అవుతుండడం పట్ల స్థానిక పూజారులు ఆందోళన వ్యక్తం చేశారు. మానవ వ్యర్థాల కారణంగానే గంగానది స్వచ్ఛతను కోల్పోతోందని చెప్పారు.

యునైటెడ్ హెల్త్‌కేర్ సీఈవో హత్య

న్యూయార్క్: అమెరికాలో ఆరోగ్యరంగ దిగ్గజం యునైటెడ్‌హెల్త్ గ్రూప్ సంస్థలో ఇన్సురెన్స్ విభాగమైన యునైటెడ్‌హెల్త్‌కేర్ సంస్థకు సీఈఓగా సేవలందిస్తున్న బ్రియాన్ థాంప్సన్ హత్యకు గురయ్యారు. బుధవారం ఉదయం అమెరికాలోని మిడ్‌టౌన్ మన్‌హట్టన్‌లో గుర్తుతెలియని ఆగంతకుడు కాల్పులు జరిపాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించినా లాభం లేకపోయింది. పెట్టుబడిదారుల సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన థాంప్సన్‌పైకి గుర్తుతెలియని వ్యక్తి కాల్పులు జరిపినట్టు దర్యాప్తు అధికారి చెప్పారు.

మీకూ నెలసరి వస్తే తెలిసేది

మధ్యప్రదేశ్ హైకోర్టు తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి

న్యూఢిల్లీ: మహిళా సివిల్ జడ్జీల తొలగింపు విషయంలో మధ్యప్రదేశ్ హైకోర్టు వ్యవహరించిన తీరు పట్ల సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. గర్భస్రావం కారణంగా ఓ మహిళా న్యాయమూర్తి తీవ్ర ఆవేదన అనుభవించారని, ఆమె క్షోభను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదని ఆక్షేపించింది. పురుషులకు కూడా నెలసరి వస్తే ఆ బాధేమిటో వారికి తెలిసేది అంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది. పనితీరు సక్రమంగా లేని ఆరుగురు మహిళా సివిల్ జడ్జీలను విధుల నుంచి తొలగిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు గత ఏడాది నిర్ణయం తీసుకుంది. వారిలో నలుగురిని మళ్లీ విధుల్లో చేర్చుకోవాలని హైకోర్టు ధర్మాసనం నిర్ణయించింది. అయితే, మిగిలిన ఇద్దరిని మాత్రం పక్కనపెట్టింది. వీరిలో ఒక మహిళా న్యాయమూర్తి హైకోర్టు ధర్మాసనాన్ని ఆశ్రయించారు. తనకు గర్భస్రావం జరిగిందని, అందువల్ల విధులు సక్రమంగా నిర్వర్తించలేకపోయానని, తనను మళ్లీ విధుల్లో చేర్చుకోవాలని కోరినప్పటికీ హైకోర్టు ధర్మాసనం పట్టించుకోలేదు. ఈ వ్యవహారంపై జస్టిస్ వి.బి.నాగరత్నం, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టింది. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకోకుండా కేవలం పనితీరు ఆధారంగా విధుల నుంచి తొలగించడం సమంజసం కాదని స్పష్టంచేసింది. సివిల్ జడ్జీల విషయంలో అమల్లో ఉన్న విధివిధానాలపై వివరణ ఇవ్వాలని హైకోర్టును ఆదేశించింది.

తీవ్రమైన నేరాల్లో బెయిల్ ఇవ్వొద్దు: సుప్రీంకోర్టు

అత్యాచారం, హత్య, దోపిడీ వంటి తీవ్రమైన నేరాల్లో విచారణ ప్రారంభమైన తర్వాత నిందితులకు బెయిల్ ఇవ్వొద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాంటి వారి బెయిల్ దరఖాస్తులను ట్రయల్ కోర్టులు, హైకోర్టులు సాధారణంగా పరిగణించవద్దని పేర్కొంది. అత్యాచారం కేసులో నిందితుడైన వ్యక్తికి హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాలు చేస్తూ బాధితురాలు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. ఇలాంటి కేసుల్లో కోర్టుల్లో విచారణ ప్రారంభమైన తర్వాత, సాక్షులను ప్రాసిక్యూషన్‌వారు ప్రశ్నించడం మొదలైన తర్వాత నిందితులకు బెయిల్ ఇవ్వొదని కింది కోర్టుకు స్పష్టంచేసింది. ఒకవేళ విచారణ ఎక్కువకాలం ఆలస్యమవుతుంటే బెయిల్ ఇవ్వొద్దని అభిప్రాయపడింది. వేగంగా విచారణ జరిగి తీర్పు వెలువడడం నిందితుడి హక్కు అని పేర్కొంది. అలాంటి హక్కుకు విఘాతం కలుగుతోంది అనుకున్నప్పుడు బెయిల్ మంజూరు చేయడం సమంజసం అని వెల్లడించింది.

ఒక్కడినే వెళ్తానన్నా ఒప్పుకోరా?

సంభాల్‌కు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులపై రాహుల్ ఆగ్రహం


బుధవారం గాజీపూర్ సరిహద్దు వద్ద రాహుల్, సోదరి ప్రియాంక

గజియాబాద్(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో హింసాత్మక ఘటనల్లో బాధితులను పరామర్శించేందుకు అక్కడికి వెళ్లేందుకు బయల్దేరిన లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీని పోలీసులు అడ్డుకున్నారు. ఢిల్లీ నుంచి బయల్దేరిన రాహుల్ గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ ఇతర నేతలను గజియాబాద్ సరిహద్దు వద్దకు రాగానే ఉత్తరప్రదేశ్ పోలీసులు ఆపేశారు. స్థానికేతరులకు సంభాల్ జిల్లాలో పర్యటించడంపై కలెక్టర్ నిషేధాజ్ఞలు విధించారంటూ నేతలను పోలీసులు ముందుకు వెళ్లనివ్వలేదు. దీనిపై రాహుల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. '' సంభాల్‌కు వెళ్లేందుకు బయల్దేరాం. మమ్మల్ని పోలీసులు ముందుకు వెళ్లనివ్వట్లేదు. లోక్‌సభలో విపక్షనేతగా అక్కడికి వెళ్లి బాధితులను పరామర్శించే హక్కు నాకు ఉంది. నేతలెవరూ లేకుండా ఒంటరిగా వెళ్లేందుకైనా సిద్ధం. కావాలంటే పోలీసులతో కలిసి వెళ్తానన్నా కూడా వెళ్లనివ్వట్లేదు. కొద్దిరోజుల తర్వాతే వస్తే పంపిస్తారట. విపక్షనేతతో వ్యవహరించే పద్ధతి ఇదేనా?. పోలీసులు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను సైతం వాడుకోనివ్వట్లేదు. రాజ్యాంగాన్ని చాపలాగా చుట్టి పక్కన పడేశారు. మా పోరాటం కొనసాగుతుంది'' అని రాహుల్ ఆ తర్వాత 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. '' విపక్షనేతగా బాధితులను కలిసి పరామర్శించే హక్కు రాహుల్‌కు ఉంది. ఆయనను ఎలా అడ్డుకుంటారు?'' అని ప్రియాంకా గాంధీ పోలీసులతో వాదనకు దిగినా లాభం లేకుండాపోయింది. '' రెండు వర్గాల మధ్య విద్వేషాన్ని సృష్టించడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం. ప్రార్థనా స్థలాలకు సంబంధించిన అమల్లో ఉన్న రాజ్యాంగబద్ధ చట్టాలను చించేస్తున్న బీజేపీ ఇప్పుడు దేశమంతటా విద్వేష మార్కెట్లను తెరుస్తోంది. రాహుల్‌ను అడ్డుకోవడం దీనికి ప్రబల నిదర్శనం'' అని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను అడ్డుకునేందుకు పోలీసులు ఢిల్లీ–మీరట్ ఎక్స్‌ప్రెస్ వేపై బ్యారికేడ్లను ఏర్పాటుచేయడంతో ఈ మార్గంలో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. వేలాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ముస్లిం ఓటు బ్యాంక్‌ను బుజ్జగించేందుకే ఎస్పీ చీఫ్ అఖిలేశ్, కాంగ్రెస్ నేత రాహుల్ నాటకాలు ఆడుతున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రులు కేశ్ ప్రసాద్ మౌర్య, బ్రజేశ్ పాఠక్ విమర్శించారు. రాహుల్‌తోపాటు సంభాల్‌లో పర్యటించాల్సిన కాంగ్రెస్ బృందంలో సభ్యురాలైన యూపీ శాసనసభాపక్ష నాయకురాలు ఆరాధనా మిశ్రాను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు. యోగి సర్కార్ అరాచకాలకు పరాకాష్ట ఇది అని ఆమె వ్యాఖ్యానించారు. ఘర్షణలను తగ్గించే ఉద్దేశంతో ప్రభుత్వం డిసెంబర్ 31వ తేదీదాకా సంభాల్‌లోని స్థానికేతరులను రానివ్వకూడదని ఆదేశాలు జారీచేసింది. సంభాల్ జిల్లాలో మొఘలుల కాలంనాటి మసీదు ఉన్న చోట ఒకప్పుడు హరిహర్ ఆలయం ఉండేదని, సర్వే చేయాలంటూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో కోర్టు సర్వేకు అనుమతించడం, నవంబర్ 24న రెండోసారి సర్వేకు ప్రయత్నించినపుడు స్థానిక ముస్లింలు నిరసనకు దిగడం తెల్సిందే. నిరసనలో భాగంగా పోలీసులతో షాహీ జామా మసీదు ప్రాంతంలో జరిగిన ఘర్షణల్లో నలుగురు చనిపోయారు. దీంతో ఆ ప్రాంతంలో భారీ ఎత్తున పోలీసులు మోహరించారు.

నమీబియాకు తొలి అధ్యక్షురాలు

నెటుంబో నండీ ఎండైట్వా రికార్డు

నమీబియా ఎన్నికల్లో అధికార స్వాపో పార్టీ విజయం సాధించింది. నెటుంబో నండీ ఎండైట్వా అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. దేశ అత్యున్నత పీఠం అధిష్ఠించిన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు. నమీబియా స్వాతంత్ర్యం పొందిన నాటి నుంచి 30 ఏళ్లుగా స్వాపో పార్టీయే అధికారంలో కొనసాగుతోంది. నమీబియాలో అధ్యక్ష పదవికి, నేషనల్ అసెంబ్లీకి విడిగా ఓటింగ్ జరుగుతుంది. 72 ఎండైట్వా 57 శాతం ఓట్లు సాధించారు. శాంతి, సుస్థిరత కోసం దేశం ఓటేసిందని ఫలితాల అనంతరం ఆమె అన్నారు. 1960ల్లో దేశ స్వాతంత్ర్య పోరాట సమయంలో స్వాపో పార్టీలో చేరిన ఎండైట్వా విదేశాంగ శాఖ వంటి కీలక పదవుల్లో పనిచేశారు. 96 స్థానాలకు స్వాపో పార్టీ 51 స్థానాలు గెలిచి మెజారిటీ సాధించింది. ఇండిపెండెంట్ పేట్రియాట్స్ ఫర్ ఛేంజ్ (ఐపీసీ) పార్టీ 20 స్థానాలతో ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. ఎన్నికల ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందని, ఫలితాలను కోర్టులో సవాలు చేస్తామని ఆ పార్టీ తెలిపింది.


నిష్కళంక నేత

ఎస్ఎస్ఎన్ అని పిలుచుకునే ఎండైట్వా పార్టీలో దిగ్గజ నేత. ఆఫ్రికా ఖండంలోని అతి కొద్ది నాయకురాళ్లలో ఒకరు. దేశ స్వాతంత్ర్య పోరాట కాలం నుంచి ఏదో ఒక పదవిలో ఉంటూ వస్తున్నారు. పాస్టర్ కూతురు అయిన ఆమె గొప్ప రాజనీతిజ్ఞురాలిగా ఎదిగారు. గత ఫిబ్రవరిలో ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆర్థిక దౌత్యాన్ని ఉపయోగించి పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఉద్యోగాలను సృష్టిస్తానని ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశారు. పార్టీలోని అన్ని వర్గాలను ఏకం చేయగలిగారు. నిష్కళంక నేతగా ఆమెకున్న ప్రతిష్ట ఎన్నికల్లో గెలుపు వైపు నడిపించింది.

బలమైన గ్రామీణ మూలాలతో

30 లక్షల మంది జనాభా ఉన్న నమీబియా ప్రధానంగా యురేనియం, వజ్రాల ఎగుమతిదారు. దేశంలో మెరుగైన మౌలిక సదుపాయాలు లేవు. నిరుద్యోగం అధికం. దేశ సంపద స్థానికులకు ఉపయోగపడటం లేదు. 15–34 ఏళ్ల మధ్య వయస్కుల్లో నిరుద్యోగం 46 శాతముంది. ఇది జాతీయ సగటు కంటే మూడు రెట్లు ఎక్కువ. అధిక నిరుద్యోగం, అసమానతల కారణంగా స్వాపో పార్టీ గెలుపు కష్టమేనని విశ్లేషకులు భావించారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో బలమైన మూలాలు స్వాపోకు కలిసొచ్చాయి.

\- సాక్షి, నేషనల్ డెస్క్

సల్మాన్ ఖాన్‌కు మళ్లీ బెదిరింపులు



ముంబై: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు మరోసారి బెదిరింపులు ఎదురయ్యాయి. బుధవారం రాత్రి ముంబైలోని దాదర్ ప్రాంతంలో సల్మాన్ సినిమా షూటింగ్‌లో ఉండగా, ఓ వ్యక్తి సెట్లోకి ప్రవేశించాడు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయి పేరును ప్రస్తావిస్తూ బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. షూటింగ్‌లో ఉన్న ఇతర సిబ్బంది అతడిని బంధించారు. పోలీసులు రంగంలోకి దిగి సదరు గుర్తు తెలియని వ్యక్తిని అరెస్టు చేశారు. ప్రస్తుతం శివాజీ పార్కు పోలీసులు అతడిని విచారిస్తున్నారు. కృష్ణ జింకలను వేటాడిన కేసులో దోషిగా తేలిన సల్మాన్‌కు గతంలో లారెన్స్ బిష్ణోయి గ్యాంగ్ నుంచి పలుమార్లు హెచ్చరికలు వచ్చిన సంగతి తెలిసిందే.

ప్రోబా3లో సాంకేతిక లోపం

పీఎస్ఎల్‌వీ సీ–59 ప్రయోగం గురువారానికి వాయిదా

సూళ్లూరుపేట: సూర్యుని వెలుపలి వలయం కరోనా గుట్టుమట్లను తెల్సుకునేందుకు యురోపియన్ స్పేస్ ఏజెన్సీ(ఈఎస్ఏ) తయారుచేసిన ప్రతిష్టాత్మక ప్రోబా–3 జంట ఉపగ్రహాల ప్రయోగం చిట్టచివర్లో వాయిదాపడింది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ ప్రయోగవేదిక నుంచి బుధవారం సాయంత్రం ప్రయోగించాల్సిన పీఎస్ఎల్‌వీ–సీ59 రాకెట్ ప్రయోగాన్ని ఆఖరిలో వాయిదా వేశారు. ప్రోబా–3 వ్యోమనౌకలో 310 కేజీల కరోనాగ్రాఫ్, 240 కేజీల ఆకల్టర్ అనే ఉపగ్రహాలున్నాయి. వీటిల్లో ఒకదానిలో తలెత్తిన స్వల్ప సాంకేతికసమస్య కారణంగా ఈఎస్ఏ సూచన మేరకు ప్రయోగాన్ని వాయిదావేసినట్లు ఇస్రో బుధవారం సాయంత్రం ప్రకటించింది. గురువారం సాయంత్రం 4.12 గంటలకు రాకెట్‌ను ప్రయోగించనున్నామని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ప్రకటించారు. వాణిజ్యపరమైన ప్రయోగాల్లో సాంకేతిక లోపం తలెత్తడం ఇదే మొదటిసారి కావడం విశేషం. సూళ్లూరుపేట పట్టణంలో వెలసియున్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ఇస్రో చైర్మన్ సోమనాథ్ బుధవారం దర్శించుకుని రాకెట్ ప్రయోగం విజయంతం కావాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంటన షార్ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులున్నారు.

2025 ప్రథమార్థంలో గగన్‌యాన్ మిషన్

రాబోయే ఏడాది అంటే 2025 ప్రథమార్థంలో మానవ రహిత గగన్‌యాన్ మిషన్ ప్రయోగం ఉంటుందని, ఇందులో రోబోను పెట్టి పంపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని సోమనాథ్ తెలిపారు. చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నాక ఆయన మీడియాతో మాట్లాడారు. గగన్‌యాన్ మిషన్ మానవ రహిత ప్రయోగంలో ముందుగా రోబోను పంపించిన అనంతరం మానవ సహిత ప్రయోగంలో వ్యోమగాములను పంపిస్తామని చెప్పారు. సూర్యుడిపై పరిశోధనలు చేసేందుకు ప్రయోగించిన ఆదిత్య ఎల్ 1 ఉపగ్రహం తరహాలో యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ప్రోబా3 వ్యోమనౌకను సిద్ధంచేసిందని తెలిపారు. రెండు నెలల్లో పీఎస్ఎల్‌వీ సీ60 ప్రయోగం ఉంటుందని చెప్పారు.

క్లుప్తంగా...

కుక్కల విద్యాసాగర్ బెయిల్ పిటిషన్‌పై 9న తీర్పు

సాక్షి, అమరావతి: సినీ నటి కాదంబరి జత్వానీ ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసులో బెయిల్ కోరుతూ కుక్కల విద్యాసాగర్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. విద్యాసాగర్, సీఐడీ, జత్వానీ తరఫున వాదనలు విన్న హైకోర్టు ఈ నెల 9న నిర్ణయం వెలువరిస్తామని ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకు ముందు విద్యాసాగర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో వాస్తవాలను పోలీసులు కోర్టుకు చెప్పడం లేదన్నారు. వాస్తవాలు బయటకు వస్తే విద్యాసాగర్‌పై కేసే ఉండదని చెప్పారు. విద్యాసాగర్ సొంత ఊరికి వచ్చిన జత్వానీ రూ.కోటి ఇవ్వాలని బెదిరించిందన్నారు. జత్వానీ తల్లి ఖాతాలో విద్యాసాగర్ డబ్బు జమ చేశారని తెలిపారు. ఆమె బ్యాంకు ఖాతా వివరాలు బయటపడితే వాస్తవం తెలుస్తుందని, అయితే పోలీసులు చర్యలు చేపట్టడం లేదన్నారు. అందుకే తాము జత్వానీ ఎలక్ట్రానిక్ ఉపకరణాలను భద్రపరచాలంటూ న్యాయపోరాటం చేస్తున్నామన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరిస్తాం
మంత్రి అనగాని సత్యప్రసాద్



సాక్షి, అమరావతి: అన్ని రకాల భూ వివాదాలకు పరిష్కారం చూపేందుకే ఈ నెల 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సదస్సుల నిర్వహణ కోసం బుధవారం మంగళగిరి నుంచి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భూ వివాదాలను పరిష్కరించేందుకు ఎటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. రెవెన్యూ సదస్సులు 33 రోజుల్లో అన్ని గ్రామాల్లో జరుగుతాయని చెప్పారు. అన్ని రకాల భూ సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదులు తీసుకుంటామని తెలిపారు. అసైన్డ్ భూములు ఫ్రీ హోల్డ్ చేసిన వాటిల్లో ఏవైనా అక్రమాలు జరిగాయా అనేది కూడా పరిశీలిస్తామన్నారు.

ఈడబ్ల్యూఎస్ కోటాలో కాపులకు సగమా?

సాక్షి, అమరావతి: ఉన్నత వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఈడబ్ల్యూఎస్) విద్య, ఉపాధి అవకాశాల్లో ఇచ్చిన 10 శాతం రిజర్వేషన్లలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాల విషయంలో తమకు సందేహాలున్నాయని హైకోర్టు తెలిపింది. ప్రాథమిక ఆధారాలను బట్టి చూస్తే ఈడబ్ల్యూఎస్ కోటాలో ఓ వర్గానికే సగం ఇవ్వడం సబబుగా అనిపించడంలేదని అభిప్రాయపడింది. ఈడబ్ల్యూఎస్ కోటా ఇస్తూ కేంద్రం చేసిన 103వ రాజ్యాంగ సవరణ విషయంలో సుప్రీంకోర్టు ఏం చెప్పింది? కాపులకు 5 శాతం రిజర్వేషన్ల చట్టాలను సుప్రీంకోర్టులో ఎవరు సవాలు చేశారు? వారు లేవనెత్తిన అభ్యంతరాలేమిటి తదితర వివరాలను తమ ముందుంచాలని పిటిషనర్లను ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 29కి వాయిదా వేసింది. ఈ మేరకు ధర్మాసనం బుధవారం ఆదేశాలు జారీ చేసింది.

5 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం లేదు..

ఈడబ్ల్యూఎస్ కోటాలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2019లో చేసిన చట్టాలను అమలు చేయాలంటూ కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు చేగొండి హరిరామజోగయ్య పిటిషన్ దాఖలు చేశారు. కాపు రిజర్వేషన్లను సవాలు చేస్తూ కొందరు కూడా పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. జోగయ్య తరఫు న్యాయవాది పోలిశెట్టి రాధాకృష్ణ, ఇతరుల తరఫున ఎన్.భరత్ వాదనలు వినిపిస్తూ.. కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన చట్టాలను అమలు చేయడంలేదన్నారు. ఈడబ్ల్యూఎస్, కాపుల కోటాపై సుప్రీంకోర్టులో పిటిషన్లేవీ పెండింగ్‌లో లేవని, అందువల్ల కాపుల రిజర్వేషన్లు అమలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కాపు రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ పిటిషన్లు దాఖలు చేసిన వారి తరఫున న్యాయవాది జె.ఉగ్రనరసింహ వాదనలు వినిపిస్తూ.. ఈడబ్ల్యూఎస్ కోటా 10 శాతంలో సగం కాపులకు ఇవ్వడం సరికాదని, అది ఈడబ్ల్యూఎస్ కోటా నిబంధనలకు విరుద్ధమన్నారు.

దానిని ఆక్రమణ అని ఎలా అనగలం: హైకోర్టు



సాక్షి, అమరావతి: ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మరదలు గాలి వసుమతి నిర్మించిన భవనం చెరువు పక్కన ఉన్నట్లుగా ఫొటోలను చూస్తే అర్థమవుతోందని, దానిని ఆక్రమణ అని ఎలా అనగలమని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఆక్రమణ అని నిరూపించేందుకు ఆధారాలేమిటని ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఈ అంశంపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని జల వనరులు, రెవెన్యూ శాఖల ముఖ్య కార్యదర్శులు, జిల్లా కలెక్టర్‌ను, వెంకటరామిరెడ్డి, వసుమతి తదితరులను ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 8కి వాయిదా వేసింది.

ధాన్యం దళారీగా సర్కారు

మిల్లర్లు దోచుకుంటుంటే చోద్యం చూస్తోంది
రైతులకు, మిల్లర్లకు మధ్య మధ్యవర్తిత్వం నడుపుతోంది

- మిల్లర్లు చెప్పిన ధరకు ఇవ్వాలంటూ ఒత్తిడి చేస్తున్నారు
- రాష్ట్రంలో ఏ ఒక్క రైతుకూ 'మద్దతు' లభించడంలేదు
- 14-17 శాతం తేమ ఉన్నా మద్దతు ధర ఇవ్వడంలేదు
- కొనే నాథుడులేక రెండు వారాలుగా రోడ్ల మీదే ధాన్యం రాశులు
- మంత్రులు, ఉన్నతాధికారుల ఆదేశాలు పట్టించుకోని కిందిస్థాయి అధికారులు
- ధాన్యం కొనుగోలు కోసం అన్నదాతల ఆందోళన ఉధృతం
- విజయవాడలోని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున రైతుల నిరసన
- ధాన్యం రాశులు చూపిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



సాక్షి, అమరావతి: 'ప్రభుత్వం ధాన్యం దళారీగా మారింది. రైతులకు, మిల్లర్లకు మధ్య మధ్యవర్తిత్వం నడుపుతోంది. మిల్లర్లు చెప్పిన ధరకు ధాన్యం ఇచ్చేయాలంటూ రైతులపై ఒత్తిడి తీసుకొస్తోంది. రాష్ట్రంలో ఏ ఒక్క రైతుకూ పూర్తిస్థాయిలో కనీస మద్దతు ధర దక్కడంలేదు. చరిత్రలో ఎప్పుడూ ఇంత దారుణమైన పరిస్థితులు చూడలేదు'.. అంటూ అన్నదాతలు మండిపడుతున్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు చేస్తున్న ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. గడిచిన రెండ్రోజులుగా మండల తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్బీకేలు, రైతుక్షేత్రాలు, రోడ్లపై ఆరబోసిన ధాన్యం రాశుల ఎదుట నిరసనలు వ్యక్తంచేసిన రైతులు బుధవారం విజయవాడలోని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన వివిధ మండలాల రైతులు, కౌలు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం పౌరసరఫరాల సంస్థ ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు, వివిధ రైతు సంఘాల నేతలు మాట్లాడారు. వారు ఏమన్నారంటే..

మంత్రి చిటికలేసినా ధాన్యం కదల్లేదు..

కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించి, రోడ్లపై ఉన్న ధాన్యాన్ని సాయంత్రానికి కల్లా కాటావేసి మిల్లులకు తరలించాలని నాలుగు రోజుల క్రితం అధికారులకు చిటకలేసి మరీ చెప్పారు. రోజులు గడుస్తున్నా గింజ ధాన్యం కూడా కాటా వేయలేదు. మంత్రులు, ఉన్నతాధికారుల ఆదేశాలు క్షేత్రస్థాయిలో పట్టించుకోవడంలేదు. వాళ్లు పర్యటించిన చోట కూడా ధాన్యం కాటా వేయడం కానీ, మిల్లులకు తోలడం గానీ జరగడంలేదు. మారుమూల గ్రామాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

రాష్ట్రంలో ఏ ఒక్క రైతుకు 'మద్దతు' దక్కడంలేదు..

తేమ శాతం ఎంతున్నా కొంటామంటున్నారు. ఆ తర్వాత 17 శాతం దాటితే ఐదు కేజీల కోత వేసి మిగిలిన ధాన్యాన్ని కొంటామన్నారు. పూర్తిస్థాయి మద్దతు ధర కల్పించాల్సిన ప్రభుత్వమే తరుగు మినహాయించి కొంటామని చెప్పడం దారుణం. తుపాను, వర్షాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా తేమ శాతం 20 నుంచి 24 శాతం వస్తోంది. రెండు శాతమో, ఐదు శాతమో కట్ చేసి మిగిలిన ధాన్యానికి మద్దతు ధర ప్రకారం లెక్కిస్తే 75 కేజీల బస్తాకు రూ.1,670 చొప్పున ఇవ్వాలి. కానీ, రూ.1,470-1,500కు మించి ఇవ్వడంలేదు. పైగా.. ధాన్యం బాగోలేదంటూ మిల్లర్లు పేచీ పెడుతున్నారు. కొనేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. ఎంటీయూ 1,262, 1,318 వంటి ఫైన్ వెరైటీ ధాన్యానికి కూడా మద్దతు లభించని దుస్థితి ఏర్పడింది.

రైతులకు-మిల్లర్లకు మధ్య బ్రోకర్లుగా మారారు..

నిజానికి.. రైతుసేవా కేంద్రాల్లో తేమ శాతాన్ని పరీక్షించాలి. అక్కడ నిర్ధారించే దానినే ప్రామాణికంగా తీసుకుని ధరను నిర్ణయించి అదే ధరకు కొనుగోలు చేయాలి. కానీ, ఎక్కడా ఆ పరిస్థితిలేదు. ఆర్‌ఎస్‌కేలకు వెళ్తుంటే తేమ శాతం కూడా చూడడం లేదు. ఏ మిల్లుకు వెళ్తారని అడిగి అక్కడకు పంపించేస్తున్నారు. మిల్లు వాళ్లు ఏ ధర నిర్ణయిస్తారో ఆ ధరకు అమ్ముకోండంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారు. ఇది చాలా దారుణం. ఇది రైతాంగాన్ని మిల్లర్లు దోచుకునేందుకు ఉపయోగపడే పద్ధతే తప్ప రైతులకు మేలుచేసే విధానం కాదు. ఇక వాట్సప్‌లో 'హాయ్' అని మెసేజ్ పెడితే చాలు క్షణాల్లో మీ ధాన్యం కొనేస్తామంటున్నారు. కానీ, ఆచరణలో ఇదెక్కడా అమలుకు నోచుకోవడంలేదు.

ఒక్క ప్రైవేటు వ్యాపారిపైనైనా కేసు పెట్టారా?

ఇక ప్రైవేటు వ్యాపారులు కొనే ధాన్యాన్ని ప్రభుత్వం ఎందుకు కొనడంలేదో అర్థం కావడంలేదు. తక్కువ ధరకు కొనే వ్యాపారస్తులపై కేసులు పెడతామని చెప్పారుగానీ.. రాష్ట్రంలో ఒక్క ధాన్యం వ్యాపారిపైనైనా కేసు పెట్టారా? ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లు తక్కువ రేటుకు ధాన్యం కొంటుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోంది. పోనీ ప్రభుత్వమైనా కొంటుందా అంటే అదీలేదు. గతేడాది కోసిన ధాన్యాన్ని కోసినట్లుగానే తీసుకెళ్లారు.. ప్రతీ రైతుకూ మద్దతు ధర లభించింది. కానీ, ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితిలేదు. ధర్నాలో ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు టీవీ లక్ష్మణస్వామి, కృష్ణాజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే. శివనాగేంద్ర, పంచకర్ల రంగారావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే ఎండ్రిన్ తాగి చావాలి..



ఏడెకరాల్లో వరి వేశాం. పంట కోసి 15 రోజులైంది. తేమ 17 శాతం ఉంది. 20 శాతమైనా తీసుకుంటామన్నారు. కానీ తీసుకోలేదు. బేరగాళ్లు వచ్చి 75 కేజీల బస్తాకు రూ.1,450 ఇస్తామన్నారు. మా రైతు రూ.1,740 చొప్పున లెక్కగట్టి కౌలు ఇవ్వాలంటున్నారు. ఇలా అయితే మా చేతి డబ్బులు పెట్టుకోవాలి. పైగా పంటను కాపాడుకునేందుకు పరదాలకు రోజుకు రూ.2వేలు ఖర్చవుతోంది. డబ్బులు కట్టలేక చచ్చిపోతున్నాం. ఇలా అయితే ఎండ్రిన్ తాగి చావడం తప్ప వేరే దారిలేదు.

– పొద్దుటూరు ప్రసాద్, గొడవర్రు. కంకిపాడు మండలం, కృష్ణాజిల్లా

ఇలా అయితే కౌలు రైతులు బతికేదెలా?



నేను మూడెకరాల్లో వరి వేశాను. గతేడాదితో పోలిస్తే ఎకరాకు ఐదు బస్తాలు తగ్గింది. తేమ శాతం తక్కువగానే ఉన్నప్పటికీ ఈ రకం ధాన్యాన్ని కొనడంలేదు. ఆర్బీకేల్లోనే 20–25 శాతం ఉంటే 1,450 ఇస్తామంటున్నారు. బయట వాళ్లు కొనడం లేదు. పంటను కాపాడుకునేందుకు పరదాల కోసం రోజుకు ఎకరాకు రూ.300–500 చొప్పున చెల్లిస్తున్నాం. ఇలా అయితే కౌలురైతులు బతికేదెలా?

– కోసూరి శివనాగేంద్ర, గడ్డిపాడు, పమిడిముక్కల మండలం, కృష్ణాజిల్లా

గతేడాది మద్దతు ధర వచ్చింది..



ఎనిమిది ఎకరాల్లో వరికోసి 10 రోజులైంది. తేమ 15.5 శాతం ఉంది. మిల్లుకు పంపిస్తామన్నారు. కానీ ఎవరూ రాలేదు. మళ్లీ వెళ్లి అడిగితే మిల్లు దగ్గరకు వెళ్లండి అంటున్నారు. బేరగాళ్లు రూ.1,400 ఇస్తామంటున్నారు. అధికారులు పట్టించుకోవడంలేదు. గతేడాది కోసిన వెంటనే 75 కేజీల బస్తాకు రూ.1,630కు కొన్నారు. ఈ ఏడాది కొనేవాడులేడు. 10 రోజులుగా రోడ్డుపైనే ధాన్యం ఉంది. ఏం చేయాలో పాలుపోవడం లేదు.

– గెద్దా నరేంద్ర, గొడవర్రు, కంకిపాడు మండలం, కృష్ణాజిల్లా

నష్టానికి తోలాల్సి వస్తోంది..



ఐదెకరాల్లో వరివేసా. ఎకరాకు 30 బస్తాలొచ్చింది. గొడవర్రు ఆర్ఎస్‌కు తీసుకెళ్తే 15.4% తేమ వచ్చింది. రేటు చెప్పలేదు. 90 బస్తాలు మిల్లుకు తోలారు. అక్కడ 75 కేజీల బస్తాకు రూ.1,600 కు మించి ఇవ్వమని తెగేసి చెప్పారు. ఆర్ఎస్‌కే సిబ్బందికి చెబితే పట్టించుకోలేదు. చేసేది లేక బస్తాకు రూ.130 చొప్పున నష్టానికి మిల్లుకు తోలాల్సి వచ్చింది.

– గెద్దం రాజా, గొడవర్రు, కృష్ణాజిల్లా

రహస్య బ్యాలెట్ విధానాన్ని అమలు చేయండి

- సాగు నీటి సంఘాల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- బ్యాలెట్ కోరే ఓటర్లను అందుకు అనుమతించాలని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: సాగు నీటి సంఘాల ఎన్నికలపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సంఘాల మేనేజింగ్ కమిటీల ఎన్నికల్లో ఏకాభిప్రాయం కుదరనప్పుడు 'చేతులెత్తి ఎన్నుకునే విధానం'ను అమలు చేస్తే ఓటర్లు ఇబ్బంది పడుతారని, ఎవరో ఒకరు వీరిని లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందన్న వాదనను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ ఎన్నికల్లో రహస్య బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకుంటామనే రైతులకు అందుకు అనుమతించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందుకోసం ఏర్పాట్లు చేయాలని చెప్పింది. పోటీలో ఉన్న అభ్యర్థుల విషయంలో ఏకాభిప్రాయం కుదరనప్పుడు పిటిషనర్ల వంటి వారు ఓటు హక్కును సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఉపయోగించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరవచ్చునని తెలిపింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 25కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

ఆ నిబంధనలను కొట్టేయండి

సాగు నీటి సంఘాల మేనేజింగ్ కమిటీల ఎన్నికల్లో రహస్య ఓటింగ్‌కు సైతం అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ ఎన్టీఆర్ జిల్లా వేములనర్వకు చెందిన చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కమతం రాములు పిటిషన్ దాఖలు చేశారు. ఏపీ రైతుల సాగునీటి వ్యవస్థ నిర్వహణ చట్టం, సాగు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణలో పలు నిబంధనలను కొట్టేయాలని కోరారు. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పాపెల్లిగారి వీరారెడ్డి వాదనలు వినిపిస్తూ.. సాగునీటి సంఘాల మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో ఏకాభిప్రాయం లేనప్పుడు చేతులు ఎత్తడం లేదా స్లిప్పుల ద్వారా ఎన్నుకోవచ్చన్నారు. చేతులెత్తి ఎన్నుకొంటే ఓటర్లు ఎవరికి ఓటు వేశారో తెలిసిపోతుందని, తద్వారా వారిని లక్ష్యంగా చేసుకొనే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల రహస్యంగా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. ఓటర్లు ఓటు హక్కును రహస్యంగా వినియోగించుకొనే ప్రత్యేక ఏర్పాట్ల ప్రస్తావన ఏదీ నిబంధనల్లో లేదన్నారు. ఓటర్లందరూ పక్కపక్కన కూర్చొని స్లిప్పుల్లో అభ్యర్థుల సీరియల్ నంబర్లను పూరించాల్సి ఉంటుందన్నారు. దీనివల్ల ఇతరులు ఆ ఓటును చూసే అవకాశం ఉంటుందని వీరారెడ్డి తెలిపారు. చేతులెత్తి ఎన్నుకునే విధానంపై ఏ ఓటరుకైనా అభ్యంతరం ఉంటే స్లిప్పుల ద్వారా ఓటు వేయొచ్చని ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ చెప్పారు. ఇరు పక్షాల వాదనల అనంతరం రహస్య బ్యాలెట్ విధానాన్ని అమలు చేయాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది.

జీఎస్టీ సాంకేతిక సమస్యలు పరిష్కరిస్తాం

వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కమిషనర్ ఎ.బాబు

సాక్షి, అమరావతి: డీలర్లు పన్ను చెల్లించడంలో ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను తక్షణం పరిష్కరిస్తామని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కమిషనర్ ఏ.బాబు తెలిపారు. ఇందుకోసం డీలర్లతో తరచూ సమావేశాలు నిర్వహించి జీఎస్టీ చట్టం సక్రమంగా అమలయ్యే విధంగా చూస్తామన్నారు. బుధవారం కుంచనపల్లిలోని జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్రస్థాయి జీఎస్టీ ఫిర్యాదుల పరిష్కార కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ ప్రభుత్వం, డీలర్లు పరస్పరం సహకారం అందించుకుంటూ పన్నుల వ్యవస్థను పటిష్టం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మీ వైఫల్యాన్ని దళారులపై నెట్టేస్తారా?

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులపై రైతుల నుంచి మంత్రి నాదెండ్లకు తీవ్ర వ్యతిరేకత

సాక్షి, అమరావతి/అవనిగడ్డ: పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు మరోసారి రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. గత వారం కృష్ణాజిల్లాలో వారి నుంచి ఎదురైన చేదు సంఘటనలు బుధవారం కూడా ఇదే జిల్లాలో మరోమారు పునరావృతమయ్యాయి. ధాన్యం కొనుగోళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులు, పడుతున్న కష్టాలను వారు ఎక్కడికక్కడ మంత్రికి ఏకరువు పెట్టి ఆగ్రహంతో నిలదీసినంత పనిచేశారు. రైతుల నుంచి ఎదురైన ఈ వ్యతిరేకతను చూసి ఆయన ప్రభుత్వ వైఫల్యాన్ని దళారులపై నెట్టే ప్రయత్నం చేశారు. అలాగే, రైతుల అవస్థలు చూసి తనకూ బాధేసిందని ఆయన కవరింగ్ ఇచ్చారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం జరిపిన పర్యటనలో ఆయనకు ఎదురైన చేదు అనుభవం ఇది. ఎక్కడికక్కడ రైతులు ఆయన్ను ధాన్యం కొనుగోళ్లపై నిలదీయడం.. గత వారం కూడా ఇదే రీతిలో అనుభవం ఎదురవడంతో బుధవారం సాయంత్రం మచిలీపట్నం కలెక్టరేట్‌లో మిల్లర్లతో జరగాల్సిన సమావేశం.. ప్రెస్‌మీట్‌కు మంత్రి అవమాన భారంతో డుమ్మా కొట్టి ముఖం చాటేశారు.

దారి పొడవునా మంత్రికి ఏకరువు..

ఘంటసాల మండలం లంకపల్లి నుంచి మోపిదేవి మండలం పెదప్రోలు వరకూ దారిపొడవునా రైతులు మంత్రి నాదెండ్ల మనోహర్‌కు తమ కష్టాలు ఏకరువు పెట్టారు. లంకపల్లిలో ఓ మహిళా రైతు మాట్లాడుతూ.. 20 రోజుల నుంచి రోడ్డు పక్కనే ధాన్యం కుప్పగా పోసి కాపలా ఉంటున్నామని, ప్రతిరోజూ పదిమంది కూలీలతో ఆరబెట్టుకుంటున్నట్లు చెప్పింది. అలాగే, చల్లపల్లి మండలం మాజేరులో మరికొందరు రైతులు స్పందిస్తూ.. పదిరోజుల నుంచి ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నామని, ఎవరూ కొనేందుకు ముందుకు రావడంలేదని రైతులు మంత్రికి తమ ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో ఆయన రైతుసేవా కేంద్రం, వీఏఏ, పీఏసీఎస్ గుమస్తాపై మండిపడ్డారు. తమకు సమాచారం ఇవ్వలేదని వారు చెప్పగా గ్రామంలో ఏ రైతు నూర్పిడి చేస్తున్నారో, రోడ్ల వెంట ఎవరు ఆరబెట్టుకుంటున్నారో తెలుసుకోవాల్సిన బాధ్యత మీపై లేదా అంటు చిర్రుబుర్రులాడారు. వీరిపై చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.



లంకపల్లిలో మంత్రి నాదెండ్లకు ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఏకరువు పెడుతున్న మహిళా రైతులు

ఆ రెండు రకాలను మిల్లర్లు కొనడంలేదు..

ఇక చల్లపల్లి, మోపిదేవి మండలం పెదప్రోలులో కొంతమంది రైతులు పండించిన ఎంటీయూ 1262, 1318 రకాల ధాన్యాన్ని గత ఏడాది కొనుగోలు చేసినప్పటికీ మిల్లర్లు ఎవరూ ఈసారి కొనడంలేదని ఆరోపించారు. దీంతో బస్తా రూ.1,400 చొప్పున దళారులకు అమ్ముకున్నానని మరో రైతు చెప్పాడు. అలాగే, రోజుల తరబడి ఆరబెట్టినా ధాన్యం కొనడం లేదని మరికొందరు రైతులు మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఫిర్యాదు చేయగా.. వాతావరణం మారిందని అందరూ ఒకేసారి అర్జంట్‌గా కొనేయమంటే వారైనా ఎలా కొంటారంటూ మంత్రి దళారులకు దన్నుగా నిలిచారు. వారు ఇంకా తమ కష్టాలు చెప్పుకుంటుండగా.. 'మొన్న జరిగిన విషయాలు వదిలేయండి, మీకు గోతాలు కావాలంటే గోతాలు, లారీలు కావాలంటే లారీ అన్నీ అందుబాటులో ఉంచుతాం.. రేపటికల్లా ఎక్కడా ధాన్యం నిల్వల్లేకుండా చర్యలు తీసుకుంటా'మని మంత్రి నాదెండ్ల వారికి హామీ ఇచ్చారు. వాతావరణ పరిస్థితులవల్ల ఒకేసారి నూర్పిళ్లు చేయడంతో దళారులు ప్రవేశించారని.. వారివల్లే రైతులకు ఈ దుస్థితి వచ్చిందని మంత్రి చెప్పారు. ఎవరూ దళారులను ఆశ్రయించవద్దని.. ప్రతి గింజా కొనేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ధాన్యం ఆరబెట్టుకునేందుకు సైలోజ్‌లు ఏర్పాటు..

అనంతరం.. అవనిగడ్డ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు డ్రయర్స్ ఎక్కువగా లేనందున రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వచ్చే ఖరీఫ్ నాటికి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణాజిల్లాలో ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు వీలుగా భారీస్థాయిలో సైలోజ్‌లు ఏర్పాటుచేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9.91లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా వాటికి సంబంధించి రూ.2,280 కోట్లను రెండ్రోజుల్లోనే రైతుల ఖాతాలకు జమచేశామన్నారు.

గత వారం కూడా మంత్రిపై ఇదే ఆగ్రహజ్వాల..

కాగా గత వారం కూడా మంత్రి నాదెండ్ల కృష్ణాజిల్లాలో పర్యటించారు. అప్పుడు కూడా రైతులు సర్కారు చేతగానితనంపై ఆగ్రహోదగ్రులయ్యారు. స్వయంగా టీడీపీ వారే ఆయనకు నానా చీవాట్లు పెట్టారు. పైగా.. గత ప్రభుత్వంలో తమకు ఎంతో మేలు జరిగిందని, గోనె సంచులు, టార్పాలిన్లు, ఇచ్చారని, రవాణా చార్జీలు కూడా చెల్లించి ఎంతో మేలుచేశారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో.. తాజాగా ఆయనకు రైతుల నుంచి పరాభవం ఎదురవడంతో మచిలీపట్నం కలెక్టరేట్‌లో మిల్లర్లతో జరగాల్సిన సమీక్షకు డుమ్మా కొట్టారు.

మిల్లుల్లో ధాన్యం అన్‌లోడ్ చేసుకోవట్లేదు..

ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు పౌరసరఫరాల సంస్థ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. సంస్థ కేంద్ర కార్యాలయ సిబ్బంది ఐదు బృందాలుగా ఏర్పడి కృష్ణాజిల్లాల్లో పలు మండలాల్లో రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు పేర్కొంది. మిల్లు ఆవరణలో ధాన్యం వాహనాలు అన్‌లోడింగ్‌లో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు.. ధాన్యం తూకంలో కోత విధిస్తున్నట్లు తెలిపింది. ఈ క్రమంలో ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టిన మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు పౌరసరఫరాల సంస్థ ఆ ప్రకటనలో తెలిపింది.

ఏపీలో 6 నెలల్లో 11,554 మంది దళితులపై దాడులు

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



రాజ్యసభ.. సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో ఎస్సీ, ఎస్టీలపై జరిగిన దాడులకు సంబంధించి ఆరు నెలల్లో 11,554 ఫిర్యాదులొచ్చాయని సామాజిక న్యాయం, సాధికారితశాఖ సహాయమంత్రి రాందాస్ అతావాలే తెలిపారు. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్ సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. జాతీయ ఎస్సీ కమిషన్‌కు చెందిన ఆన్‌లైన్ ఈ-గ్రీవెన్స్‌కు ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు అందాయని తెలిపారు. 2020-21లో 10,952, 2021-22లో 13,528, 2022-23లో 12,782, 2023-24లో 19,719 ఫిర్యాదులు రాగా.. 2024-25 నవంబర్ 28వ తేదీ నాటికి 11,554 ఫిర్యాదులు అందాయని చెప్పారు.

రాష్ట్రంలో 4.92 లక్షల పీవీటీజీ జనాభా

ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసి న్యాయవాసి న్యాయ మహా అభియాన్ (పీఎం-జన్మాన్) పథకం కింద 21, నవంబర్ 2024 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 4లక్షల 92వేల 552 మంది 'పర్టిక్యూలర్లీ వెల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్'(పీవీటీజీ) ఉన్నారని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయ్‌కీ తెలిపారు. విజయసాయిరెడ్డి మరోప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. దేశంలో అత్యధికంగా పీవీటీజీలు ఉన్న రాష్ట్రాల్లో ఏపీ ఒకటని చెప్పారు.

పాఠశాలల మరమ్మతులకు రూ.39.80 కోట్లు

ఏపీలో 2021-22, 2023-24 విద్యాసంవత్సరాలకు 'సమగ్ర శిక్షా అభియాన్' (ఎస్ఎస్ఏ) కింద రూ.39.80 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి జయంత్ చౌదరి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. ఏపీకి మూడేళ్లలో రూ.39.80 కోట్లు కేటాయించగా రూ.29.42 కోట్లు ఉపయోగించినట్లు చెప్పారు. 2024-25లో మరమ్మతుల కోసం రూ.16.92 కోట్లు ఇచ్చేందుకు ఇటీవల బడ్జెట్‌లో ఆమోదించారన్నారు.

బాయిలర్ ప్రమాదాల్లో మరణిస్తే రూ.1 కోటి ఇవ్వాలి

ఏపీలో బాయిలర్ల ప్రమాదాల్లో మృతిచెందిన కుటుంబాలకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.కోటి నష్టపరిహారం ఇచ్చి ఆదుకున్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబురావు తెలిపారు. దేశ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో నష్టపరిహారం ఇచ్చి బాధిత కుటుంబాలను ఆదుకున్న నాయకుడు జగన్ తప్ప.. మరెవరూ లేరని రాజ్యసభ వేదికగా కొనియాడారు. ఇదే తరహాలో దేశంలో ఎక్కడ ఏ ఘటన జరిగి మరణించినా ఆ బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలని, ఆ మేరకు కేంద్రం కొత్త బిల్లులో మార్గదర్శకాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. బాయిలర్‌ల నియంత్రణ-1923 సవరణ బిల్లుకు మద్దతు తెలుపుతూ రాజ్యసభలో ఎంపీ గొల్ల బాబురావు మాట్లాడారు.

రాష్ట్రంలో 29 పోస్టాఫీసు ఎగుమతి కేంద్రాలు

- ఇంధన వనరుల పరిశోధనకు మద్దతు ఇచ్చాం
- లోక్‌సభలో ఎంపీలు వైఎస్ అవినాష్ రెడ్డి, గురుమూర్తి ప్రశ్నలకు సమాధానం
- అరకు-హైదరాబాద్ మధ్య డైరెక్ట్ రైలు నడపండి: ఎంపీ తనూజారాణి



లోక్‌సభ.. సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో 29 పోస్టాఫీసు ఎగుమతి కేంద్రాలు (డక్ ఘర్ నిర్యాత్ కేంద్ర) ఉన్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. పోస్టాఫీసుల ద్వారా ఎగుమతులను ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా 1,013 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అడిగిన ప్రశ్నకు పెమ్మసాని రాతపూర్వకంగా తెలిపారు.

ఇంధన వనరుల పరిశోధనకు మద్దతు..

రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన వనరులపై జరిగే పరిశోధనలను ప్రోత్సహించేందుకు కేంద్రం మద్దతు ఇచ్చినట్లు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 18 ప్రాజెక్టులకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనుసంధన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, తదితర ఫౌండేషన్‌ల ద్వారా పునరుత్పాదక ఇంధన రంగంలో మద్దతు ఇచ్చినట్లు చెప్పారు. కోనసీమ ప్రాంతంలోని ఎస్సీ మత్స్యకారుల సామాజిక, ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి తక్కువ ధరలో ఫిష్ డ్రైయర్‌పై ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా రాత్రి సమయాల్లో చేపల వేటకోసం లాంతర్లను తయారు చేసే ప్రాజెక్టు చేపట్టామని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు.

అరకు-హైదరాబాద్ మధ్య డైరెక్ట్ రైలు నడపండి

ఆంధ్రప్రదేశ్‌లోని అరకు గుహలను వీక్షించేందుకు ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులు వస్తున్నందున హైదరాబాద్ నుంచి అరకుకు నేరుగా రైలు నడపాలని కేంద్ర ప్రభుత్వాన్ని వైఎస్సార్ సీపీ ఎంపీ తనూజారాణి డిమాండ్ చేశారు. అలాగే పర్యాటకులు అరకు అందాలను ఆస్వాదించాలంటే విశాఖ నుంచి అరకుకు టాయ్ ట్రెయిన్‌ను నడపాలని ఆమె కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న డబ్లింగ్ లైన్లను పూర్తి చేయాలని ఎంపీ తనూజ రాణి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. లోక్‌సభలో రైల్వే సవరణ బిల్లు సమయంలో ఎంపీ తనూజారాణి అరకు పార్లమెంట్ పరిధిలో ఉన్న రైల్వే సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు.

డాలరే కరెన్సీ కింగ్

ప్రపంచ కరెన్సీలో ప్రస్తుతం కింగ్ ఎవరంటే డాలర్ అనే చెప్పాలి. ఎందుకంటే ప్రస్తుతం కరెన్సీ చెల్లింపుల్లో సింహ భాగం దానిదే. ప్రపంచంలోని మరే కరెన్సీ డాలర్ దరిదాపుల్లో కూడా లేదు. బ్రిక్స్ దేశాల విషయానికొస్తే... ప్రపంచ జీడీపీలో వీటి వాటా 27 శాతం. కానీ, ఒక్క అమెరికా వాటా 28 శాతం . విచిత్రమేంటంటే.. ప్రపంచ జనాభాలో 45 శాతం జనాభా బ్రిక్స్ దేశాల్లోనే ఉంది. కానీ, అమెరికా జనాభా వాటా కేవలం 4 శాతమే. భౌగోళికంగా చూసినా ప్రపంచ భూభాగంలో బ్రిక్స్ దేశాల భూభాగం 29 శాతం కాగా, అమెరికాది కేవలం 6 శాతమే. కానీ, డాలర్ ఇప్పుడు ప్రపంచాన్ని ఏలుతోంది. అక్టోబరు నాటికి ప్రపంచ కరెన్సీ చెల్లింపుల్లో ప్రధాన కరెన్సీల వాటా ఎంతెంత అంటే...



కరెన్సీ	శాతం
అమెరికన్ డాలర్	47
యూరో	23
బ్రిటన్ పౌండ్	7
జపాన్ యెన్	4
చైనీస్ యువాన్	3
కెనడా డాలర్	3
హాంకాంగ్ డాలర్	2
ఆస్ట్రేలియా డాలర్	2
సింగపూర్ డాలర్	1
స్విస్ ఫ్రాంక్	1

ఆధారం: సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్‌బ్యాంక్ ఫైనాన్షియల్ టెలికమ్యూనికేషన్ (స్విఫ్ట్)

క్లుప్తంగా...

వర్రా రవీంద్రరెడ్డికి రిమాండ్

సాక్షి, నెట్‌వర్క్: సోషల్ మీడియా యాక్టివిస్ట్ వర్రా రవీంద్రరెడ్డిని గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణ పోలీసులు బుధవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా.. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కూటమి ముఖ్య నేతలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ ఇటీవల పట్టణానికి చెందిన టీడీపీ నేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న రవీంద్రరెడ్డిని పొన్నూరు కోర్టులో హాజరు పరిచి గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

ఐదుగురి విచారణ

సోషల్ మీడియా యాక్టివిస్టులు సునీతరెడ్డి, వరకుమార్, లింగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దాసరి శరత్‌కుమార్‌లను వైఎస్సార్ జిల్లా కడపలోని సైబర్ క్రైం పోలీసులు గంటల పాటు విచారించారు. వీరికి గతంలో డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో 41ఏ నోటీసులిచ్చారు.

అగ్రి కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి చివరి దశ మాన్యువల్ కౌన్సెలింగ్‌ను ఈనెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్ఆర్ఐ కోటాలో బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో తుది విడత కౌన్సెలింగ్‌ను 6వ తేదీనే నిర్వహిస్తారని పేర్కొన్నారు.

త్వరలో సివిల్ సర్వీసెస్ కోచింగ్ కేంద్రాలు

మంత్రి ఎస్.సవిత

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 26 జిల్లాల్లో బీసీలకు డీఎస్సీ ఉచిత కోచింగ్ కేంద్రాలు ప్రారంభమయ్యాయని, త్వరలో సివిల్ సర్వీసెస్‌కు కూడా కోచింగ్ కేంద్రాలు ప్రారంభిస్తామని బీసీ, చేనేత సంక్షేమ శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు.

భారీగా అఫిలియేషన్ ఫీజుల పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రైవేటు జూనియర్ కళాశాలల అఫిలియేషన్ (గుర్తింపు), ఇన్‌స్పెక్షన్ (తనిఖీ) ఫీజులను ప్రభుత్వం భారీగా పెంచింది. గతంతో పోలిస్తే దాదాపు 50 శాతం మేర ఫీజులను పెంచుతున్నట్టు ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెరిగిన ఫీజులు 2025–26 విద్యా సంవత్సరం నుంచి అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. ఇకపై ఏటా 10శాతం చొప్పున ఐదేళ్ల పాటు పెంపు ఉంటుందని స్పష్టం చేశారు.

కొత్త జూనియర్ కళాశాలల ఏర్పాటుకు అనుమతులు

రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరంలో కొత్తగా ప్రైవేటు జూనియర్ కళాశాలల ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. 2025–26లో 37 మండలాల్లో 47 కళాశాలలు, రెండు మున్సిపాల్టీ ప్రాంతాల్లో కొత్తగా ఆరు జూనియర్ కళాశాలల ఏర్పాటుకు అవకాశం ఉందని ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దళితులంటే ఇంత చిన్నచూపా?

అక్రమ కేసులతో ఉక్కుపాదం మోపుతున్న చంద్రబాబు ప్రభుత్వం

రాజమహేంద్రవరంలో కాలనీ సమస్యపై పోస్టు పెట్టిన దళిత యువకుడు సాగర్‌పై అమానుషం

- పోలీసుస్టేషన్‌లో అర్ధ నగ్నంగా నిలబెట్టి తీవ్ర దుర్భాషలు, బెదిరింపులు
- కొవ్వుపట్టి కొట్టుకుంటున్నావురా నా..కొ.. అంటూ రెచ్చిపోయిన సీఐ
- పందిలా ఉన్నావు.. నిన్ను కోసి రైలు పట్టాల మీద పడేస్తే దిక్కెవరు?
- నీ గొంతుకోసి గోదావరిలో పడేస్తే శవం కూడా దొరకదని బెదిరింపులు
- ఇంత అవమానం జరిగాక బతకాలని లేదని వాపోయిన బాధితుడు
- కూటమి ప్రభుత్వ కక్షసాధింపుపై మండిపడ్డ వైఎస్సార్‌సీపీ నేతలు మార్గాని భరత్, సుధాకర్‌బాబు, కొమ్మూరి కనకారావు




రాజమహేంద్రవరం పోలీస్‌స్టేషన్ సెల్‌లో తనను అర్ధనగ్నంగా ఉంచారని ఆవేదన వ్యక్తంచేస్తున్న పులి సాగర్

సాక్షి, అమరావతి: సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంలో వైఫల్యాలపై ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా యాక్టివిస్టులపై చంద్రబాబు ప్రభుత్వం కక్ష పరాకాష్టకు చేరింది. ప్రభుత్వ హామీల అమలుపై నిలదీస్తున్న సోషల్ మీడియా యాక్టివిస్టులను ఉక్కుపాదంతో అణచివేస్తోంది. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను తుంగలో తొక్కుతూ అక్రమ కేసులతో వేధిస్తోంది. సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టినట్లు ఎవరిపైనైనా కేసు నమోదు చేస్తే.. ముందు 41ఏ నోటీసు జారీ చేయాలి. ఆ తర్వాత నిందితుడి నుంచి పోలీసులు సమాధానం తీసుకోవాలి. నిందితుడిపై నమోదైన అభియోగాలతో మేజిస్ట్రేట్ సంతృప్తి చెంది, అనుమతి ఇస్తేనే అరెస్టు చేయాలి. కానీ.. పోలీసులు చట్టాన్ని యథేచ్ఛగా తుంగలో తొక్కుతున్నారు.

రాజమహేంద్రవరంలో వరదలు వచ్చినప్పుడు ప్రజలు పడిన ఇబ్బందులను నెల రోజుల్లోనే పరిష్కరించానంటూ టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. దీనిపై దళిత యువకుడు పులి సాగర్ స్పందిస్తూ.. తాను నివాసం ఉండే కృష్ణానగర్, బ్రదరన్ చర్చి ప్రాంతాల్లో వరద నీళ్లు ఇంకా నిల్వ ఉన్నాయని, ఇతర సమస్యలు అలాగే ఉన్నాయని పోస్టు పెట్టారు. దీనిపై గత నెల 30న పోలీస్‌స్టేషన్‌కు రావాలని రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ స్టేషన్ పోలీసులు ఆదేశిస్తే.. ఈ నెల 2న పులి సాగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడ పోలీసులు అతడిని తీవ్ర స్థాయిలో దుర్భాషలాడుతూ బెదిరించారు. అంతేకాకుండా బీఎస్సీ, బీఈడీ చదివిన తనను సెల్‌లో అర్ధనగ్నంగా నిలబెట్టి.. మహిళా పోలీసు కానిస్టేబుళ్లను కాపలాగా ఉంచారని పులి సాగర్ ఆవేదన వ్యక్తం చేశాడు. సీఐ బాజీలాల్ తన పట్ల దురుసుగా వ్యవహరించి గొంతుకు రాయికట్టి గోదావరిలో పడేస్తానని బెదిరించారని బుధవారం మీడియా ఎదుట కన్నీటి పర్యంతమయ్యాడు. కొవ్వుపట్టి కొట్టుకుంటున్నావురా నా..కొ.. అంటూ రెచ్చిపోయారని, పందిలా ఉన్నావు.. నిన్ను కోసి రైలు పట్టాల మీద పడేస్తే దిక్కెవరని బెదిరించారని చెప్పారు. స్థానిక సమస్యపై సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన పాపానికి దళిత యువకుడినైన తన ఆత్మగౌరవాన్ని పోలీసులు దెబ్బతీసి అమానవీయంగా వ్యవహరించడమే కాక నోటికొచ్చినట్లు అసభ్యంగా మాట్లాడారని పులి సాగర్ వాపోయాడు. ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ నేతలు మార్గాని భరత్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొమ్మూరి కనకారావు తీవ్రంగా స్పందించారు. బాధిత యువకుడు పులి సాగర్‌తో కలిసి వీరు బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సంఘటనను మీడియాకు వివరించారు.

నోటికొచ్చిన బూతులు తిట్టారు: పులి సాగర్



ఇటీవల మా ప్రాంతంలో వచ్చిన వరద పరిస్థితివల్ల ఏర్పడిన ఇబ్బందులను నెలరోజుల్లోనే పరిష్కరించానంటూ రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. అయితే, నేనుండే ప్రాంతంలోని బ్రదరన్ చర్చి, కృష్ణానగర్‌లో ఇంకా వరద నీరు నిలిచివుండటం, సమస్యలు అలాగే ఉండటంపై 'ఇదేనా మీరు చేసిందంటూ ఫొటోలతో సోషల్ మీడియాలో ఒక పోస్టుపెట్టా. 30న రాజమండ్రి ప్రకాశ్‌నగర్ పోలీసులు ఫోన్ చేసి స్టేషన్‌కు రమ్మని చెప్పారు. ఈనెల 2న వెళ్లా. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టు పెట్టినందుకు కేసు నమోదు చేస్తున్నామన్నారు. తరువాత సీఐ ఎస్‌కే బాజీరావు నన్ను నోటికొచ్చిన బూతులతో తిడుతూ.. 'కొవ్వుపట్టి కొట్టుకుంటున్నావురా నా కొడకా.. లం..కొడకా.. పందిలా ఉన్నావు.. నిన్ను కోసి, రైలు పట్టాల మీద పడేస్తే దిక్కెవరు'.. అంటూ ఇష్టమొచ్చినట్లు దూషించారు. సెల్‌లో అర్ధనగ్నంగా నన్ను నిలబెట్టి మహిళా కానిస్టేబుళ్లను కాపలాగా ఉంచారు. బీఎస్సీ, బీఈడీ చదువుకున్నాను, నేనేం తప్పు చేశానని ప్రశ్నించినందుకు 'నీ గొంతుకోసి గోదావరిలో పడేస్తే... శవం కూడా దొరకదు' అంటూ సీఐ బెదిరించారు. టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అనుచరుడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నన్ను చూసి నవ్వుకుంటూ వెళ్లాడు. నా కుటుంబసభ్యులు పోలీసుస్టేషన్‌కు న్యాయవాదిని తీసుకొచ్చారు. నాతో బలవంతంగా సంతకాలు పెట్టించుకున్నారు. ఆ తరువాత 41 నోటీసిచ్చి సీఐ హెచ్చరించారు.నాకు బతకాలని లేదు. ఈ దారుణాన్ని వైఎస్సార్‌సీపీ నేతల దృష్టికి తీసుకొచ్చా'.

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు: మాజీ ఎంపీ భరత్



విద్యావంతుడైన ఒక దళిత యువకుడు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులో ఏం తప్పు ఉంది? ఆయనుంటున్న ప్రాంతంలో వరదవల్ల తలెత్తిన సమస్య పరిష్కారం కాలేదని ఫొటోలతో ఒక పోస్టు పెట్టాడు. దానికి కూడా ఈ టీడీపీ కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతోంది. అర్ధనగ్నంగా మహిళా కానిస్టేబుళ్ల ముందు నిలబెట్టి అతడి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. అసలు మనం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నామా? దీనిపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం.

దళితులపై వేధింపులు, దౌర్జన్యాలు: మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు



దళితులపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. దళితులను అణచివేస్తోంది.రాజ్యాంగంలో అంబేడ్కర్ ప్రసాదించిన భావ ప్రకటన హక్కు, జీవించే హక్కులను కూడా ఈ ప్రభుత్వం కాలరాస్తోంది. ఈరోజు పులి సాగర్‌కు జరిగిన దాడికి బాధ్యులైన పోలీసులపై చర్య తీసుకోవాలి. డీజీపీపై మాకు నమ్మకంలేదు. జాతీయ సంస్థలకు ఫిర్యాదు చేస్తాం. ఈ రాష్ట్రంలోని దళిత ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్, మరో అధికారి విజయపాల్ వంటి వారిపై ప్రభుత్వం ఎలాంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందో ప్రజలు గమనిస్తున్నారు.

రాష్ట్రంలో దళితులు బతకాలా.. వద్దా? : కొమ్మూరి కనకారావు



పులి సాగర్‌పై దారుణంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగానికి బదులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏపీలో దళితులపై అత్యాచారాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయి. రాష్ట్రంలో దళితులు బతకాలా? వద్దా? వారికి మాట్లాడే స్వేచ్ఛ కూడా లేదా? ప్రశ్నించడానికే పార్టీ పెట్టాను అన్న పవన్‌కళ్యాణ్ ఎక్కడికి పోయారు? త్వరలోనే ఎన్డీఏ కూటమికి దళితులు బుద్ధిచెబుతారు.



అండగా ఉంటాం

- దళిత యువకుడు పులి సాగర్‌కు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ భరోసా
- పోలీసులు తనతో ఎంత దారుణంగా ప్రవర్తించారో వివరించిన సాగర్
- ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని పార్టీ నేతలకు జగన్ ఆదేశం

సాక్షి, అమరావతి: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పోలీసుల చేతిలో దారుణ హింసకు గురైన దళిత యువకుడు పులి సాగర్ ఉదంతంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. బాధితుడు పులి సాగర్‌కు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ నేతలను ఆయన ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సాగర్‌ను పార్టీ నేతలు వైఎస్ జగన్ దగ్గరకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరంలో పోలీసులు తనపై ఎంత దారుణంగా ప్రవర్తించారో సాగర్.. వైఎస్ జగన్‌కు వివరించారు. సాగర్‌కు ధైర్యం చెప్పిన వైఎస్ జగన్ పూర్తి స్థాయిలో పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని పార్టీ నేతలను ఆదేశించారు.

ఉద్యోగమని నమ్మించి చేపలు పట్టిస్తున్నారు

ఫోన్లు లాగేసుకుని బందీలుగా మారుస్తున్న ముఠా



ఆరిఫ్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఉద్యోగాలు ఇస్తామని మభ్యపెట్టి యువకుల్ని తీసుకువెళ్లి.. వారితో కృష్ణా నదిలో చేపలు పట్టిస్తూ బందీలుగా మార్చుకుంటున్న వైనం వెలుగు చూసింది. ఈ ముఠా ఉచ్చులో చిక్కుకుని గుంటూరు జిల్లాకు చెందిన యువకుడు ప్రాణాలు అరచేత పట్టుకుని బయటపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. గుంటూరుకు చెందిన ఆరిఫ్ అనే యువకుడు పాలిటెక్నిక్ పూర్తి చేశాడు. ఉద్యోగ వేటలో ఉన్న ఆరిఫ్‌కు గుంటూరు నాజ్ సెంటర్‌కు చెందిన మొహిద్దీన్ పరిచయమయ్యాడు. వినుకొండలో చేపల అక్వేరియంలో ఉద్యోగం ఉందని.. వారానికి రూ.15 వేలు ఇస్తారని ఆరిఫ్‌ను మొహిద్దీన్ నమ్మించాడు. ఆ ఉద్యోగం కావాలంటే తనకు రూ.10 వేలు ఇవ్వాలన్నాడు. దీంతో ఆరిఫ్ తన బైక్ తాకట్టు పెట్టి రూ.10 వేలు ఇచ్చాడు. గత నెల 23న మొహిద్దీన్ కలిసి వ్యాన్‌లో బయలుదేరగా, గుంటూరులో మరో ఇద్దరిని, నరసరావుపేటలో మరో ముగ్గురిని ఎక్కించిన తర్వాత వ్యాన్‌లో ఖాళీలేదని, తాను వెనుక వస్తానని మొహిద్దీన్ మధ్యలో దిగిపోయాడు. రాత్రి నంద్యాల జిల్లా కొత్తపల్లి అడవుల్లోకి తీసుకెళ్లారు. అక్కడ కృష్ణా నదిలో పడవ ఎక్కించి సంగమేశ్వర వద్ద దింపారు. ఇక్కడకెందుకు తీసుకొచ్చారని అడగ్గా.. ఇక్కడ చేపలు పట్టాలని చెప్పి ఆరిఫ్ వద్ద ముఠా సభ్యులు ఫోన్ లాగేసుకున్నారు. ఎవరైనా వెళ్లిపోవడానికి ప్రయత్నిస్తే ముఠా సభ్యులు చితకబాదుతుండటంతో ఆరిఫ్ బిక్కుబిక్కుమంటూ గడిపాడు. తన సెల్‌ఫోన్‌ను ఎలాగో దక్కించుకున్న ఆరిఫ్ ఇంకో వ్యక్తితో కలిసి అక్కడి నుంచి తప్పించుకున్నాడు. రోజంతా కొండల్లో నుంచి నడిచి బయటకు వచ్చి కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. ఛార్జింగ్ అయిపోవడంతో ఫోన్ కట్ అయింది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై నల్లపాడు పోలీసుల సహాయంతో లొకేషన్ కనుక్కుని అక్కడికి వెళ్లారు. స్థానికులను విచారించగా.. ఇక్కడకు పనుల కోసం వచ్చిన వారిలో చాలామంది గల్లంతయ్యారని చెప్పడంతో ఆందోళన చెందారు. కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికి ప్రయత్నిస్తే గుంటూరులో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ తీసుకురావాలన్నారు. దీంతో ఆరిఫ్ కుటుంబ సభ్యులు తిరుగు ప్రయాణంలో మార్కాపురం రాగా.. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఆరిఫ్ ఇంటికి ఫోన్ చేసి కర్నూలు బస్టాండ్‌లో ఉన్నానని చెప్పడంతో వారు మార్కాపురం బస్ ఎక్కి రావాలని సూచించారు. అతను వచ్చిన తర్వాత కుటుంబ సభ్యులు మంగళవారం గుంటూరు చేరుకున్నారు. ముఠా వలలో చిక్కి పదుల సంఖ్యలో యువకులు అక్కడ ఉన్నారని, పోలీసులు వారిని కాపాడాలని ఆరిఫ్ 'సాక్షి'కి తెలిపాడు.

సుప్రీంకోర్టునూ

లెక్కచేయని పోలీసులు!

- సజ్జల భార్గవ్‌ను రెండు వారాలపాటు అరెస్టు చేయొద్దన్న కోర్టు
- అయినా భార్గవ్ ఎక్కడున్నారంటూ డ్రైవర్‌కు వేధింపులు
- పోలీస్ స్టేషన్‌కు పిలిపించి చితకబాదిన వైనం



సుబ్బారావు

ఆగిరిపల్లి: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం మాజీ ఇన్‌చార్జ్ సజ్జల భార్గవరెడ్డిపై ప్రభుత్వం బనాయించిన కేసుల్లో రెండు వారాలపాటు అరెస్టు చేయకుండా రక్షణ కల్పిస్తూ సోమవారం సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సైతం పోలీసులు లెక్క చేయక పోవడం విస్తుగొలుపుతోంది. సజ్జల భార్గవరెడ్డి డ్రైవర్ యామర్తి సుబ్బారావును అదే రోజు పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ కక్ష సాధింపుకు పరాకాష్టగా నిలుస్తోంది. సుబ్బారావు ముఖానికి ముసుగేసి గుర్తు తెలియని ప్రాంతానికి తీసుకెళ్లి సజ్జల భార్గవ ఎక్కడ ఉన్నాడో చెప్పాలంటూ చావబాదారు. దీంతో సుబ్బారావు నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌కు వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేశారు.

మా అన్నయ్యను చిత్రహింసలు పెట్టారు..



అభం శుభం తెలియని మా అన్నయ్య సుబ్బారావుని పోలీసులు చిత్రహింసలు పెట్టారు. మా అన్నయ్య సుబ్బారావు సింహాద్రి అప్పారావుపేటలో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. మా అమ్మానాన్న అనారోగ్యంతో మంచంలో లేవలేని స్థితిలో ఉన్నారు. మా కుటుంబానికి అన్నయ్యే దిక్కు. ఎవరో సార్ దగ్గర ఐదేళ్ల నుంచి కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు అని నాకు తెలుసు. సోమవారం మధ్యాహ్నం ఎవరో వ్యక్తులు నాకు ఫోన్ చేసి మీ అన్నయ్య ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. ఫోన్ నంబర్ ఇవ్వమని అడిగారు.. అయితే నాకు నంబర్ తెలియదని చెప్పి ఫోన్ పెట్టేశాను. అయితే పదేపదే ఫోన్ చేసి మా సార్ మాట్లాడతారని చెప్పారు. ఆయన నాతో మాట్లాడుతూ 'నువ్వు కంగారుపడకు మేం పోలీసులం కాదు.. సుబ్బారావు ఇంటి నంబర్, ఫోన్ నంబర్ ఇవ్వు' అని అడిగారు. పదేపదే ఫోన్ చేస్తుంటే నాకు భయమేసి ఫోన్ పెట్టేశాను. ఈరోజు ఉదయమే టీవీలో మా అన్నయ్య సుబ్బారావుని చూశాను. ఏ పాపం తెలియని మా అన్నయ్యను పోలీసులు ఇష్టం వచ్చినట్లు కొట్టారు. ఏం తప్పు చేశాడని ఇలా చేశారు. మా అన్నయ్యను వెంటనే మాకు అప్పగించాలి. ఆయనకు ఏమైనా జరిగితే పోలీసులు, ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

– సుబ్బారావు సోదరి తిరుపతమ్మ

అభిప్రాయం చెప్పాడని దండన!

- 'సీఎం క్యాండిడేట్ ఎవరో నిర్ణయించుకోలేదు' అన్నందుకు విద్యార్థిపై అక్రమ కేసు
- రెండేళ్ల క్రితం ఓ యూట్యూబర్ ప్రశ్నకు సమాధానం చెప్పాడని చర్యలు
- సెమిస్టర్ పరీక్షలు రాస్తున్నాడని విన్నవించినా పట్టించుకోని దైన్యం
- తమ కుమారుడికి ఏం జరిగినా ప్రభుత్వానిదే భాధ్యత అంటున్న తల్లిదండ్రులు



తీవ్ర ఆందోళన చెందుతున్న యఘ్నేష్ తల్లిదండ్రులు



యఘ్నేష్

అసభ్యకరంగా దూషించలేదు.. ఎవరినీ కించపరచలేదు.. ఒక్కరినీ పల్లెత్తు మాట అనలేదు. ఎలాంటి చాలెంజ్‌లూ చేయలేదు.. అయినా కూటమి ప్రభుత్వ పెద్దలకు కోపం వచ్చింది. ఎప్పుడో రెండేళ్ల క్రితం.. ఓ యూట్యూబర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా 'కూటమి పార్టీలు ఇంకా సీఎం క్యాండిడేట్ ఎవరో నిర్ణయించుకోలేదు' అని అభిప్రాయం చెప్పడమే ఆ విద్యార్థి పాలిట శాపమైపోయింది. అంతర్జాతీయ టెర్రరిస్ట్‌ను పట్టుకోవడానికి వచ్చినట్లు.. క్రైమ్, సస్పెన్స్ సినిమాలను తలదన్నేలా గ్రామంలో అందరూ గాఢ నిద్రలో ఉన్నప్పుడు.. కోడి కూయక ముందే సీఐడీ పోలీసుల బృందం గ్రామాన్ని చుట్టుముట్టి.. ఆ విద్యార్థిని పట్టి బంధించింది. ఆపై ఎక్కడికి తీసుకెళ్తున్నారో కూడా చెప్పకుండా ఇన్నోవాలో ఎక్కించుకుని వెళ్లిపోయింది. ఈ పరిణామాన్ని ఏమనాలి? బహుశా తాలిబన్లు కూడా ఇలా వ్యవహరించి ఉండరు!

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం దశుమంతపురం గ్రామం బుధవారం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. తెల్లవారుజామున సీఐడీ పోలీసులు గ్రామంలోకి వచ్చారు. గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి అలజంగి యఘ్నేష్ ఇంటిని చుట్టుముట్టారు. తీరా చూస్తే ఎప్పుడో రెండేళ్ల కిందట కూటమి పార్టీలపై తన అభిప్రాయం చెప్పాడని, గత ఎన్నికలకు ముందు కూటమి నాయకులు 'సీఎం క్యాండిడేట్ ఎవరో నిర్ణయించుకోలేదు' అన్నందుకు ఇప్పుడు ఈ విద్యార్థిపై అక్రమ కేసు బనాయించినట్టు తెలుసుకుని అవాక్కయ్యారు. అసలు ఎవరు ఫిర్యాదు చేశారు.. ఏమని ఫిర్యాదు చేశారు.. తమ కుమారుడిని ఎక్కడికి తీసుకెళ్తున్నారో తెలియక తల్లిదండ్రులు వెంకటనాయుడు, వెంకటరత్నంలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. 'తెల్లవారుజామునే ఇంటి తలుపు తట్టారు. ఎవరని ప్రశ్నిస్తే యఘ్నేష్ స్నేహితులమని చెప్పారు. తలుపు తీసి చూస్తే పోలీసులు. మంచంపై నిద్రపోతున్న మా కుమారుడిని పట్టుకున్నారు. యఘ్నేష్‌తో చిన్న పని ఉంది.. అరగంటలో మళ్లీ వచ్చేస్తాం అన్నారు. పార్వతీపురంలోని భాస్కర్ డిగ్రీ కాలేజీలో బీకాం సెకండియర్ చదువుతున్నాడు. మంగళవారం నుంచి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మరో వారం రోజుల వరకు పరీక్షలు ఉంటాయని చెప్పినా వినిపించుకోలేదు' అంటూ తల్లిదండ్రులు విలపిస్తున్నారు. యఘ్నేష్‌కు ఏం జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. చదువుకుంటున్న ఓ విద్యార్థిని ఎక్కడికి తీసుకెళ్తున్నారో చెప్పకుండా పట్టుకుపోవడం తగదని గ్రామస్తులు వాపోతున్నారు. కాగా, యఘ్నేష్‌ను సీఐడీ పోలీసులు గుంటూరు తీసుకెళ్లారని సమాచారం.

వర్రా రవీంద్రరెడ్డిపై ఎన్ని కేసులు పెట్టారో చెప్పండి


పోలీసులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: సోషల్ మీడియా యాక్టివిస్టు వర్రా రవీంద్రరెడ్డిపై రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని కేసులు నమోదయ్యాయో పూర్తి వివరాలు ఇవ్వాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. తన భర్త వర్రా రవీంద్రరెడ్డిపై నమోదు చేసిన కేసుల వివరాలను అందజేసేలా పోలీసులను ఆదేశించాలని, తద్వారా బెయిల్ పిటిషన్ దాఖలకు అవకాశం దొరుకుతుందంటూ వర్రా కళ్యాణి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ రవీంద్రరెడ్డిపై రాష్ట్రవ్యాప్తంగా అనేక కేసులున్నాయని చెబుతున్న పోలీసులు, వాటి వివరాలను మాత్రం ఇవ్వడంలేదన్నారు. ధన్‌రాజ్ అశ్వనీ వర్సెస్ మూల్‌చందనీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం నిందితుడు ఓ కేసులో అరెస్టై జైల్లో ఉన్నప్పుడు, అతనిపై ఇతర కేసులుంటే వాటిలో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చునని తెలిపారు. పోలీసుల తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) డి.యతీంద్ర దేవ్ వాదనలు వినిపిస్తూ.. కేసుల వివరాల కోరుతూ పిటిషనర్ ఎలాంటి వినతిపత్రం సమర్పించలేదన్నారు. వినతి పత్రం ఇచ్చినా అధికారులు స్పందించకపోతేనే కోర్టుకు రావాలన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

గురువారం 5-12-2024



'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 254

'ఆసియా' యువ భారత్‌దే



పురుషుల అండర్-21 ఆసియా కప్ హాకీ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన భారత జట్టు టోర్నీని అజేయంగా ముగించింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ జట్టుతో జరిగిన ఫైనల్లో శర్దానంద్ తివారి సారథ్యంలోని టీమిండియా 5-3 గోల్స్ తేడాతో గెలుపొందింది. తద్వారా ఈ టోర్నీ టైటిల్‌ను ఐదోసారి సొంతం చేసుకుంది. -స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

స్త్రీ శక్తి





తవణంపల్లి చేయూత మహిళా మార్ట్

మహిళా 'సూపర్' మార్ట్

చిత్తూరు యాసలో వినిపించే 'పుష్ప–2' డైలాగ్....
'పుష్ప అంటే నేషనల్ అనుకుంటివా... ఇంటర్నేషనల్' బాగా పేలింది.
చిత్తూరు జిల్లా తవణంపల్లె మహిళా మార్ట్‌కు కూడా ఈ డైలాగ్‌ను అన్వయించుకోవచ్చు.
'మా మహిళా మార్ట్ అంటే స్టేట్ అనుకుంటివా... ఇప్పుడు నేషనల్... రేపు ఇంటర్నేషనల్'
ఆనాటి వై.ఎస్.జగన్ ప్రభుత్వ ఆధ్వర్యంలో 'మారనున్న అక్కాచెల్లెమ్మల భవిత' నినాదంతో
పురుడు పోసుకున్న 'మహిళా మార్ట్'లు ఇంతై ఇంతింతై అన్నట్లుగా ఎదిగి పోయాయి.
కార్పొరేట్ సూపర్ మార్కెట్‌లతో సమానంగా సత్తా చాటుతున్నాయి.
తాజాగా... చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గంలోని తవణంపల్లె 'మహిళా మార్ట్' జాతీయస్థాయిలో పురస్కారం పొందింది.

చిన్న దుకాణాన్ని నడపడానికి కూడా ఎన్నోవిధాల ఆలోచించాల్సి ఉంటుంది. ఎంతో కొంత డబ్బు కావాల్సి ఉంటుంది. అలాంటిది కార్పొరేట్ మార్ట్‌లకు దీటుగా ఒక్క అడుగు వెనక్కి తగ్గకుండా సాధారణ మహిళల 'మహిళా మార్ట్'లు విజయం సాధించడం చాలా మందిని ఆశ్చర్యానికి గురి చేసింది. వ్యాపారంలో ఓనమాలు కూడా తెలియని వారు, భర్త ఆదాయంపైనే పూర్తిగా ఆధారపడే వారు, పల్లెకే పరిమితమైన వారు 'మహిళా మార్ట్'ల పుణ్యమా అని వ్యాపారంలో మెలకువలు తెలుసుకున్నారు. ఆర్థికంగా సొంత కాళ్ల మీద నిలబడే శక్తిని తెచ్చుకున్నారు. పల్లె దాటి ప్రపంచాన్ని చూస్తున్నారు.

'ఇది మా వ్యాపారం. మా టర్నోవర్ ఇంత...' అని గర్వంగా చెప్పుకునే స్థాయికి ఎదిగారు.

వై.ఎస్.జగన్ ప్రభుత్వంలో మండల సమాఖ్య ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యుల భాగస్వామ్యంతో రాష్ట్రంలోనే రెండో 'చేయూత మహిళా మార్ట్'ను తవణంపల్లెలో 2023 ఫిబ్రవరిలో ఏర్పాటు చేశారు. మండలంలోని 1,431 స్వయం సహాయక సంఘాల్లోని 14,889 మంది సభ్యుల వాటా ధనం రూ.26 లక్షలతో 'చేయూత మహిళా మార్ట్'(ప్రస్తుతం వెలుగు మహిళ మార్ట్‌గా పేరు మార్చారు)ను ప్రారంభించారు.

ఆర్థిక అవగాహన, పొదుపు, అప్పుల రికవరీలు, సిబిఎఫ్ చెల్లింపులు. స్త్రీనిధి, పారదర్శక నిర్వహణ, రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ద్వారా రైతులకు అందిస్తున్న సేవలతో తవణంపల్లె మహిళా మార్ట్ ముందంజలో ఉంది. మండల సమాఖ్య ద్వారా సభ్యుల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ మహిళా మార్ట్ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో, జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. హైదరాబాద్ యూసఫ్‌గూడలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ కార్యాలయంలో తవణంపల్లె మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రేఖ, కార్యదర్శి అనిత సర్టిఫికేట్, షీల్డు, ప్రోత్సాహక నగదు (రూ.75 వేలు) అందుకున్నారు.

'ఇది ఒకరిద్దరి విజయం కాదు. ఎంతోమంది మహిళల సామూహిక విజయం. ఎంతోమందికి స్ఫూర్తినిచ్చే విజయం' అంటున్నారు రేఖ, అనిత.

– తగీరు జగన్నాథం, సాక్షి, తవణంపల్లె, చిత్తూరు జిల్లా.

పారదర్శకత... మా బలం



'అన్నీ తెలిసిన వారు లేరు. ఏమీ తెలియని వారు లేరు' అనే సామెత ఉంది. ఏమీ తెలియకుండా ఎవరూ ఉండరు. మనకు తెలిసిన దాన్ని మరింత మెరుగుపరుచుకుంటే ఏదీ అసాధ్యంగా అనిపించదు. 'మహిళా మార్ట్' అనే బడిలో వ్యాపారంలో ఓనమాలు దిద్దుకున్నాం. ఎన్నో పాఠాలు నేర్చుకున్నాం. ఏ వ్యాపారానికి అయినా పారదర్శకత అనేది ముఖ్యం. ఆ పారదర్శకత వల్లే జాతీయ గుర్తింపు వచ్చింది. మహిళా సంఘాలు 'వెలుగు మహిళా మార్ట్'ను పారదర్శకంగా నిర్వహించడంతో జాతీయ పురస్కారం అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. గుర్తింపు అనేది ఉత్సాహాన్ని ఇవ్వడమే కాదు మరిన్ని విజయాలు సాధించడానికి అవసరమైన శక్తిని ఇస్తుంది.

– అనిత
మహిళా సమాఖ్య మండల కార్యదర్శి

ఆ నమ్మకమే ముందుకు నడిపిస్తుంది



వ్యాపారంలో ఫలానా మహిళ ఉన్నత స్థాయికి చేరింది... లాంటి ఎన్నో విజయగాథలను వినేవాళ్లం. అలాంటి ఒక స్థాయికి ఏదో ఒకరోజు చేరుకోగలమా అనిపించేది. 'మహిళా మార్ట్' ద్వారా మమ్మల్ని గొప్ప అవకాశం వెదుక్కుంటూ వచ్చింది. మాకు ధైర్యాన్ని ఇచ్చింది. ముందుకు నడిపించింది. 'మీ విజయ రహస్యం ఏమిటి?' అడిగే వాళ్లకు నేను చెప్పే జవాబు... 'నేను సాధించగలను' అనే నమ్మకం. ఆ నమ్మకానికి కష్టం, అంకితభావం తోడు కావాలి. తవణంపల్లెలోని వెలుగు మహిళా మార్ట్‌లో సభ్యులకు నాణ్యమైన వస్తువులు సరసమైన ధరలకు విక్రయిస్తున్నాం. బయట మార్కెట్ కంటే తక్కువ ధరలకు అన్నిరకాల వస్తువులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. డ్వాక్రా సభ్యులు మార్ట్‌లోని వస్తువులే కొంటున్నారు.

– రేఖ
మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు

● మన(సు)లో మాట

అది మీ భ్రమ..!

డాక్టర్ గారూ... మా ఊర్లో ఇటీవల థాట్ రీడింగ్ మెషీన్స్ వచ్చాయి. కొందరు వాటిని నా మీద ప్రయోగించి, నా వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఎన్నో విషయాలను తెలుసుకుని నన్ను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. దీనివల్ల బతికుండగానే నరకం అనుభవిస్తున్నాను. ఒకసారి ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేశాను. నేను ఈ బాధలు తట్టుకోలేక డైరెక్టుగా వారిని కలిసి అడిగితే, మాకేం తెలియదని బుకాయిస్తున్నారు. పోలీసులకు కంప్లైంట్ ఇచ్చాను. వారు దీన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఏం చేయాలో మీరైనా సలహా ఇవ్వగలరు.

– రఘురామ్, గుంతకల్లు

మీ మానసిక వేదన అర్థమైంది. ప్రపంచంలో ఇంతవరకు మీరు చెప్పిన లాంటి థాట్ రీడింగ్ మెషీన్ ఎక్కడా రాలేదు. అది జరగని విషయమే. కేవలం ఒక మెషిన్ ద్వారా ఒకరి ఆలోచనలను ఇంకొకరు తెలుసుకోగలిగితే, ప్రపంచంలో ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యేవి. అదేవిధంగా మరి కొన్ని కొత్త సమస్యలు కూడా పుట్టుకొచ్చి ఉండేవి. నిజంగా మీరు చెప్పిన మెషీన్లు గనక వస్తే, మనుషుల మధ్య స్పర్ధలు, అపోహలు, గొడవలే కాకుండా సమాజంలో కూడా అశాంతి, అలజడి చెలరేగే ప్రమాదం ఉంది. అలాంటి మెషీన్స్ కేవలం రచయితల కల్పనలే. అవి సినిమాలకు, నవలలకు మాత్రమే పరిమితం. కానీ వాస్తవం కానే కాదు. పారనాయిడ్ సైకోసిస్ అనే మానసిక వ్యాధికి గురైన వ్యక్తులు, ఒక్కోసారి ఇలాంటి భ్రమలు– భ్రాంతులకు లోనయ్యే అవకాశముంది. లేనివి ఉన్నట్లుగా భావించి, నిజమని నమ్మి, తాము మనోవేదనకు గురి కావడమే కాకుండా ఇతరులను కూడా ఇబ్బంది పెడతారు. ఎంత తార్కికంగా వీరికి నచ్చజెప్పచూసినా, వీరు ఆ మూఢ నమ్మకాలనుంచి బయట పడలేరు. ఇలాంటి భావనలను డెల్యూజన్స్ ఆఫ్ పర్‌సెక్యూషన్ అని అంటారు. ఎవరో వైర్‌లెస్ ద్వారా, కంప్యూటర్స్ ద్వారా తమ మైండ్‌ను కంట్రోల్ చేస్తున్నారనే కొందరి భావనలు కూడా ఈ కోవకు చెందినవే! మెదడులోని డోపమైన్ అనే ఒక ప్రత్యేక రసాయనిక పదార్థంలోని సమతుల్యతలో తేడాలొచ్చినప్పుడు కొందరికి ఇలాంటి భ్రమలు– భ్రాంతులు కలుగుతాయి. మీకు నేనిలా సలహా చెబుతున్నానని అన్యథా భావించక వెంటనే మీకు దగ్గరలోని సైకియాట్రిస్టును సంప్రదించి, మీకున్న ఈ ఇబ్బందికి తగిన చికిత్స తీసుకుంటే మీకొచ్చిన ఇలాంటి భ్రమలు, ఆలోచనలు పటాపంచలై మీరు వీటిలోనుంచి పూర్తిగా బయట పడి, మనశ్శాంతిగా ఉండగలరు. ఆల్ ది బెస్ట్!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com



కస్తూరి రాజమూర్తి

తల్లి కష్టాన్ని కూతురు మోసింది

రష్యాలో జరిగిన డబ్ల్యూపీపీఎల్ వరల్డ్ కప్ పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించి ప్రశంసలు అందుకుంటోంది కస్తూరి రాజమూర్తి. కస్తూరి కథ చాలామంది విజేతలతో పోల్చితే భిన్నమైనది. కస్తూరి తల్లి తిరువణ్ణామలై రైల్వేస్టేషన్‌లో పోర్టర్. తల్లి పెద్ద పెద్ద బ్యాగులు, సూటుకేసులు మోస్తుంటే ఆసక్తిగా చూసేది. తల్లికి సహాయంగా తాను కూడా చిన్న చిన్న బరువులు మోసేది. ఈ కష్టం ఊరకే పోలేదు. వెయిట్ లిఫ్టింగ్‌పై ఆసక్తి పెంచుకునేలా, పతకాలు గెలుచుకునేలా చేసింది.

'గెలుస్తాను అనుకోలేదు' అంటుంది కస్తూరి రష్యాలో వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం గెలుచుకోవడం గురించి. ఎందుకంటే ఆమెను ఓటమి కంటే గెలుపు పలకరించిన సందర్భాలే ఎక్కువ.

'పోటీలో బరువు ఎత్తబోతున్నప్పుడు మా అమ్మ రైల్వేస్టేషన్‌లో బ్యాగులు ఎత్తి నెత్తి మీద మోసే దృశ్యాన్ని గుర్తు చేసుకున్నాను. మా అమ్మే నాకు స్ఫూర్తి. మరిన్ని పతకాలు గెలుచుకోవాలనుకుంటున్నాను. ఎలాంటి కష్టాలు లేకుండా అమ్మను చూసుకోవాలనుకుంటున్నాను' అంటుంది కస్తూరి.

తిరువణ్ణామలై ప్రాంతంలోని చెయ్యార్ అనే చిన్న గ్రామంలో పుట్టి పెరిగిన కస్తూరి అనుకోకుండా వెయిట్ లిఫ్టింగ్‌పై ఆసక్తి పెంచుకుంది. కొత్తూర్‌పురంలో స్థానిక ఇన్‌స్ట్రక్టర్ల దగ్గర వెయిట్‌లిఫ్టింగ్‌లో శిక్షణ తీసుకుంది. ఇల్లు వదిలి వేరే ఊళ్లో శిక్షణ తీసుకోవడానికి తల్లిదండ్రులు మొదట ఒప్పుకోకపోయినా కస్తూరి పట్టుదల చూసి ఆ తరువాత ఒప్పుకోక తప్పింది కాదు.

కొత్తగా పరిచయం అయిన ఆట అయినప్పటికీ ఏడాదిలోపే జిల్లా పోటీలో 36 పతకాలు గెలుచుకుంది. వీసా కోసం దరఖాస్తు చేసుకోవడానికి డబ్బులు లేకపోవడంతో యూరప్‌లో పోటీ పడే అవకాశాన్ని కోల్పోయింది. ఇండియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ సహకారంతో రష్యాలోని నోవోసిబిర్క్స్ వరల్డ్‌కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలో పాల్గొంది. 75 కేజీల విభాగంలో డెడ్‌లిఫ్ట్ చేసింది.

తాజాగా.... ఒలింపిక్ వెయిట్‌లిఫ్టింగ్ ట్రెనింగ్ కోసం తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి కస్తూరికి ఫోన్ కాల్ వచ్చింది. అయితే ఈ కాల్ కస్తూరిని పెద్దగా సంతోష పరిచినట్లు లేదు.

'ముందు నాకు ఉద్యోగం కావాలి. మా కుటుంబం మొత్తం అమ్మపైనే ఆధారపడింది. నాన్న అనారోగ్యంగా ఉన్నారు. మా అక్కాచెల్లెళ్లు ఉద్యోగాల కోసం వెదుకుతున్నారు. నా కుటుంబం ఆర్థికంగా బాగుండి, సంతోషంగా ఉంటేనే నేను ఆటలపై బాగా దృష్టి కేంద్రీకరించగలుగుతాను' అంటోంది కస్తూరి రాజమూర్తి.

కొత్త దారి







అడవి ఒడిలో...

'నాకు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో డ్రైవర్ ఉద్యోగం వచ్చింది' అని మార్గరేట్ బారు తన సంతోషాన్ని ఇతరులతో పంచుకున్నప్పుడు అభినందనలు తెలియజేసిన వారికంటే ఆశ్చర్యపోయిన వారే ఎక్కువ.

'డ్రైవర్ ఉద్యోగం... అది కూడా అడవిలో... నువ్వు ఆడపిల్ల అనే విషయం మరిచావా' అన్నవారు కూడా ఉన్నారు. అయితే వారి ఆశ్చర్యాలు, అభ్యంతరాలేవీ మార్గరెట్ దారికి అడ్డుకాలేకపోయాయి.

ఒడిషాలోని దిబ్రుఘర్ అభయారణ్యంలోని తొలి మహిళా సఫారి డ్రైవర్‌గా ఎంతోమంది యువతులకు స్ఫూర్తిని ఇస్తోంది మార్గరెట్ బారు.

దిబ్రుఘర్ అభయారణ్యానికి సమీపంలోని క్రిస్టియనప్డా మార్గరెట్ బారు స్వగ్రామం. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మెట్రిక్యులేషన్ పాసైన తరువాత చదువు మానేయాల్సి వచ్చింది. అభయారణ్యంలో వివిధ ఉద్యోగాలలో మహిళల నియామకానికి అటవీశాఖ ప్రకటన మార్గరెట్‌కు ఆశాకిరణంలా తోచింది.

తన కుటుంబానికి ఆసరాగా ఉండడానికి ఏదో ఒక ఉద్యోగం తప్పనిసరిగా చేయాలనుకున్న మార్గరెట్ డ్రైవర్ ఉద్యోగానికి ఎంపికైంది.

అయితే సఫారీ డ్రైవర్ ఉద్యోగంలో చేరాలనుకున్నప్పుడు ఇతరుల నుంచే కాదు కుటుంబసభ్యుల నుంచి కూడా అభ్యంతరాలు, సందేహాలు ఎదురయ్యాయి.

అయినప్పటికీ మార్గరెట్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. డ్రైవింగ్, వెహికిల్ మెయింటెనెన్స్, జంగిల్ రోడ్లను నావిగేట్ చేయడంలో ప్రాక్టికల్ ఎక్స్‌పీరియన్స్‌తో ఆరునెలల కఠినమైన శిక్షణ తరువాత ఉద్యోగంలో చేరింది.

దిబ్రుఘర్ అభయారణ్యంలోని 13 మంది సఫారీ డ్రైవర్‌లలో ఏకైక మహిళ మార్గరెట్. అయితే ఎప్పుడూ అసౌకర్యంగా భావించలేదు. అభద్రతకు గురి కాలేదు.

రోజు ఉదయం ఆరు నుంచి మార్గరెట్ ఉద్యోగ జీవితం మొదలవుతుంది.

'అడవిలో రోడ్లు నాకు సహనాన్ని, ధైర్యాన్ని నేర్పాయి. ప్రతిరోజూ ఒక కొత్త సాహసం చేసినట్లుగా భావిస్తాను. ఈ ఉద్యోగం ద్వారా నా కుటుంబానికి అండగా ఉన్నందుకు గర్వంగా ఉంది' అంటుంది మార్గరెట్.



సంగీతతో మార్గరెట్

డ్రైవర్ ఉద్యోగం వల్ల మార్గరెట్ ఆర్థిక స్వాతంత్ర్యం సాధించడం ఒక కోణం అయితే, సంప్రదాయ ఉద్యోగాలకు అతీతంగా కొత్తదారిలో పయనించాలని కలలు కనే అమ్మాయిలకు రోల్‌మోడల్‌గా నిలవడం మరో కోణం.

మార్గరెట్‌లాగే మూసధోరణులకు భిన్నంగా ప్రయాణిస్తోంది సంగీత. ఒకప్పుడు ఆమె మార్గరెట్ రూమ్‌మేట్. 24 సంవత్సరాల సంగీత సీక్రా దిబ్రూఘర్‌లో మొదటి మహిళా ఎకో గైడ్.

'అడవిలో మీకు భయం వేయదా? ఇది రిస్క్ జాబ్... సిటీలో ఏదో ఒక ఉద్యోగం చేసుకోవచ్చు కదా... ఇలాంటి మాటలు ఎన్నో వింటుంటాను. అయితే అడవి అనేది అమ్మలాంటిది. అమ్మ ఒడిలో ఉన్నప్పుడు భయం ఎందుకు! నేను, నా స్నేహితురాలు ఇప్పుడు ఎంతోమందికి స్ఫూర్తి ఇవ్వడం సంతోషంగా ఉంది' అంటుంది సంగీత సీక్రా.



అమ్మకు సుస్తీ చేస్తే?

ఇంట్లో ఎవరికైనా సుస్తీ చేస్తే అమ్మ వారికి సేవలు చేసి కోలుకునేలా చేస్తుంది. మరి అమ్మకు సుస్తీ చేస్తే? వంట ఎవరు చేయాలి? బాక్స్ ఎవరు కట్టాలి? అంట్ల పరిస్థితి ఏమిటి? అనారోగ్యం వల్ల ఆమెకు చిరాకు కలిగితే ఎలా వ్యవహరించాలి? ఎవరికి సుస్తీ చేసినా అమ్మ ఆరోగ్యంగా ఉంటే ఏమీ కాదు. కానీ అమ్మకు సుస్తీ చేస్తే ఇంటికే సుస్తీ అవుతుంది. మరి మనకు అమ్మ పనులు ఎన్ని వచ్చు?

ఒక్క అమ్మ అందరి పనులూ చేస్తుంది. అందరూ కలిసి అమ్మ పనులు చేయలేరా?

ఇది చలికాలం. సుస్తీ చేసే కాలం. బద్ధకం కాలం. ఏ త్రోట్ ఇన్ఫెక్షనో, జ్వరమో, ఒళ్లు నొప్పులో, నీరసమో, ఏమీ చేయాలనిపించని నిర్లిప్తతో, ముసుగు తన్ని విశ్రాంతి తీసుకోవాలనే తలంపో ఒక రోజంతా అమ్మను మంచం కదలనివ్వకపోతే అమ్మ ఎన్ని పనులు చేస్తుందో ఇంట్లోని సభ్యులకు అర్థమవుతుంది. ఆ పనులన్నీ అమ్మ కోసం ఇంటి సభ్యులు చేయగలరా? చేయాలి.

ఎవరికి చిరాకు?

సాధారణంగా అమ్మకు అనారోగ్యం వస్తే నాన్నకు చిరాకుగా అనిపిస్తుంది. మరి నాన్న ఆఫీసుకు వెళ్లాలి. ఏవేవో పనులుంటాయి. టైముకు అన్నీ జరిగిపోవాలి. అమ్మ మంచం మీద ఉంటే అవి జరగవు. అప్పుడు నాన్నకు చిరాకు వేస్తుంది. 'లేచి పనుల్లో పడితే సుస్తీ అదే పోతుంది' అని ఎఫ్.ఆర్.సి.ఎస్ లెవల్‌లో సూచన కూడా చేస్తాడు. అమ్మకు బాగా లేకపోతే పిల్లలు నాన్నకు చెప్పాల్సిన మొదటి సంగతి– లీవ్ పెట్టు నాన్నా... రోజూ వెళ్లే ఆఫీసేగా అని. తనకు బాగా లేకపోతే భర్త కన్సర్న్‌తో లీవ్ పెట్టాడు అనే భావన అమ్మకు సగం స్వస్థత ఇస్తుంది. ఆ తర్వాత నాన్న అమ్మతో చెప్పాల్సిన మాట 'నేను చూసుకుంటాను. నువ్వు రెస్ట్ తీసుకో' అనే.

పనులు పంచుకోవాలి

కొన్ని ఇళ్లల్లో తల్లిదండ్రులు పిల్లలకు ఆపిల్ పండు తొక్క తీయడం కూడా నేర్పరు. అలాంటి ఇళ్లలో ఇంకా కష్టం కాని కొద్దో గొప్పో పనులు చేసే పిల్లలు ఉంటే తండ్రి, పిల్లలు కలిసి ఏ మాత్రం శషభిషలు లేకుండా పనులు పంచుకోవాలి. బ్రేక్‌ఫాస్ట్ ఏమిటి? బ్రెడ్‌తో లాగించవచ్చు. మధ్యాహ్నం ఏమిటి? అన్నం కుక్కర్‌లో పడేసి, ఏదైనా ఊరగాయ, బాయిల్డ్ ఎగ్ కట్టుకుని వెళ్లవచ్చా? ఇల్లు సర్దే బాధ్యత ఒకరిది. పనిమనిషి ఉంటే ఆమె చేత అంట్లు తోమించి, ఉతికిన బట్టలు మైనం చేసే బాధ్యత ఒకరిది. ఈ పనులన్నీ అమ్మ తప్ప ఇంట్లో అందరూ చేయకపోతే ఆ ఇంట్లో అనవసర కోపాలు వస్తాయి. అవి గృహశాంతిని పోగొడతాయి. అసలే ఆరోగ్యం బాగలేకుండా ఉన్న అమ్మను అవి మరీ బాధ పెడతాయి. ఆమే ఓపిక చేసుకుని లేచి పని చేస్తే ఆరోగ్యం మరింత క్షీణించి లేని సమస్యలు వస్తాయి.

అమ్మ పేరున మందు చీటి

ఏ ఇంటిలోనైనా అతి తక్కువ మందు చీటీలు ఉండేది అమ్మ పేరుతోనే. ఎందుకంటే సగం అనారోగ్యాలు ఆమె బయటకు చెప్పదు. ఒకవేళ చెప్పినా మెడికల్ షాప్ నుంచి తెచ్చి ఇవ్వడమే తప్ప హాస్పిటల్‌కు తీసుకువెళ్లడం తక్కువ. కాని అమ్మను కచ్చితంగా ఆస్పత్రికి తీసుకెళ్లాలి. డాక్టర్ సూచన ఆమెకు బలాన్ని ఇచ్చి లోపలి సందేహాలేవైనా ఉంటే పోగొడుతుంది. అమ్మ సరైన మందులతో తొందరగా కోలుకుంటుంది.

అమ్మతో సమయం

తనతో కాసింత సమయం గడపాలని అమ్మ కోరుకుంటుంది ఇలాంటప్పుడు. భర్త ఆమె దగ్గర కూచుని తీరిగ్గా కబుర్లు చెప్పొచ్చు. ఏవైనా జ్ఞాపకాలు నెమరు వేసుకోవచ్చు. మధ్య మధ్య ఆమెకు ఏదైనా సూప్ కాచి ఇచ్చి తోడుగా తనూ కాస్తంత తాగుతూ కూచుంటే అమ్మకు ఎందుకు బాగైపోదు..? పిల్లలు పాదాలు నొక్కుతూ కబుర్లు చెప్పొచ్చు. అమ్మ వర్కింగ్ విమన్ అయితే ఆఫీసుకు వెళ్లొద్దని ఇంకొన్నాళ్లు రెస్ట్ తీసుకోమని మారాం చేయొచ్చు. ఆ మారాం కూడా ఆమెకు మందే.

కొంత ఖర్చు చేయాలి

అమ్మకు అనారోగ్యం అయితే అమ్మ వద్దు వద్దంటున్నా కొంత ఖర్చు చేయాలి. మంచి పండ్లు తేవాలి. వంట చేయలేని పరిస్థితి ఉంటే మంచిచోట నుంచి భోజనం తెచ్చుకోవాలి. మంచి హాస్పిటల్‌లో చూపించాలి. మందులు పూర్తి కోర్సు కొని వాడేలా చూడాలి. డాక్టర్లు పరీక్షలు ఏవైనా రాస్తే ఏం అక్కర్లేదు అని ఎగ్గొట్టకూడదు. అమ్మ కోసం కుటుంబం మొత్తం ప్రేమగా, సహనంగా, ఒళ్లు వొంచి పని చేసే విధంగా ఏ ఇంట్లో ఉండగలరో ఆ ఇంట్లో అమ్మ ఆరోగ్యంగా తిరుగుతుంది. తొందరగా కోలుకుంటుంది.

బ్యూటిప్స్


చలికాలం .. మృదువుగా!

చలికాలం చర్మం పొడిబారి, జీవం కోల్పోయినట్టు కనపడుతుంది. ఇలాంటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కలిగి ఉండాలి. చర్మ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

- టీ స్పూన్ బాదం నూనె, అర టీ స్పూన్ తేనె కలిపి ముఖానికి, చేతులకు, పాదాలకు రాసి మసాజ్ చేయాలి. స్నానం చేసేముందు నాలుగు చుక్కల బాదం నూనె బకెట్ నీటిలో కలపాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే చర్మం మృదుత్వాన్ని సంతరించుకుంటుంది.
- అరటిపండు గుజ్జు, కప్పు పెరుగు, టేబుల్ స్పూన్ తేనె, టేబుల్ స్పూన్ ఓట్స్ కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మేనికి పట్టించి పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. దీంతో చర్మానికి జీవకళ వస్తుంది.



- స్నానం చేయడానికి అరగంట ముందు కొబ్బరి నూనె లేదా నువ్వుల నూనె మేనికి రాసుకోవాలి. మృదువుగా మర్దనా చేసి, గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయాలి.
- చలికాలం నూనె శాతం అధికంగా ఉన్న మాయిశ్చరైజర్లు వాడాలి. ఆలివ్ ఆయిల్, అలొవెరా జెల్ సమపాళ్లలో తీసుకొని అందులో కొద్దిగా వెనిలా ఎసెన్స్ కలపాలి. ఈ మిశ్రమాన్ని చలికాలం మాయిశ్చరైజర్‌గా ఉపయోగించవచ్చు.
- టీ స్పూన్ శనగపిండిలో అర టీ స్పూన్ తేనె, పచ్చిపాలు కలిపి ముఖానికి రాసుకోవాలి. అరగంట తర్వాత శుభ్రపరుచుకోవాలి. వారానికి రెండుసార్లు ఈ విధంగా చేస్తూ ఉంటే పొడిబారిన ముఖ చర్మం ముడతలు తగ్గుతాయి.
- చర్మం పొడిబారకుండా ఉండాలంటే మృతకణాలను తొలగిస్తూ ఉండాలి. అలాగని చర్మాన్ని మరీ రబ్ చేయకూడదు. కార్న్‌ఫ్లేక్స్‌ని పొడి చేసి, అందులో తేనె, పాలు కలిపి చర్మానికి పట్టించి, మర్దనా చేయాలి. మృతకణాలు తొలగిపోయి చర్మం మృదువుగా మారుతుంది.


'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 254

గురువారం 5-12-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మహిళా 'సూపర్' మార్ట్

వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన 'మహిళా మార్ట్'లు ఇంతై ఇంతింతై అన్నట్లుగా ఎదిగిపోయాయి. కార్పొరేట్ సూపర్ మార్కెట్‌లతో సమానంగా సత్తా చాటుతున్నాయి. తాజాగా చిత్తూరు జిల్లా తవణంపల్లె మహిళా మార్ట్ జాతీయ స్థాయిలో పురస్కారం పొందింది.

- ఫ్యామిలీలో



అడవి ఒడిలో..

ఒడిశాలోని అభయారణ్యంలో తొలి మహిళా సఫారీ డ్రైవర్‌గా రాణిస్తున్న మార్గరెట్ బారుపై కథనం.

ఫ్యామిలీలో ▸



తల్లి కష్టాన్ని కూతురు మోసింది

రష్యాలో జరిగిన వరల్డ్ కప్ పవర్ లిఫ్టింగ్ టోర్నీలో బంగారు పతకం సాధించిన కస్తూరి రాజమూర్తిపై ప్రత్యేక కథనం.

ఫ్యామిలీలో ▸



ఆటుపోట్ల మధ్య లాభాలు

భారీ ఆటుపోట్ల మధ్య వరుసగా నాలుగో రోజు మార్కెట్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ 111 పాయింట్లు బలపడి 80,956 వద్ద ముగిసింది.

వివరాలు 6లో ▸



ఎఫ్ఎంసీజీ.. ఆరోగ్య'మస్తు'!

ఆర్గానిక్ ప్రొడక్టులు, చిరు ధాన్యాలకు తోడు ఆరోగ్యకరమైన ఉత్పత్తుల పేరుతో ఫంక్షనల్ ఫుడ్స్‌పై ఎఫ్ఎంసీజీ కంపెనీలు ఫోకస్ చేస్తున్నాయి.

వివరాలు 6లో ▸

విద్యుత్ లోటు రాకూడదనే సెకీ ఒప్పందం

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని చెప్పిన ఏపీఈఆర్సీ

ఏపీలో డిమాండ్ ఉంటుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ స్పష్టీకరణ

సెకీ ఒప్పందానికి ఆమోదం తెలుపుతూ ఇవే విషయాలు ప్రస్తావించిన ఏపీఈఆర్సీ

- దీర్ఘకాలిక డిమాండ్‌కు అనుగుణంగా సెకీ విద్యుత్ తీసుకోవడం సమంజసమేనని వెల్లడి
- మిగులు విద్యుత్ ఉంటుందని ఈఆర్సీ చెప్పిందంటూ ఈనాడు పచ్చి అబద్ధాలు
- నిజానికి చంద్రబాబు హయాంలోనే మిగులు విద్యుత్.. అయినా అధిక ధరలకు సౌర, పవన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రోజురోజుకి విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. రానున్న రోజుల్లో ఈ డిమాండ్ మరింతగా పెరుగుతుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) కూడా స్పష్టంగా చెప్పింది. భవిష్యత్తులో విద్యుత్ లోటు రాకుండా, రైతులకు 25 ఏళ్లపాటు ఉచిత విద్యుత్ అందించే లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకుంది. అదీ అతి చవగ్గా. అంతర్రాష్ట్ర సరఫరా చార్జీలు కూడా లేకుండా 25 ఏళ్ల పాటు విద్యుత్ కొనుగోలు ఒప్పందం

వ్యవసాయానికి పగటి పూట 9 గంటలు నాణ్యమైన విద్యుత్ ఉచితంగా అందించాలనే సంకల్పంతో చేసుకున్న ఈ ఒప్పందం మేరకు సెకీ నుంచి రాష్ట్రానికి 2024-25లో 3 వేల మెగావాట్లు, 2025-26లో మరో 3 వేల మెగావాట్లు, 2026-27లో వెయ్యి మెగావాట్లు చొప్పున తీసుకుని దానిని రైతులకు అందించాలని గత ప్రభుత్వం భావించింది. అదే సమయంలో అంతర్రాష్ట్ర విద్యుత్ సరఫరా ఛార్జీల (ఐఎస్‌టీఎస్) భారం లేకుండా యూనిట్ రూ.2.49 చొప్పున విద్యుత్‌ను సరఫరా చేస్తామంటూ కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ పర్యవేక్షణలో ఏర్పాటైన ప్రభుత్వ రంగ సంస్థ సెకీ తనకు తానుగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన లేఖ పంపింది. దానిపై కమిటీ వేసి మరీ అధ్యయనం చేసిన తరువాత, ఏపీఈఆర్సీ అనుమతితో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా, ఏ ప్రభుత్వంలోనూ, ఏ ముఖ్యమంత్రి హయాంలోనూ ఎవరూ చేయని విధంగా కారు చౌకగా యూనిట్ కేవలం రూ.2.49కే కొనుగోలు చేసేందుకు అత్యంత పారదర్శకంగా ఒప్పందం కుదర్చుకుంది. కానీ ఈనాడు మాత్రం ఇంత మంచి ఒప్పందంపై విషం చిమ్ముతూనే ఉంది.

మిగతా 2వ పేజీలో ▶



ఆ కనులు.. ఇక పండువెన్నెల గనులు

పూర్తిగా దెబ్బతిన్న కన్నుకు స్టెమ్ సెల్ ప్లాంటేషన్ ద్వారా చూపు

- జపాన్‌లోని ఒసాకా వర్సిటీ పరిశోధనల్లో సక్సెస్
- ఇప్పటికే నలుగురికి ప్రయోగం
- మరిన్ని ప్రయోగాలు, లోతైన అధ్యయనం అనంతరం జన బాహుళ్యంలోకి..
- అమలైతే ఇక చీకటి రోజులకు చరమగీతమేనంటున్న శాస్త్రవేత్తలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: 'కళ్లు.. వెన్నెలను కురిపించే కన్నులు'.. అంటూ తెలుగు కవి వర్ణనలో వీటికి ప్రత్యేక స్థానం ఉంది. తెలుగు సినిమాలోనూ కళ్ల మీద వచ్చిన పాటలు ఎంతో హిట్ కొట్టాయి. 'వాలు కనుల దానా..' అంటూ అమ్మాయిని వర్ణించాలన్నా.. నీ కళ్లు చెబుతున్నాయి నను ప్రేమించావని.. కళ్లల్లోకి కళ్లుపెట్టి చూడవెందుకూ అంటూ ప్రేమికుల హృదయ గీతాన్ని ఆలపించాలన్నా.. చూపే బంగారమాయనే అంటూ ప్రేయసికి నాటుగా ప్రేమను వ్యక్తంచేయాలన్నా.. గేయ రచయితలు, కవులు మొదటగా దృష్టిసారించేది ఈ కళ్లనే. కంటిచూపుతో చంపేస్తా లాంటి పంచ్ డైలాగులకూ నేత్రాలే ఆధారం. అటువంటి కళ్లు దెబ్బతిని చూపు కోల్పోతే ఇక బతుకు అంధకారమే. అయితే, కంటిచూపు దెబ్బతింటున్న ప్రారంభ దశలో మాత్రం కేటరాక్ట్ ఆపరేషన్ ద్వారా కంటి చూపును మెరుగుపరిచే అవకాశం సులభంగా ఉంటోంది. కానీ, పూర్తిగా దెబ్బతిన్న సందర్భాల్లో ఆపరేషన్ ద్వారా కూడా చూపొచ్చే అవకాశమేలేదు. లేదా కళ్లని దానంచేసే వారి కోసం అన్వేషించాలి. ఈ నేపథ్యంలో.. స్టెమ్‌సెల్స్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా కార్నియా పూర్తిగా దెబ్బతిన్న సందర్భంలో కూడా కంటిచూపును తెప్పించే అవకాశం ఉందని జపాన్‌లోని ఒసాకా యూనివర్సిటీ పరిశోధకులు తేల్చారు. ఇప్పటివరకు ఈ విధంగా నలుగురి కంటి చూపు మెరుగైనప్పటికీ పరిశోధనలు మరింత లోతుగా జరిపి ఎలాంటి సమస్యలు రాకుండా

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

రూ.3.24 కోట్ల విలువైన ఎర్రచందనం పట్టివేత



మంగళగిరి: గుంటూరు జిల్లా కాజ టోల్‌గేట్ వద్ద మంగళగిరి రూరల్ పోలీసులు భారీగా ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా పేపర్ బండిళ్ల రవాణా చేస్తున్న లారీలో రూ.3.24 కోట్ల విలువైన 49 ఎర్రచందనం దుంగలను గుర్తించారు. లారీ డ్రైవర్ పరారయ్యాడని, లారీని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


నేటినుంచి విశాఖలో డీప్‌టెక్-2024 సదస్సు

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో నేటినుంచి 2 రోజుల పాటు డీప్‌టెక్, గవర్నమెంట్ టెక్నాలజీ ఇన్నోవేషన్ కాంక్లేవ్-2024 జరుగనుంది. తొలి రోజు స్టార్టప్స్, ఇన్నోవేటర్స్ డీప్‌టెక్, కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ తదితర అంశాలపై సమావేశాలు జరుగనున్నాయి. 6న సీఎం చంద్రబాబు హాజరుకానున్నారు. గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ ఆధ్వర్యంలో సదస్సు జరుగుతోంది. నీతిఆయోగ్, నాస్కామ్, ఎస్‌టీపీఐ, సీఐఐ, సీఎంఎస్, ఫెడరేషన్ ఆఫ్ ఏసియన్ బయోటెక్ అసోసియేషన్ తదితర సంస్థల ప్రతినిధులు హాజరవుతున్నారని జీఎఫ్ఎస్‌టీ ఏపీ చైర్మన్, మాజీ చీఫ్ సెక్రటరీ ఎస్‌పీ టక్కర్ తెలిపారు.

రెట్టింపైన ఈపీఎఫ్ఓ కార్పస్



ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్ఓ) వివిధ సాధనాల్లో పెట్టుబడులు పెట్టగా పెరిగిన కార్పస్ ఫండ్ గత 5 ఏళ్లలో రెట్టింపయింది. కార్పొరేట్ బాండ్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వంటి పెట్టుబడి సాధనాల్లోనూ, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) వంటి వాటిలోనూ ఈపీఎఫ్ఓ పెట్టుబడులు పెడుతోంది. ఇలా పెట్టిన మొత్తం ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.24.75 లక్షల కోట్లకు పెరిగింది. 2023–24లో ఈపీఎఫ్ఓ అత్యధికంగా 40.7 శాతం కార్పస్ ఫండ్‌ని రాష్ట్ర అభివృద్ధి రుణాల్లో పెట్టింది. ఆ తరవాత 16.3 శాతాన్ని కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీల్లో మదుపు చేసింది. ఈపీఎఫ్ఓలో క్రియాశీలకంగా ఉన్న వినియోగదారుల సంఖ్య గతేడాదితో పోలిస్తే 7.6 శాతం పెరిగి 7.37 కోట్లకు చేరింది.



ఆధారం : ఈపీఎఫ్ఓ

ఉపాధ్యాయుల్లో 'పీటీఎం' గుబులు

ఈ నెల 7న 45,099 పాఠశాలల్లో నిర్వహణకు ప్రణాళిక

- పిల్లల తల్లిదండ్రులకు ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు
- చందాలు పోగేసి భోజనం పెట్టాలన్న నిర్ణయం వెనక్కి
- ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్.. అయినా పీటీఎం హడావుడి
- ఈ నెల 9 నుంచి అర్ధ వార్షిక పరీక్షలు.. అటకెక్కిన బోధన
- ఇదేం ఖర్మని వాపోతున్న ఉపాధ్యాయులు

2 లో



కొత్త డయాఫ్రం వాల్ దిశగా...

ప్రధాన డ్యాం గ్యాప్-2లో దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌కు 6 మీటర్లు ఎగువన నిర్మించాలని నిర్ణయం

- కనిష్ఠంగా 10 మీటర్లు, గరిష్ఠంగా 93.5 మీటర్ల లోతు.. 1,396.6 మీటర్ల పొడవు
- మే నాటికే 89.09 మీటర్ల నుంచి 900 మీటర్ల మధ్య ఇసుక సాంద్రతను పెంచి, నేలను గట్టిపరిచారు
- అక్కడ మొదట పనులు చేపట్టాలని నిర్ణయం
- ఆ తర్వాత మిగిలిన 496.6 మీటర్ల పనులు..
- ఇందుకోసం గైడ్ వాల్స్ నిర్మిస్తున్న 'మేఘా'
- పోలవరంపై నిపుణుల కమిటీ సిఫారసు మేరకు కాంట్రాక్టు సంస్థ ముందుకు..



ధ్వంసమైన డయాఫ్రం వాల్‌ను పరిశీలిస్తున్న నిపుణుల కమిటీ (ఫైల్)

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు ప్రధాన (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యాం గ్యాప్-2లో 2016–19 మధ్య నాటి చంద్రబాబు ప్రభుత్వం చారిత్రక తప్పిదం వల్ల దెబ్బతిన్న డయాఫ్రం వాల్ స్థానంలో కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం దిశగా కాంట్రాక్టు సంస్థ మేఘా అడుగులు వేస్తోంది. అంతర్జాతీయ నిపుణుల కమిటీ సిఫారసు మేరకు దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌కు ఎగువన 6 మీటర్ల దూరంలో కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేసే పనులు ప్రారంభించింది. మే నాటికే వైబ్రో కాంపాక్షన్ ద్వారా ఇసుక సాంద్రతను పెంచి, నేలను గట్టిపరిచిన ప్రదేశంలో 89.09 నుంచి 900 మీటర్ల మధ్య తొలుత డయాఫ్రం వాల్ పనులను మేఘా తరపున జర్మనీకి చెందిన బావర్ సంస్థ చేపట్టనుంది. డయాఫ్రం వాల్ నిర్మాణానికి వీలుగా మీటరు లోతుతో రెండు గైడ్ వాల్స్‌ను సమాంతరంగా

మిగతా 2వ పేజీలో ▶



గోదారోళ్ల బ్రిడ్జికి 50 ఏళ్లండీ బాబు.. ఆయ్..!

ఉభయ గోదావరి జిల్లా ప్రజలను కలిపే ఆత్మీయ వారధిగా రాజమహేంద్రవరం రోడ్-కం-రైలు బ్రిడ్జి ఖ్యాతి గడించింది. రాజమహేంద్రవరం-కొవ్వూరు మధ్య నిర్మితమైన ఈ చారిత్రక వంతెన దిగ్విజయంగా 50 వసంతాలు పూర్తి చేసుకుంది. 1974 ఆగస్టు 16న అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ఈ వంతెనను జాతికి అంకితం చేశారు.

- సాక్షి, రాజమహేంద్రవరం

గోదారోళ్లు ఈ బ్రిడ్జిపై అమితమైన అభిమానం, ఆప్యాయత చూపుతారు. గోదావరి మధ్యలో నిర్మితమైన బ్రిడ్జి రాజమహేంద్రవరం వద్ద మలుపు తిరగడాన్ని అప్పటి ఇంజనీర్లు అద్భుతంగా డిజైన్ చేశారు. కింద రైలు.. పైన రోడ్డుపై వాహనాలు ప్రయాణించేలా రూపుదిద్దారు. ఈబ్రిడ్జిపై ప్రయాణించేవారు మధురానుభూతి పొందుతారు. రోడ్డుపై వాహనాల్లో ప్రయాణిస్తున్న సమయంలో వంతెన కొంతమేర కంపిస్తుంది. తొలిసారిగా ప్రయాణించేవారు వంతెన పడిపోతుందేమోనని భావిస్తారు. కానీ నిర్మాణం సమయంలోనే ఆ విధంగా డిజైన్ చేశారు. దేశంలోనే అతి పొడవైన రైల్-కమ్-రోడ్డు బ్రిడ్జిల్లో మూడోదిగా ఇది చరిత్ర పుటల్లో నిలిచింది. తొలి రెండు బ్రిడ్జిలు అసోంలోని బ్రహ్మపుత్ర నదిపై ఒకటి.. బిహార్‌లోని సోన్‌పూర్ వద్ద మరొకటి ఉన్నాయి. ఈ వంతెన రాజమహేంద్రవరం నగరానికి, ముఖ్యంగా రైలు, రోడ్డు ప్రయాణాన్ని సమర్థంగా అనుసంధానం చేస్తూ, వాణిజ్య, ఇతర రవాణా అవసరాలను తీర్చడంలో కీలక భూమిక పోషిస్తోంది.

నిర్మాణానికి బీజం ఇలా..

రోడ్-కమ్-రైలు వంతెన నిర్మాణం చేపట్టక ముందు గోదావరి జిల్లాల ప్రజలు లాంచీలపై ప్రయాణాలు చేసేవారు. రవాణా కష్టాలను అధిగమించే క్రమంలో 1964లో మూడో పంచవర్ష ప్రణాళికలో భాగంగా కొవ్వూరు-రాజమండ్రి మధ్య ఒక రైలు వంతెన నిర్మించాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు మార్గాన్ని సైతం అనుసంధానిస్తూ వంతెన నిర్మించాలనుకునే ప్రతిపాదన కేంద్రానికి పంపింది. ఆమోదం పొందిన అనంతరం జెసోప్ కంపెనీ నిర్మాణం ప్రారంభించింది. 1974 ఆగస్టులో ఈ వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 2.8 కిలోమీటర్ల మేర రైలు, 4.1 కిలో మీటర్లు వాహనాలు ప్రయాణించే విధంగా రూపొందించారు. అనంతరం కొవ్వూరు-రాజమండ్రి మధ్య షటిల్ బస్‌ల రాకపోకలు ప్రారంభించారు. నిత్యం పదివేలకు పైగా వాహనాలు వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. 60 ఏళ్ల సామర్థ్యంతో దీన్ని నిర్మించారు. వంతెన మనుగడ మరో 20 ఏళ్లు పెంచేందుకుగాను ఇటీవల బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. ద్విచక్ర వాహనాలు, కార్లు మాత్రమే ప్రయాణించేందుకు అనుమతిస్తున్నారు. భారీ వాహనాలు, బస్సులు గామన్ బ్రిడ్జి మీదుగా అనుమతిస్తున్నారు.

గొడ్డు చాకిరీ చేస్తున్నా.. బలి పశువులను చేస్తారా?


రాష్ట్రవ్యాప్తంగా 15,633 మంది సచివాలయ సిబ్బందికి నోటీసులు!

- వైఎస్సార్ జిల్లాలో 829 మంది హెచ్ఎంలకు షోకాజ్ నోటీసులు
- భగ్గుమంటున్న ఉద్యోగ సంఘాలు



సాక్షి ప్రతినిధి, గుంటూరు/కడప ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు నానాటికీ వేధింపులు అధికమవుతున్నాయి. విధులు సరిగా నిర్వహించడం లేదనే సాకుతో వేలాది మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. సచివాలయ సిబ్బందిని డిప్యూటేషన్‌పై వేరే చోట పని చేయించుకుంటూ జియో పంచ్ వేయలేదంటూ రాష్ట్రవ్యాప్తంగా 15,633 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయగా.. వైఎస్సార్‌జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు సంబంధించిన 829 మంది ప్రధానోపాధ్యాయులకు బుధవారం షోకాజ్ నోటీసులను జారీ చేయడం పలు విమర్శలకు దారితీస్తోంది. నవంబర్ ఒకటి నుంచి 13 వరకు అటెండెన్స్ వేయలేదని, సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలంటూ గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం రాష్ట్ర డైరెక్టర్ శివప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల వారీగా గుంటూరు 658, అనకాపల్లి 866, విజయనగరం 822, అల్లూరి సీతారామరాజు 798, ప్రకాశం 774, శ్రీకాకుళం 768, ఎన్‌టీఆర్ 707, ఏలూరు 694, కాకినాడ 678..

మిగతా 2వ పేజీలో ▶





విదేశీ విద్యార్థులు 72 వేలు

మనదేశంలో ఈ ఏడాది ఇప్పటివరకు చదువుతున్న విదేశీ విద్యార్థుల సంఖ్య 72,218. నిజానికి 2015–16లో 42వేలకు చేరిన ఈ సంఖ్య 2021లోగానీ 50వేలకు పెరగలేదు. కోవిడ్ కారణంగా మళ్లీ ఈ సంఖ్య తగ్గింది. విదేశీ విద్యార్థులను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం 2018లో స్టడీ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించింది. దాని ద్వారా గత రెండేళ్లలో విదేశీ విద్యార్థుల సంఖ్య స్వల్పంగా పెరిగింది.

కేంద్ర విద్యాశాఖ ప్రకారం విదేశీ విద్యార్థులు..

2014-15	34,774
2015-16	42,293
2016-17	47,575
2017-18	46,144
2018-19	47,427
2019-20	49,348
2023-24	64,000
2024-25	72,218

ఉపాధ్యాయుల్లో 'పీటీఎం' గుబులు

రాజకీయ వేదికలుగా మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశాలు



ఈ నెల 7న 45,099 పాఠశాలల్లో నిర్వహణకు ప్రణాళిక

- పిల్లల తల్లిదండ్రులకు ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు
- చందాలు పోగేసి భోజనం పెట్టాలన్న నిర్ణయం వెనక్కి
- ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్.. అయినా పీటీఎం హడావుడి
- ఈ నెల 9 నుంచి అర్ధ వార్షిక పరీక్షలు.. అటకెక్కిన బోధన
- ఇదేం ఖర్మని వాపోతున్న ఉపాధ్యాయులు

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం తలపెట్టిన మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశాలు (పీటీఎం) ఉపాధ్యాయుల్లో గుబులు రేపుతున్నాయి. ఎక్కడా ఏలోటూ రాకుండా నూరు శాతం తల్లిదండ్రుల హాజరు ఉండాలని ఒక పక్క.. స్థానిక రాజకీయ నాయకులను తప్పనిసరిగా ఆహ్వానించాలన్న ఆదేశాలు మరోపక్క టీచర్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గతంలో ఎన్నో పేరెంట్స్–టీచర్స్ సమావేశాలను విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు ఇప్పుడు మెగా పీటీఎం అంటే భయపడే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ఒత్తిడి, అధికారుల రోజువారీ సమావేశాలు, ఆదేశాలతో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. మరో పక్క ఈ నెల 9 నుంచి విద్యార్థులకు అర్ధ వార్షిక పరీక్షలు (సమ్మేటివ్-1) ఉండగా.. పీటీఎం పనుల్లో నిమగ్నమైన ఉపాధ్యాయులు ఇప్పటివరకు సిలబస్ పూర్తి చేయలేకపోయారు. ఈ పరిస్థితుల్లో ఫలితాలు తగ్గితే తమపై చర్యలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి గతనెల 14న మెగా పీటీఎం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించి, ఈ నెల 7వ తేదీకి వాయిదా వేసింది. రాష్ట్రంలోని 45,099 ప్రభుత్వ పాఠశాలల్లోనూ పేరెంట్స్– టీచర్స్ సమావేశాలు గొప్పగా నిర్వహించాలని, నిర్వహణకు టీచర్లు, తల్లిదండ్రులతో కమిటీలు వేయాలని సూచించింది. ఈ సమావేశాలపై ఉపాధ్యాయులకు ప్రతిరోజు జిల్లా కలెక్టర్లు, డీఈవోలు, ఇతర ఉన్నతాధికారుల రివ్యూలతో క్షణం తీరికలేకపోవడంతో రెండు వారాలుగా బడుల్లో బోధన అటకెక్కింది.

టార్గెట్లతో ఉక్కిరిబిక్కిరి

ప్రతి స్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రులు 100 శాతం హాజరయ్యేలా చూసే బాధ్యత ఉపాధ్యాయులపై పెట్టారు. అంతేగాక సమావేశాల నిర్వహణకు ప్రతి స్కూల్లో ఆహ్వాన కమిటీ నుంచి మీడియా కవరేజీ కమిటీ వరకు 13 కమిటీలు ఏర్పాటు చేయాలని, ఇందులో ఉపాధ్యాయులతో పాటు పిల్లల తల్లిదండ్రులు కూడా ఉండాలని సూచించారు. స్కూళ్లను సుందరంగా అలంకరించి తోరణాలు కట్టాలని, వచ్చే వారికి పూలతో ఆహ్వానం పలకాలనే నిబంధన విధించారు. పిల్లల తల్లులకు ముగ్గుల పోటీలు, తల్లిదండ్రులకు టగ్ ఆఫ్ వార్ ఆడించి బహుమతులు కూడా ఇవ్వాలని ఆదేశించారు. వీటితో పాటు ఇప్పటివరకు జరిగిన రెండు ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షల ఫలితాలతో హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు తల్లిదండ్రులకు ఇచ్చి, ఆయా సబ్జెక్టుల టీచర్లు వారికి విడిగా విద్యార్థుల ప్రగతిని వివరించాల్సి ఉంది. దీంతోపాటు మండలానికి 5 స్కూళ్లలో విద్యార్థుల హెల్త్ కార్డులను సైతం పంపిణీ చేయాలి. తర్వాత అందరు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, స్థానిక నాయకులతో బడిలో తీసుకోవాల్సిన మార్పులపై ప్రసంగాలు చేయాలి. అయితే, స్థానిక ప్రజాప్రతినిధుల్లో ఒక్కరినే ఆహ్వానించాలని ఆదేశించడంతో ఎవరిని పిలవాలో తెలియక ఉపాధ్యాయులు మథనపడుతున్నారు. ఒకరిని పిలిచి మరొకరిని పిలవకపోతే తమపై ఎలాంటి ఫిర్యాదులు చేస్తారోనని ఆందోళన చెందుతున్నారు. మరోపక్క ప్రస్తుత వ్యవసాయ పనుల సమయంలో సమావేశానికి పిలిచినా తల్లిదండ్రులు వచ్చే అవకాశం లేదని.. మరి నూరు శాతం హాజరు ఎలా చూపాలని వాపోతున్నారు.

విందుపై వెనక్కి తగ్గిన సర్కారు

మెగా పీటీఎం నిర్వహణ ఏర్పాట్లకు రాష్ట్ర సమగ్ర శిక్ష నుంచి రూ.9.06 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. బడిలో 10 మంది విద్యార్థులుంటే రూ.1,000, 25 మంది ఉంటే రూ.1,200, 2 వేల మంది ఉంటే రూ.13 వేలు, అంతకంటే ఎక్కువ ఉంటే రూ.14 వేల చొప్పున బడ్జెట్ కేటాయించింది. ఈ మొత్తం నిధులతోనే షామియానా, మైక్సెట్లు, అలంకరణ, బొకేలు తదితర సామగ్రి సమకూర్చాలి. ఈ డబ్బుతోనే తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వాలి. దీంతోపాటు మధ్యాహ్నం పిల్లలతోపాటు తల్లిదండ్రులకు, అతిథులకు విందు భోజనం పెట్టాలని, నిధులను ఉపాధ్యాయులు స్థానికంగా దాతల నుంచి చందాలు తీసుకోవాలని సూచించారు. అయితే, ఏ మూలకూ సరిపోని అరకొర బడ్జెట్తో సమావేశాలు నిర్వహించడం కష్టమని, భోజనం ఏర్పాట్లు తమవల్ల కాదని ఉపాధ్యాయులు తెగేసి చెప్పారు. దీంతో విందును మధ్యాహ్న భోజనం నుంచి ఏర్పాటు చేస్తామని అధికారులు తాజాగా హామీ ఇచ్చారు. బోధన పక్కనపెట్టి అపార్ నమోదులో నిమగ్నమైన ఉపాధ్యాయులు ఇప్పుడు మెగా పీటీఎం ఏర్పాట్లపై ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్సులతో బిజీగా మారారు. పీటీఎం పూర్తయ్యే వరకు ప్రతిరోజు ఏర్పాట్లపై జిల్లా స్థాయి అధికారులకు సమాచారం అందించాలి. కూటమి సర్కారు గొప్ప కోసం చేపట్టిన మెగా పీటీఎం ఇప్పుడు విద్యార్థుల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

ఎన్నికల కోడ్ ఉన్నా 'పీటీఎం' హడావుడి

ప్రస్తుతం ఉభయ గోదావరి జిల్లాల్లో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఈ కారణంతోనే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల వేడుకకు ఆ జిల్లాల టీచర్లను ఆహ్వానించకపోగా అవార్డులను సైతం ప్రదానం చేయలేదు. అలాంటిది రాజకీయ రంగు పులుముకున్న మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశాలు ఈనెల 7న ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎలా నిర్వహిస్తారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పైగా ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు సైతం పాల్గొంటారు. టీచర్లకు అవార్డులు ప్రదానం చేసేందుకు అడ్డొచ్చిన కోడ్ ఈ సమావేశాలకు వర్తించదా అని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

క్లుప్తంగా...

19 రైళ్లలో అదనపు జనరల్ బోగీలు

సాక్షి, అమరావతి: దక్షిణ మధ్య రైల్వే 19 రైళ్లకు అదనపు జనరల్ బోగీలను కేటాయించింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన రైళ్లలో వీటిని ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు ఇటీవల నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 19 రైళ్లలో 66 అదనపు జనరల్ బోగీలను ఏర్పాటు చేసినట్టు బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. త్వరలో మరో 21 రైళ్లలో 80 అదనపు బోగీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు పేర్కొంది.

జూనియర్ వైద్యుల గౌరవ వేతనాలు పెంపు

సాక్షి, అమరావతి: జూనియర్ వైద్యుల గౌరవ వేతనాలు 15 శాతం మేర పెంచుతూ వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులిచ్చారు. పెంచిన వేతనాలు ఈ ఏడాది జనవరి నుంచి వర్తిస్తాయి. రెసిడెంట్ స్పెషలిస్ట్లకు రూ.70 వేల నుంచి రూ.80,500, రెసిడెంట్ డెంటిస్ట్లకు రూ.65 వేల నుంచి రూ.74,750, రెసిడెంట్ సూపర్ స్పెషలిస్ట్లకు రూ.85 వేల నుంచి రూ.97,750కు పెంచినట్టు వెల్లడించారు.

10, 11 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

సాక్షి, అమరావతి: అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయిన నేపథ్యంలో 10, 11 తేదీల్లో సచివాలయంలో కలెక్టర్ల సదస్సు నిర్వహించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. వచ్చే ఆరు నెలల్లో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్లకు సీఎం దిశా నిర్దేశం చేయనున్నారని అధికార వర్గాలు తెలిపాయి.

గ్రామ సచివాలయాల శాఖ కోసం సీనియర్ కన్సల్టెంట్

- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల శాఖకు సీనియర్ కన్సల్టెంట్ నియామకానికి ప్రభుత్వం అనుమతి తెలిపింది. ఈ పోస్టులో నియమితులయ్యే వారికి నెలకు రూ.2 లక్షల వేతనం చొప్పున మొదట ఏడాది కాలానికి అనుమతి ఇస్తూ గ్రామ వార్డు సచివాలచయ శాఖ కార్యదర్శి సురేశ్ కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

16న రీజనల్ డిఫెన్స్ ఎంఎస్ఎంఈ సదస్సు

సాక్షి, విశాఖపట్నం: రక్షణ రంగంలో ఎంఎస్ఎంఈలు, స్టార్టప్ల భాగస్వామ్యాన్ని మరింత ప్రోత్సహించేందుకు సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్, భారత పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో 16న విశాఖ వేదికగా డిఫెన్స్ ఎంఎస్ఎంఈ సదస్సు జరగనుంది. రక్షణ రంగంలో భాగస్వాములుగా ఉన్న ఎంఎస్ఎంఈలు, స్టార్టప్ సంస్థల ప్రతినిధులు సదస్సుకు హాజరు కానున్నారు. ఎంఎస్ఎంఈలు డిఫెన్స్ టెక్ ఎక్స్పో కూడా జరగనుంది.

'పుష్ప-2' టికెట్ ధర పెంపుపై పిల్

సాక్షి, అమరావతి: పుష్ప–2 సినిమా టికెట్ల ధరలను పెంచుకునేందుకు నిర్మాతలకు వీలు కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైంది. నెల్లూరు జిల్లాకు చెందిన వెంకటేశ్వర్లు దాఖలు చేసిన ఈ పిల్పై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. భారీ బడ్జెట్ సినిమాల టికెట్ ధరల పెంపును మొదటి పది రోజులకే పరిమితం చేస్తూ గతంలో ఓ సినిమా విషయంలో ఉత్తర్వులిచ్చామని ధర్మాసనం గుర్తు చేసింది. ప్రీమియం షోలకు టికెట్ ధరలను ఎక్కువగా ఉన్నాయనుకుంటే, సినిమాకు వెళ్లకూడదని పిటిషనర్కు ధర్మాసనం తేల్చి చెప్పింది.

విద్యుత్ లోటు రాకూడదనే సెకీ ఒప్పందం

▶ మొదటి పేజీ తరువాయి

చేసుకుంది. సెకీతో 17,000 మిలియన్ యూనిట్ల (7వేల మెగావాట్లు) విద్యుత్ కొనుగోలుకు కుదుర్చుకున్న ఈ ఒప్పందంపై ఇప్పటికే అనేక విధాలుగా వాస్తవాలను ప్రజల ముందు ఉంచినప్పటికీ, టీడీపీ, దాని అనుబంధ పత్రిక ఈనాడు చేస్తున్న దుష్ప్రచారం కొనసాగుతూనే ఉంది. మిగులు విద్యుత్ ఉన్నందున రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు సెకీ విద్యుత్ను తీసుకోలేవంటూ అర్థం లేని ఆరోపణలతో మంగళవారం మరో తప్పుడు కథనాన్ని వండి వార్చింది. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) రానున్న సంవత్సరాల్లో మిగులు విద్యుత్ను అంచనా వేసిందంటూ ఓ పట్టికను అందులో ప్రచురించింది. వాస్తవానికి సెకీతో ఒప్పందానికి ఏపీఈఆర్సీ సైతం ఆమోదం తెలిపింది. ఆ సందర్భంలో 2019 ఏప్రిల్ 15న ఆమోదించిన 4వ నియంత్రణ వ్యవధి (2019-20 నుంచి 2023-2024), 5 వ నియంత్రణ వ్యవధి ((2024-25 నుంచి 2028-29) కోసం విద్యుత్ డిమాండ్ అంచనాలు, వనరుల ప్రణాళికల ఆధారంగా సెకీ ఒప్పందం ఉందని చెప్పింది. అదే విధంగా 2019 ఆగస్టులో కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) విడుదల చేసిన దీర్ఘకాలిక విద్యుత్ డిమాండ్ అంచనాకు అనుగుణంగా కూడా సెకీ నుంచి విద్యుత్ తీసుకోవడం సమంజసమేనని ఏపీఈఆర్సీ స్పష్టం చేసింది. ఈ వాస్తవాలే ఈనాడు కథనం సుద్ద అబద్ధమని తేల్చిచెబుతున్నాయి.

ఏపీఈఆర్సీ ఆమోదించిన విద్యుత్ డిమాండ్ ప్రణాళిక, లోటు అంచనా (మి.యూనిట్లలో)

ఆర్థిక సంవత్సరం	లభ్యత	అవసరం	లోటు
2022-23	80,204	83,152	2,948
2023-24	80,658	90,033	9,375
2024-25	80,570	97,707	17,137
2025-26	80,521	1,06,247	25,726
2026-27	80,446	1,16,046	35,600
2027-28	80,439	1,27,141	46,702
2028-29	80,436	1,39,665	59,229

సీఈఏ అంచనా ప్రకారం రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ వివరాలు (మి.యూనిట్లలో)

సంవత్సరం	డిమాండ్
2024	87,801
2025	93,825
2026	1,00,169
2027	1,06,836
2028	1,13,830
2029	1,21,156

ఈ అంచనాలను చూస్తే రాష్ట్రంలో విద్యుత్ లోటు ఉంటుందని ఎవరికైనా స్పష్టంగా అర్థమవుతుంది. దీనిని పరిగణనలోకి తీసుకుని గత ప్రభుత్వం సెకీతో ఒప్పందాన్ని చేసుకోగా దానిని ఏపీఈఆర్సీ ఆమోదించింది.

చంద్రబాబు తప్పు చేసినా ఈనాడుకి పట్టదు

చంద్రబాబు 2014లో అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో విద్యుత్ లోటు ఉందని, దానిని అధిగమించి, విద్యుత్ మిగులు రాష్ట్రంగా చంద్రబాబు మార్చారని ఈనాడు రాసుకొచ్చింది. కానీ ఇది పచ్చి అబద్ధం. 2014 జూన్ 2 రాష్ట్ర విభజన జరిగింది. ఆ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్కు 17,731 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి స్థాపిత సామర్థ్యం ఉంది. అందులో 12,190 మెగావాట్లు థర్మల్, 275.78 మెగావాట్లు అణు విద్యుత్ కాగా మిగిలినది పునరుత్పాదక విద్యుత్. కానీ 2014 జూన్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రెండింటి మొత్తం గరిష్ట డిమాండ్ 13,404 మెగావాట్లు మాత్రమే. ఈ లెక్కన టీడీపీ అధికారంలోని వచ్చే నాటికి ఏపీలో మిగులు విద్యుత్ అందుబాటులో ఉంది. అయినా టీడీపీ ప్రభుత్వం అధిక ధరలకు సౌర, పవన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏలు) కుదుర్చుకుంది. పీపీఏలు చేసుకోవాలంటే విద్యుత్ లోటు ఉండాలనే మాటకు ఈనాడు కట్టుబడి ఉంటే గనుక 2016–17 సంవత్సరానికి ఏపీఈఆర్సీ ఆమోదించిన విద్యుత్ లభ్యత 67,277 మిలియన్ యూనిట్లు, ఆ ఏడాది విద్యుత్ అవసరం 56,804.66 మిలియన్ యూనిట్లు. అంటే 10,472.66 మిలియన్ యూనిట్లు మిగులు విద్యుత్ ఉంది. అలాంటప్పుడు 2,400 మెగావాట్ల సౌర విద్యుత్, 3,500 మెగావాట్ల పవన విద్యుత్ కొనుగోళ్లకు చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు పీపీఏలు కుదుర్చుకుంది? అది ఈనాడుకు తప్పుగా, ఆశ్చర్యంగానూ ఎందుకు కనిపించడం లేదు అని విద్యుత్ రంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

గొడ్డు చాకిరీ చేస్తున్నా.. బలి పశువులను చేస్తారా?

▶ మొదటి పేజీ తరువాయి

కృష్ణా 666, పార్వతీపురం మన్యం 655, తిరుపతి 636, పశ్చిమగోదావరి 630, బాపట్ల 613, కర్నూలు 613, చిత్తూరు 606, శ్రీసత్యసాయి 580, అనంతపురం 562, విశాఖపట్నం 517, నంద్యాల 490, పల్నాడు 429, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు 427, తూర్పుగోదావరి 398, బీఆర్ అంబేద్కర్ కోనసీమ 365, అన్నమయ్య 352, వైఎస్సార్ 329 మందికి నోటీసులు జారీ అయ్యాయి. కాగా భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలు ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి.

829 మంది హెచ్ఎంలకూ..

వైఎస్సార్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన అపార్ నమోదు కోసం ఎడ్యుకేషన్ ప్రొఫైల్ (ఈపీ), జనరల్ ప్రొఫైల్ (జీపీ)ల వివరాల నమోదులో విషయంలో కొంతమంది హెచ్ఎంలు పనితీరు సరిగా లేదని విద్యాశాఖాధికారి మీనాక్షి 829 మంది ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఈ నోటీసులకు సంబంధించి మూడు రోజుల్లో సమాధానం చెప్పాలని అందులో పేర్కొన్నారు. లేకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఒకేసారి ఇంతమందికి నోటీసులు ఎలా ఇస్తారు?

జిల్లాలో అపార్ నమోదు సరిగా చేయలేదని ఒకేసారి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 829 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై ఎమ్మెల్సీ రాంగోపాల్రెడ్డి డీఈఓ కార్యాలయ అధికారులను ప్రశ్నించారు. ఇచ్చిన నోటీసులను వెనక్కు తీసుకోవాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు.

7న మెగా పేరెంట్-టీచర్ మీట్

- రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 45,094 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఈ నెల 7న మెగా పేరెంట్-టీచర్ మీట్ను నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. తల్లిదండ్రుల సహకారం, భాగస్వామ్యంతో పాఠశాలలను అభివృద్ధి చేస్తామన్నారు. బాపట్ల మున్సిపల్ హై స్కూల్లో జరిగే కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ హాజరవుతారని చెప్పారు. ప్రతి పాఠశాలకు స్టార్ రేటింగ్ ఇవ్వనున్నట్లు వివరించారు. సాధారణ ప్రోగ్రెస్ కార్డుల స్థానంలో వినూత్నంగా రూపొందించిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులతో తల్లిదండ్రులకు వివరిస్తామన్నారు. తల్లిదండ్రుల అభిప్రాయాలు, సూచనలను సేకరించేందుకు ఓపెన్ హౌస్ సెషన్ను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్య కార్డులను పంపిణీ చేస్తామన్నారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు, ఎస్పీడీ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆ కనులు.. ఇక పండువెన్నెల గనులు

▶ మొదటి పేజీ తరువాయి

స్టెమ్సెల్ ట్రాన్స్ప్లాంటేషన్ను జనబాహుళ్యంలోకి తెచ్చే అవకాశం తొందర్లోనే ఉందన్న విశ్వాసాన్ని వ్యక్తంచేస్తున్నారు. కంటిచూపు కోల్పోయి చీకటితో సావాసం చేస్తున్న ఇలాంటి వారందరి జీవితాల్లో వెలుగులు నింపేలా.. వారందరి కళ్లల్లో ఆనందంచూసే రోజు తొందర్లోనే ఉందన్న భరోసాను కల్పిస్తున్నారు.

స్టెమ్సెల్ ట్రాన్స్ప్లాంటేషన్ అంటే..

దెబ్బతిన్న మూలకణాల స్థానంలో ఆరోగ్యకరమైన మూలకణాలను భర్తీచేయడాన్ని స్టెమ్సెల్ ట్రాన్స్ప్లాంటేషన్ అంటారు. రేడియోధార్మికత/అధిక మోతాదులో కీమోథెరపీతో చికిత్స చేయడం ద్వారా ఈ ప్రక్రియను చేపడతారు. స్టెమ్సెల్స్ ప్లాంటేషన్లో సొంతంగా చికిత్స చేస్తున్న వ్యక్తి నుంచి లేదా దాతల నుంచి కూడా మూలకణాలను సేకరించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం దీనిని బోన్మ్యారో ట్రాన్స్ప్లాంటేషన్, కేన్సర్ చికిత్స, గుండె, న్యూరో సంబంధ చికిత్సలలో విరివిగా వినియోగిస్తున్నారు. ఈ సెల్స్ తమలాంటి మరిన్ని సెల్స్ను తయారుచేసుకోగలుగుతాయి. శరీరంలోని దాదాపు అన్ని కణజాలాల్లో స్టెమ్సెల్స్ ఉంటాయి. కొత్త సెల్స్ను ఉత్పత్తిచేసే సహజ సామర్థ్యం శరీరంలోని ఏ ఇతర కణానికీలేదు. అయితే, స్టెమ్ సెల్స్ థెరపీలో ప్రధానంగా ఫంగల్, బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్స్ వచ్చే అవకాశం ఉంటుంది. అయినప్పటికీ బ్లడ్ కేన్సర్ వంటి చికిత్సల్లో స్టెమ్ సెల్స్ థెరపీ సక్సెస్ రేటు 60–70 శాతం ఉంటోంది. ఇతర చికిత్సల్లో దీని సక్సెస్ రేటు 80 % వరకూ ఉంటోందని పరిశోధనలు చెబుతున్నాయి.



నలుగురి 'కళ్లల్లో' ఆనందం..

వాస్తవానికి.. స్టెమ్సెల్ ట్రాన్స్ప్లాంటేషన్ వ్యవహారం ఐదేళ్ల క్రితమే అమెరికాలో దుమారం రేపింది. వయసుతో పాటు వచ్చే కంటి సమస్య.. ఏఎండీ (ఏజ్ రిలేటెడ్ మ్యాకులర్ డీ జనరేషన్), కంటి వెనుక వచ్చే, టిష్యూ లేయర్కు వచ్చే రెటీనిస్ పిగ్మెంటోసా (ఆర్పీ) వంటి సమస్యలకు స్టెమ్సెల్ థెరపీ అంటూ అమెరికాలో కొన్ని క్లినిక్స్ అనధికారికంగా ఆపరేషన్లు నిర్వహించాయి. అయితే, ఇవి కాస్తా కంటిచూపు తేలేకపోవడంతో పాటు పలు ఫిర్యాదులు రావడంతో ఎఫ్డీఏ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ప్రస్తుతం ఒసాకా యూనివర్సిటీ పరిశోధనలు మెరుగ్గా సాగి.. పూర్తిస్థాయిలో అనుమతుల వరకూ ప్రక్రియ కొనసాగుతోంది. కార్నియా పూర్తిగా దెబ్బతిన్నాక ఏ తరహా ఆపరేషన్ చేసినా ఇక కంటిచూపు ఉండదనే తరుణంలో స్టెమ్సెల్ ట్రాన్స్ప్లాంట్ ద్వారా చూపు తెప్పించవచ్చని ఒసాకా వర్సిటీ పరిశోధకులు తేల్చారు. బ్లడ్సెల్స్ను కార్నియల్ సెల్స్గా మార్చి దెబ్బతిన్న కార్నియా ప్రదేశంలో ఉంచడం ద్వారా కంటిచూపును తేవొచ్చని నిరూపించారు. ఈ విధంగా గత ఏడాది మొత్తం నలుగురి కంటి చూపులో మెరుగైన ఫలితాలొచ్చాయని తెలుస్తోంది. అయితే, మరింత లోతైన అధ్యయనం అవసరమని పరిశోధకులు చెబుతున్నారు.

కొత్త డయాఫ్రం వాల్ దిశగా...

ప్రధాన డ్యాం గ్యాప్-2లో దెబ్బతిన్న డయాఫ్రం వాల్కు 6 మీటర్లు ఎగువన నిర్మించాలని నిర్ణయం

▶ మొదటి పేజీ తరువాయి

నిర్మిస్తోంది. రెండు గైడ్ వాల్స్ మధ్య 1.5 మీటర్ల వెడల్పుతో ఖాళీ ప్రదేశాన్ని ఉంచింది. గైడ్ వాల్స్కు ఇరువైపులా బంకమట్టి, రాళ్లు, మట్టితో ప్లాట్ఫామ్ను సిద్ధం చేస్తోంది. ఇసుక సాంద్రతను పెంచి, నేలను గట్టిపరిచాక మిగతా... అంటే 900 నుంచి 1,485.69 మీటర్ల మధ్య డయాఫ్రం వాల్ పనులు చేపట్టనుంది. గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంను గత ప్రభుత్వం పూర్తి చేసిన నేపథ్యంలో వరదల్లోనూ డయాఫ్రం వాల్ పనులను నిర్విఘ్నంగా కొనసాగించి, సత్వరమే పూర్తి చేయడానికి మార్గం సుగమమైందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం ఇలా...

- ప్రధాన డ్యాం గ్యాప్–2లో 89.09 మీటర్ల నుంచి 1,485.69 మీటర్ల మధ్య 1,396.6 మీటర్ల పొడవు, 1.5 మీటర్ల వెడల్పు.. కనిష్ఠంగా 6 మీటర్లు, గరిష్ఠంగా 93.5 మీటర్ల లోతున ప్లాస్టిక్ కాంక్రీట్తో కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలి.
- కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం కోసం గైడ్ వాల్స్పై ఏర్పాటుచేసే ప్లాట్ఫామ్ మీద నుంచి గ్రాబర్లు, కట్టర్లతో రాతి పొర తగిలే వరకూ భూగర్భాన్ని తవ్వుతూ ప్యానళ్లను దించుతూపోతారు. తవ్వి తీసిన మట్టి స్థానంలో బెంటనైట్ మిశ్రమాన్ని నింపుతారు. రాతి పొర తగిలాక... అధిక ఒత్తిడితో కాంక్రీట్ మిశ్రమాన్ని పంపుతారు. అప్పుడు బెంటనైట్ మిశ్రమం బయటకు వస్తుంది. కాంక్రీట్ మిశ్రమంతో కొంత బెంటనైట్ మిశ్రమం కలిసి ప్లాస్టిక్ కాంక్రీట్గా మారి గోడలా తయారవుతుంది. అదే డయాఫ్రం వాల్.
- డయాఫ్రం వాల్కు లీకేజీ(సీపేజీ) పర్మియబులిటీ(తీవ్రత) ఒక లీజీయన్ లోపు ఉండాలి (పర్మియబులిటీని లీజీయన్లలో కొలుస్తారు). అప్పుడే ఆ డయాఫ్రం వాల్ నాణ్యంగా ఉన్నట్లు లెక్క. ప్రధాన గ్యాప్–1లో గత ప్రభుత్వం నిర్మించిన డయాఫ్రం వాల్లో లీకేజీ పర్మియబులిటీ ఒక లీజీయన్ లోపే ఉండటం గమనార్హం.

చంద్రబాబు విధ్వంసం వల్లే జాప్యం...

- పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో తొలుత గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించేలా అప్రోచ్ ఛానల్, స్పిల్ వే, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్ను పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలను నిర్మించాలి.
- వరద ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించాక.. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల మధ్య ప్రధాన డ్యాం నిర్మాణాన్ని చేపట్టాలి. ప్రపంచంలో ఎక్కడైనా ఇదే పద్ధతిలో ప్రాజెక్టును నిర్మిస్తారు.
- బాబు ప్రభుత్వం మాత్రం 2016-17, 2017-18లలో వరద మళ్లించే పనులను పూర్తి చేయకుండానే ప్రధాన డ్యాం గ్యాప్–2లో 1,396.6 మీటర్ల పొడవునా డయాఫ్రం వాల్ను నిర్మించింది.
- 2017, 2018 గోదావరి వరద ప్రవాహం డయాఫ్రం వాల్ మీదుగా ప్రవహించడంతో కోతకు గురై దెబ్బతిందని అంతర్జాతీయ నిపుణుల కమిటీ తేల్చింది.
- డయాఫ్రం వాల్ పూర్తయిన తర్వాత ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల పనులు ప్రారంభించి, నిర్వాసితులకు పునరావాసం కల్పించలేక... వాటికి ఇరు వైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేసి 2019 ఫిబ్రవరిలో చంద్రబాబు ప్రభుత్వం చేతులెత్తేసింది. దాంతో 2019లో గోదావరి ప్రవాహం కాఫర్ డ్యాంల ఖాళీ ప్రదేశాల గూండా అధిక ఉద్ధృతితో ప్రవహించడంతో ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంతం కోతకు గురై విధ్వంసం చోటుచేసుకుంది. ఆ చారిత్రక తప్పిదం వల్ల డయాఫ్రం వాల్ 693 మీటర్ల పొడవున దెబ్బతిందని నిపుణుల కమిటీ తేల్చింది. ప్రాజెక్టు భద్రత దృష్ట్యా కొత్త డయాఫ్రం వాల్ నిర్మించడమే శ్రేయస్కరమని స్పష్టం చేసింది.
- చంద్రబాబు ప్రభుత్వం ఆ చారిత్రక తప్పిదానికి పాల్పడకపోయి ఉంటే 2022 నాటికే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేదని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

వైఎస్ జగన్ హయాంలో ప్రణాళికాబద్ధంగా.. శరవేగంగా..

రాష్ట్రంలో 2019, మే 30న ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించాక.. చంద్రబాబు తప్పిదాలను సరిదిద్దితూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని గాడిలో పెట్టారు. రెండేళ్లపాటు కరోనా ప్రతికూల పరిస్థితులు ఏర్పడినా స్పిల్ వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ కాఫర్ డ్యాంలను పూర్తిచేసి 2021, జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించారు. కోతకు గురైన దిగువ కాఫర్ డ్యాంను సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు పూర్తిచేశారు. ప్రధాన డ్యాం గ్యాప్–3లో కాంక్రీట్ డ్యాం నిర్మించారు. ప్రధాన డ్యాం గ్యాప్–2, గ్యాప్–1 నిర్మాణ ప్రాంతంలో కోతకు గురై విధ్వంసం చోటుచేసుకున్న ప్రాంతాన్ని వైబ్రో కాంపాక్షన్ ద్వారా యథాస్థితికి తెచ్చే పనులు కొలిక్కి తెచ్చారు. కుడి, ఎడమ కాలువలను జలాశయంతో అనుసంధానం చేసే పనులతోపాటు ఎడమ కాలువలో వరాహ అక్విడెక్టు సహా అత్యంత కీలకమైన నిర్మాణాలను పూర్తిచేశారు. డ్యాం భద్రత దృష్ట్యా కోతకు గురైన డయాఫ్రం వాల్ భవితవ్యాన్ని తేల్చితే... ప్రధాన డ్యాం పనులను శరవేగంగా పూర్తి చేస్తామని 2022 నుంచే కేంద్రాన్ని వైఎస్ జగన్ కోరుతూ వచ్చారు.

ప్రధాన డ్యాం గ్యాప్-2 పునాది డయాఫ్రం వాల్ నిర్మాణం ఇలా...

డయాఫ్రం వాల్ లోతు (మీటర్లలో)	డయాఫ్రం వాల్ పొడవు (మీటర్లలో)
10 లోపు	18.4
10-20	39.6
20-30	102.6
30-40	309.2
40-50	491.0
50-60	233.4
60-70	135.2
70-80	33.6
80-90	24.0
90-93.50	9.6
మొత్తం	1,396.6

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
గురువారం ‌ 5 ‌ డిసెంబర్ ‌ 2024



విస్తృతంగా వాహన తనిఖీలు

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లాలోని ప్రధాన కూడళ్లలో బుధవారం ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. 525 వాహనాలను సీజ్ చేశారు.



సమస్యల పరిష్కారానికి వినతి

ఘంటసాల: సమస్యల పరిష్కారం కోరుతూ లంకపల్లి గ్రామంలో 104 ఉద్యోగులు బుధవారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందించారు.



ఆవేదన అల్లాహ్‌కు చెప్పకుందాం

వలంటీర్లు తమ ఆవేదనను అల్లాహ్‌కు చెప్పకున్నారు. తమకిచ్చిన హామీలు అమలుచేసేలా ఈ ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలంటూ విజయవాడ పంజా సెంటర్‌లోని దర్గాకు వెళ్లి ప్రార్థించారు.

న్యూస్‌రీల్

కృష్ణా వర్సిటీ చెస్ జట్టు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: దక్షిణ భారత అంతర విశ్వ విద్యాలయాల మహిళల చదరంగం పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు సప్తగిరి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్, చైర్‌పర్సన్ డాక్టర్ పి.వి.డి.శ్రీదేవి తెలిపారు. వర్సిటీ అంతర కళాశాలల పోటీలు, వర్సిటీ జట్టు ఎంపిక పోటీలు తమ కాలేజీ ఆధ్వర్యంలో, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ ఆర్.రఘురామ్ పర్యవేక్షణలో జరిగినట్లు చెప్పారు. హైందవి శర్వాణి(ఎస్‌వీడీ సిద్ధార్థ లా కాలేజీ), ఉషాప్రవల్లిక(పీబీ సిద్ధార్థ), సాధన(పీబీ సిద్ధార్థ), నవ్య(ఎస్‌డీఎంఎస్‌ఎం కాలేజీ), బిందుమాధవి(కేబీఎన్ కాలేజీ), దివ్యరేఖ(ఏజీఎస్‌జీ సిద్ధార్థ) జట్టుకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ జట్టుకు శ్రావణి మేనేజర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. ఈ నెల ఐదు నుంచి ఎనిమిదో తేదీ వరకు గీతం వర్సిటీలో జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి

పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవో నంబర్ 114 అమలు చేయాలని కోరుతూ బుధవారం విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో సత్యాగ్రహ దీక్ష జరిగింది. ఈ దీక్షకు లక్ష్మణరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు విడుదల చేసిన జీవో నంబర్ 114 ప్రకారం కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలన్నారు. దీక్షలో అసోసియేషన్ అధ్యక్షుడు బీఎస్ఆర్ శర్మ, కార్యదర్శి బీజే గాంధీ కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

'అమ్మ' నూతన కార్యవర్గం ఎన్నిక

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షుడిగా గారపాటి సతీష్ బాబు, ఉపాధ్యక్షులుగా గోనుగుంట వెంకట సుబ్బారావు, దోనేపూడి దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సుంకర చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శిగా కొమ్మినేని దుర్గా మల్లికార్జునరావు, కోశాధికారిగా అన్నే శ్రీనివాసరావు నియమితులయ్యారని నూతన అధ్యక్షుడు సతీష్ బాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీ పదవీకాలం 2026 సంవత్సరం వరకు ఉంటుందన్నారు.

అసంబద్ధ నిర్ణయాలు ఉపసంహరించుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యా శాఖ అధికారుల అసంబద్ధ నిర్ణయాలు ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్ కుమార్ కోరారు. విద్యాశాఖలో అధికారుల అసంబద్ధ నిర్ణయాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఈనెల 11న అన్ని జిల్లాల డీఈవో కార్యాలయాల ముందు, 16న సీఎస్సీ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ మేరకు బుధవారం డీఈవో కార్యాలయంలో డీఈవో సుబ్బారావును కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మనోహర్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాల పనివేళల్లో మార్పు, పాఠశాలలో టెన్త్ క్లాస్ విద్యార్థులకు 100 రోజుల కార్యాచరణ పేరిట ఆదివారం సెలవు దినాల్లో పని చేసే విధంగా యాక్షన్ ప్లాన్ రూపొందించడం తదితర నిర్ణయాలు ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందులు కలిగించే అంశాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుందరయ్య మాట్లాడుతూ నిరసన కార్యక్రమాల్లో ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు డి.హరిప్రసాద్, షేక్ ప్రైమర్ సాహెబ్, కె.మల్లికార్జునరెడ్డి, ఎ.భరత్, అల్లిక నరసింహారావు పాల్గొన్నారు.

సరిహద్దు దాటని సాగర్ జలాలు

- ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులో కాలువకు గండ్లు
- కూలిన యూటీలు
- అవస్థలు పడుతున్న ఆంధ్ర ప్రాంత మెట్ట రైతులు



తెలంగాణ సరిహద్దులో కాలువకు పడిన గండి

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): నాగార్జున సాగర్ జలాలు తెలంగాణ సరిహద్దు దాటి ఆంధ్రలోకి రావడం లేదు. సరిగ్గా ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులో తెలంగాణ ప్రాంతంలో కాలువకు గండ్లు పడడం, యూటీలు కూలడమే ఇందుకు ప్రధాన కారణం. షెడ్యూల్ ప్రకారం సాగర్ జలాలు విడుదల చేసినా దిగువకు రాని పరిస్థితి. దీంతో పూర్తిగా వర్షాధారం, సాగర్ జలాలపై ఆధారపడిన మెట్ట రైతులు అవస్థలు పడుతున్నారు. రైతుల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ, మైలవరం నియోజకవర్గాలు పూర్తిగా మెట్ట ప్రాంతాలు. ఈ నియోజకవర్గాల్లోని కొన్ని మండలాలు తెలంగాణ సరిహద్దులో ఉన్నాయి. రైతులు వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగు చేస్తుంటారు. ఈ ప్రాంతానికి ప్రధాన సాగునీటి వనరు సాగర్ జలాలే. నాగార్జున సాగర్ మూడో జోన్ ఆయకట్టు చివరి ప్రాంతం కావడంతో సాగర్ జలాలు సక్రమంగా అందడం లేదు. దీంతో మెట్ట పంటలు సాగు చేస్తున్న రైతులు సాగునీటికోసం అవస్థలు పడుతున్నారు. నాగార్జున సాగర్ ఎడమ కాలువ మూడో జోన్‌లో మైలవరం బ్రాంచ్ కెనాల్ పరిధిలో మూలపాడు, ఇబ్రహీంపట్నం మేజర్ కాలువలు ఉన్నాయి. ఎన్ఎస్‌పీ కాలువ వీరులపాడు మండలం గూడెంమాధవరం తెలంగాణలోని ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల గ్రామాల మధ్య మన రాష్ట్రంలోకి ప్రవేశిస్తోంది. మూలపాడు, ఇబ్రహీంపట్నం మేజర్ కాలువల కింద కంచికచర్ల, వీరులపాడు, ఇబ్రహీంపట్నం మండలాల్లో మెట్ట పైర్లు పత్తి, మిర్చి, మొక్కజొన్న సాగవుతున్నాయి. మూలపాడు మేజర్ కాలువ 40.250 కిలో మీటర్లు, ఇబ్రహీంపట్నం మేజర్ 30.690 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్నాయి. వీటి కింద అధికార, అనధికారికంగా 70వేల ఎకరాల పైచిలుకు సాగవుతోంది.

సాగర్ ఆయకట్టు		
కాలువ	క్యూసెక్కులు	విస్తీర్ణం (ఎకరాలు)
మూలపాడు మేజర్	750	39,222
ఇబ్రహీంపట్నం మేజర్	350	11,847
మొత్తం	1100	51,069

సరిహద్దులో కాలువకు గండ్లు

ఆంధ్ర తెలంగాణ సరిహద్దులో వీరులపాడు మండలం గూడెం మాధవరం, తెలంగాణ రాష్ట్రం ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల మధ్య ఎన్ఎస్‌పీ కాలువ ఆంధ్ర రాష్ట్రంలోకి ప్రవేశిస్తోంది. షెడ్యూల్ ప్రకారం ఎన్ఎస్‌పీ మూడో జోన్‌కు నవంబర్‌లో నీటిని విడుదల చేశారు. కాని ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులో ఎర్రుపాలెం మండలం జమలాపురానికి ఎగువన కాలువకు రెండు చోట్ల గండ్లు పడ్డాయి. ఇక్కడకు సమీపంలోనే దశాబ్దాల క్రితం నిర్మించిన యూటీలు కూలిపోయాయి. దీంతో సాగర్ జలాలు సరిహద్దు దాటి రావడం లేదు. తెలంగాణ రాష్ట్రం చివరలో గండ్లు పడడంతో అక్కడి అధికారులు గండ్లు పూడ్చడం లేదు. మన ప్రభుత్వ పెద్దలు ఈ కాలువ గురించి పట్టించుకోవడం లేదు. రైతులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అవస్థలు పడుతున్నారు.

అధ్వానంగా కాలువలు

దశాబ్దాల కిందట నిర్మించిన కాలువలు కావడం, నిర్వహణ లోపంతో అధ్వానంగా మారాయి. నీటి ప్రవాహ సామర్థ్యాన్ని కోల్పోయాయి. కొన్ని కాలువలు రూపురేఖలు మారిపోగా, మరికొన్ని ఫీల్డ్ చానల్స్ అదృశ్యమయ్యాయి. ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని మంత్రి ప్రకటించారు. కానీ మెట్ట ప్రాంత రైతుల ఇబ్బందులు, కాలువల దుస్థితిని మాత్రం పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా ప్రభుత్వం నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమైంది. నీరే ప్రవహించని కాలువలకు ఎన్నికలు ఎందుకని రైతులు పెదవి విరుస్తున్నారు.

సాగర్ జలాలు వస్తాయని మొక్కజొన్న సాగుచేశా



అధికారులు నాగార్జున సాగర్ జలాశయం నుంచి నవంబర్ 15వ తేదీన సాగునీరు కాల్వలకు విడుదల చేస్తామన్నారు. సాగునీరు వస్తాయన్న నమ్మకంతో 5 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. ఇప్పటివరకు మూలపాడు మేజర్ కాల్వకు నీరు రాలేదు.

–బెల్లంకొండ వెంకట సుబ్బారావు, రైతు, గండేపల్లి, కంచికచర్ల మండలం

గతంలో సకాలంలో సాగర్ జలాలు వచ్చాయి



గత ప్రభుత్వంలో ఖరీఫ్, రబీ సీజన్లలో పత్తి, మిర్చి పంటలు సాగుచేశా. సకాలంలో నీరు వచ్చింది. దీంతో దిగుబడులు బాగా వచ్చాయి. ప్రస్తుతం సాగర్ జలాలు రావడం లేదు. అధికారులు చొరవ చూపి సాగర్ జలాలు వచ్చేలా చూడాలి.

–వెలగలేటి బాబురావు, రైతు, చెవిటికల్లు, కంచికచర్ల మండలం

సాగర్ జలాలు రాకుంటే నష్టపోతాం



ఇప్పటికే గతంలో కురిసిన అకాల వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయాం. సాగర్ జలాలు అదునుకు రాకపోతే మరోసారి నీటి ఎద్దడి కారణంగా నష్టపోవాల్సి వస్తుంది. మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

– చలమల దుర్గారావు, చట్టన్నవరం, వీరులపాడు మండలం

సాగర్ జలాల కోసం ఎదురు చూస్తున్నాం



సాగర్ కాల్వలకు భారీ గండ్లు పడటంతో చుక్క నీరు కూడా కిందకు వచ్చే అవకాశం కనపడటం లేదు. సాగర్ జలాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

– మల్లెల రాంబాబు, చట్టన్నవరం, వీరులపాడు మండలం

సూపర్‌సిక్స్‌తో బాబు మోసం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చారని, ఆర్నెల్ల కాలంగా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. చంద్రబాబు హామీ సూపర్ సిక్స్ అవుతుందా? లేక పెద్ద సున్నా అవుతుందో కాలమే నిర్ణయిస్తుందన్నారు. విజయవాడలోని జింఖానా మైదానంలో బుధవారం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ప్రజా హక్కుల సభ జరిగింది. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ అదానీ అవినీతిపై చంద్రబాబు, మోదీ నోరు మెదపడం లేదని, పార్లమెంట్‌లోనూ దీనిపై చర్చించడం లేదన్నారు. తక్షణమే అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగారురావు, డి.హరినాథ్ మాట్లాడుతూ గత విద్యుత్ ఉద్యమ కాలం నాటి పరిస్థితులు మరలా రాష్ట్రంలో వస్తున్నాయన్నారు. సూపర్ సిక్స్ కాదని, పీపుల్స్ సిక్స్ అమలు చేయాలని ఆరు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఏటా 15లక్షల ఉద్యోగాలు కల్పించాలని, ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగభృతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు బీమా వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. సభ ప్రారంభానికి ముందు ర్యాలీ నిర్వహించారు.

పెద్దాసుపత్రిలో మందుల్లేవ్

- కనీసం ఎగ్జామినేషన్ గ్లౌజ్‌లు కూడా లేక ఇబ్బందులు
- యాంటీబయోటిక్స్‌తో పాటు పలు రకాల మందుల కొరత
- రోగులు బయట కొనుగోలు చేయాల్సిన దుస్థితి
- మూడు వారాలుగా హెచ్‌బీఏ1సీ పరీక్షలు చేయడం లేదు



విజయవాడ ప్రభుత్వాస్పత్రి

లబ్బీపేట(విజయవాడతూర్పు): పెద్దాస్పత్రికి వెళితే మంచి వైద్యంతో పాటు మందులు కూడా వారే ఇచ్చి పంపుతారని రోగులు భావించేవారు. అది గతంలో.. కానీ నేడు జబ్బు చేసి వైద్యం కోసం వెళితే సగం మందులు బయటకే రాస్తున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌పేషెంట్స్‌గా చేరిన అటెండెంట్స్ చేతిలో నర్సులు చీటీ పెట్టి ఈ మందులు కొనుక్కొచ్చుకోండి అని చెబుతున్నారని పలువురు వాపోతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందే స్తోమత లేక ఇక్కడకు వస్తే, మందులు కొనుక్కోవాల్సి వస్తోందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో ఎంత దయనీయమైన పరిస్థితి ఏర్పడిందంటే రోగులను ఎగ్జామినేషన్ చేసేందుకు వైద్యులు వేసుకునే గ్లౌజులకు కూడా కొరతగానే ఉంది.

నెల రోజులుగా హెచ్‌బీఏ1సీ పరీక్ష చేయడం లేదు ప్రభుత్వాస్పత్రి జనరల్ మెడిసిన్ విభాగానికి నిత్యం 100 నుంచి 150 మంది షుగర్ రోగులు వస్తుంటారు. వారితో పాటు జనరల్ సర్జరీ, నెఫ్రాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ విభాగాలకు షుగర్ రోగులు వస్తారు. వారికి కచ్చితమైన వ్యాధి నిర్ధారణ చేసేందుకు హెచ్‌బీఏ1సీ ఫలితాన్ని ఇప్పుడు అందరూ ప్రామాణికంగా తీసుకుంటున్నారు. కానీ ప్రభుత్వాస్పత్రిలో నెల రోజుల కిందట మెషీన్ చెడిపోవడంతో పరీక్షలు నిలిచిపోయాయి. దీంతో ఆ పరీక్ష చేయించుకోవాలంటే బయట ల్యాబ్‌లకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడ రూ.500 నుంచి రూ.750 వరకూ ల్యాబ్‌ను బట్టి రేట్లు వసూలు చేస్తున్నట్లు రోగులు వాపోతున్నారు. అంతేకాకుండా థైరాయిడ్ పరీక్షలు కూడా రోజూ చేయకుండా నిర్దేశిత రోజుల్లో మాత్రమే చేస్తుండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

15 రోజులు మూలన పడిన ఎంఆర్ఐ

ప్రభుత్వాస్పత్రికి వచ్చే పక్షవాతం, తలకు గాయాలు, డిస్క్, వెన్నెముక ఇబ్బందులను నిర్ధారించేందుకు ఎంఆర్ఐ స్కాన్ చేస్తుంటారు. ఇటీవల చిన్న సమస్య వస్తే మరమ్మతులకు 15 రోజులు సమయం పట్టడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవసరమైన వారు బయటకు వెళ్లి వేలాది రూపాయలు చెల్లించి తీయించుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ఎస్ఎస్ బ్లాక్‌లోని సీటీ స్కాన్ కూడా హార్డ్‌వేర్ ప్రాబ్లమ్ రావడంతో ఫిల్మ్ ఇవ్వడం కుదరడం లేదు. గతంలో స్కానింగ్ మెషీన్లలో ఏదైనా సమస్య తలెత్తితే ఒకటి, రెండు రోజుల్లో పరిష్కరించేవాళ్లు. కానీ నేడు పదిహేను రోజులకు పైగా పడుతుండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

క్యాజువాలిటీలో రోగులను ఎగ్జామినేషన్ చేసేందుకు తరచూ గ్లౌజుల కొరత ఏర్పడుతోంది. గతంలో స్థానికంగా కొనుగోలు చేసేవారు. ఇప్పుడు వారి బాకీ పెరిగిపోవడంతో అత్యవసరంగా సరఫరా చేయడం లేదు. దీంతో తరచూ గ్లౌజుల కొరత ఏర్పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇన్సులిన్ ఇంజెక్షన్లు, రక్తనాళాల్లో గడ్డలు కరిగే ఖరీదైన ట్రోంబలైజ్ ఇంజెక్షను సైతం కొరత ఉంటోంది. జీజీహెచ్‌లో రెండు నెలల పాటు ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్ కొరత నెలకొనగా, ఇటీవలే ప్రభుత్వం సరఫరా చేసింది. నొప్పులు, అరుదైన బ్యాక్టీరియాలకు వాడే యాంటీబయోటిక్స్, లివర్ సిర్రోసిస్ రోగులకు బిలిరుబిన్ ఇంజెక్షను కూడా అవసరమైనప్పుడు ఉండటం లేదు. దీంతో ఒక్కోసారి ఖరీదైన ఇంజెక్షన్లను రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తుంది. గతంలో ఎలాంటి కొరత లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసేది.

మందుల కొరత లేకుండా చూడాలి



పేదలు జబ్బు చేస్తే వైద్యం కోసం వెళ్లేది ప్రభుత్వాస్పత్రికే. కనీసం చార్జీలకు కూడా డబ్బులు లేని వారు ఉంటారు. అలాంటి చోట మందుల కొరత ఏర్పడితే పేదలు కొనుగోలు చేసుకునే శక్తి లేని వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటుంది. ప్రతి రోగికి అవసరమైన మందులను సక్రమంగా అందించేందుకు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– షేక్ మునీర్ అహ్మద్, రాష్ట్ర కన్వీనర్, ముస్లిం జేఏసీ

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రెవెన్యూ సమస్య పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 6నుంచి జరగనున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పూర్తి సన్నద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియాలకు వివరించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, సీసీఎల్ఏ కమిషనర్ జి. జయలక్ష్మి జిల్లా కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ లక్ష్మీశ జిల్లాలో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 320 రెవెన్యూ గ్రామాలతో పాటు విజయవాడ, నందిగామ, జగ్గయ్యపేట, ఇబ్రహీంపట్నం, తిరువూరు పట్టణ వార్డు సచివాలయాల పరిధిలో ఈ సదస్సుల నిర్వహణకు చర్యలు చేపట్టామన్నారు. రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌ను ప్రజలకు తెలియజేసేలా కరపత్రాలు ముద్రించి గ్రామాల్లో పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించే ఫిర్యాదులు, వినతి పత్రాలపై తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సుల నిర్వహణ పర్యవేక్షణకు అధికారులను నియమించామన్నారు. ఈ సదస్సులపై ఈనెల 5న ఇన్‌చార్జి మంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పిస్తామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, డీఆర్వో లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ సమన్వయ పర్యవేక్షకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి బొమ్మకు పూర్వ వైభవం



కొండపల్లి బొమ్మల తయారీలో వాడే తెల్లపొణికి చెక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

- బొమ్మల పరిశ్రమకు ప్రభుత్వ ప్రోత్సాహం
- నర్సరీలతో తెల్లపొణికి సమస్యకు పరిష్కారం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సమష్టి కృషితో కొండపల్లి బొమ్మల పరిశ్రమకు పూర్వ వైభవం తెద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. కళా ఔన్నత్యానికి చిహ్నంగా నిలిచిన కొండపల్లి బొమ్మల కళకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని అన్నారు. బొమ్మల పరిశ్రమను డీఆర్‌డీఏ, డ్వామా, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. బొమ్మల కళాకారుల సహకార సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. బొమ్మల తయారీకి ముడిసరుకు అయిన తెల్ల పొణికి చెక్క విశిష్టత, లభ్యత, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాకారులు అద్భుత నైపుణ్యంతో చెక్కను అందమైన బొమ్మగా తీర్చిదిద్దుతున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు కలిగిన కొండపల్లి బొమ్మలకు డిమాండ్‌తో పాటు మార్కెటింగ్ అవకాశాలు బాగున్నాయని, అయితే బొమ్మల తయారీకి అవసరమైన తెల్ల పొణికి చెట్ల లభ్యత సమస్యగా ఉందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో తెల్లపొణికి నర్సరీల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తెల్లపొణికి నర్సరీల తయారీకి వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక జాయింట్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అటవీ నిబంధనలు పాటిస్తూనే మరోవైపు తెల్లపొణికి చెట్లు కళాకారులకు అందుబాటులో ఉండేలా పటిష్ట ప్రణాళికతో చర్యలు తీసుకుంటామన్నారు. సంప్రదాయ కళా సంపదను భావి తరాలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు కె.శ్రీనివాసరావు, రాము, డీఎఫ్‌వో జి.సతీష్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేపు కళా ఉత్సవ్ జిల్లా స్థాయి పోటీలు

గుడ్లవల్లేరు: కళా ఉత్సవ్ జిల్లా స్థాయి పోటీలను అంగలూరులోని ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్)లో శుక్రవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన విద్యా సంస్థల్లో 9, 10, 12వ తరగతులు చదువుతున్న బాల బాలికలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. ఈ పోటీల్లో మొత్తం కళా రూపాలు, గాత్ర సంగీతం(సంప్రదాయ, జానపద), వాద్య సంగీతం (పెర్కుసివ్, మెలోడిక్), నాట్యం(సంప్రదాయ, జానపద), ద్వితీయ, త్రిమితీయ చిత్రణ, సంప్రదాయబద్ధ ఆట బొమ్మలు, ఆటలు, నాటకం(ఏక పాత్రాభినయం), సంప్రదాయ కథలు చెప్పటం ఉంటాయని తెలిపారు. ప్రతి విభాగం నుంచి ఐదు గురికి మించకుండా బృందంగా కూడా ఈ పోటీల్లో తలపడవచ్చునని చెప్పారు. ఒక విద్యా సంస్థ నుంచి ఒక్కొక్క కళా రూపంలో ఒక బాలుడు, ఒక బాలిక మాత్రమే విడివిడిగా పాల్గొనాలని చెప్పారు. గతేడాది జరిగిన కళా ఉత్సవ్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినవారు పాల్గొనేందుకు అనర్హులని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థులకు అవసరమైన సామగ్రిని వారే తెచ్చుకోవాలన్నారు. ప్రతి కళా రూపానికి ఐదు నిమిషాల సమయం మాత్రమే కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్‌కు చెందిన అన్ని పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు డైట్ కళాశాల అధ్యాపకురాలు ఎస్.జయశ్రీ(83282 14217) మొబైల్ ద్వారా సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చునని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే వారి వివరాలను ఈ–మెయిల్ dietkrishna@yahoo.comకు పంపించవలసిందిగా లక్ష్మీనారాయణ కోరారు.

క్లుప్తంగా

విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా ప్రత్యేక వారంతపు రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్–బ్రహ్మపూర్ (07027) ఈ నెల 6, 13, 20, 27 తేదీలలో ప్రతి శుక్రవారం రాత్రి 8.15 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2.45 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07028) ఈ నెల 7, 14, 21, 28 తేదీల్లో ప్రతి శనివారం సాయంత్రం 4.45 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 11.35 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్–విశాఖపట్నం (07097) ఈ నెల 8, 15, 22, 29 తేదీల్లో ప్రతి ఆదివారం సాయంత్ర 4.35 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07098) ఈ నెల 9, 16, 23, 30 తేదీల్లో ప్రతి సోమవారం రాత్రి 7.50 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 11.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

స్వర్ణభారత్‌లో టాలీప్రైమ్ ఉచిత శిక్షణ

ఉంగుటూరు: ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లోని సైబర్ గ్రామీణ్ శిక్షణ కేంద్రంలో ఈ నెల16 నుంచి ప్రారంభించనున్న టాలీ ప్రైమ్ కోర్సుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డైరెక్టర్ అంకమ్మరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు 60 రోజుల శిక్షణ ఉంటుందని, బీకామ్, బీబీఏ, ఎంకామ్, ఎంబీఏ విద్యార్హత ఉన్నవారు అర్హులని చెప్పారు. శిక్షణ పొందేవారికి ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసినవారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగలవారు 9100033552, 9440630051 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేపు మెగా జాబ్ మేళా

గుడివాడ టౌన్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి. విక్టర్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా ఏర్పాటుచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేళాలో హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, కూరాకు ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఈ ఉద్యోగాల కోసం 10వ తరగతి, ఐటీఐ, డిప్లొమ(మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్), గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ అభ్యర్థులు అర్హులన్నారు. 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు వీటికి అర్హులన్నారు. రూ. 12 వేల నుంచి రూ. 29 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 9848819682, 9666654641 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మచిలీపట్నంటౌన్:పామర్రు నియోజకవర్గం పరిధిలోని కురుమద్దాలిలో ఉన్న కొసరాజు పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలోనూ మేళా నిర్వహిస్తున్నామన్నారు.

ప్రశాంతంగా పరఖ్ సర్వేక్షణ

- 116 పాఠశాలల నుంచి 3398 మంది విద్యార్థులు హాజరు
- జిల్లాలో 3, 6, 9 తరగతుల విద్యార్థుల సామర్థ్యాల పరిశీలనకు పరీక్ష
- పరిశీలించిన డీఈవో



విద్యార్థుల పరీక్షను పరిశీలిస్తున్న డీఈవో సుబ్బారావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా పాఠశాలల్లోని విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు ఏ మేరకు ఉన్నాయో పరిశీలించేందుకు నిర్వహించిన పెర్మార్మెన్స్ అసెస్‌మెంట్ రివ్యూ అండ్ అనలిసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ (పరఖ్ సర్వేక్షణ–2024) బుధవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. పరఖ్ సర్వేక్షణ–2024 పేరుతో సర్వేను 2021లో చివరిసారిగా నిర్వహించారు. మరలా తిరిగి ఈ ఏడాది బుధవారం నిర్వహించారు. దాని కోసం జిల్లాలో గడిచిన వారం రోజులుగా కసరత్తు చేశారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న 116 పాఠశాలల్లో మూడు, ఆరు, తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష నిర్వహించి ఈ సర్వే నిర్వహించారు.

హాజరైన 3398 మంది విద్యార్థులు

ఎన్టీఆర్ జిల్లాలో 116 పాఠశాలలను ఈ పరీక్ష కోసం ఎంపిక చేశారు. ఇందులో ఒక్కో పాఠశాల నుంచి తరగతికి 30 మంది చొప్పున మూడు తరగతులకు సంబంధించిన – విద్యార్థులను ఎంపిక చేశారు. అందులో భాగంగా మూడో తరగతికి సంబంధించి 47 విద్యాసంస్థలకు చెందిన 978 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. అందులో 478 మంది బాలురు, 500 బాలికలు ఉన్నారు. అలాగే ఆరో తరగతికి సంబంధించి 39 విద్యా సంస్థలకు చెందిన 1062 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. అందులో 480 మంది బాలురు, 582 మంది బాలికలు, తొమ్మిదో తరగతికి చెందిన 1358 మంది విద్యార్థులు హాజరయ్యారు. మూడు, ఆరు తరగతులకు చెందిన విద్యార్థులకు 90 నిమిషాలు పాటు, తొమ్మిదో తరగతికి చెందిన విద్యార్థులకు రెండు గంటల పాటు పరీక్ష నిర్వహించారు. డీఈవో యుపీ సుబ్బారావు మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో పరాఖ్ సర్వేక్షణ పరీక్షను బుధవారం ప్రశాంతంగా నిర్వహించామని తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ పరీక్షను నిర్వహించామని చెప్పారు. మూడు, ఆరు, తొమ్మిది తరగతులకు చెందిన విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. సుమారుగా 3398 మంది విద్యార్థులకు పరీక్షకు హాజరయ్యారని వెల్లడించారు.

జాతీయ క్రీడలకు జట్లను తీసుకెళ్తాం

ఏపీవోఏ అధ్యక్షుడు ఆర్.కె.పురుషోత్తం



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్స్ సంఘం అధ్యక్షుడు పురుషోత్తం

విజయవాడస్పోర్ట్స్: జనవరిలో నెలలో ప్రారంభమయ్యే జాతీయ క్రీడలకు వెళ్లే రాష్ట్ర జట్లకు సమకూర్చాల్సిన వనరుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)కు ఇచ్చామని, అయితే ప్రభుత్వం, శాప్ నుంచి ఎలాంటి సమాధానం రాలేదని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ (ఏపీవోఏ) అధ్యక్షుడు ఆర్.కె.పురుషోత్తం తెలిపారు. గతంలో మాదిరిగానే శాప్ వ్యవహరిస్తున్న తీరు పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే రాష్ట్ర జట్లను తీసుకెళ్లాల్సిన బాధ్యత తమ సంఘంపై ఉందని, రాష్ట్ర ప్రభుత్వం, శాప్ కలిసి రాకపోయినా జట్లను తామే సొంత ఖర్చులతో తీసుకెళ్తామని పేర్కొన్నారు. విజయవాడ గాంధీనగర్‌లోని ఓ హోటల్లో ఏపీవోఏ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పురుషోత్తం మాట్లాడారు. చెఫ్–డీ మిషన్ (జాతీయ క్రీడల ఏపీ సంధాన కర్త)గా బడేటి వెంకట్రామయ్య (వెయిట్ లిఫ్టింగ్ సంఘ ప్రతినిధి)ని నియమిస్తూ భారత ఒలింపిక్ సమాఖ్య (ఐవోఏ)కు లేఖ రాసినట్లు చెప్పారు. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ క్రీడలకు 34 క్రీడాంశాల నుంచి 220 మంది క్రీడాకారులు హాజరవుతున్నారని వెల్లడించారు. ఏపీవోఏ, రాష్ట్ర ప్రభుత్వం, శాప్ సంయుక్తంగా జట్లను పంపడం ఆనవాయితీగా వస్తోందన్నారు. క్రీడా సంఘాలకు, ప్రభుత్వానికి అనుసంధాన కర్తగా ఉన్న శాప్ ఉద్యోగుల వ్యవహారశైలి విమర్శనాత్మకంగా ఉందన్నారు. సినిమా బ్లాక్ టిక్కెట్లు అమ్ముకున్న చందంగా క్రీడా సర్టిఫికెట్లను అమ్ముకున్న సంఘాలకు శాప్ అధికారులు కొమ్ముకాస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ క్రీడలకు వెళ్లే క్రీడాకారుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. క్రీడల వ్యవహారంలో ప్రభుత్వాన్ని శాప్ అధికారులు మొదటి నుంచి తప్పుదోవ పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతి శాప్ అధికారులపై చర్యలు తీసుకుని సీఎం చంద్రబాబు తమతో కలిసి వస్తారని ఆశతో ఉన్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏపీవోఏ ప్రతినిధులు రమణరావు, గోవిందరాజులు, శ్రీనివాసన్, శివకుమార్, మోహన్, పద్మజబాల పాల్గొన్నారు.

అల్లు అర్జున్ అహంకారి

- అల్లు అర్జున్ చిత్రాలు అడ్డుకుంటాం
- జనసేన నేత చలమలశెట్టి సవాల్



మాట్లాడుతున్న జనసేన నేత చలమలశెట్టి

హనుమాన్‌జంక్షన్ రూరల్: సినీ నటుడు అల్లు అర్జున్‌కు మెగా ఫ్యామిలీతో తనకు సంబంధం లేదని బహిరంగంగా ప్రకటించే దమ్ముందా అంటూ జనసేన నేత సవాల్ విసిరారు. 'పుష్ప–2' చిత్రం విడుదల సందర్భంగా అల్లు అర్జున్‌పై జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ సినిమా ప్రదర్శించనున్న శ్రీకృష్ణా థియేటర్ వద్ద బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికల్లో మెగా ఫ్యామిలీ యావత్తూ ఒకే వైపు ఉండి జనసేనకు మద్దతుగా నిలిస్తే, అల్లు అర్జున్ ఒళ్లు బలిసి, కొవ్వు ఎక్కువై వైఎస్సార్ సీపీ తరుపున ఎన్నికల ప్రచారం చేశారని మండిపడ్డారు. అహంకార భావంతో వ్యవహరిస్తున్న అతడి చిత్రాలను అడ్డుకుని తీరతామన్నారు. మెగా ఫ్యామిలీ పేరు చెప్పుకుని నటుడిగా ప్రాచుర్యం పొందాడని, చిరంజీవి కుటుంబ సభ్యుడనే ఆయనను మెగా అభిమానులంతా ఆదరించారని చెప్పారు. అల్లు అర్జున్ ఎదుగుదలలో మెగా ఫ్యామిలీ, మెగా అభిమానుల తోడ్పాటు ఎంతో ఉందన్నారు. అదంతా మర్చిపోయి గత సార్వత్రిక ఎన్నికల్లో మెగా ఫ్యామిలీకి, జనసేన పార్టీకి వ్యతిరేకంగా అల్లు అర్జున్ వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.

చలమలశెట్టి వ్యాఖ్యలు ఉపసంహరణ

అల్లు అర్జున్‌పై సంచలన వ్యాఖ్యలు చేయటంతో పాటుగా, పుష్ప–2 చిత్ర ప్రదర్శనను అడ్డుకుంటామని ప్రకటించిన జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు వెనకడుగు వేశారు. ఉదయం తీవ్ర పదజాలంతో ఆగ్రహావేశాలు వ్యక్తం చేసిన చలమలశెట్టి సాయంత్రం 7:30 గంటలకు మెత్తబడ్డారు. జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణతో పాటుగా చిత్ర డిస్ట్రిబ్యూటర్లు చలమలశెట్టి నివాసానికి వచ్చి చర్చలు జరిపారు. అంతేకాక ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు కూడా ఫోన్‌లో మాట్లాడి నచ్చజెప్పటంతో అల్లు అర్జున్, పుష్ప–2 చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలను పూర్తిగా ఉపసంహరించుకున్నట్లుగా ప్రకటించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణతో కలిసి ఆయన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. మెగా బ్రదర్ నాగబాబుపై తనకు ఉన్న గౌరవంతో తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నానని, పుష్ప–2 చిత్ర ప్రదర్శనను కూడా ఎక్కడా అడ్డుకోబోనని చెప్పారు.

9న అప్రెంటీస్ మేళా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):ఈ నెల 9వ తేదీన నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎం.కనకరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ కోర్సు పూర్తి చేసి అన్ని ట్రేడ్‌ల వారు ఈ మేళాలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఈ మేళాకు హాజరై వారి కంపెనీల్లో అప్రెంటీస్‌గా అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. ఐటీఐ పాస్ అయి అప్రెంటీస్ పూర్తి కాని వారు విద్యార్హతకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈ మేళాకు హాజరు కావాలని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రమేష్ ఆసుపత్రి రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో 9వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుంచి మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9298605175 నంబరులో సంప్రదించాలని కోరారు.

టిప్పర్ ఢీకొని యువకుడి దుర్మరణం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మితిమీరిన వేగంతో వచ్చిన టిప్పర్ ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న యువకుడు దుర్మరణం చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 4లో తుమ్మపాల అమ్మాజీ కుటుంబం నివాసం ఉంటుంది. అమ్మాజీ భర్త ప్రకాష్ 2015లో మరణించాడు. దీంతో కుటుంబ భారం మీద పడటంతో చేపల మార్కెట్ వద్ద కొవ్వొత్తులు తయారు చేసే కంపెనీలో పని చేస్తూ తన ఇద్దరు కుమారులను పెంచి పెద్ద చేసుకుంది. పెద్ద కుమారుడు తుమ్మపాల హేమంత్ చరణ్ (27) డిప్లమో వరకు చదివి, పైపుల రోడ్డులోని ఓ రెస్టారెంట్‌లో పని చేస్తున్నాడు. చరణ్‌కు ఇంకా వివాహం కాలేదు. బుధవారం ఉదయం 7 గంటలకు చరణ్ తన స్నేహితుడైన మనోజ్ బైక్ తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఉదయం 10 గంటల సమయంలో పాముల కాల్వ వైపు వెళుతున్న చరణ్ బైక్‌ను వేగంగా వచ్చిన టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత రోడ్డు పక్కన టిప్పర్‌ను నిలిపి డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటనపై మృతుడి తల్లి అమ్మాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నాగార్జున యూనివర్సిటీతో సిద్ధార్థ కళాశాల ఒప్పందం



ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి చూపుతున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి వారిని పోటీ ప్రపంచంలో ప్రతిభ గల వారిగా తీర్చిదిద్దడం కోసం తమ కళాశాల ఆచార్య నాగార్జున యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకుందని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.సింహాచలం చాంబర్‌లో ఈ ఒప్పంద పత్రాలను బుధవారం మార్చిడి చేసుకున్నామని తెలిపారు. ఈ ఒప్పందం వల్ల పరిశోధనలు చేయడం, సాంకేతిక పరమైన సదస్సులు నిర్వహించడం, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, పాఠ్య ప్రణాళికలు రూపొందించడం, నూతన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని విద్యార్థులతో పాటుగా అధ్యాపకులకు బోధించడంలో తమ కళాశాల నాగార్జున యూనివర్సిటీ కలిసి పనిచేస్తాయని వివరించారు. నాగార్జున యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు, సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్, ఉప విభాగాధిపతి కె.సుధీర్‌తో పాటుగా యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

యాజమాన్య చర్యలతో లాభదాయకంగా మినుము

ఘంటసాల కృషి విజ్ఞానకేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి



మినుము పైరు పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తున్న డాక్టర్ డి.సుధారాణి


కంకిపాడు: మేలైన యాజమాన్య చర్యలతో మినుము సాగు లాభదాయకంగా మారుతుందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. మండలంలోని చలివేంద్రపాలెం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మినుము పొలాలను అధికారుల బృందం రైతులతో కలిసి పరిశీలించింది. ఈ సందర్భంగా డాక్టర్ డి.సుధారాణి యాజమాన్య చర్యలను వివరించారు. సెప్టెంబరులో చల్లిన మినుము కోతకు (మినుముతీత) చేరుతుందన్నారు. ఈ దశలో పెట్టుబడులు తగ్గించుకునేందుకు చూడాలే తప్ప విచక్షణారహితంగా పురుగు మందులు వాడటం సరికాదన్నారు. వరి కోతలు పూర్తయ్యే మినుము చల్లే రైతాంగం సాగు పద్ధతులపై దృష్టి సారించాలని సూచించారు. రసం పీల్చే పురుగు ఉధృతి అధికంగా ఉండే అవకాశం ఉండటంతో రసం పీల్చేపురుగుల నివారణకు గానూ ఇమిడాక్లోప్రిడ్ 5 ఎంఎల్ కిలో విత్తనానికి పొలంలో చల్లే ముందు 12–24 గంటల ముందు పట్టించి విత్తనం చల్లుకోవాలన్నారు. తెగుళ్లలో ప్రధానంగా కనిపించే కాండం గజ్జిని అధికమించటానికి విత్తనానికి 10 గ్రాములు ట్రైకోడెర్మా విరిడి కిలో విత్తనానికి పట్టించి పొలంలో చల్లువాలన్నారు. ఏటా 30 నుంచి 40 శాతం వరకూ పంటను పొగాకు లద్దె పురుగు ఆశిస్తుందన్నారు. పురుగు నివారణకు శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ సిఫారసులను పాటించాలన్నారు. దీంతో పాటుగా ఎకరాకు లీటరు వేపనూనె ఏదైనా పురుగు మందుతో కలిపి పిచికారీ చేయటం ద్వారా ఏ దశలో అయినా పంటకు పొగాకు లద్దె పురుగు ఆశించకుండా నివారించుకోవటానికి ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత, ఏఓ పిఎం కిరణ్, సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, రైతులు దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కట్టుకోలు రవిరెడ్డి, వీఏఏ ధాత్రిక, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బైక్, సెల్‌ఫోన్ దొంగలు అరెస్ట్

విజయవాడస్పోర్ట్స్: గంజాయి, మద్యానికి బానిసలై మోటారు వాహనాలు, మొబైల్ ఫోన్‌ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు యువకులను సీసీఎస్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఆరు బైక్‌లు, ఒక ఐ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వన్‌టౌన్‌లోని సీసీఎస్ స్టేషన్ వద్ద ఏసీపీ సీహెచ్ వెంకటేశ్వర్లు, సీఐ లక్ష్మీనారాయణ బుధవారం వెల్లడించారు. భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కబేళా సెంటర్‌లో వాహనాలు తనిఖీ పోలీసులను చూసి అటుగా బైక్‌పై వస్తున్న డి.సాయితేజ, వి.కిషోర్ కంగారు పడి పారిపోయేందుకు ప్రయత్నించారని చెప్పారు. అనుమానంతో వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. భవానీపురం, టు టౌన్, సూర్యారావుపేట, గన్నవరం, మంగళగిరి ప్రాంతాల్లో ఆరు బైక్‌లను, పటమటలో ఐ ఫోన్‌ను దొంగిలించినట్లు విచారణలో అంగీకరించడంతో నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. వారి నుంచి రూ. 3.5 లక్షల విలువ చేసే బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిందితులు గతంలో జైలు జీవితం అనుభవించారు.

కృష్ణవేణికి సంగీత నీరాజనం

- రేపటి నుంచి మూడు రోజులపాటు నిర్వహణ
- మంత్రి కందుల దుర్గేష్



విజయవాడ కల్చరల్: సాంస్కృతిక, పర్యాటక శాఖ, కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో 6వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కృష్ణవేణికి సంగీత నీరాజనం కార్యక్రమాలు నిర్వహిస్తున ట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సంగీత కళాశాలలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తుమ్మలపల్లి వారి క్షేత్ర య్యా కళాక్షేత్రం ప్రధాన కేంద్రంగా శుక్రవారం ఉత్సవాలు ప్రారంభం అవుతాయని చెప్పారు. దుర్గాఘాట్ వద్ద, ఇంద్రకీలాద్రి మీద కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు కచేరీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సాంస్కృతిక శాఖ సీఈవో ఎ. శ్రీనివాస్, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ, సాంస్కృతిక శాఖ చైర్మన్ తేజస్వి పొడపాటి పాల్గొన్నారు.

సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి



ఆత్కూరు స్టేషన్‌లో పలు సూచనలు చేస్తున్న ఎస్పీ గంగాధర్

ఉంగుటూరు:ఫిర్యాదు దారుల సమస్యలు తక్షణ పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర్‌రావు సిబ్బందిని ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆత్కూరు పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. పెండింగ్ కేసుల పురోగతిని స్వయంగా పరిశీలించి, త్వరితగతిన చార్జి ఫైల్ చేయడానికి ఎస్ఐ సురేష్‌కు సూచనలు చేశారు. నేర నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు అదుపునకు విద్యాలయాల వద్ద మహిళా కానిస్టేబుల్స్ చేత ఏర్పాటు చేసిన శక్తి టీంల ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసులు, హనుమాన్ జంక్షన్ సీఐ కేవీఎస్ఎన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్ఏఎస్ పరీక్ష కేంద్రాల సందర్శన

గన్నవరం: మండలంలోని కేసరపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) పరీక్ష కేంద్రాన్ని బుధవారం ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ కేంద్రంలో ఆరో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఎన్ఏఎస్ పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించిన ఆయన విద్యాశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని సుందరయ్యనగర్ ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడవ తరగతి విద్యార్థుల ఎన్ఏఎస్ పరీక్ష కేంద్రాన్ని కూడా సందర్శించారు. విద్యార్థుల హాజరు, పరీక్ష జరుగుతున్న తీరు గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించేందుకు దేశ వ్యాప్తంగా ఎన్ఏఎస్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీవైఈఓ పద్మారాణి, ఎంఈఓ–1 కొండా రవికుమార్, ఎంఈఓ–2 ఆర్. కమల, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణరెడ్డి మృతి



గుణదల(విజయవాడ పశ్చిమ):కృష్ణా జిల్లాకు చెందిన విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి దుగ్గిరాల సత్యనారాయణ రెడ్డి(85) బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య ఉద్యమాలతో అనుబంధం ఉన్న ఆయన పదవీ విరమణ తరువాత ఇస్కఫ్, శాంతి స్నేహ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే పలువురు వామపక్ష నేతలు, న్యాయవాదులు తమ సంతాపాన్ని తెలియచేశారు.

తెలుగు నాటక రంగ అభివృద్ధికి అకాడమీ కృషి



గుమ్మడి గోపాలకృష్ణను సత్కరిస్తున్న నాటక రంగ ప్రముఖులు

విజయవాడ కల్చరల్: తెలుగు నాటక రంగ అభివృద్ధికి నాటక అకాడమీ కృషి చేస్తుందని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ అన్నారు. దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో బుధవారం నాటక రంగ ప్రముఖుల సమక్షంలో పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. గుమ్మడి గోపాల కృష్ణ మాట్లాడుతూ నాటకం తెలుగు వారి ఆత్మగా అభివర్ణించారు. కళాకారుల బకాయిలు చెల్లించడానికి కృషి చేస్తానన్నారు. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ నిజమైన కళాకారులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఏటా నంది నాటకోత్సవాలు నిర్వహించాలని సూచించారు. పర్యాటక సాంస్కృతిక శాఖామంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గుమ్మడి గోపాల కృష్ణ నాటక రంగానికే కట్టుబడిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎ.శ్రీనివాస్ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, అంబికారాజా, సింగంశెట్టి చంద్రశేఖర్, జొన్నలగడ్డ రామకృష్ణ, గుడిపాటి రాధాకృష్ణ, డాక్టర్ పీవీఎస్ కృష్ణతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాటక రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాటక అభిమానులు గుమ్మడి గోపాలకృష్ణను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమాలను మేనేజర్ శ్రీనివాస్ నిర్వహించారు.

క్లుప్తంగా

అలరించిన భక్తి సంగీతం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నగరానికి చెందిన డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య బృందం ఆలపించిన భక్తి సంగీతం ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ధర్మపథం వేదికపై డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య, పాలవర్తి ఆంజనేయశాస్త్రి, జగన్మోహిని బృంద సభ్యులు పలు కీర్తనలను వీనుల విందుగా ఆలపించారు. పాలవర్తి అంజనేయ శాస్త్రి వయోలిన్‌పై, జగన్మోహిని మృదంగంపై సహకారం అందించారు. అనంతరం ఆలయ మర్యాదలతో రామయ్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలను అందజేశారు. ఆలయ డీఈఓ రత్నరాజు రామయ్య బృందానికి అమ్మవారి చిత్రపటం అందించి అభినందించారు. కార్యక్రమానికి ఆలయ అర్చకులు చెరువు ఆదినారాయణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ఘంటసాల గాత్రం అజరామరం



విజయవాడ కల్చరల్: ఘంటసాల గాత్రశోభ అజరామరమని ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. పద్మశ్రీ ఘంటసాల సంగీత కళావేదిక ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద ఘంటసాల జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ.. ఘంటసాల పాడిన భగవద్గీత ప్రజల్లో జ్ఞాన జ్యోతిని వెలిగించిందన్నారు. చాలా మంది గాయనీగాయకులు ఘంటసాల పాటలు పాడుతూ ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నంది పురస్కారాలతో పాటు, ఘంటసాల పేరుతో పురస్కారాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ ఘంటసాల సంగీత వేదిక వ్యవస్థాపకుడు బొబ్బిలి లీలాకుమార్ మాట్లాడుతూ.. ఏటా ఘంటసాల జయంతి సందర్భంగా పేదలకు వస్త్రదానం చేస్తున్నట్లు తెలిపారు. వేముల హజరత్తయ్య గుప్తాకు ఘంటసాల స్మారక పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో పైలా సురేష్, దేవతోట నాగరాజు, నరసింహారావు పాల్గొన్నారు. గాయనీ గాయకులు హరికృష్ణ, కామేశ్వరి తదితరులు ఘంటసాల గీతాలను ఆలపించారు.

రేపటి నుంచి శ్రీసుబ్రహ్మణ్య షష్ఠి కల్యాణోత్సవాలు



మోపిదేవి: రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల ఆరు నుంచి ఎనిమిదో తేదీ వరకు శ్రీసుబ్రహ్మణ్యషష్ఠి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయని ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వర ప్రసాదరావు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల ఆరో తేదీ ఉదయం 11 గంటలకు స్వామిని పెళ్లి కుమారుడుని చేస్తామని, రాత్రి ఏడు గంటలకు యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణ, అంకురారోపణ, వాస్తుపూజ, బలిహరణ, నీరాజన తదితర పూజలు జరుగుతాయని తెలిపారు. ఏడో తేదీ ఉదయం ఆరు గంటలకు ప్రాతఃకాలార్చన, గోపూజ, నిత్యహోమం, బలిహరణ, ఉదయం 11 గంటలకు శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దివ్యకల్యాణ మహోత్సవం, నీరాజన మంత్రపుష్పాలు, సాయంత్రం ఆరు గంటలకు మయూర వాహనంపై రావివారి పాలెం వరకు శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. ఎనిమిదో తేదీ ఉదయం ఆరు గంటలకు ప్రాతఃకాలార్చన, గోపూజ, నిత్య హోమం, బలిహరణ, పంచామృతస్నపన, వసంతోత్సవం, మహాపూర్ణాహుతి నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు శేష వాహనంపై రావివారిపాలెం వరకు స్వామివారి గ్రామోత్సవం ఉంటుందని, రాత్రి ఏడు గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, ఎనిమిది గంటలకు స్వామివారి పుష్పశయ్యాలంకృత పర్యంకసేవ ఉంటుందని వివరించారు. ఉత్సవాల సమయంలో ఆర్జిత సేవలన్నీ రద్దు చేసినట్లు తెలిపారు.

దుర్గమ్మ సేవలో టీటీడీ బోర్డు సభ్యుడు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను టీటీడీ బోర్డు సభ్యుడు, ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయి బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆనందసాయికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వదించారు. ఆలయ డీఈఓ రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

నత్త నడకన పేవర్ బ్లాక్స్ పనులు

- సర్వీస్ రోడ్డు వెంబడి గోతులు తీసి వదిలేశారు
- వారాలు గడుస్తున్న పూర్తి కాని పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాణిగారితోట ప్రజలు

బ్యాంక్ వద్ద గొయ్యి తీసి వదిలేసిన దృశ్యం



కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారితోట, సర్వీస్ రోడ్డులో వీఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన పేవర్‌బ్లాక్స్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండు నెలల క్రితం 17వ డివిజన్‌లోని గుడ్ మార్నింగ్ హోటల్ ముందు సర్వీస్ రోడ్డు మార్జిన్ వెంబడి ప్రారంభమైన పేవర్‌బ్లాక్స్ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనుల్లో భాగంగా సర్వీస్ రోడ్డు వెంబడి తవ్వి కొంతమేర కంకర, బేబీ చిప్స్‌తో పూడ్చి వదిలివేయగా యూనియన్ బ్యాంక్, హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం ముందు గోతులు తీసి అలాగే వదిలేశారు. దీంతో బ్యాంక్‌కు, గ్యాస్ కార్యాలయానికి వెళ్లే మహిళలు, వృద్ధులు నానా అవస్థలు పడుతూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను రోడ్డు మీద పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు కుంచించుకుపోయి తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

ఎప్పుడు పూర్తవుతాయో..

రోడ్డు మార్జిన్ల వెంబడి దుమ్ము, ధూళి లేకుండా చూడాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంవత్సరం క్రితం కృష్ణలంకలోని 16,17 డివిజన్ల పరిధిలో పేవర్‌బ్లాక్స్ నిర్మాణ పనులు చేపట్టింది. సుమారు రూ.1.60 కోట్లతో 1.2 కిలోమీటర్ల మేర వీఎంసీ ఆధ్వర్యంలో జాతీయ రహదారి వెంబడి నేతాజీ వంతెన సమీపంలోని సాయిబాబా గుడి వద్ద నుంచి స్క్యూబ్రిడ్జి వరకు, సర్వీస్ రోడ్డులో స్క్యూబ్రిడ్జి నుంచి గుడ్‌మార్నింగ్ హోటల్ వరకు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ సమయంలో గుత్తేదారు సాయిబాబు గుడి వద్ద పనులు ప్రారంభించి సర్వీస్ రోడ్డులోని గీతా నగర్ కట్ట వరకు పూర్తి చేశారు. ఆ తర్వాత కొన్ని కారణాలతో గీతానగర్ కట్ట నుంచి గుడ్ మార్నింగ్ హోటల్ వరకు పేవర్ బ్లాక్స్ పనులు ఆగిపోయాయి. మళ్లీ రెండు నెలల క్రితం కాంట్రాక్టర్ మిగిలిన పేవర్‌బ్లాక్స్ నిర్మాణ పనులను గుడ్‌మార్నింగ్ హోటల్ నుంచి ప్రారంభించారు. ప్రారంభమైన మొదటి రెండు వారాలు పనులు చురుకుగా సాగడంతో కొంతవరకు పూర్తయింది. ఆ తర్వాత నుంచి పనుల్లో నిర్లక్ష్యం జరగడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. పనుల్లో భాగంగా సర్వీస్ రోడ్డు మార్జిన్ వెంబడి గోతులు తవ్వి వదిలివేయడంతో వ్యాపారులు, స్థానికులు రాకపోకల సమయంలో భయాందోళన చెందుతున్నారు. వారాలు గడుస్తున్న పేవర్‌బ్లాక్స్ పనులు పూర్తిచేయడంలో జాప్యం చేస్తున్నారని, ఎప్పుడు పూర్తవుతుందో ఎన్ని రోజులు అగచాట్లు పడాల్సి వస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పేవర్‌బ్లాక్స్ పనులు త్వరతిగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పేవర్‌బ్లాక్స్‌పై దర్జాగా వాహనాల పార్కింగ్

లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన పేవర్‌బ్లాక్స్‌తో నిర్మించిన ఫుట్‌పాత్‌పై కొంతమంది తమ వాహనాలను దర్జాగా పార్కింగ్ చేస్తున్నారు. 16, 17 డివిజన్లలో రోడ్డు వెంబడి బ్లాక్స్ ఏర్పాటు చేస్తుండడంతో ప్రజలు ఉదయం సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు అనుకూలంగా ఉంటుందన్న భావనతో సంతోషం వ్యక్తం చేశారు. కానీ పేవర్‌బ్లాక్స్ పనులు పూర్తయిన వెంటనే ఆటోలు, కార్లు పార్కింగ్‌కు, మెకానిక్‌లు మరమ్మతు పనులకు, చిరువ్యాపారులు వినియోగిస్తున్నారు. దీంతో వాకింగ్ చేసుకునే అవకాశం లేకుండా పోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పేవర్‌బ్లాక్స్‌తో నిర్మించిన ఫుట్‌పాత్‌పై నిలిపిన ఆటోలు



కంకర, బేబీచిప్స్‌తో నింపి పేవర్‌బ్లాక్స్ ఏర్పాటు చేయని వైనం

త్వరగా పూర్తి చేయాలి



సర్వీస్ రోడ్డులో పేవర్ బ్లాక్స్ పనులు రెండు నెలల క్రితం ప్రారంభించారు. అక్కడక్కడ పూర్తి చేశారు. జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతంలో పూర్తి చేయకుండా గోతులు తీసి అలాగే వదిలేశారు. బ్యాంక్ ముందు పెద్ద గొయ్యి ఉండడంతో ప్రమాదకరంగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఒకరి తోడు లేనిదే వెళ్లలేని పరిస్థితి. జాప్యం చేయకుండా పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలి.

– ఎస్.కృష్ణ, రాణిగారితోట

ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా పోరాడాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీపీ గౌతమిశాలి

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా పోరాడాలని డెప్యూటీ పోలీస్ కమిషనర్ గౌతమి శాలి సూచించారు. పటమట పంటకాలువ రోడ్డులోని స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో బుధవారం యాంటీ ర్యాగింగ్, ఏంటీ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ తొటివిద్యార్థులతో అమానుషంగా ప్రవర్తించే విధానమే ర్యాగింగ్ అని పేర్కొన్నారు. సీనియర్, జూనియర్ల మధ్య తత్సంబంధాలు మెరుగుపడేలా విద్యాసంస్థలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. వాటిలో పాల్గొని విద్యార్థులు కళాశాలల ప్రాంగణంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. చట్టరీత్యా ర్యాగింగ్ నేరమని, ఎవరు ప్రోత్సహించినా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల కాలంలో యువత డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. డ్రగ్స్ వాడినా, సరఫరా చేసినా నేరమేనని, డ్రగ్స్ సమాచారం తెలిస్తే 1972 టోల్‌ఫ్రీ నంబరుకు తెలపాలని కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. డ్రగ్స్ వినియోగిస్తున్న వారి సమాచారం ఇచ్చినా వారిని సక్రమైమ దారిలో ఉంచేందుకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఏసీపీ దామోదర్, పటమట సీఐ పవన్ కిషోర్, కళాశాల డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషా కుమారి, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ బ్యూలా, ఇంటర్మీడియెట్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ వున్నం స్వప్న, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

పటమటలో ఆక్రమణలు తొలగింపు



పటమటలో ఆక్రమణలను తొలగిస్తున్న పటమట ట్రాఫిక్ సీఐ రామారావు

పటమట(విజయవాడతూర్పు): రోడ్డు వెంబడి వ్యాపారాలు చేసుకునే హ్యాకర్లు ట్రాఫిక్‌కు అవరోధం కలగకుండా చూడాలని, వాహన చోదకులకు ఇబ్బందులు కల్పించొద్దని పటమట ట్రాఫిక్ సీఐ యు.రామారావు సూచించారు. పటమట సీఐ పవన్ కిషోర్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక విభాగం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ వశీం బేగ్‌తో కలిసి ఆయన బుధవారం హైస్కూల్ రోడ్డులో ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్ నిర్వహించారు. పలు ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రామారావు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో పండ్లు, కూరగాయలు, ఇతర చిరువ్యాపారులు రోడ్డును ఆక్రమించేస్తున్నారని, ఇటువైపు తరచూ ట్రాఫిక్ రద్దీ పెరిగి వాహనాల రాకపోకలకు అవరోధం కలుగుతుందని ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల సూచనల మేరకు ఆక్రమణ తొలగింపు చేపట్టామని తెలిపారు. పటమట పంటకాలువ రోడ్డు నుంచి బందరు రోడ్డు వరకు ఇరువైపులా రోడ్డును, డ్రెయిన్లపై ఆక్రమణలను వ్యాపారులకు ఇబ్బందిలేకుండా, రాకపోకలకు సమస్యల లేకుండా తొలగించామని వివరించారు. భవిష్యత్తులో ఎవరు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసినా కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అడ్డుకోవాలి



వివిధ హిందూసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బంగ్లాదేశ్‌లోని హిందువులపై జరుగుతున్న దాడులను అడ్డుకోవాలని, అందుకు ప్రతి ఒక్కరూ తమ గళాన్ని వినిపించాలని పలు హిందూ సంఘాల నాయకులు పేర్కొన్నారు. హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ నగరంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. వన్‌టౌన్‌లోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ వివిధ ప్రధాన వీధుల మీదుగా కొత్తపేట నెహ్రూ బొమ్మ సెంటర్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ సంస్థ ప్రతినిధి ఫల్గుణ దాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, హనుమాన్ పీఠాధిపతి దుర్గాప్రసాద్‌స్వామిజీ, వివిధ సంఘాల ప్రతినిధులు సాతినేని యామిని, సానా శ్రీనివాసరావు, చక్రదర్, అవ్వారు బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో మరింత నాణ్యత పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏజే వినోద్

పటమట(విజయవాడతూర్పు): తాగునీటి నిర్వహణలో నాణ్యమైన ప్రమాణాలను అమలు చేయాలని శాస్త్రవేత్త, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) విజయవాడ డైరెక్టర్ ఎం.ఎ.జె.వినోద్ సూచించారు. గుణదలలోని ఓ హోటల్‌లో బుధవారం మనక్ మంథన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్మార్ట్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, సెర్ప్, మెప్మా అధికారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వినోద్ మాట్లాడుతూ.. నగరాల్లో నీటి నిర్వహణ, పైపుల ద్వారా తాగు నీటి సరఫరా, నీటి నిర్వహణలో సాంకేతికతను మెరుగుపరచేందుకు అనువైన మార్గాలను అనుసరించాలని సూచించారు. బీఐఎస్ జాయింట్ డైరెక్టర్, సైంటిస్ట్ రమాకాంత్ సాగర్ తాగునీటి సరఫరాలో పైప్‌లైన్ ఫిట్టింగ్‌లు, నీటి అలారమ్‌లు, బిందుసేద్యం తదితర అంశాల్లో సాంకేతికతను అనుసరించాలని సూచించారు.

బంతి పూల సాగు భళా



బంతి పూల దిగుబడి ఆశాజనంగా ఉంది. పెనమలూరు మండలం వణుకూరు గ్రామ పరిధిలో బంతి పూలు సాగవుతున్నాయి. తోటలో పూలను కోస్తున్న రైతు కూలీని 'సాక్షి' కెమెరా బుధవారం క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

● తాటి బురగుంజుకు భలే డిమాండ్



బురగుంజు కొనుగోలు చేస్తున్న వాహనదారుడు (ఇన్‌సెట్‌లో) బురగుంజు

ప్రస్తుత సీజన్‌లో లభించే తాటి బురగుంజుకు ప్రజలు ఎగబడుతున్నారు. కేవలం ఈ సీజన్‌లోనే తేగలు లభిస్తాయి. తేగలు తీసేయగా మిగిలిన టెంకలను పగలకొట్టి అందులో ఉండే బురగుంజును కొందరు చిరు వ్యాపారులు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. విజయవాడ పరిసర ప్రాంతాలతో పాటుగా గ్రామీణ ప్రాంతాల్లోనూ బురగుంజు విక్రయాలు జరుగుతున్నాయి. ఒక్కో ప్యాకెట్ రూ.50కి అమ్ముతున్నారు. బురగుంజు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

– కంకిపాడు

పోటాపోటీగా రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్‌లో రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు రహస్య బ్యాలెట్ పద్ధతిలో బుధవారం మొదలయ్యాయి. డివిజన్ వ్యాప్తంగా రైల్వే ఉద్యోగులు ఎక్కడ విధులు నిర్వర్తిస్తున్నారో అక్కడే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధ, గురువారం జరిగే ఈ ఎన్నికల్లో మొదటి రోజు పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆర్‌పీఎఫ్, జిల్లా పోలీసులతో రైల్వే అధికారులు బందో బస్తు చేపట్టారు. పోటీలో ఉన్న కార్మిక సంఘం నేతలు రైల్వే స్టేషన్ వద్ద టెంట్‌లు వేసుకుని ఓటర్ల సమాచారం అందించడంతోపాటు తమ సంఘాలకు ఓటు వేసే దిశగా ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా ఎన్ఎఫ్ఐఆర్ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండి యన్ రైల్వేమెన్)లో భాగస్వామి అయిన దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, ఏఐఆర్ఎఫ్ (ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్)లో భాగస్వామి అయిన దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌లు ప్రధానంగా పోటీలో ఉన్నాయి. దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం (డీఎంఆర్‌కేఎస్) తమ గుర్తింపు కోసం పోటీలో నిలిచింది. ఎన్నికల ఫలితాలను ఈ నెల 12వ తేదీన ప్రకటిస్తారు.

స్టెల్లాలో ఎన్‌సీసీ నేవీ డే



స్టెల్లాలో జరిగిన ఎన్‌సీసీ నేవీ డే వేడుకలు

పటమట(విజయవాడతూర్పు): దేశానికి సేవ చేయాలంటే విద్యార్థులు ఎన్‌సీసీలో చేరాలని ఎన్‌సీసీ 8వ ఆంధ్ర నేవీ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ ప్రదీప్ అన్నారు. స్టెల్లా కళాశాలలో ఇండియన్ నేవీ డే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలకు కెప్టెన్ ప్రదీప్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు ఇండియన్ నేవీలో సేవలు అందించాలని, అగ్నివీర్ పథకం గురించి తెలుసుకోవాలని పేర్కొన్నారు. 1971వ సంవత్సరంలో జరిగిన యుద్ధంలో నావికా దళం చేసిన వీరత్వాన్ని ఈ సందర్భంగా క్యాడెట్లకు వివరించారు. అనంతరం సబ్ లెటునెంట్ స్వప్న మాట్లాడుతూ.. భారత్ నావికా రంగం పాత్రను వివరించారు. అనంతరం పోస్టర్ కాంపిటీషన్ విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కళాశాల నుంచి నిర్మల కాన్వెంట్ జంక్షన్ వరకు భారత నావికా దళం శాంతి ర్యాలీ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఎన్‌సీపీ అధికారులు వెంకట రమణ, రాజశేఖర్, సిద్ధార్థ కళాశాల ఎన్‌సీసీ అధికారి లెటునెంట్ వెంకటేశ్ ఆకురాతి, పలువురు ఎన్‌సీసీ క్యాడెంట్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలి

విజయవాడస్పోర్ట్స్: యూనిఫాం ధరించకుండా ఆటోలు నడిపే వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. డ్రైవర్లు యూనిఫాం ధరించకపోవడం వల్ల ట్రాఫిక్ క్రమశిక్షణకు ఇబ్బందులు వస్తున్నాయని, యూనిఫాం నిబంధనలు ఉల్లంగించి పట్టుబడిన వారికి మొదటిసారి అవగాహన కల్పిస్తామని, రెండోసారి పట్టుబడితే జరిమానా విధించడంతో పాటు నిబంధనల ఉల్లంఘన నివేదికను రవాణా శాఖ అధికారులకు సమర్పిస్తామని వెల్లడించారు. యూనిఫాం ధరించడం వల్ల డ్రైవర్‌కు గౌరవం, నైతిక బాధ్యత పెరుగుతుందని, ప్రజల భద్రత, ట్రాఫిక్ శ్రేయస్సు కోసం యూనిఫాం ధరించాలని సూచించారు.

చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలి



దర్గా ఎదుట నిరసన తెలుపుతున్న వలంటీర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, నిర్వీర్యం చేసే చర్యలకు స్వస్తి పలకాలని ఏపీ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లంక గోవిందరాజులు డిమాండ్ చేశారు. 'వలంటీర్లు ఆవేదన అల్లాకు చెబుదాం' పేరుతో సీఎం చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కూటమి నాయకులు ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ వన్‌టౌన్ పంజా సెంటర్ వద్ద ఉన్న దర్గాలో బుధవారం సాయంత్రం వలంటీర్లు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా లంక గోవిందరాజులు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కూటమి నాయకులు చేసిన ప్రకటనలు బాధాకరంగా ఉన్నాయన్నారు. ఉగాది పండగ రోజు శుభవార్త చెప్తానని నమ్మబలికిన చంద్రబాబు తమ జీవితాలను తారుమారు చేశారన్నారు. శాసనమండలి సమావేశాల్లో వలంటీర్ వ్యవస్థ లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి ప్రకటించడం విచిత్రంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులకు వలంటీర్ల వ్యవస్థ లేదనే విషయం తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలోని 2,60,000 మంది వలంటీర్లకు న్యాయం చేస్తూ ప్రకటన చేయాలన్నారు. ఆ మేరకు జీఓ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ల సంఘ రాష్ట్ర కార్యదర్శి జి.మమత, నాయకులు రాజకుమార్, దమ్ము రమేష్, అబ్దుల్ జిలాని, పూజిత, ఆశాజ్యోతి, కల్యాణి, సోనీ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
111	10
80,956	24,467

విదేశీ సూచీలు (తొలి సెంతు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	9,664	▲	183
డోజోన్స్	44,862	▲	152
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,336	▼	24
డాక్స్	20,232	▲	215
షాంఘై	3,365	▼	14
నికాయ్	39,276	▲	28

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	76,392
బంగారం (99.5 స్వచ్ఛత)	76,086
వెండి (కిలో)	90,025

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.91	85.20
£	బ్రిటన్ పౌండ్	105.12	108.21
€	యూరో	87.00	89.84
¥	జపాన్ ఎన్ (100)	45.26	61.27
AUS	ఆస్ట్రేలియా డాలర్	52.11	55.10
S$	సింగపూర్ డాలర్	60.71	63.59
SAR	సౌదీ రియాల్	21.70	23.25
UAE D	యూఏఈ దిర్హామ్	22.18	23.18
¥	చైనా యువాన్	10.79	12.62

ఎఫ్‌ఎంసీజీ.. ఆరోగ్య 'మస్తు'!



ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులకు డిమాండ్

- అందుబాటులోకి ప్రీమియం బ్రాండ్‌లు
- అధిక రేట్లున్నా తగ్గేదేలే అంటున్న కస్టమర్లు

తక్కువ కొలెస్ట్రాల్ గల నెయ్యి, వంట నూనెలు.. రోగనిరోధక శక్తిని పెంచే గోధుమ పిండి, బియ్యం.. విటమిన్లతో కూడిన టీ పొడి.. ఐరన్–విటమిన్లు పుష్కలంగా ఉన్న ఉప్పు.. ఇలా ఎఫ్‌ఎంసీజీ కంపెనీలన్నీ ఇప్పుడు ఆరోగ్య మంత్రం జపిస్తున్నాయి. ఆరోగ్య సమస్యలను నివారించే ప్రీమియం ప్రొడక్టులకు డిమాండ్ పెరుగుతుండటంతో కంపెనీలకు దండిగా అదనపు ఆదాయం సమకూరుతోంది.

- సాక్షి, బిజినెస్ డెస్క్

గజిబిజి నగర జీవితం.. జీవనశైలి ఆరోగ్య సమస్యల ప్రభావంతో ఆరోగ్యంపై మరింతగా శ్రద్ధపెట్టే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. దీంతో ఆర్గానిక్ ప్రొడక్టులు, చిరు ధాన్యాలకు తోడు ఆరోగ్యాన్ని కాపాడే ఉత్పత్తుల పేరుతో ఫంక్షనల్ ఫుడ్స్‌పై ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు ఫోకస్ చేస్తున్నాయి. తమ ప్రస్తుత ప్రోడక్ట్ జాబితాలో ఈ ప్రీమియం ఉత్పత్తులను చేర్చడం ద్వారా సరికొత్త వ్యూహానికి తెరతీశాయి. ఐటీసీ, అదానీ విల్మర్, టాటా కన్జూమర్, బిగ్‌బాస్కెట్, ఇమామీ ఆగ్రోటెక్ సహా పలు బడా కంపెనీలు ఇందులో ఉన్నాయి. ఇటీవలే ఐటీసీ 'రైట్ షిఫ్ట్' అనే కొత్త ఫుడ్ బ్రాండ్‌ను ప్రవేశపెట్టింది. 40వ పడిలోకి అడుగుపెట్టిన వారి కోసం ప్రత్యేకంగా మీల్స్, డ్రింక్స్, స్నాక్ ఉత్పత్తులను అందిస్తోంది. దీంతోపాటు తక్కువ కొలెస్ట్రాల్ నెయ్యి వంటివి కూడా ఇందులో ఉన్నాయి. సాధారణంగా విక్రయించే ఉత్పత్తుల రేంజ్‌తో పోలిస్తే వీటి రేటు 26 శాతం మేర ఎక్కువ కావడం విశేషం. అయినాసరే, కస్టమర్ల నుంచి డిమాండ్ బాగానే ఉండటం గమనార్హం. ఇక మధుమేహం (డయాబెటిక్) విషయంలో అప్రమత్తంగా ఉండే వారు, ఇమ్యూనిటీ బూస్టర్ కోరుకునే వారిని దృష్టిలో పెట్టుకుని అదానీ విల్మర్ కొత్త వంటనూనెను తీసుకొచ్చింది. సాధారణ సన్‌ఫ్లవర్ నూనె కంటే దీని ధర 22–46 శాతం అధికం! అలాగే డయాబెటిక్ వినియోగదారుల కోసం త్వరలోనే తక్కువ గ్లయిసెమిక్ ఇండెక్స్ బియ్యం, గోధుమ పిండి వంటి ప్రీమియం ప్రొడక్టులను తీసుకొచ్చే సన్నాహాల్లో ఉంది.

ఫిట్‌నెస్.. లైఫ్ స్టయిల్...

నగరాల్లో బిజీగా ఉంటూ... లైఫ్ స్టయిల్, ఫిట్‌నెస్‌పై ఫోకస్ చేసే కస్టమర్లు ప్యాకేజ్డ్ ఫుడ్‌లో ఆరోగ్యకరమైన అంశాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఐటీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హేమంత్ మాలిక్ చెబుతున్నారు. 'ప్రీమియం ఆహారోత్పత్తుల మార్కెట్ భారీగా వృద్ధి చెందుతోంది. దేశంలో ఇటువంటి ప్రత్యేకతను కోరుకునే సంపన్న కన్జూమర్ల సంఖ్య 3 కోట్లకు పైగానే ఉంది. పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ, రుచి, నాణ్యత వంటి ప్రయోజనాలను అందించే విలువ చేకూర్చిన, వినూత్న ఉత్పత్తులకు అధిక రేట్లను చెల్లించేందుకు వారు సిద్ధంగా ఉన్నారు' అని ఆయన పేర్కొన్నారు. టాటా గ్రూప్ కంపెనీ బిగ్ బాస్కెట్ తక్కువ జీఐ గల బంగాళాదుంపలను 21% ఎక్కువ రేటుతో విక్రయిస్తోంది. ఇక జీఐ తక్కువగా ఉన్న చక్కెర రేటయితే ఏకంగా 120 శాతం అధికం కావడం విశేషం. ఖపాలీ గోధుమ లేదా ఎమ్మర్ గోధుమలో ఫైబర్ మోతాదు కాస్త ఎక్కువగా ఉంటుంది. పలు బ్రాండ్‌లు ఈ గోధుమ పిండిని కేజీ రూ.150–250 మధ్య విక్రయిస్తున్నాయి. అంటే సాధారణ గోధుమ పిండితో పోలిస్తే 3–5 రెట్లు ఎక్కువ.

డిమాండ్ ఫుల్.. సరఫరా డల్

కొన్నిసార్లు తగినంత సరఫరా లేకపోవడం వల్ల కూడా రేటు భారీగా పెరిగేందుకు దారితీస్తోందని కంపెనీలు చెబుతున్నాయి. ఉదాహరణకు చాలా తక్కువ మంది రైతులు మాత్రమే తక్కువ జీఐ గల బంగాళాదుంపలను పండిస్తున్నారు. స్టాక్ తక్కువగా ఉండటం వల్ల ప్రీమియం ధరకు అమ్మాల్సి వస్తోందని బిగ్‌బాస్కెట్ చీఫ్ మర్చెండైజింగ్ ఆఫీసర్ శేషు కుమార్ చెప్పారు. మరోపక్క, ఇటువంటి ప్రీమియం ప్రొడక్టుల తయారీ కోసం టెక్నాలజీ వినియోగం వల్ల కూడా ధర పెరుగుతోందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక ప్రీమియం బ్రాండ్ల పేరుతో జేబు గుల్ల చేస్తున్న ఉదంతాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఉదాహరణకు, అమూల్ బ్రాండ్ రూ.650కి కేజీ నెయ్యిని విక్రయిస్తుండగా... వేరే బ్రాండ్‌లు 'ఏ2 నెయ్యి' పేరుతో కేజీ రూ.2,500కి పైగా ధరకు విక్రయిస్తుండటం అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో ఫుడ్ సేఫ్టీ అథారిటీ (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) ఇలాంటి ప్రొడక్టులపై ఉక్కుపాదం మోపుతోంది.

ఆటుపోట్ల మధ్య లాభాలు



- 615 పాయింట్ల మధ్య ఊగిసలాట
- చివరికి 111 పాయింట్లు అప్
- 80,956 వద్ద నిలిచిన సెన్సెక్స్
- తొలుత 81,245ను తాకిన ఇండెక్స్

ముంబై: భారీ ఆటుపోట్ల మధ్య వరుసగా నాలుగో రోజు మార్కెట్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ 111 పాయింట్లు బలపడి 80,956 వద్ద ముగిసింది. నిఫ్టీ 10 పాయింట్లు స్వల్ప లాభంతో 24,467 వద్ద నిలిచింది. అయితే తొలుత సెన్సెక్స్ 400 పాయింట్లు జంప్‌చేసింది. 81,000 పాయింట్ల మైలురాయిని అధిగమించి 81,245 వద్ద గరిష్టాన్ని తాకింది. ఈస్థాయిలో అమ్మకాలు పెరగడంతో మధ్యాహ్నానికల్లా వెనకడుగు వేసింది. లాభాలను కోల్పోయి నికరంగా 216 పాయింట్లు నష్టపోయింది. 80,630 వద్ద కనిష్టానికి చేరింది. వెరసి ఇంట్రాడేలో 615 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. ఈ బాటలో నిఫ్టీ సైతం 24,573– 24,366 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులను చవిచూసింది. ఆర్‌బీఐ పాలసీ సమీక్ష నేపథ్యంలో బ్యాంకింగ్ కౌంటర్లకు డిమాండ్ కొనసాగింది. సెన్సెక్స్ నాలుగు రోజుల్లో 2,200 పాయింట్లు జంప్‌చేయడంతో ట్రేడర్లు లాభాల స్వీకరణకు దిగినట్లు నిపుణులు పేర్కొన్నారు.

బ్యాంకుల దన్ను

బ్యాంకింగ్ రంగం మరోసారి మార్కెట్లకు అండగా నిలిచింది. ఎన్‌ఎస్‌ఈలో పీఎస్‌యూ బ్యాంక్స్, రియల్టీ 2.2 శాతం ఎగశాయి.

రూపాయి @84.75

సరికొత్త కనిష్టం



డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ మరోసారి కొత్త కనిష్టానికి చేరింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో రూపాయి తాజాగా 7 పైసలు క్షీణించి 84.75 వద్ద ముగిసింది. అంతర్జాతీయ పరిణామాలు, క్రూడ్ ధరలో అనిశ్చితి దీనికి నేపథ్యం.

యూపీఐ లైట్ వాలెట్ పరిమితి రూ. 5,000కు పెంపు



ముంబై: యూపీఐ లైట్ వాలెట్ వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా రిజర్వ్ బ్యాంక్ మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా వాలెట్ పరిమితిని రూ. 5,000కు, ఒక్కో లావాదేవీ పరిమితిని రూ. 1,000కి పెంచింది. ఇందుకు సంబంధించి 2022 జనవరిలో జారీ చేసిన 'ఆఫ్‌లైన్ ఫ్రేమ్‌వర్క్'ను సవరించింది. ప్రస్తుతం ఈ విధానంలో ఒక్కో లావాదేవీ పరిమితి రూ. 500గా, మొత్తం వాలెట్ లిమిట్ రూ. 2,000గా ఉంది.

ప్యూర్ ఈవీ కొత్త ప్లాంట్

రూ.400 కోట్లతో తెలంగాణలో ఏర్పాటు • కంపెనీ ఫౌండర్ నిశాంత్ దొంగరీ వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీలో ఉన్న హైదరాబాద్ కంపెనీ ప్యూర్ ఈవీ మరో ప్లాంటును నెలకొల్పుతోంది. హైదరాబాద్ సమీపంలో 46 ఎకరాల విస్తీర్ణంలో రానున్న ఈ కేంద్రం 2026లో కార్యరూపం దాల్చనుంది. 1,80,000 యూనిట్ల వార్షిక తయారీ సామర్థ్యంతో స్థాపించనున్న ఈ ఫెసిలిటీకి రూ.400 కోట్లు వెచ్చించనున్నట్టు ప్యూర్ ఈవీ ఫౌండర్, ఎండీ నిశాంత్ దొంగరీ బుధవారమిక్కడ మీడియాకు తెలిపారు. 1,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఇప్పటికే కంపెనీకి సంగారెడ్డి వద్ద ఏటా 50,000 యూనిట్ల సామర్థ్యంతో తయారీ కేంద్రం ఉంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా 500 మంది ఉద్యోగులున్నారు. 75 విక్రయశాలలు ఉన్నాయి. పొరుగు దేశాలకు వాహనాలను ఎగుమతి చేస్తోంది. ఇప్పటికే రూ.220 కోట్లు సమీకరించింది. మరో రూ.600 కోట్లు సమీకరించనుంది.

యూజర్ ఎక్స్‌పీరియెన్స్..

కంపెనీ 2019 నుంచి ఇప్పటివరకు 75,000 యూనిట్లను విక్రయించింది. ప్రస్తుతం నాలుగు మోడళ్లను అందుబాటులోకి తెచ్చింది. విక్రయాల్లో తెలంగాణ 40 శాతం కైవసం చేసుకుంది. భారత ఈవీ రంగంలో ఇతర కంపెనీల మోడళ్లతో పోలిస్తే ప్యూర్ ఈవీ ఈప్లూటో 7జీ మ్యాక్స్ అత్యధికంగా 151–201 కిలోమీటర్ల మైలేజీ ఇస్తోందని నిశాంత్ తెలిపారు.



'సమర్థవంతమైన ఉష్ణ నిర్వహణ కోసం బ్యాటరీల్లో నానో ఫేజ్ చేంజ్ మెటీరియల్ వాడిన తొలి కంపెనీ మాదే. ఈ సాంకేతికత బ్యాటరీ కాలిపోకుండా కాపాడుతుంది. ఈరోజు వరకు ఏ ఒక్క ప్యూర్ ఈవీ అగ్ని ప్రమాదం బారిన పడలేదు. యూజర్ ఎక్స్‌పీరియెన్స్ ఆధారంగానే వాహనాలకు ఎప్పటికప్పుడు తుది మెరుగులు దిద్దుతున్నాం. మాటలను అక్షరాల రూపంలోకి మార్చే సాంకేతికతను రిలయన్స్ జియోతో కలిసి అభివృద్ధి చేస్తున్నాం' అని వివరించారు.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

వైజాగ్ నేవల్ డాక్‌యార్డ్‌లో 275 అప్రెంటిస్‌లు

విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డ్ అప్రెంటిస్ స్కూల్.. 2025–26 బ్యాచ్‌కు సంబంధించి వివిధ ట్రేడుల్లో అప్రెంటిస్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 275. **శిక్షణ వ్యవధి:** ఏడాది.
» **ట్రేడులు:** ఎలక్ట్రీషియన్, ఫౌండ్రీమ్యాన్, మెకానిక్ డీజిల్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్, మెకానిక్ మెషిన్ టూల్ మెయింటెనెన్స్, పెయింటర్ (జనరల్), షీట్ మెటల్ వర్కర్, మెకానిక్, వెల్డర్(గ్యాస్–ఎలక్ట్రిక్), ఎలక్ట్రానిక్స్ మెకానిక్, షిప్‌రైట్(ఉడ్), ఫిట్టర్, పైప్ ఫిట్టర్, మెకానిక్ మెకాట్రానిక్స్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(సీవోపీఏ).
» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 65 శాతం మార్కులతో సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** కనిష్టంగా 14 ఏళ్లు, గరిష్ట వయోపరిమితి లేదు.
» **స్టైపెండ్:** నెలకు రూ.7,700 నుంచి రూ.8,050.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ,టెక్నికల్ స్కిల్ టెస్ట్‌లో వచ్చిన మార్కులు,సర్టిఫికేట్‌ల పరిశీలన,వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.01.2025.
» **రాతపరీక్ష తేది:** 28.02.2025.
» **వెబ్‌సైట్:** https://indiannavy.nic.in

డా.వైఎస్.ఆర్ హార్టికల్చరల్ యూనివర్శిటీలో పీజీ, పీహెచ్‌డీలో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వెంకటరామన్నగూడెం(పశ్చిమ గోదావరి)లోని డా.వై.ఎస్.ఆర్ హార్టికల్చరల్ యూనివర్శిటీ 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డా.వైఎస్సార్‌హెచ్‌యూ అనుబంధ హార్టికల్చర్ కళాశాలల్లో పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కాలేజీలు:** కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్(వెంకటరామన్నగూడెం), కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్(అనంతరాజుపేట).

కోర్సుల వివరాలు

» **ఎంఎస్సీ(హార్టికల్చర్):** రెండేళ్లు/నాలుగు సెమిస్టర్లు. **మొత్తం సీట్ల సంఖ్య:** 65
» **పీహెచ్‌డీ(హార్టికల్చర్):** మూడేళ్లు/ఆరు సెమిస్టర్లు. **మొత్తం సీట్ల సంఖ్య:** 27
» **విభాగాలు:** ఫ్రూట్ సైన్స్, వెజిటబుల్ సైన్స్, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్,ప్లాంటేషన్,స్పైసెస్,మెడిసినల్ అండ్ ఆరోమాటిక్ క్రాప్స్,పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ పాథాలజీ, ప్లాంట్ ప్రొటెక్షన్–ఎంటమాలజీ.
» **అర్హత:** పీజీ కోర్సులకు బీఎస్సీ(హార్టికల్చర్), బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్, పీహెచ్‌డీ కోర్సులకు ఎంఎస్సీ(హార్టికల్చర్), ఎంఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2024 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** పీజీ కోర్సులకు ఐకార్–ఏఐఈఈఏ(పీజీ)–2024 ర్యాంకు, పీహెచ్‌డీ కోర్సులకు ఐకార్–ఏఐసీఈ జేఆర్‌ఎఫ్/ఎస్ఆర్‌ఎఫ్(పీహెచ్‌డీ)–2024 ర్యాంక్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్, డా.వై.ఎస్.ఆర్. హార్టికల్చరల్ యూనివర్శిటీ, వెంకటరామన్నగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 17.12.2024.
» **కౌన్సెలింగ్ తేదీలు:** పీజీ కోర్సులకు 28.12.2024.
» **పీహెచ్‌డీ కోర్సులకు** 30.12.2024.
» **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

వార్షిక పరీక్షలు.. బెస్ట్ స్కోర్ ఇలా!

» ఫిబ్రవరి 15 నుంచి 10, 12 తరగతుల వార్షిక పరీక్షలు
» మార్చి 18 వరకు 10వ తరగతి, ఏప్రిల్ 4 వరకు 12వ తరగతి పరీక్షలు
» మంచి స్కోర్‌కు మార్గంగా నిలిచే ఎంసీక్యూలు, కేస్ బేస్డ్ కొశ్చన్స్
» షార్ట్ నోట్స్, మోడల్ టెస్ట్స్‌తో మంచి మార్కులకు మార్గం



సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ).. 10, 12 తరగతుల వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది! గత ఏడాది కంటే ఎంతో ముందుగానే పరీక్షల తేదీలను ప్రకటించింది! సీబీఎస్ఈ వార్షిక పరీక్షల ప్రశ్నల సరళి కొంత భిన్నంగా ఉంటుంది. విద్యార్థుల్లోని అకడమిక్ నైపుణ్యాలను పరిశీలిస్తూనే.. ఆయా అంశాలను వాస్తవ పరిస్థితుల్లో అన్వయించేలా ప్రశ్నలు అడుగుతారు. ఈ నేపథ్యంలో.. సీబీఎస్ఈ 10, 12 తరగతుల పరీక్ష విధానం, మంచి స్కోర్‌కు మార్గాలపై ప్రత్యేక కథనం..

ఫిబ్రవరి 15 నుంచి పరీక్షలు

సీబీఎస్ఈ 10, 12 తరగతుల వార్షిక పరీక్షలను 2025 ఫిబ్రవరి 15 నుంచి నిర్వహించనున్నారు. 10వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 10 నుంచి మార్చి 18 వరకు; 12వ తరగతి (+2) పరీక్షలను ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహిస్తారు. ఒక్కో పేపర్‌కు మధ్య కనీసం నాలుగైదు రోజుల వ్యవధి ఉంటోంది. దీంతో విద్యార్థులు ఒక పేపర్ తర్వాత మరో పేపర్‌కు తుది దశ ప్రిపరేషన్‌కు సమయం అందుబాటులో ఉంటుంది.

10వ తరగతి.. 80 మార్కులకు

సీబీఎస్ఈ అకడమిక్ బోధన విధానాల ప్రకారం–పదో తరగతిలో ప్రతి సబ్జెక్ట్‌లో 80 మార్కులకు వార్షిక పరీక్షలు నిర్వహిస్తారు. మరో 20 మార్కులకు పాఠశాల స్థాయిలో ఇంటర్నల్ అసెస్‌మెంట్స్ ఉంటాయి. వార్షిక పరీక్షల్లో 50 శాతం ప్రశ్నలు సామర్థ్య ఆధారిత ప్రశ్నలు, కేస్ స్టడీ బేస్డ్ ప్రశ్నలు అడుగుతారు. వీటితోపాటు స్వల్ప సమాధాన ప్రశ్నలు, దీర్ఘ సమాధాన ప్రశ్నలు కూడా ఉంటాయి.

మ్యాథమెటిక్స్(బేసిక్)

ఇందులో మొదటి విభాగంలో 20 బహుళైచ్ఛిక ప్రశ్నలు (20 మార్కులు); రెండో విభాగంలో 5 స్వల్ప సమాధాన ప్రశ్నలు (10 మార్కులు); మూడో విభాగంలో 6 స్వల్ప సమాధాన ప్రశ్నలు (18 మార్కులు); నాలుగో విభాగంలో 4 దీర్ఘ సమాధాన ప్రశ్నలు (20 మార్కులు); అయిదో విభాగంలో సోర్స్ బేస్డ్, కేస్ బేస్డ్, ప్యాసేజ్ బేస్డ్ ప్రశ్నలు 3 (12 మార్కులు) అడుగుతారు.

సైన్స్

ఈ సబ్జెక్ట్‌లో మొదటి విభాగంలో 20 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు (20 మార్కులు); రెండో విభాగంలో అతి స్వల్ప సమాధాన ప్రశ్నలు 6 (12 మార్కులు); మూడో విభాగంలో స్వల్ప సమాధాన ప్రశ్నలు 7 (21 మార్కులు); నాలుగో విభాగంలో దీర్ఘ సమాధాన ప్రశ్నలు 3 (15 మార్కులు); అయిదో విభాగంలో సోర్స్/కేస్ బేస్డ్ ప్రశ్నలు 3 (12 మార్కులు) ఉంటాయి.

సోషల్ సైన్స్

ఈ సబ్జెక్ట్‌లో కూడా మొదటి విభాగంలో 20 బహుళైచ్ఛిక ప్రశ్నలు (20 మార్కులు); రెండో విభాగంలో అతి స్వల్ప సమాధాన ప్రశ్నలు 4 (8 మార్కులు); మూడో విభాగంలో స్వల్ప సమాధాన ప్రశ్నలు 5 (15 మార్కులు); నాలుగో విభాగంలో లాంగ్ ఆన్సర్ కొశ్చన్స్ 4 (20 మార్కులు); అయిదో విభాగంలో కేస్ బేస్డ్ కొశ్చన్స్ 3 (12 మార్కులు); అయిదో విభాగంలో మ్యాప్ ఆధారిత ప్రశ్న 1 (5 మార్కులు)తో పరీక్ష పత్రం ఉంటుంది.

ఇంగ్లిష్

ఈ సబ్జెక్ట్‌లో మొదటి విభాగంలో రీడింగ్ (20 మార్కులు); రెండో విభాగంలో రైటింగ్,గ్రామర్(20 మార్కులు), మూడో విభాగంలో లిటరేచర్ (40 మార్కులు)ఉంటాయి. రీడింగ్ విభాగంలో ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. రైటింగ్, గ్రామర్ విభాగంలో 10 ప్రశ్నలు గ్రామర్ నుంచి, 5 మార్కులకు లెటర్ రైటింగ్, మరో 5 మార్కులకు ప్రెసిస్ రైటింగ్ ఉంటాయి. మూడో విభాగంలో గద్య భాగం, పద్య భాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

హిందీ

హిందీ సబ్జెక్ట్‌లో అపరిచిత పద్యం (5 మార్కులు), అపరచిత గద్యం (5 మార్కులు); గ్రామర్ (16 మార్కులు); లిటరేచర్ పద్యం, గద్యం (14 మార్కులు); రెండో భాగంలో పద్య భాగంలో షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్ గద్య భాగంలో వెరీ షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్; సప్లిమెంటరీ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ విభాగానికి 20 మార్కులు ఉంటాయి. రైటింగ్ విభాగంలో ప్యాసేజ్ రైటింగ్, లెటర్ రైటింగ్, రెజ్యూమే/ ఈ–మెయిల్ రైటింగ్; లెటర్ రైటింగ్/అడ్వర్టయిజ్‌మెంట్ రైటింగ్‌లతో 20 మార్కులకు మరో విభాగం ఉంటుంది.

12వ తరగతి.. మెడికల్, నాన్-మెడికల్

సీబీఎస్ఈ 12వ తరగతి(+2) పరీక్షలను మెడికల్, నాన్–మెడికల్ అనే రెండు విభాగాలుగా నిర్వహిస్తారు. రాష్ట్రాల బోర్డ్ స్థాయిలో ఎంపీసీకి సరితూగే విధంగా నాన్-మెడికల్ విభాగంలోని సబ్జెక్ట్‌లు (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్, హిందీ) ఉంటాయి. బైపీసీకి సరితూగే మెడికల్ విభాగంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్ట్‌లలో పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది. సీఈసీకి సరితూగేలా కామర్స్ స్ట్రీమ్‌లో అకౌంటెన్సీ, బిజినెస్ స్టడీస్, ఎకనామిక్స్, ఇంగ్లిష్, హిందీలు; హెచ్ఈసీకి సరితూగేలా జాగ్రఫీ, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్ట్‌లు ఉంటాయి.

మ్యాథమెటిక్స్

12వ తరగతి స్థాయిలో ఎంతో కీలకంగా భావించే మ్యాథమెటిక్స్ పరీక్ష 80 మార్కులకు ఉంటుంది. సెక్షన్–ఎలో 18 ఎంసీక్యూలు, 2 అసెర్షన్ అండ్ రీజన్ ప్రశ్నలు (20 మార్కులు); సెక్షన్–బిలో 5 వెరీ షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్ (10 మార్కులు); సెక్షన్–సిలో 6 షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్ (18 ప్రశ్నలు); సెక్షన్–డిలో 4 లాంగ్ ఆన్సర్ కొశ్చన్స్ (20 మార్కులు); సెక్షన్–ఇలో సోర్స్/కేస్/ప్యాసేజ్ బేస్డ్/ఇంటిగ్రేటెడ్ యూనిట్స్ ప్రశ్నలు 4 (12 మార్కులు) అడుగుతారు.

ఫిజిక్స్

ఫిజిక్స్‌లో మాత్రం 70 మార్కులకే పరీక్ష ఉంటుంది. సెక్షన్–ఎలో 16 ఎంసీక్యూలు, సెక్షన్–బిలో 5 షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్ (10 మార్కులు); సెక్షన్–సిలో 3 మార్కుల ప్రశ్నలు 7 (21 మార్కులు); సెక్షన్–డిలో 2 కేస్ స్టడీ బేస్డ్ ప్రశ్నలు (8 మార్కులు) అడుగుతారు.

కెమిస్ట్రీ

కెమిస్ట్రీలో 70 మార్కులకే పరీక్ష నిర్వహిస్తారు. సెక్షన్–ఎలో 16 ఎంసీక్యూలు (16 మార్కులు); సెక్షన్–బిలో 5 వెరీ షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్ (10 మార్కులు); సెక్షన్–సిలో 7 షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్ (21 మార్కులు); సెక్షన్–డిలో 2 కేస్ బేస్డ్ ప్రశ్నలు (8 మార్కులు); సెక్షన్–ఇలో 3 లాంగ్ ఆన్సర్ కొశ్చన్స్ (15 మార్కులు) ఉంటాయి.

బయాలజీ

బయాలజీలో సెక్షన్–ఎ లో 16 ఎంసీక్యూలు (16 మార్కులు); సెక్షన్–బిలో వెరీ షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్ (10 మార్కులు); సెక్షన్–సిలో 7 షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్ (21 మార్కులు); సెక్షన్–డిలో 2 కేస్ ఆధారిత ప్రశ్నలు (8 మార్కులు); సెక్షన్–ఇలో 3 లాంగ్ ఆన్సర్ కొశ్చన్స్ (15 మార్కులు) అడుగుతారు.

సిలబస్‌పై పట్టు

సీబీఎస్ఈ 10,12 తరగతుల వార్షిక పరీక్షల్లో మంచి స్కోర్ సాధించాలంటే.. విద్యార్థులు ముందుగా సిలబస్‌పై పట్టు సాధించాలి. సీబీఎస్ఈ విధానం ప్రకారం–ఆయా సబ్జెక్ట్‌లలో సదరు అంశాలకు లభిస్తున్న వెయిటేజీని గుర్తించి.. అధిక వెయిటేజీ ఉన్న అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.

పరీక్ష విధానంపై అవగాహన

వార్షిక పరీక్షలకు ఇప్పటి నుంచి నిర్దిష్ట స్టడీ షెడ్యూల్‌ను రూపొందించుకోవాలి. తాము కష్టంగా భావించే సబ్జెక్ట్‌లకు ఎక్కువ సమయం కేటాయించాలి. ప్రతిరోజు తరగతి అభ్యసనానికి అదనంగా కనీసం ఆరు గంటలు ప్రిపరేషన్ కొనసాగించాలి. సిలబస్‌పై పట్టు సాధించడంతోపాటు.. పరీక్ష విధానంపైనా సీబీఎస్ఈ విద్యార్థులు అవగాహన ఏర్పరచుకోవాలి. సీబీఎస్ఈ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న నమూనా ప్రశ్న పత్రాలను పరిశీలించాలి. అదే విధంగా.. పాఠశాల, కళాశాల స్థాయిలో నిర్వహిస్తున్న పరీక్షలను అవగతం చేసుకోవాలి.

ఎంసీక్యూలకు సంసిద్ధంగా

సీబీఎస్ఈ పరీక్షలో ఎంసీక్యూ(బహుళైచ్ఛిక ప్రశ్నలు)లు కూడా అడుగుతారు. వీటికి సమాధానం ఇచ్చేందుకు కూడా ఇప్పటి నుంచే సన్నద్ధత పొందాలి. ఒక ప్రశ్నకు ఇచ్చిన నాలుగు ఆప్షన్లలో సరైన ఆప్షన్ గుర్తించేందుకు.. సదరు ఆప్షన్ వెంటనే స్ఫురించేలా ప్రిపరేషన్ సాగించాలి. ఇందుకోసం.. ఆయా సబ్జెక్ట్‌లలో ఫార్ములాలు, కాన్సెప్ట్‌లు, నిర్వచనాలను అవగాహన చేసుకోవాలి.

రివిజన్‌కు సమయం

ప్రిపరేషన్‌లో భాగంగా విద్యార్థులు రివిజన్‌కు సమయం కేటాయించుకోవాలి. ఫిబ్రవరి 15 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు.. కనీసం రెండు వారాల ముందు నుంచి పూర్తిగా రివిజన్‌పై దృష్టి పెట్టాలి. ప్రతిరోజు అన్ని సబ్జెక్ట్‌లను రివిజన్ చేసుకునేలా సమయం కేటాయించాలి.

జేఈఈతో సమన్వయం

సీబీఎస్ఈ 12వ తరగతి విద్యార్థులు జేఈఈ–మెయిన్‌తోపాటు వార్షిక పరీక్షలకు ఏకకాలంలో సన్నద్ధత పొందాల్సి ఉంటుంది. జేఈఈ–మెయిన్ 2025 జనవరి సెషన్ పరీక్షలను 2025 జనవరి 22 నుంచి నిర్వహించనున్నారు. జనవరి సెషన్‌కు హాజరయ్యే 12వ తరగతి విద్యార్థులు జనవరి 10వ తేదీ నాటికి ఈ రెండు పరీక్షలకు ఉమ్మడి ప్రిపరేషన్ పూర్తచేయాలి. ఆ తర్వాత జేఈఈ–మెయిన్ పరీక్ష తేదీ వరకు ఆ పరీక్షకు సన్నద్ధం కావాలి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

రఘురామ కేసులో ముగ్గురి విచారణ

ఒంగోలు టౌన్: మాజీ ఎంపీ ప్రస్తుత ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో గుంటూరు జీజీహెచ్‌కు చెందిన ఇద్దరు అధికారులు, సిబ్బంది ఒకరు ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఎదుట విచారణకు హాజరయ్యారు. జీజీహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ రాజేంద్ర, ఈసీజీ టెక్నీషియన్ నాగరాజు ఉదయం 11 గంటలకు ఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. ఎస్పీ తన చాంబర్‌లోకి ఒక్కొక్కరిని పిలిచి «ఆ రోజు ఏమి జరిగింది» అంటూ ఆరా తీసినట్లు సమాచారం.


ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, లారీ ఢీ లారీ డ్రైవర్ మృతి

రాజంపేట: కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని భువనగిరిపల్లె ఆర్చి(అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం) వద్ద బుధవారం తెల్లవారుజామున ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, లారీ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా దేవరపురి తాలూకా ఇబ్రహీంపట్నంకు చెందిన లారీ డ్రైవర్ పరమానంద సిద్దప్ప (35) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... తిరుపతి నుంచి హైదరాబాదుకు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు పట్టణ సరిహద్దులో ఉన్న భువనగిరిపల్లె ఆర్చి వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి, ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొంది. బస్సు డ్రైవర్ లోకేష్‌రెడ్డితోపాటు హైదరాబాదు చందానగర్‌కు చెందిన తనూజ, కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన ఎం.ప్రవీణ్, సునీల్‌కు గాయాలయ్యాయి. వీరిని రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. రోడ్డు ప్రమాదం సంఘటనతో హైవేలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు రంగప్రవేశంచేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

సూపర్‌సిక్స్ హామీలతో ప్రజలను మోసం చేసిన చంద్రబాబు

సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చారని, ఆర్నెల్ల కాలంగా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. చంద్రబాబు హామీ సూపర్ సిక్స్ అవుతుందా? లేక పెద్ద సున్నా అవుతుందో కాలమే నిర్ణయిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలకు కావాల్సింది సూపర్ సిక్స్ కాదని, పీపుల్స్ సిక్స్ కావాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ డిమాండ్ చేస్తోందన్నారు. బుధవారం విజయవాడలోని జింఖానా మైదానంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ప్రజా హక్కుల సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ చంద్రబాబునాయుడు పాత చంద్రబాబు కాదని, ఆయన ఢిల్లీలో మోడీకి సహాయం చేస్తూ.. రాష్ట్రంలో ఆయన సహాయం తీసుకుంటున్నారన్నారు.ఆ విధంగా పరోక్షంగా బీజేపీ రాష్ట్రంలోకి ప్రవేశించిందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపిందన్నారు. అదానీ అవినీతిపై చంద్రబాబు, మోడీ నోరు మెదపడం లేదన్నారు. పార్లమెంట్‌లోనూ దీనిపై చర్చించడం లేదన్నారు. తక్షణమే అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సభలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మూర్తి, పొలిట్‌బ్యూరో సభ్యులు శంకర్, ఆర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.



కోనలో జలసవ్వడి

ఫెంగల్ తుఫాన్ కారణంగా ప్రకాశం జిల్లా సీఎస్‌పురంతోపాటు మండలంలోని పర్యాటక పుణ్య క్షేత్రం భైరవకోన, వివిధ గ్రామాల్లో భారీవర్షం కురిసింది. భైరవకోనలో జలపాతం నీరు తెల్లని పాలధారవలె నురగలతో సవ్వడి చేస్తూ ఉధృతంగా జాలువారుతోంది. భైరవకోనకు వెళ్లే మార్గంలో ఉన్న వంకలు, వాగులు జలకళను సంతరించుకోగా నీరు సప్తాలపై పారింది. త్రిముఖ దుర్గాదేవి ఆలయంలోకి ప్రవేశించిన జలపాతం నీరు అమ్మవారి పాదాలను తాకింది. వర్షాల కారణంగా జలపాతం ఉధృతిగా ఉండటంతో బుధవారం రాకపోకలు నిలిపేస్తున్నామని, భక్తులు, సందర్శకులు సహకరించాలని ఆలయ ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి తెలిపారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

– సీఎస్‌పురం(పామూరు)



నింగి నుంచి రాలి.. నీటి ముత్యాలై నిలిచి !

చూసే కళ్లు.. స్పందించే హృదయం ఉంటే ప్రకృతిలో ప్రతిదీ ఓ అద్భుతంగా కనిపిస్తోంది. తుపాన్ ప్రభావంతో కర్నూలు నగరంలో చిరు జల్లులు కురిశాయి. ఆ సమయంలో వాన చినుకులు విద్యుత్ తీగలపై నిలిచి నీటి ముత్యాలను తలపించాయి. తీక్షణంగా వాటిని చూస్తే ఎవరో నీటి బిందువులను తీగలపై పేర్చి పుడమికి ముత్యాల పందిరి వేసినట్లుగా అనిపించింది. దూరం నుంచి చూస్తే తళుక్కుమంటూ మెరిసి ఆకట్టుకున్నాయి.

– సాక్షిఫొటో గ్రాఫర్, కర్నూలు



తిమ్మమ్మమర్రిమాను బాహ్య చిత్రం

నిర్లక్ష్యం ఊడలు.. మర్రికి చెదలు!

తిమ్మమ్మమర్రిమాను... 669 సంవత్సరాల చరిత్ర. 8.15 ఎకరాల్లో విస్తరించి... 1350కిపైగా ఊడలతో వ్యాపించింది. ప్రపంచంలోనే అతిపెద్ద మర్రిమానుగా ఏకంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకుంది. కానీ అభివృద్ధికి మాత్రం ఆమడదూరంలో నిలిచింది. దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నా.. కనీస సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలం కావడంతో తిమ్మమ్మ మర్రిమాను ఖ్యాతికి చెదలు పడుతోంది

తిమ్మమ్మ మర్రిమాను ప్రపంచ ప్రఖ్యాతి

- దేశ విదేశాల నుంచి తరలివస్తున్న పర్యాటకులు
- కనీస సౌకర్యాలు లేక సతమతం
- తాగే నీరూ దొరకని వైనం
- రవాణా సౌకర్యం లేక సగం మంది వెనక్కి
- అభివృద్ధి చేసి ఆదరణ కల్పించాలని కోరుతున్న స్థానికులు

అభివృద్ధి పనులు డిమాండ్ ఇలా..

- తిమ్మమాంబ అమ్మవారి దర్శనం అనంతరం పర్యాటకులు మర్రిమాను పరిసర ప్రాంతంలో సేద తీరడం కోసం పార్కు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.
- పర్యాటకులను ఆకర్షించేందుకు మరిన్ని వణ్య ప్రాణులను తీసుకురావడం, ఆటస్థలాన్ని అభివృద్ధి చేయాలి.
- పర్యాటకుల కోసం విశ్రాంతి భవనం, నీటి, మరుగుదొడ్ల వసతి కల్పించాలి. రోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహించాలి. మర్రిమాను పరిసర ప్రాంతాల్లో వివిధ రకాల పూలమొక్కలు పెంచి అందంగా తీర్చిదిద్దాలి.
- మర్రిచెట్టు ఉన్న విస్తీర్ణంలో మీటరు ఎత్తున కొత్త మట్టిని తోలించి, వాలిన ఊడలను సంరక్షించాలి.
- తిమ్మమ్మమర్రిమానుకు పడమర వైపున ఓబుళదేవరగుట్టపై 10 ఏళ్ల క్రితం టీటీడీ వారు వెంకటేశ్వస్వామి ఆలయం నిర్మించారు. కానీ ఇంత వరకు విగ్రహప్రతిష్ట చేయలేదు. దీంతో ఆ ఆలయ ప్రదేశం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. వెంటనే విగ్రహ ప్రతిష్ట చేసి ఆలయంలో పూజలు ప్రారంభిస్తే ఈప్రాంతానికి భక్తుల రాక పెరుగుతుంది.

ఎన్పీకుంట: సత్యసాయి జిల్లాలోని నంబులపూలకుంట (ఎన్పీకుంట) మండలం గూటిబైలు గ్రామంలోని తిమ్మమ్మమర్రిమాను చరిత్ర అమోఘం. అభివృద్ధి మాత్రం దారుణం. అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన ఈ అతిపెద్ద మర్రిమాను గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఫలితంగా సౌకర్యాలు కరువయ్యాయి.

మర్రిమాను చరిత్ర..

దిగువగూటిబైలు గ్రామానికి చెందిన తిమ్మమాంబ భర్త బాలవీరయ్యతో కలిసి 1355లో సతీసహగమనం చేసినట్లు ఇక్కడి చరిత్ర చెబుతోంది. ఆ సమయంలో చితికి నాలుగు వైపులా నాటిన ఎండు మర్రిగుంజల్లో ఈశాన్యం వైపు నాటిన గుంజ చిగురించి, నేడు మహావృక్షంగా మారి చరిత్ర పుటల్లోకి ఎక్కింది. 8.15 ఎకరాల్లో విస్తరించి ఉన్న తిమ్మమ్మమర్రిమాను కర్ణాటక రాష్ట్రానికి చెందిన జర్నలిస్ట్ సత్యనారాయణ అయ్యర్ కృషి ఫలితంగా 1989లో గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు దక్కించుకుంది.

సౌకర్యాలు కరువు..

తిమ్మమ్మమర్రిమాను గురించి తెలుసుకుని పొరుగు రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా ఎంతో ఆసక్తితో పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడిదాకా వచ్చిన వారికి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో అమ్మవారిని దర్శించుకుని తిరుగుముఖం పడుతున్నారు. కనీసం తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేకపోవడంతో వెంటనే వెళ్లిపోతున్నారు. మరోవైపు పర్యవేక్షణ కరువై ఊడలు కూడా చెదలు పడుతున్నాయి.

అటవీశాఖ ఆధీనంలోకి తీసుకున్నా..

1990వ సంవత్సరంలో తిమ్మమ్మమర్రిమాను అటవీ అభివృద్ధి శాఖ ఆధీనంలోకి తీసుకుంది. పార్కు, షెడ్డు ఏర్పాటు చేసి కొన్ని వన్యప్రాణులను తీసుకువచ్చి అందులో ఉంచింది. సమీపంలోని 27 ఎకరాలు కూడా సేకరించింది. కానీ ఆ తర్వాత నిర్వహణ గురించి పట్టించుకోలేదు. ఫలితంగా అభివృద్ధి కుంటుపడింది. పార్కులో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వన్యప్రాణుల షెడ్డులో జింకలు, కుందేళ్లు, నెమళ్లు మాత్రమే ఉన్నాయి.

భూమి కోత.. ఊడలకు చెదలు..

గతంలో దట్టమైన ఆకులతో మర్రిమాను కళకళలాడుతూ ఉండేది. పర్యాటకులు కూడా మర్రిమాను కింద సేదతీరేవారు. అటవీశాఖ ఆధీనంలోకి తీసుకున్నాక చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఎప్పుడో ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మాత్రం శుభ్రత చర్యలు చేపడుతున్నారు. దీంతో ప్రస్తుతం మర్రిమాను లోపలిభాగంలో కొన్ని చోట్ల భూమి కోతకు గురైంది. భూసారం తగ్గి ఆకులు రాలిపోవడంతో పాటు, చెట్టు సైతం నేల వాలింది. మరికొన్ని చోట్ల ఊడలకు చెదలు పట్టింది. వెంటనే ప్రభుత్వాలు తిమ్మమ్మమర్రిమాను సంరక్షణకు చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.



తిమ్మమాంబ ఆలయంలో అమ్మవారు



మర్రిమాను వద్ద ఉన్న తిమ్మమాంబ ఆలయం



నిర్వహణ లోపంతో నిరుపయోగంగా ఉన్న ఆటస్థలం



మర్రిమాను లోపలి భాగంలో కూలిన మర్రి ఊడ



కోతకు గురై భూసారం తగ్గడంతో ఆకులు రాలిన దృశ్యం

వసతులు కల్పించాలి



మేము ఏటా మర్రిమానును సందర్శిస్తాము. గతంలో బాగుండేది. ప్రస్తుతం సౌకర్యాలు లేవు. అమ్మవారిని దర్శించి వెళ్లాల్సి వస్తోంది. మధ్యాహ్న సమయంలో భోజన వసతి కూడా ఉండదు. పిల్లలు ఆడుకోవడానికి పార్కు, ఆటస్థలం అభివృద్ధి చేయాలి. నీటి, భోజన వసతి కల్పిస్తే బాగుంటుంది. అలాగే మర్రి ఊడలు చెదలు పట్టకుండా కాపాడాలి.

– సి.నాగార్జునరెడ్డి, యాత్రికుడు, అనంతపురం

సౌకర్యాలు కరువు



తిమ్మమ్మమర్రిమాను దర్శనానికి వస్తే ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. అమ్మవారి దర్శనం తరువాత సేద తీరడానికి అవకాశమే లేదు. మరుగు దొడ్లు, విశ్రాంతి భవనాలు లేవు. ఆటస్థలంలో క్రీడాపరికరాలు ఏవీ లేవు. అలాగే మర్రిమాను కింద సేదదీరే ఏర్పాట్లు లేకపోవడంతో దూరం నుంచే చూసి వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వాలు చర్యలు తీసుకొని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుంది.

– రవికుమార్, యాత్రికుడు, అనంతపురం

సంక్రాంతి మూడు రోజుల్లో ఎంతోమంది జీవితాలను ఛిన్నాభిన్నం చేసే ఈ పందేల జూదం ఇప్పుడు ఎప్పుడు పడితే అప్పుడు నిర్వహిస్తుండటంతో సామాన్యుల జీవితాలపై ప్రభావం చూపిస్తోంది. పందేల మోజులో ఎంతోమంది తమ కష్టార్జితాన్ని కోల్పోతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో కొన్నాళ్లుగా కోడిపందేలు నిర్వహిస్తున్నా, టీడీపీ నేతల ప్రమేయం ఉండడంతో పోలీసులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.



బరితెగింపు

- పశ్చిమ గోదావరి జిల్లాలో యథేచ్ఛగా కోడి పందేలు
- గుట్టుచప్పుడు కాకుండా రహస్య ప్రదేశాల్లో బరుల ఏర్పాటు
- ఫోన్ల ద్వారా పందెంరాయుళ్లకు సమాచారం
- చేతులు మారుతున్న కోట్ల రూపాయలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు



దిరుసుమర్రులో పందెం పుంజులున్న సంచులతో పందెంరాయుళ్లు

సాక్షి, భీమవరం: కూటమి నేతలు బరితెగించారు. రహస్య ప్రదేశాల్లో బరులు ఏర్పాటుచేసి యథేచ్ఛగా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా తెల్లవార్లు సాగుతున్న ఈ పందేల్లో కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయి. పోలీసులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. సంక్రాంతికి బరులు ఏర్పాటుచేసి కోడి పందేలు నిర్వహించడం పరిపాటి. నిబంధనలకు విరుద్ధమే అయినా సంప్రదాయం మాటున బాహాటంగానే సాగిపోతుంటాయి. పండుగ మూడు రోజులు పోలీసులు బరుల వైపు కన్నెత్తి చూడరు. ఇది ఏటా జరిగేదే అయినా కూటమి అధికారంలోకి వచ్చాక ఎప్పుడుపడితే అప్పుడు.. ఎక్కడపడితే అక్కడ అన్నట్టుగా కూటమి నేతలు యథేచ్ఛగా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. గత కొద్దిరోజులుగా భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో, జిల్లాలోని ఏదోక చోట చిన్న స్థాయి నుంచి భారీ స్థాయిలో కోడి పందేలు సాగుతున్నాయి. రాత్రి పది గంటల నుంచి తెల్లవారే వరకు వీటిని నిర్వహిస్తున్నారు. ఏలూరు జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేతో పాటు టీడీపీకి చెందిన ముఖ్యనేత ఒకరు కొన్ని పందేలకు హాజరై దగ్గరుండి జరిపించినట్టు తెలిసింది. జిల్లాకు చెందిన కొందరు ప్రజాప్రతినిధుల అండదండలుండటం, నిర్వాహకుల నుంచి భారీగానే ముడుపులు అందుతుండటంతో కోడి పందేల వైపు పోలీసులు కన్నెత్తి చూడటం లేదన్న ప్రచారం జరుగుతోంది.

రోజుకో చోట :

మొదట్లో ఉండిలోని మారుమూల ప్రాంతంలో కోడి పందేలు ఏర్పాటుచేయగా తర్వాత ఎమ్మార్పీ అగ్రహారంలో మూతపడిన ఓ ఫ్యాక్టరీ గోడౌన్ వద్ద పందేలు నిర్వహించారు. దీపావళి రోజున దొంగపిండి గ్రామంలోని చేపల చెరువుల వద్ద, ఇటీవల అధికార పార్టీ నేత పుట్టినరోజు వేడుకల్లో భాగంగా కాళ్ల మండలం సీసలిలోని తోటల్లో ఫ్లడ్ లైట్ల వెలుతురులో భారీ స్థాయిలో పందేలను నిర్వహించినట్టు సమాచారం. భీమవరం రూరల్ వెంప, శ్రీరాంపురం పరిసరాల్లో వారంలో మూడునాలుగు రోజులు పాటు తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు పందేలు నిర్వహిస్తున్నట్టు తెలిసింది. రెండు రోజుల క్రితం దిరుసుమర్రులో భారీ స్థాయిలో పందెం నిర్వహణకు ఏర్పాట్లు చేయగా పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. వారి ఆదేశాలతో పోలీసులు వస్తున్న సమాచారం తెలిసి పందెంరాయుళ్లు అక్కడి నుంచి జారుకున్నారు. పందెంరాయుళ్లు పందెం పుంజుల సంచులతో అక్కడికి నుంచి వెళ్లిపోతున్న వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఉండి మండల శివారు పాండవ సరిహద్దు ప్రాంతంలో పందేల సమాచారం తెలిసి స్థానిక పోలీసులు చేరే సరికి పందెంరాయుళ్లు అక్కడి గణపవరం సరిహద్దుల్లోకి పరారై అక్కడ నిర్వహించినట్టు తెలిసింది.

ఒకరోజు ముందే సమాచారం

విశ్వసనీయ సమాచారం మేరకు పందేలు ఎప్పుడు నిర్వహించేది ఒక రోజు ముందు పందెంరాయుళ్లకు నిర్వాహకులు ఫోన్ల ద్వారా సమాచారం అందిస్తున్నారు. ఏ గ్రామంలో ఎక్కడ జరిగేది పందెం రోజున తెలియజేస్తున్నారు. ఇందుకోసం ముఖ్యమైన వారితో ఒక వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేసుకుని అందులో సమాచారం పెడుతున్నట్టు తెలుస్తోంది. జన సంచారం తక్కువగా ఉండే రహస్య ప్రదేశాల్లో బరులకు ఏర్పాట్లు చేస్తున్నారు. బారికేడ్లు, ఫ్లడ్‌లైట్ల కోసం అవసరమైన సామగ్రి, జనరేటర్లు సిద్ధంగా ఉంచుకుని పూటలోనే బరిని సిద్ధం చేస్తున్నారు. పెద్ద బరులకు వచ్చే వారికి ముందుగానే టోకెన్లు ఇవ్వడం ద్వారా అవి ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో పాటు రాజమహేంద్రవరం, కృష్ణా జిల్లా నుంచి పందెంరాయుళ్లు తరలివస్తున్నారు. పెద్ద బరిలో రాత్రి నుంచి తెల్లవారే వరకు 15 నుంచి 20 వరకు పందేలు జరుగుతుంటే, తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు నిర్వహిస్తున్న చిన్న బరుల్లో ఆరేడు వరకు పందాలు నిర్వహిస్తున్నారు. పందెంతో పాటు పై బెట్టింగుల రూపంలో రూ.3 కోట్ల వరకు చేతులు మారుతున్నాయి. అధికారపార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి కోడిపందేల పట్ల పోలీసు యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 01 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 60,301 మంది స్వామిని దర్శించుకున్నారు. 20,222 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.32 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.



జర్మన్ భాషపై తిరుపతిలో శిక్షణ

తిరుపతి అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నేతృత్వంలో జర్మన్ భాషపై శిక్షణ, తర్వాత ఉద్యోగ కల్పనకు కృషి చేస్తున్నట్టు ఆ విభాగం జిల్లా అధికారి ఆర్.లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థతోపాటు ఓఎంసీఏపీ, ఎస్ఎం కేర్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు వెల్లడించారు. జనరల్ నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్ చదువుకున్న వారు, 35 ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులని, ఈ నెల 15వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 15 నుంచి ఆరు నెలల పాటు తిరుపతిలోని స్విమ్స్ నర్సింగ్ కళాశాలలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. జర్మన్‌బాషలో ఏ1, ఏ2, బీ1, బీ2 స్థాయిలో శిక్షణ ఇస్తారని వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు అదనపు సమాచారం కోసం 9160912690లో సంప్రదించాలని సూచించారు.

13న చొక్కాణి ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13వ తేదీ చొక్కాణి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదలలో తెలిపారు. ఆలయంలో ఈ ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. శివయ్యను అగ్నితో పూజించే విధానం ఉందని తెలిపారు. అందుకు నిదర్శనమే చొక్కాణి ఉత్సవమని తెలిపారు. ఇక 15వ తేదీ పౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షిణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 14న వేయిలింగాల కోనలో ఏర్పాట్లను పరిశీలిస్తామన్నారు. 15న ఆదివారం పౌర్ణమి సందర్భంగా బ్రహ్మర్షి చాగంటి కోటేశ్వరరావు శిష్య బృందం శ్రీగురువాణి సొసైటీకి చెందిన సుమారు 200 మంది గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని తెలిపారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.90 కోట్లు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుల ద్వారా రూ.1,90,35,265 ఆదాయం వచ్చినట్టు ఈవో బాపిరెడ్డి తెలిపారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో బుధవారం హుండీలోని కానుకలను లెక్కించినట్టు తెలిపారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 106 గ్రాములు, వెండి 466.100 కిలోలు, విదేశీ కరెన్సీ 121 వచ్చిందన్నారు.

'నీరాజనం' కళాకారులకు ప్రశంస

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలో ఆదివారం నిర్వహించిన కృష్ణవేణి సంగీత నీరాజనంలో ప్రతిభను ప్రదర్శించిన జాతీయ సంస్కృత వర్సిటీ యువ టూరిజం క్లబ్ సభ్యులకు బుధవారం ప్రశంసాపత్రాలు అందించారు. ఈ మేరకు సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సూర్యనారాయణ, డాక్టర్ రాజేష్, మీనా, రాహుల్ పాల్గొన్నారు.



దుబాయ్ వెళ్లేందుకు ముంబై బస్సు ఎక్కుతున్న యువకులు



గల్ఫ్ ట్రావెల్స్ కార్యాలయం వద్ద యువకులు, బంధువులు


వలస బాట

జగిత్యాల క్రైం: ఉన్న ఊరిలో ఉపాధి దొరక్క, ఉన్నత విద్య చదివినా ఉద్యోగాలు రాక కుటుంబ పోషణ భారమై గల్ఫ్ దేశాలకు వెళ్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీనికి నిదర్శనం బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని విజయపురి కాలనీలో ఓ గల్ఫ్ ఏజెన్సీ నిర్వాహకుడు గ్రూపు వీసాలపై 23 మందిని గల్ఫ్ పంపించేందుకు తన కార్యాలయం వద్దకు రప్పించుకోగా.. వారిని సాగనంపేందుకు పెద్ద ఎత్తున బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు అక్కడికి వచ్చారు. ఇంతలో ముంబై వెళ్లే ప్రైవేటు బస్సు అక్కడికి రావడంతో సదరు యువకులు బస్సులోకి వెళ్లగానే వారిని సాగనంపుతున్న సమయంలో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. వీరంతా ముంబై నుంచి ఒకట్రెండు రోజుల్లో దుబాయ్‌కి చేరుకోనున్నారు.

‘ఆపరేషన్ కగార్’ పై సర్వత్రా చర్చ

మావోయిస్టు కుటుంబాల్లో మిశ్రమ స్పందన • ఉద్యమ జీవితంలోనే కీలక నేతలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అడవుల జిల్లాగా ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి అనేక మంది వామపక్ష సిద్ధాంతాలకు ఆకర్షితులై ఉద్యమబాట పట్టారు. మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు, ఛత్తీస్‌గఢ్‌కు సమీపంలో ఉండే ఈ ప్రాంతం మావోలకు ఇలాఖాగా మారింది. అప్పట్లో పోలీసు బలగాలకు మావోయిస్టులు కంటికి మీద కునుకు లేకుండా చేశారు. కాలక్రమంగా వారి కార్యకలాపాలు తగ్గిపోయాయి. 2026 నాటికి మావోయిస్టు పార్టీని అంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది.



మృతి చెందిన మావోయిస్టు నేత కటకం సుదర్శన్. (ఫైల్)

కీలక స్థానాల్లో తెలుగువారు

నిర్మల్ జిల్లా సోన్ మండలం కూచన్‌పల్లికి చెందిన ఇర్రి మోహన్‌రెడ్డి, సెంట్రల్ పొలిట్‌బ్యూరో కేంద్ర కమిటీ సాంకేతిక విభాగంలో పనిచేస్తున్నారు.

- మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన బండి ప్రకాశ్ అలియాస్ బండి దాదా సింగరేణి కోల్ కమిటీలో కీలకంగా ఉన్నారు. ఇటీవల ఆయన్ను కేంద్ర కమిటీలోకి తీసుకున్నట్లు సమాచారం.
- ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెరకు చెందిన మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్, రాష్ట్ర కమిటీ మెంబర్, కేబీఎం (కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల) కమిటీ కార్యదర్శిగా ఉన్నారు.
- బెల్లంపల్లికి చెందిన సలాకుల సరోజ పార్టీ నిర్వహిస్తున్న ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్నట్లుగా చెబుతారు. ఇదే మండలం చంద్రవెల్లికి చెందిన జాడి వెంకటి, అతని సహచరి పుష్ప దండకారణ్యంలోనే ఉన్నారు.
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం అగర్‌గూడకు చెందిన చౌదరి అంకుబాయి అలియాస్ అనితక్క దండకారణ్యంలోనే ఉన్నారు. ఒక్కొక్కరి తలపై రూ.20 లక్షలకు పైనే రివార్డులు ఉన్నాయి.

ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు

గత కొంతకాలంగా మావోయిస్టులు చనిపోవడమో, లొంగిపోవడమో జరుగుతోంది. ఐదు దశాబ్దాలకుపైగా పార్టీ కేంద్ర కమిటీలో పనిచేసిన కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్(69) గతేడు జూన్‌లో మరణించారు. బెల్లంపల్లికి చెందిన సుదర్శన్ కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు, పార్టీ పత్రికలకు ఎడిటర్‌గా పని చేశారు. ఆయనపై రూ.కోటి రివార్డు ఉంది.

- దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, గడ్చిరోలి జిల్లా ఇన్‌చార్జ్‌గా పనిచేసిన కాసర్ల రవి అలియాస్ అశోక్ ఎన్‌కౌంటర్‌లో మరణించారు. వీరే కాకుండా కంతి లింగవ్వతోపాటు సీనియర్లను పార్టీ కోల్పోయింది. మూడేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలో ఇంద్రవెల్లి, సిర్పూర్, మంగి, చెన్నూరు, మంచిర్యాల ఏరియాలకు కొత్త నియామకాలు చేపట్టింది. 2020లో కాగజ్‌నగర్ మండలం కడంబా అడవుల్లో భద్రత్రా బలగాల చేతిలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన చుక్కాలు, నేరడిగొండ మండలం అద్దాల తిమ్మాపూర్‌కు చెందిన బాదీరావు చనిపోయారు. ప్రస్తుతం కోల్‌బెల్ట్ కమిటీ సింగరేణి కార్మికుల పక్షాన, స్థానిక ఎమ్మెల్యేలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వ్యతిరేకిస్తూ పత్రిక ప్రకటనలకే పరిమితమైంది.

అడవి వీడి బయటకు రావాలి



మా చెల్లి నా కోసం వచ్చి అక్కడే ఉండిపోయింది. నేను లొంగిపోయి సాధారణ జీవితం గడుపుతున్నా. మా చెల్లి 36 ఏళ్లుగా పార్టీలోనే ఉంది. అడవి వీడి తిరిగి వస్తే అందరికీ సంతోషం.

– చౌదరి చిన్నన్న, చౌదరి అంకుబాయి అన్నయ్య, ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం అగర్‌గూడ

ఆశయాన్ని చంపలేరు



వ్యక్తులను చంపగలరు గానీ ఆశయాన్ని చంపలేరు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయకులను బలి తీసుకున్నా అంతిమ విజయం ప్రజలదే. నా స్వార్థం కోసం మా నాన్నను అజ్ఞాతం వీడమని చెప్పలేను. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే శాంతి చర్చలు జరిపి పరిష్కారాన్ని వెతకాలి. అంతేకాని ఉద్యమాన్ని అణచడం కాదు.

– బండి కిరణ్, మావోయిస్టు నాయకుడు బండి ప్రకాశ్ కొడుకు

జీవించే హక్కును కాపాడాలి



ఆదివాసీలు నేరం చేసినట్టు లక్షల కొద్దీ బలగాలతో అడవుల్లో క్యాంపులను ఏర్పాటు చేసి అమాయకులను చంపేస్తున్నారు. అడవి, సహజ వనరులను నాశనం చేసి సాధించేదేమిటి? 2005 నుంచి అనేక పేర్లతో ఈ ఆపరేషన్లు కొనసాగుతున్నాయి. ఆర్థిక, సామాజిక, అసమానతల కోణంలో చూస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం దొరకదు. కేంద్రం ఆపరేషన్ కగార్ పేరుతో జరుపు తున్న మరణహోమాన్ని వెంటనే ఆపేయాలి. చర్చలకు పిలవాలి. ప్రతీ ఒక్కరికి జీవించే హక్కును కాపాడాలి.

– నక్క నారాయణరావు, ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పౌరహక్కుల సంఘం.



అసెంబ్లీని సందర్శించిన విద్యార్థులు

- శాసనసభ పనితీరును వివరించిన స్పీకర్

సాక్షి, హైదరాబాద్: జవహర్ బాలమంచ్ సంస్థ ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా రాష్ట్ర శాసనసభను హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందిన 120 మంది విద్యార్థులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా శాసనసభ పనితీరును విద్యార్థులకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వివరించారు. పీయూసీ చైర్మన్, షాద్‌నగర్ శాసనసభ్యుడు కె.శంకరయ్య, లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు, బాలమంచ్ సంస్థ స్టేట్ చైర్మన్ రిషికేశ్ రెడ్డి, సభ్యులు సునీల్ యాదవ్, సాయికృష్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్పీకర్‌తో కలిసి విద్యార్థులు గ్రూప్ ఫొటో దిగారు.

మెసెంజర్లకు ద్విచక్ర వాహనాలు

శాసనసభ, శాసనమండలి మెసెంజర్లకు కేటాయించిన నూతన ద్విచక్ర వాహనాలకు స్పీకర్ ప్రసాద్ కుమార్ అందజేశారు. మెసెంజర్లు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు సమాచారాన్ని చేరవేయడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు శాసన సభ, మండలి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు అందించడంలో సాయం చేస్తారు.

మెడికల్ ప్రొఫెషనల్స్ కోసం ఓఈటీ

- డాక్టర్లు, నర్సులు, ఫార్మసిస్టులకి ఆక్యుపేషనల్ ఇంగ్లిష్ టెస్ట్
- విదేశాల్లో స్థిరపడాలనుకునే వారికి మంచి అవకాశం
- ‘సాక్షి’తో ఓఈటీ దక్షిణాసియా రీజనల్ డైరెక్టర్ అమిత్ ఉపాధ్యాయ్

సాక్షి, హైదరాబాద్

విదేశాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లాలన్నా ఎంట్రన్స్ పరీక్ష రాయాల్సిందే. అందులో స్కోర్‌ను బట్టి కాలేజీల్లో అడ్మిషన్ ఇస్తుంటారు. చాలామందికి జీఆర్ఈ, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, డులింగో వంటి పరీక్షల గురించే తెలుసు. కానీ అవి కాకుండా వేరే పరీక్షలతో కూడా మనం విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొందచ్చని తెలుసా?. మెడికల్, నర్సింగ్, ఫార్మసీ చేసిన వారికి ప్రత్యేకంగా టెస్ట్ ఉంటుందని చాలా మందికి తెలియకపోవచ్చు. దానికి సంబంధించిందే ఆక్యుపేషనల్ ఇంగ్లిష్ టెస్ట్ (ఓఈటీ). ఓఈటీ దక్షిణాసియా రీజనల్ డైరెక్టర్ అమిత్ ఉపాధ్యాయ్ నగరానికి వచ్చిన సందర్భంగా ‘సాక్షి’ఆయన్ను పలకరించింది. ఓఈటీతో హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్‌కు ఎలాంటి ఉపయోగాలు ఉంటాయి? ఎలా ప్రిపేర్ అవ్వాలి? ఏయే కాలేజీల్లో చేరే అవకాశం ఉంటుందనే అంశాలను ఆయన వివరించారు.

ఓఈటీ పరీక్ష చాలా సులువు

వేరే పరీక్షలతో పోలిస్తే ఓఈటీ చాలా సులువుగా ఉంటుందని అమిత్ ఉపాధ్యాయ్ చెప్పారు. ఎంబీబీఎస్, నర్సింగ్, ఫార్మసీ కోర్సుల్లో చదివిన అంశాలు కేంద్రంగా ఓఈటీ పరీక్ష ఉంటుందన్నారు. అకడమిక్ స్థాయిలో చదువుకున్న అంశాలే ఈ పరీక్షలో కూడా ఉంటాయని తెలిపారు. విదేశాల్లో స్థిరపడాలనుకునే హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ కోసం ఈ పరీక్షను ప్రత్యేకంగా రూపొందించామని వెల్లడించారు. దీన్ని ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ వర్సిటీకి చెందిన ప్రొఫెసర్ టిమ్ మెక్‌నమరా 40 ఏళ్ల కింద అభివృద్ధి పరిచారని తెలిపారు. ప్రస్తుతం కేంబ్రిడ్జి బాక్సిల్ లాంగ్వేజ్ అసెస్‌మెంట్ యూనిట్ ట్రస్ట్ నిర్వహిస్తోందన్నారు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, న్యూజిలాండ్ సహా అనేక దేశాలు ఈ పరీక్షకు ఆమోదం తెలిపాయని, ప్రపంచంలోని 500 యూనివర్సిటీలు ఈ పరీక్ష ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తున్నాయని అమిత్ వెల్లడించారు. ఉద్యోగ సమయంలో ఎదురయ్యే క్షేత్రస్థాయి పరిస్థితులకు సన్నద్ధమయ్యేందుకు ఈ పరీక్ష కీలకంగా వ్యవహరిస్తుందని వివరించారు.

కేరళలో ఎక్కువగా..

ఓఈటీ పరీక్షను కేరళలో ఎక్కువ మంది రాస్తుంటారని, కొన్ని వేల మంది ఈ పరీక్ష రాసి అక్కడి నుంచి వెళ్లి విదేశాల్లో స్థిరపడ్డారని అమిత్ గుర్తు చేశారు. తెలంగాణ, ఏపీ నుంచి కూడా చాలా మంది ఈ పరీక్ష రాసేలా అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణలోని పలు మెడికల్, నర్సింగ్ కాలేజీలు తమతో ఒప్పందం చేసుకునేందుకు ముందుకొచ్చాయని, సమీప భవిష్యత్తులో ఈ ఒప్పందాలు పూర్తవుతాయని తెలిపారు.



ఉచిత శిక్షణ

తమ వెబ్‌సైట్‌లో ఉచితంగా ఓఈటీ పరీక్ష కోసం సన్నద్ధమయ్యేందుకు వెసులుబాటు కల్పించామని అమిత్ చెప్పారు. ఇప్పటికే చాలా కాలేజీలు వెబ్‌సైట్‌లోని ఓఈటీ కోర్సును చివరి సంవత్సరం విద్యార్థులకు పాఠ్యాంశాల్లో చేర్చాయని, దక్షిణ భారత్‌లో ఇప్పుడిప్పుడే ఓఈటీపై చాలా మందికి అవగాహన పెరుగుతోందని తెలిపారు. వినడం, చదవడం, రాయడం, మాట్లాడటం వంటి నాలుగు అంశాల్లో ఓఈటీ పరీక్ష ఉంటుందన్నారు. ఏ, బీ, సీ, డీ, ఈ గ్రేడ్‌ల రూపంలో మార్కులు ఇస్తారని, ఈ గ్రేడ్స్‌లో బీ, బీ, బీ, సీప్లస్ గ్రేడ్స్ సాధించిన వారికి వర్సిటీల్లో అడ్మిషన్లు ఇస్తారని అమిత్ వెల్లడించారు. విదేశాల్లో స్థిరపడాలనుకునే వారే కాకుండా సొంత దేశంలో కూడా వారి ప్రొఫెషన్‌లో మంచి స్కిల్స్ పెంపొందించుకోవాలనుకునే వారికి కూడా ఇది ఉపయోగపడుతుందని తెలిపారు.

ప్రత్యేక శిక్షణ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలి

- మంత్రి సీతక్కకు ఓయూ దివ్యాంగుల జేఏసీ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: దివ్యాంగులకు విద్యను బోధించే ప్రత్యేక శిక్షణ ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ దివ్యాంగుల జేఏసీ కోరింది. ఈ మేరకు పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్కను జేఏసీ నేతలు చంద్రశేఖర్, లాల్‌సింగ్, బట్టురాజు, రాము, రాజు తదితరులు కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం తెలంగాణ సచివాలయ మీడియా పాయింట్ బయట విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగుల కోసం స్పెషల్ డీఎస్సీ 727 స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 220 పోస్టులను రిక్రూట్‌మెంట్ ద్వారా, ప్రమోషన్ ద్వారా 86 పోస్టులకు మ్రాతమే భర్తీ చేశారని పేర్కొన్నారు. ఇంకా రాష్ట్రవ్యాప్తంగా మిగిలి ఉన్న 421 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారని, దివ్యాంగులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని జేఏసీ నేతలు తెలిపారు.

చెరుకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి

చెరకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బొంతు రాంబాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చెరుకుకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు బోనస్ ఇవ్వాలని చెరుకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. టన్నుకు ధర రూ.4,000, బోనస్ రూ.1,000 అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ చెరుకు రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రైతులు నగరంలోని చక్కెర శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం అదనపు కమిషనర్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో చెరుకు రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో 2014లో 1.5 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పండిన చెరుకు.. 30 వేల ఎకరాలకు తగ్గిపోయిందన్నారు. 2014లో 11 షుగర్ ఫ్యాక్టరీలు పనిచేయగా, ఇప్పుడు కేవలం 7 ఫ్యాక్టరీలు రన్నింగ్‌లో ఉండి నెల రోజులు కూడా క్రషింగ్ చేసే పరిస్థితి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం చెరకు ధరకు షుగర్ రికవరీ 8.5 నుంచి 10.25 పెంచడం వల్ల దక్షిణాది రాష్ట్రాల చెరుకు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. 8.5 రికవరీ పద్ధతిలో ధర నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చెరకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపి, చెరుకు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రచ్చా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎదురుకాల్పుల్లో డీఆర్‌జీ హెడ్ కానిస్టేబుల్ మృతి

- ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో ఘటన



బీరేంద్రకుమార్ సారీ

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో డీఆర్‌జీ విభాగానికి చెందిన ఒక హెడ్ కానిస్టేబుల్ మృతి చెందారు. నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్‌లోని సోన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధి కొహ్కామెట్ట అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో డీఆర్‌జీ, బీఎస్‌ఎఫ్ విభాగాల పోలీసులు కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య హోరాహోరీగా ఎదురుకాల్పులు జరిగాయి. కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన హెడ్ కానిస్టేబుల్ బీరేంద్రకుమార్ సోరీ (36) సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. కాంకేర్ జిల్లాలోని నర్‌హర్‌పూర్‌కు చెందిన బీరేంద్రకుమార్ 2010లో డీఆర్‌జీలో చేరగా.. 2018లో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. ఆయన మృతదేహాన్ని నారాయణపూర్ జిల్లా కేంద్రానికి తరలించారు.

థియేటర్ వద్ద తొక్కిసలాటలో ఓ మహిళ మృతి

ఓ బాలుడి పరిస్థితి విషమం...




తొక్కిసలాటలో గాయపడ్డ బాలుడు

సాక్షి, హైదరాబాద్: పుష్ప 2 సినిమా ప్రీ రిలీజ్ షోకు అభిమానులు పోటెత్తడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఒక మహిళ చెందింది. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి (39) తన భర్త భాస్కర్, ఇద్దరు పిల్లలు శ్రీ తేజ (9), సన్వీక (7)తో కలిసి పుష్ప ప్రీమియర్ షో చూడటానికి బుధవారం ఆర్టీసీ రోడ్స్‌లోని సంధ్య 70ఎంఎం థియేటర్‌కు వచ్చారు. అల్లు అర్జున్ ఆ థియేటర్‌కు వచ్చిన సమయంలో అభిమానులు ఒక్కసారిగా థియేటర్ గేటు లోపలికి చొచ్చుకువచ్చారు. ఈ సమయంలో జరిగిన తొక్కిసలాటలో రేవతి, ఆమె కొడుకు శ్రీ తేజ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే పోలీసులు విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ హాస్పిటల్‌కు తరలించారు. రేవతి అప్పటికే మృతి చెందగా, శ్రీ తేజ పరిస్థితి విషమంగా ఉండటంతో బేగంపేట కిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

విచారణ ఎదుర్కోవాల్సిందే!

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఎంపీ అర్వింద్‌కు చుక్కెదురు
- ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని మాదన్నపేట పోలీస్‌స్టేషన్‌లో తనపై ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. విచారణ ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసింది. 2022లో చంచల్‌గూడ జైలు వద్ద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అర్వింద్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో దళితుల మనోభావాలను దెబ్బతీశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిజామాబాద్‌లోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్‌లో బంగారు సాయిలు అనే వ్యక్తి ఫిర్యాదు చేయటంతో అర్వింద్‌పై కేసు నమోదైంది. అనంతరం ఆ కేసును మాదన్నపేట పీఎస్‌కు బదిలీ చేశారు. ఈ కేసును కొట్టివేయాలని హైకోర్టులో అర్వింద్ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో కేసు విచారణను నిలిపివేస్తూ న్యాయస్థానం గత ఏడాది డిసెంబర్‌లో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషన్‌పై వాదనలు పూర్తి కావడంతో న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం తీర్పు వెలువరించారు. అర్వింద్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు.



కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

డిప్యూటీ సీఎం భట్టికి.. పరశురాం వినతి

సాక్షి, హైదరాబాద్: కరెన్సీ నోట్లపైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెరిపోతుల పరశురాం.. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కోరారు. ఈమేరకు అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపాలని విన్నవించారు. 1921లో ఇంపీరియల్ బ్యాంకు కుప్పకూలినప్పుడు ‘రూపాయి–దాని సమస్య–పరిష్కార మార్గం’ పేరుతో అంబేడ్కర్ పుస్తకాన్ని రాశారని, ఆయన కృషి ఫలితంగానే 1935, ఏప్రిల్ 1న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పడిందని పరశురాం పేర్కొన్నారు. ఆర్బీఐ ఏర్పాటై ప్రస్తుతం 90 సంవత్సరాలు పూర్తిచేసుకున్నా.. నోట్లపై ఆయన ఫొటో ముద్రించకపోవడం చరిత్రను వక్రీకరించడమేనన్నారు.

విచారణకు రావాల్సిందే..

మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రజాభవన్ వద్ద హిట్ అండ్ రన్‌కు పాల్పడిన కేసులో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ విచారణకు రావాల్సిందేనని హైకోర్టు ఆదేశించింది. ఎక్కడున్నా ఈ నెల 16న పంజాగుట్ట పోలీసుల ఎదుట విచారణకు హాజరు కావాలని స్పష్టం చేసింది. హైదరాబాద్ ప్రజాభవన్ (గతంలో ప్రగతి భవన్) ఎదుట బారికేడ్లను ఢీకొట్టిన ఘటనలో పంజాగుట్ట పోలీసులు 2023లో రాహిల్‌పై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా, కేసు నమోదు తర్వాత నిందితుడు దుబాయ్ పారిపోయినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని, పోలీసులు కఠినచర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ రాహిల్ ఏప్రిల్‌లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం ఉత్తర్వులు వెలువరించారు. కేసు విచారణలో దర్యాప్తు అధికారులకు సహకరించాలని రాహిల్‌కు తేల్చిచెప్పారు. గతంలో విచారణకు హాజరుకావాలని చెప్పినా పాటించకపోవడంపై మండలిస్తూ, పిటిషన్‌పై విచారణ ముగించారు.

పళని మురుగన్‌కు ప్రణామాలు



శివ పార్వతుల గారాల తనయుడు, దేవసేనాధిపతి, తారకాసురుడనే రాక్షస సంహారానికి ఉద్భవించిన కారణజన్ముడు కార్తికేయుడు. సకల విద్యాపారంగతుడిగా, జ్ఞానప్రదాతగా, దండాయుధపాణిగా, నిత్యయవ్వనుడుగా సుబ్రహ్మణ్యేశ్వరునికి పేరుంది. సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయాలకు, ఆయనను అర్చించే భక్తులకు తెలుగునాట కొదవలేనప్పటికీ తమిళనాడు, కర్ణాటకలలో మనకన్నా అధికంగా సుబ్రహ్మణ్యేశ్వరు నికి అడుగడుగునా గుడులు కట్టి పూజించడం సర్వసాధారణంగా కనబడుతుంటుంది. తమిళనాట గల ప్రసిద్ధి చెందిన సుబ్రహ్మణ్యక్షేత్రం పళని. దండాయుధపాణిగా, బాలమురుగన్‌గా, పళని మురుగన్‌గా తమిళులు అత్యంత భక్తి శ్రద్ధలతో కొలిచే పళని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రముఖమైనదిగా, మహిమాన్వితమైనదిగా వాసికెక్కింది.

అద్భుతమైన శిల్పసంపదతో అలరారే ఆలయంలో కేవలం కౌపీనం మాత్రమే కట్టుకుని, చేతిలో శూలాయుధం పట్టుకుని, చూడగానే ఆకట్టుకునే అందమైన విగ్రహంతో కనువిందు చేసే స్వరూపంతో, భక్తులను అనుగ్రహిస్తుంటాడీ దండాయుధ పాణి.

స్థలపురాణమిదీ: ఒకసారి కార్తికేయుడు పరిపక్వమైన జ్ఞానం లభించాలనే కాంక్షతో తన అలంకారాలన్నింటినీ వదిలేసి, భూలోకం వెళ్లి అక్కడ తనకు నచ్చిన ఒక కొండమీద గల ప్రశాంతమైన వాతావరణంలో తపస్సులో మునిగిపోయాడు. కైలాసంలో కుమారుని జాడ తెలియక పార్వతీదేవి బెంగపడుతుంది. పరమేశ్వరుడు పత్నిని ఊరడించి, ఆమెను వెంటబెట్టుకుని కొడుకుని వెతుకుతూ భూలోకానికి పయనమవుతాడు. ఇద్దరూ కలసి వెతుకుతుండగా, తమిళనాడులోని తిరు ఆవినంకుడి అనే ప్రదేశం వద్దకు రాగానే కొండశిఖరం బంగారు కాంతులతో మెరుస్తూ కనపడటంతో తమ కుమారుడు అక్కడే ఉన్నాడని తెలుసుకుని, తపోదీక్షలో ఉన్న పుత్రుని చేరదీసి, ముద్దాడుతూ, 'నువ్వే నా జ్ఞానఫలానివిరా నా బంగారుకొండా' అంటూ పార్వతీ పరమేశ్వరులు కుమారుని అనుగ్రహిస్తారు. తలిదండ్రుల ఊరడింపుతో కుమారస్వామి అలకమానతాడు కానీ, ఆ ప్రదేశం తనకు ఎంతో నచ్చడంతో తన అంశను అక్కడే వదిలి, తలిదండ్రులతో తిరిగి కైలాసం చేరతాడు. ఇదీ పళని సుబ్రహ్మణ్యేశ్వరుని పురాగాథ.

ఆ ప్రదేశమే ప్రస్తుతం సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని భక్తులు అర్చించే పళని ఆలయం.

తమిళనాడులోని దిండిగల్ జిల్లాలో మధురైకి వందకిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కొండ ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు.

అన్ని విగ్రహాల్లాంటిది కాదు: పళని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం అన్ని విగ్రహాలలా రాతితో మలిచింది కాదు. నవపాషాణాలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దినది. నవ పాషాణాలనే తొమ్మిది విధాలైన మూలికలు అని కొందరంటారు, తొమ్మిది భయంకరమైన విషాలనూ ప్రత్యేకమైన పాళ్లలో కలిపితే అమృతం వంటి ఔషధం తయారవుతుందని, అందుకే దీనిని భోగార్ అనే ముని ఈ విగ్రహాన్ని ప్రత్యేకశ్రద్ధతో మలిచాడని క్షేత్రపురాణం చెబుతోంది. ఈ ఆలయం దాదాపు పదహారు గంటలసేపు తెరిచే ఉంటుంది. అందరూ స్వామిని దర్శనం చేసుకునేందుకు వీలుగా గర్భాలయం తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి.

ఈ మందిరం క్రీస్తుశకం 7వ శతాబ్దంలో కేరళ రాజు చీమన్ పెరుమాళ్ కట్టించగా, దానిని పాండ్యరాజులు పునరుద్ధరించారు. కావడి మొక్కులంటే ఇష్టమట ఈస్వామికి. అంటే ఏదయినా ఆపద కలిగినప్పుడు తాము సమర్పించగలిగినదానిని కావిళ్ల కొద్దీ సమర్పించుకుంటామని మొక్కుకుని, ఆపద తీరగానే, నియమ నిష్ఠలతో స్వామికి కావిళ్లలో మోసుకుంటూ నత్యగానాలతో స్వయంగా సమర్పించుకుంటారు భక్తులు. తండ్రి అయిన శివునిలాగే ఈయన కూడా అభిషేక ప్రియుడు. కార్తికమాసంలో అయితే రోజుకు కనీసం 700 మార్లు భక్తుల అభిషేకాలందుకుంటాడు ఈ స్వామి. వల్లీ, దేవసేన ఆయన భార్యలు. ప్రతి సంవత్సరం మార్గశిర శుద్ధ షష్ఠిరోజున స్వామివారికి కన్నులపండువగా కల్యాణోత్సవం జరుగుతుంది.

చలి కాలంలోనే పళనిలో అనేక ఉత్సవాలు జరుగుతాయి. వాటిలో కావడి ఉత్సవం, మార్గశిర శుద్ధ షష్ఠి జరిగే కల్యాణోత్సవాలు ప్రముఖమైనవి. సంతానం లేనివారు, వివాహం ఆలస్యం అవుతున్నవారు, కుజదోషం ఉన్నవారు, రాహు, కేతు, కుజగ్రహదోషాలు ఉన్నవారు, కాలసర్పదోషం, నాగదోషం, రాహుకేతు దోషాలతో బాధపడేవారు పళని సుబ్రహ్మణ్యేశ్వరుని సందర్శించుకుంటారు. అంతేకాదు, జ్ఞాన ప్రదాతగా పేరుగాంచిన సుబ్రహ్మణ్యేశ్వరుని బుద్ధిమాంద్యంతో బాధపడేవారు స్వామిని కన్నులారా సందర్శించుకుని ఆయా బాధలనుంచి విముక్తి పొందుతుంటారు.

ఎలా వెళ్లాలంటే..? పళని సుబ్రహ్మణ్యేశ్వరాలయానికి వెళ్లడం సులువే. రైలు, బస్సు, విమాన మార్గాలున్నాయి. దేశంలోని అన్ని ప్రధాన నగరాలనుంచి పళనికి నేరుగా బస్సులు, రైళ్లు ఉన్నాయి.

రైలు మార్గం: పొల్లాచ్చి మీదుగా మధురై నుంచి కోయంబత్తూరు వెళ్లే రైలుంది. అలాగే తిరుచెందూరు నుంచి మధురై మీదుగా పళని వెళ్లేందుకు రైలుంది. చెన్నై సెంట్రల్నుంచి పళని వెళ్లేందుకు ప్రత్యేకంగా రైలుంది. ఎలాగైనా పళని చేరుకుంటే అక్కడినుంచి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో గల ఆలయాన్ని చేరుకోవడానికి ఆటోరిక్షాలు, బస్సులు విరివిగా ఉన్నాయి.

వాయుమార్గం: పీలమేడు లేదా కోయంబత్తూరు, మధురై వరకు విమానంలో వెళ్తే అక్కడినుంచి పళనికి బస్సులు, రైళ్లు ఉన్నాయి.


పర్యాటక స్థలాల పళని

పళని చుట్టూ బోలెడన్ని పర్యాటక స్థలాలున్నాయి. తిరునావినంకుడి ఆలయం, ఇదుంబన్‌ఆలయం, పదగణపతి ఆలయం, తిరు అవినాకుడి ఆలయం, పెరియ నాయకి అమ్మన్‌ఆలయం, పెరియన్ అవుడైయర్ ఆలయం, కన్నడి పెరుమాల్‌ఆలయం, పళని కొండలు, తైపుసి ఆలయం, పార్వతీదేవికి తల్లిగా పేర్కొనే మరియమ్మన్ ఆలయం, మురుగన్విగ్రహ శిల్పి భోగర్సమాధి ఆలయం, కురుంజి అందవార్‌ఆలయం, లక్ష్మీనారాయణ పెరుమాళ్ ఆలయం ముఖ్యమైనవి. అసలు పళని కొండలే ఎంతో ఆహ్లాదకరంగా ఉంటాయి. ప్రకృతి అందాలను వీక్షిస్తూ పళని ఆలయాన్ని చేరుకోవాలంటే మెట్లమార్గంలో వెళ్లడం ఉత్తమం.

- డి.పూర్ణిమా భాస్కర్

పరిహారం

ఎదుగూ బొదుగూ ఉండట్లేదా? పనికి తగిన గుర్తింపు, ప్రతిఫలం రాక పోతున్నా, వృత్తి ఉద్యోగాల్లో తరచుగా అవరోధాలు ఎదురవుతున్నా అలాంటి పరిస్థితులను అధిగమించడానికి మరికొన్ని పరిహారాలు...



- కనీసం నెలకు ఒకసారైనా ఒక వికలాంగునికి భోజనం పెట్టండి. భోజనం పెట్టే వీలు లేకపోతే కనీసం అందుకు తగిన ఆర్థిక సాయం చేయండి. ఈ పరిహారం శనివారం పాటించడం మంచిది.
- వృత్తి ఉద్యోగాల్లో అనుకోని ఇక్కట్లు ఎదురవుతున్నట్లయితే, సూర్యోదయానికి ముందే నిద్రలేచి సూర్యుడు ఉదయించే వేళకు స్నానాదికాలు ముగించుకోవాలి. ఆ తర్వాత ఒక రాగిచెంబు నిండా నీరు తీసుకుని, ఆ నీట్లో 21 ఎండు మిరపగింజలు వేసి, ఆ నీటిని సూర్యుడికి తర్పణగా విడిచిపెట్టాలి. ఈ పరిహారాన్ని 43 రోజులు నిరాటంకంగా ఆచరించాలి.
- శారీరకంగా, మానసికంగా నలిగిపోతున్నా వృత్తి ఉద్యోగాల్లో ఆశించిన లక్ష్యాలను సాధించలేక వెనుకబడిపోతున్నట్లయితే ఏదైనా శనివారం శివాలయానికి వెళ్లి దీపారాధన చేయండి. ఆ తర్వాత ఆలయం వద్ద ఉన్న వృద్ధ యాచకులకు నల్లరంగు దుప్పట్లు పంపిణీ చేయండి.
- దీర్ఘకాలంగా అభివృద్ధికి దూరంగా ఉంటున్నట్లయితే శని త్రయోదశి రోజున శనికి తైలాభిషేకం చేయించాలి. ఆ తర్వాత ఎవరైనా పేద వ్యక్తికి చెప్పులు దానంగా ఇవ్వాలి.

- సాంఖ్యాయన

పఠనీయం... స్మరణీయం

అనంతుడైన శివునికి అనేక నామాలు. ఏ పేరు పిలిచినా అది ఆయన నామమే. అయితే మంత్ర రహస్యాలతో కూడిన పరమేశ్వరుని ఈ ఎనిమిది నామాలనూ స్మరిస్తూ, శివార్చన చేయడం వల్ల పాశుపత వ్రతం చేసిన ఫలితం దక్కుతుందని శివ పురాణంలోని వాయవీయ సంహిత చెబుతోంది. ఆ దివ్య నామాలు ఇవి...



శివో, మహేశ్వరశ్చైవ, రుద్రో, విష్ణుః పితామహః సంసార వైద్యః సర్వజ్ఞః పరమాత్మ ఇతి ముఖ్యతః

మంచి మాటలు

- భగవత్కృపకు మనం పాత్రులమైనప్పుడు మనం చేసే ప్రతి పని వెనుక ఆయన ఆశీస్సులు తప్పక ఉంటాయి
- భగవంతుని ఆశీస్సులను మనం పొందితే ప్రతి చోటుకీ వాటిని తీసుకువెళ్ళగలం
- అన్ని సమయాల్లో అవి మన వెన్నంటే ఉంటాయి
- ఒకవేళ పొరపాట్లు చేసినా దాని వలన ఏమీ ఇబ్బంది కలగదు. కారణం మనల్ని నిలిపి ఉంచేదాన్ని మనం కనుగొన్నాం గనుక. దీన్ని మనం విశ్వాసం ద్వారానే పొందగలం
- కనుకనే విశ్వాసానికి అంత అద్భుతమైన ప్రాముఖ్యత ఉంది. అది చాలా విలువైనది. దాన్ని మనం నిజాయితీ, చిత్తశుద్ధి ద్వారానే పొందగలం.?

- దేవుణ్ణి మీరెంతగా అభిమానిస్తున్నారో ఇంకెవరికీ తెలియనియ్యకండి.
- జగన్నాథునికి మీ ప్రేమ తెలుసు; దానిని ఇతరుల ముందు ప్రదర్శించకండి.
- అలా ప్రదర్శించడం వల్ల ఆ సర్వప్రభువు మీ ప్రేమను కోల్పోయే అవకాశం ఉంది.

- 'మన నడక నలుగురికి బాటవ్వాలి;
- మన మాట అందరికి మంచిదవ్వాలి;
- మన చెయ్యి పది మందికి సాయపడాలి'.

- వందల బిందెల నీళ్లు పోసినంత మాత్రాన
- వృక్షం అమాంతంగా పెరగదు పూలు కాయలు ఇవ్వదు
- చెట్టు నశించి పోయే ప్రమాదం కూడా ఉంటుంది...
- అలాగే మనం ఎక్కువ కష్టపడుతున్నామని పనులు క్షణాల్లోపూర్తయిపోవు
- దేనికైనా సమయం రావాలి, సహనం కావాలి

సువార్త

ప్రభుయేసు ఆగమనం



విశ్వవ్యాప్తంగా క్రైస్తవ విశ్వాస సమాజం యేసు ప్రభువు వారి జన్మదినం జరుపుకొనేందుకు నాలుగు వారాలు ముందస్తుగా 'క్రిస్మస్' వేడుకలు ప్రారంభిస్తున్నారు. దీనినే 'అడ్వెంట్' అంటారు. అనగా ఆగమనం /రాకడ/ఆహ్వానం పలుకుటకు ముందస్తుగా ఏర్పాట్లు ప్రారంభించి, డిసెంబరు 24 సాయంత్రంతో ముగిస్తారు.

దేవకుమారుడైన యేసుక్రీస్తు ఆగమనానికి ముందస్తు క్రైస్తవ విశ్వాస సమాజం ప్రార్థనలోను, సంఘ సహవాసంతోను కలిసి దేవుని వాక్యానుసారంగా ప్రార్థించుటకు 'దేవుని మందిరమైన' సంఘంలో పాల్గొని 'క్రిస్మస్' డిసెంబరు 25న క్రీస్తు జన్మదినం కొరకు సిద్ధపడటమే 'అడ్వెంట్'. చీకటిరాత్రి తొలగి అరుణోదయ కాంతి రావటమే ప్రధానాంశం.

క్రీ.పూ. 5వ శతాబ్ద కాలంలో 'మాలకీ' అనే దేవుని దూత చెదిరిపోయిన ఇశ్రాయేలీయులు అనగా ప్రవాసులుగా భూమియందట చెందినవారిని, నిస్సహాయక స్థితిలో ఉన్న వారిని భయభక్తులు కలిగి వుండాలని సందేశమిచ్చాడు. కానీ వారిని భయభ్రాంతుల నిమిత్తం కాదన్నది వాక్యభావం, అందులో ప్రాముఖ్యంగా నియామ ఏకదినము, చిగురుపుట్టును అన్న వచనాలు బలపరుస్తూ క్రీ.పూ 742–687 సంవత్సకాలంలో సింధూర వృక్షం నరకబడిన దాని మొద్దులోనుంచి పరిశుద్ధమైన చిగురు పుట్టునన్న వాక్యం దావీదు వంశావళిలో శాంతి, సమాధానాది ప్రదాతయైన యేసుప్రభువువారు జన్మించునని ముందస్తుగానే ప్రవచించారని వాక్యం స్పష్టీకరించుచున్నది. మలాకీ కాలం క్రీ.పూ. 5వ శతాబ్దం (మలాకీ 4 :1 –6; యెషయా 6 : 13).

ఈ ముందస్తు క్రీస్తు ప్రభువువారి జన్మదిన సిద్ధపాటులో ప్రజలు లేక పెండ్లి విందుకు ఆహ్వానించినవారిలో కొందరు బుద్ధిమంతులు వుంటారని, మరికొందరు బుద్ధిహీనులుగా వుంటారని పెండ్లి కుమారుడు వచ్చేవరకు వేచి వున్న బుద్ధిమంతుల దీపము అనగా భక్తిపరులుగా వాక్యానుసారంగా ఎదురుచూస్తారని ఏల అనగా వారి దీపములలో అనగా భక్తిలో నూనెతో సిద్ధపడతారని, ('నూనె' భక్తికి సాదృశ్యం), బుద్ధిహీనులు దానికి బదులుగా విరుద్ధమైన సిద్ధపాటు పడతారని వారు బుద్ధిహీనులని యేసు ప్రభువులవారు ఇశ్రాయేలీయుల ప్రజలతో ఉపమాన రీతిలో బోధించారని ఈ వాక్యం తెలియజేస్తున్న పరమార్థం (మత్తయి 5 :1–13).

కనుక ముందస్తు ఆగమనం కొరకు ఎదురుచూసేవారు ఈ నాలుగువారాలు సంఘము నియమింపబడిన సమయంలో భక్తిపూర్వకంగా వాక్యానుసారమైన ప్రార్థన, సంఘ సహవాసంతో కలిసి ప్రార్థనలలో పాల్గొని పరిశుద్ధంగా అనగా ఆ ప్రార్థనల్లో 100 శాతం నిజాలు, ప్రభువు సన్నిధిలో విజ్ఞాపన ప్రార్థనలు వుండేలా సిద్ధపడుదురు గాక.

- కోట బిపిన్‌చంద్రపాల్

వారం.. పర్వం

సుబ్రహ్మణ్య షష్ఠి

మార్గశిర శుద్ధ షష్ఠిని సుబ్రహ్మణ్య షష్ఠిఅని అంటారు. దీనినే చంపా షష్ఠి, ప్రవార షష్ఠి, సుబ్బరాయుడు షష్ఠి, తమిళులు దీనిని స్కంద షష్ఠి అని అంటారు. కుమారస్వామి సర్పరూపంలో భూలోకంలోకి అడుగిడిన రోజుకే సుబ్రహ్మణ్య షష్ఠి అని పేరు. అదేవిధంగా దేవేంద్రుడు మార్గశిర శుద్ధ షష్ఠినాడు దేవసేనతో సుబ్రహ్మణ్యస్వామి వారికి అత్యంత వైభవంగా వివాహం జరిపించిన రోజును 'శ్రీ సుబ్రహ్మణ్య షష్ఠి' గా వ్యవహరిస్తారు.

ఈ స్వామి ఆరాధనవల్ల నేత్రరోగాలు, చర్మవ్యాధులు తగ్గుతాయని పెళ్లికాని వారికి వివాహం జరిగి సత్‌సంతాన సౌభాగ్యం కలిగి ఆయురారోగ్య ఐశ్వర్యములతో వర్ధిల్లు తారని భక్తుల విశ్వానం.

ఏం చేయాలంటే..? ఈ పుణ్యదినం నాడు భక్తులు ఉదయాన్నే స్నానం చేసి ఏ ఆహారమూ తీసుకోకుండా తడి బట్టలతో సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి వెళ్ళి పాలు, పండ్లు, పువ్వులు, వెండి పడగలు, వెండి కళ్ళు మొదలైన మొక్కుబడులు సమర్పించుకుంటూ ఉంటారు. జాతకంలో కుజ దోషం, కాల సర్పదోషంచే సకాలంలో వివాహం కానివారు వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణాలను ఈ షష్ఠినాడు చేయటం కనిపిస్తుంది. సుబ్రహ్మణ్య షష్ఠి వ్రతం లో సామాజిక ప్రయోజనం కూడా కనబడుతుంది. ఈ వ్రత విధి విదానంలో దానాలే ప్రధానం

(6, శుక్రవారం సుబ్రహ్మణ్య షష్ఠి)



మహిమాన్వితం

మార్గశిర లక్ష్మీవార వ్రతం

లక్ష్మీదేవి కరుణాకటాక్షాలు పొందాలనుకునేవారంతా మార్గశిరంలో ప్రత్యేక పూజలు చేస్తూ అమ్మవారికి దగ్గరవుతుంటారు. ఈ మాసంలో ప్రధానంగా చెప్పుకోదగింది లక్ష్మీవార వ్రతమే. దీన్నే కొందరు గురువార లక్ష్మీపూజ అని, లక్ష్మీదేవి నోము అని పిలుస్తారు. మార్గశిర లక్ష్మీవార వ్రతం, ఈప్సితాలను ఈడేర్చుకునేందుకు మహిళలకు, లోకానికి దక్కిన మహోత్కృష్టమైన వరం. ఈ మాసంలో వచ్చే మొదటి గురువారం నుంచి ఐదు వారాలపాటు తనను నియమనిష్ఠలతో కొలిచినవారికి కోరిన వరాలను ప్రసాదిస్తుంది కనకమహాలక్ష్మి.



నైవేద్యాలు

1 వ గురువారం **పులగం**

2 వ గురువారం **అట్లు, తిమ్మనం**

3 వ గురువారం **అప్పాలు, పరమాన్నము**

4 వ గురువారం - **చిత్రాన్నం, గారెలు ,**

5 వ గురువారం **పూర్ణం బూరెలు**

మార్గశిర లక్ష్మీపూజ ఐదు గురువారాలు చేయాల్సిన ఐశ్వర్య వ్రతం. ఈ నెలలో గనుక నాలుగే లక్ష్మీవారాలు వస్తే, ఐదవ వారంగా పుష్యమాసం తొలి గురువారం నాడు కూడా నోము నోచుకోవాలి.

వ్రత విధానం

ముందుగా పొద్దున్నే నిద్రలేచి తలారా స్నానం చేసి ఇంటి ముంగిట రంగవల్లులు తీర్చిదిద్దాలి. లక్ష్మీదేవి ప్రతిమను పూజా మందిరంలో ప్రతిష్ఠించుకోవాలి. దేవి కొలువున్న ప్రదేశాన్ని పూలతో, బియ్యప్పిండితో వేసిన ముగ్గుతో అలంకరించాలి. మహాగణపతి పూజతో వ్రతం మొదలవుతుంది. విఘ్నేశ్వరార్చన అనంతరం మహాలక్ష్మికి షోడశోపచార పూజ నిష్ఠగా నిర్వహించాలి. 'హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణరజత స్రజాం' అంటూ ప్రార్థన చేసి అమ్మవారిని ఆవాహన చేసుకోవాలి. ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనీయం, శుద్ధోదక స్నానం, వస్త్రం, చామరం, చందనం, ఆభరణం, ధూపం, దీపం, నైవేద్యం, తాంబూలాదులు, కర్పూరనీరాజనాన్ని యథావిధిగా సమర్పించాలి.

' 'ఓం మహాలక్ష్మైచ విద్మహే విష్ణుపత్నీ చ ధీమహి తన్నో లక్ష్మీః ప్రచోదయాత్' ' అంటూ లక్ష్మీగాయత్రి పఠిస్తూ అమ్మవారికి మంత్రపుష్పాన్ని సమర్పించాలి. అనంతరం 'సహస్రదళ పద్మస్థాం పద్మనాభ ప్రియాం సతీం' అనే సిద్ధలక్ష్మీ కవచాన్ని సభక్తికంగా చదువుకోవాలి. తరువాత అష్టోత్తర నామావళి పూజ చేసి, మహానైవేద్యం సమర్పించాలి. నైవేద్యానంతరం లక్ష్మీవారవ్రత కథ చెప్పుకుని అక్షతలు శిరసున ధరించాలి. చివరగా క్షమాప్రార్థన చేయాలి.

అమ్మవారికి సమర్పించే మహానైవేద్యం విషయంలో కొన్ని నియమాలు పాటించాలని పెద్దలు చెబుతారు. గురువారం నాడు ఐదుగురు ముత్తయిదువులను ఆహ్వానించి వారికి స్వయంగా వండి వడ్డించాలి. అనంతరం దక్షిణ తాంబూలాదులిచ్చి వారి ఆశీస్సులు పొందాలి. దీంతో మార్గశిర లక్ష్మీవ్రతం పూర్తయినట్టే. మంగళగౌరీవ్రతంలాగ పూజపూర్తయ్యాక ఉద్యాపన చెప్పే క్రియ ఈ నోములో ఉండదు. ఎందుకంటే మన ఇంట్లోసౌభాగ్యలక్ష్మి నిత్యం విలసిల్లేందుకే ఈ పద్ధతిని పాటించాలనేది పండితుల ఉవాచ.

నియమనిష్ఠలు కీలకం

గురువార వ్రతం అత్యంత భక్తిశ్రద్ధలతో నియమంగా ఆచరించాల్సిన గొప్ప నోము. కాబట్టి ఈ నోము నోచే స్త్రీలు ఆయా లక్ష్మీవారాల్లో శుచిగా ఉండాలి. తలకు నూనె రాయడం, జుట్టు దువ్వుకోవడం, చిక్కులు తీసుకోవడం నిషిద్ధం. తొలిసంధ్య, మలిసంధ్య నిదురపోకూడదు. కల్లలాడకూడదు. నియమనిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో ఈ వ్రతాన్ని ఆచరించిన వారి ఇంట లేమి అనే శబ్దం పొడసూపదు. ఐశ్వర్యదేవత వరాలు కురిపించి విజయాలను చేకూరుస్తుంది.

ఒక్క గురువారాలలోనే కాకుండా ఈ మాసంలోని ప్రతిరోజూ లక్ష్మిని పూజిస్తే విష్ణుసతి దీవెనలతో పదికాలాలు పచ్చగా వర్ధిల్లవచ్చని పురాణాలు చెబుతున్నాయి. అమ్మవారికి పూలు, పండ్లు, సువాసనలిచ్చే అగరుధూపం, పరిమళద్రవ్యాలు ప్రీతికరం. వీటితో ఆమె అనుగ్రహాన్ని అవలీలగా పొందవచ్చు. ఈ సువాసనలతో మన ఇంటిని లక్ష్మీప్రసన్నంగా మార్చుకోవచ్చు.

ఇస్లాం వెలుగు

ప్రపంచం పరీక్షా సదనం

ప్రపంచం బహు తీపైనది, అతి చక్కనైనదీను. అల్లాహ్ మిమ్మల్ని దేశానికి పాలకులుగా చేసి మీ వైఖరి ఎలా ఉంటుందో చూడాలని పరీక్షించదల్చాడు. మీరు ప్రపంచం అందచందాలకు, ప్రపంచ వ్యామోహాలకు దూరంగా ఉండండి. అంతే కాకుండా స్త్రీ సంబంధమైన ఉపద్రవం (ఫిత్నా) గురించి జాగ్రత్త పడండి. ఇస్రాయిల్ సంతతి వారు స్త్రీ సంబంధమైన ఉపద్రవం లోనే చిక్కుకున్నారు ప్రప్రథమంగా.

వివరణ:

1. సిరి సంపదల్లోనూ, ప్రభుత్వ అధికారాల్లోనూ మనసు మరులు గొంటే, అవన్నీ అశాశ్వతాలే. అంతం అయిపోయేవి అన్న విషయాన్ని నమ్మండి. ఆకు పచ్చదనంతో కళకళలాడే పూదటలు, పచ్చటి పొలాలు ఎంత అందాన్ని ఆహ్లాదాన్ని పంచిపెట్టిన తుదకు ఓనాటికి వాడిపోయేవే

2. అలాగే ప్రభుత్వం, అధికారం దైవం ప్రసాదించిన అమానతులే. ఆయన అధికారాన్ని ఇచ్చి మిమ్మల్ని పరీక్షించదలిచాడు. అలా మీకు ప్రాప్తమైన అధికారంతో నమ్రతగా ఆయనకు విధేయత చూపుతారా? మంచిని పెంచుతూ చెడును నిర్మూలిస్తారా? లేక ఆ అధికారంతో విర్రవీగుతూ ఆయన్ను ధిక్కరించి మంచి మార్గాలకు అడ్డుకట్టలు వేస్తారా? అదేవిధంగా పాపకార్యాల్ని భూమిలో వ్యాపింపజేయడానికి మీకు లభించిన అధికారాన్ని వినియోగిస్తారా అన్నది చూడడానికే ఆయన మీకు అధికారాన్నిచ్చి పరీక్షించదలిచాడు.

3. ప్రపంచ అందచందాల్ని చూసి మనిషి మోస పోవచ్చు. ముఖ్యంగా దైవదవధిక్కార సంబంధమైన సంస్కృతీ సభ్యతలు ఈ ప్రపంచపు అందచందాల్ని, వ్యామోహాల్ని మరింత పెంచేస్తున్నాయి. ప్రపంచ ఉపద్రవాల నుంచి తమను తాను రక్షించుకోవాలంటే దృఢమైన విశ్వాసం, అచంచలమైన కార్యదీక్ష, మచ్చలేని నడవడి అవసరం. ప్రపంచ వ్యామోహం అనే ఇంద్రజాలాన్ని పటాపంచలు చేయాలంటే దేవునితో దృఢమైన సంబంధం కలిగి ఉండటం ముఖ్యం.



4. ఈ ఉపద్రవం తరువాత తనను తాను రక్షించుకోవాల్సింది స్త్రీ ఉపద్రవం నుండి. ఇదే హదీసులో ఇవ్వబడ్డ ఆదేశం ఇస్రాయీలు సంతతి నట్టేట ముంచింది ఈ ఉపద్రవమే. ప్రగతిని సాధించి శక్తిమంతమైన గొప్ప గొప్ప జాతులే ఈ స్త్రీ ఉపద్రవానికి (ఫిత్నాకు) బలైపోయినట్లు చరిత్ర చాటి చెబుతున్న సత్యం. పాశ్చాత్య సభ్యతా సంస్కృతులు బాగా వ్యాపిస్తున్న ఈ కాలంలో ఈ ఉపద్రవం తీవ్రత మరింత హెచ్చింది. వీడియో, టీవీ, సినిమా లాంటి మీడియాలు స్త్రీ పురుషుల విచ్చలవిడి కలయిక, క్లబ్బులు, అశ్లీల సాహిత్యం అగ్నికి ఆజ్యం పోసినట్టు మరింత మరులుగొలుపుతున్నాయి సమాజాన్ని.

- మొహమ్మద్ అబ్దుల్ రషీద్

బిజినెస్ రీల్

థాయ్‌లాండ్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్లాంట్



న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన రంగంలో ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్ తాజాగా థాయ్‌లాండ్‌లో అసెంబ్లీ ప్లాంటును ప్రారంభించినట్లు ఐషర్ మోటార్స్ బుధవారం తెలిపింది. విడిభాగాలను దిగుమతి చేసుకుని ఈ కేంద్రంలో వాహనాల అసెంబుల్ చేస్తారు. 'అపారమైన వృద్ధికి అవకాశం ఉన్న మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే అంతర్జాతీయ విస్తరణ వ్యూహాన్ని కలిగి ఉండటమే మా వ్యూహాత్మక ఉద్దేశం. థాయ్‌లాండ్ అసెంబ్లీ ప్లాంట్ ఈ విజన్‌ను అందిస్తుంది' అని రాయల్ ఎన్‌ఫీల్డ్ సీఈవో బి.గోవిందరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జెంటీనా, కొలంబియా, బ్రెజిల్, బంగ్లాదేశ్, నేపాల్‌లో ఇప్పటికే రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు ఇటువంటి అసెంబ్లింగ్ కేంద్రాలు ఉన్నాయి. నూతన ఫెసిలిటీ థాయ్‌లాండ్‌లో మిడ్–సెగ్మెంట్ మార్కెట్‌ను వృద్ధి చేయడంలో సహాయపడుతుందని విశ్వసిస్తున్నామని రాయల్ ఎన్‌ఫీల్డ్ సీసీవో యద్వీందర్ సింగ్ గులేరియా తెలిపారు. అలాగే ఈ ప్రాంతంలో పెరుగుతున్న డిమాండ్‌ను సమర్ధవంతంగా తీర్చడానికి వీలు కల్పిస్తుందని అన్నారు. కొత్త ప్లాంట్ సంవత్సరానికి 30,000 కంటే ఎక్కువ యూనిట్లను అసెంబుల్ చేయగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంది. థాయ్‌లాండ్ మార్కెట్‌తో ప్రారంభించి దశలవారీగా ఈ ప్రాంతంలో విస్తరిస్తామని కంపెనీ తెలిపింది.

జీఎంఆర్ ఇన్‌ఫ్రా-ఏడీఐఏ డీల్‌కు సీసీఐ ఆమోదం

న్యూఢిల్లీ: జీఎంఆర్ ఇన్‌ఫ్రా ఎంటర్‌ప్రైజెస్‌లో అబుధాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) తన ట్రస్ట్ ద్వారా ఇన్వెస్ట్ చేసే ప్రతిపాదనకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదముద్ర వేసింది. దీని ప్రకారం ఏడీఐఏలో భాగమైన ప్లాటినం స్టోన్ ఎ 2014 ట్రస్టు.. జీఎంఆర్ ఇన్‌ఫ్రా జారీ చేసే కన్వర్టబుల్ డిబెంచర్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. మరోవైపు, ప్రమోటరు జీఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో (జీఏఎల్) జీఎంఆర్ ఇన్‌ఫ్రా ఎంటర్‌ప్రైజెస్ 9 శాతం వాటా కొనుగోలు చేస్తుంది. ట్రస్ట్ చేసే పెట్టుబడులకు గాను ఆ వాటాను తనఖా పెడుతుంది.

విదేశాల్లో ఓయో 'సండే'

న్యూఢిల్లీ: లగ్జరీ హోటల్ బ్రాండ్ 'సండే' తాజాగా యూకే, యూఏఈలో అడుగు పెట్టిందని ఓయో బుధవారం ప్రకటించింది. ఇప్పటికే కంపెనీకి సండే కేంద్రాలు భారత్‌లో మూడు ఉన్నాయి. 2025 మార్చి నాటికి ఈ బ్రాండ్ కింద మొత్తం 25 ప్రాపర్టీలను అందుబాటులోకి తేవాలన్నది కంపెనీ ఆలోచన.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-12-2024

విశాఖ	610-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	620-00
విజయవాడ	620-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	620-00
వరంగల్	622-00
రిటైల్ ధర	6.80

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HDFCLIFE	650	2.52
HDFCBANK	1,856.80	1.67
BAJAJFINSV	1,629.95	1.42
APOLLOHOSP	7,225.00	1.38
NTPC	372.5	1.37

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BHARTIARTL	1,583.65	-2.28
CIPLA	1,500.00	-2.21
BAJAJ-AUTO	9,000.00	-1.77
TATAMOTORS	788.2	-1.63
ADANIPORTS	1,267.80	-1.62

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,521
ఎన్ఎస్ఈ	1,19,361
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,88,334
ఎఫ్ఐఐ	+ 1,798
డీఐఐ	- 901

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.77	$ 69.94
బ్రెంట్	73.44	$ 73.62

2027 నాటికి మరో మూడు మోడళ్లు



- ప్రవేశపెట్టనున్న హోండా కార్స్ ఇండియా
- కంపెనీ ప్రెసిడెంట్ టకుయ సుమూర
- భారత్‌లో అమేజ్ థర్డ్ జనరేషన్ విడుదల

న్యూఢిల్లీ: కార్ల తయారీలో ఉన్న జపాన్ సంస్థ హోండా 2027 మార్చి నాటికి భారత్‌లో మూడు కొత్త మోడళ్లను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. బలంగా అభివృద్ధి చెందుతున్న ఎస్‌యూవీ విభాగంలో వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని చూస్తున్నట్టు హోండా కార్స్ ఇండియా ప్రెసిడెంట్, సీఈవో టకుయ సుమూర తెలిపారు. కంపెనీ ప్రస్తుతం భారత్‌లో ఎలివేట్ ఎస్‌యూవీతోపాటు సెడాన్స్ అయిన అమేజ్, సిటీ మోడళ్లను విక్రయిస్తోంది. 2026–27 ఆర్థిక సంవత్సరం నాటికి హైబ్రిడ్, ఎలక్ట్రిక్ పవర్‌ట్రెయిన్‌లతో మూడు కొత్త మోడళ్లను పరిచయం చేయడానికి ప్రణాళిక చేస్తున్నట్టు సుమూర తెలిపారు. తద్వారా ఎస్‌యూవీ విభాగంలో కంపెనీ ఉనికిని విస్తరిస్తుందని చెప్పా రు. భారతీయ మార్కెట్‌కు సరిపోయే హైబ్రిడ్, బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాల వంటి మోడళ్లను హోండా అభివృద్ధి చేస్తూనే ఉందని వెల్లడించారు.

అమేజ్ థర్డ్ జనరేషన్..

మూడవ తరం అమేజ్‌ను కంపెనీ బుధవారం పరిచయం చేసింది. ఎక్స్‌షోరూమ్‌లో ధర రూ.7.99 లక్షల నుండి రూ.10.89 లక్షల వరకు ఉంది. ఈ మోడల్ మాన్యువల్, ఆటోమేటిక్ వేరియంట్లలో తయారైంది. కాంపాక్ట్ సెడాన్ సెగ్మెంట్లో మారుతీ డిజైర్, హ్యుండై ఆరా వంటి మోడళ్లతో ఇది పోటీపడుతోంది. దేశంలో అడాస్ భద్రతా ఫీచర్లను కలిగిన అత్యంత సరసమైన కారు అమేజ్ అని సుమూర చెప్పారు. హోండా దేశంలో ఇప్పటివరకు 5.8 లక్షల యూనిట్ల అమేజ్ కార్లను విక్రయించింది. అమేజ్ మొదటి తరం 2013లో, రెండవ తరం 2018లో ప్రవేశించింది. అమేజ్ కస్టమర్లలో 50% మంది మొదటిసారి కారును సొంతం చేసుకున్నవారేనని సేల్స్ వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహల్ పేర్కొన్నారు.

సానుకూలంగా వైట్ కాలర్ నియామకాలు

- నవంబర్‌లో 2 శాతం పెరుగుదల
- నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్ వెల్లడి



ముంబై: వైట్ కాలర్ ఉద్యోగుల (నైపుణ్య, నిర్వహణ విధులు) నియామకాలు నవంబర్ నెలలో 2 శాతం పెరిగాయి. ఆయిల్ అండ్ గ్యాస్, కృత్రిమ మేథ-మెషిన్ లెర్నింగ్ (ఏఐ/ఎంఎల్), ఎఫ్ఎంసీజీ రంగాల్లో నియామకాలు సానుకూలంగా నమోదయ్యాయి. నవంబర్ నెలకు సంబంధించిన గణాంకాలను నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్ విడుదల చేసింది. నౌకరీ ప్లాట్‌ఫామ్‌పై వైట్‌కాలర్ ఉద్యోగాలకు సంబంధించి 2,430 నోటిఫికేషన్లు వెలువడ్డాయి. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 2 శాతం పెరిగాయి. ఆయిల్ అండ్ గ్యాస్ రంగంలో 16 శాతం, ఫార్మా/బయోటెక్ రంగంలో 7 శాతం, ఎఫ్ఎంసీజీ రంగంలో 7 శాతం, రియల్ ఎస్టేట్‌లో 10 శాతం చొప్పున వైట్ కాలర్ నియామకాలు అధికంగా నమోదయ్యాయి. ముఖ్యంగా ఏఐ/ఎంఎల్ విభాగంలో 30 శాతం, గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్లలో 11 శాతం అధికంగా ఉపాధి కల్పన జరిగినట్టు నౌకరీ నివేదిక తెలిపింది. ఐటీ రంగంలో వైట్ కాలర్ నియామకాలు క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చిచూసినప్పుడు ఎలాంటి వృద్ధి లేకుండా ఫ్లాట్‌గా నమోదైంది. పండుగల సీజన్ మద్దతుతో ఇతర రంగాల్లో నియామకాలు మోస్తరుగా ఉన్నాయి. ప్రాంతాల వారీగా చూస్తే రాజస్థాన్ ముందుంది. జైపూర్ 14 శాతం, ఉదయ్‌పూర్ 24 శాతం, కోటలో 15 శాతం వైట్ కాలర్ నియామకాలు పెరిగాయి. జైపూర్‌లో విదేశీ ఎంఎన్‌సీ కంపెనీల తరఫున నియామకాలు 20 శాతం పెరిగాయి. భువనేశ్వర్‌లో 21 శాతం వృద్ధి కనిపించింది.



సేవల రంగంలో ఉపాధి 'జూమ్'

- నవంబర్ హెచ్ఎస్‌బీసీ ఇండియా యాక్టివిటీ ఇండెక్స్ @ 58.4

న్యూఢిల్లీ: భారత్ మొత్తం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో మెజారిటీ వాటా ఉన్న సేవల రంగం నవంబర్‌లో భారీ ఉపాధి అవకాశాలు కల్పించినట్లు హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ పేర్కొంది. ఈ సర్వే ప్రకారం, 2005 తర్వాత అదే స్థాయిలో సేవల రంగం ఉపాధి కల్పించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కాగా, అక్టోబర్‌లో 58.5 వద్ద ఉన్న ఇండెక్స్, నవంబర్‌లో స్వల్పంగా 58.4కు తగ్గింది. విక్రయాల్లో స్వల్ప మందగమనం దీనికి కారణం. కాగా, ఇండెక్స్ 50పైన ఉంటే దానికి వృద్ధి ధోరణిగా, ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు.

గ్లాండ్ ఫార్మా ఔషధానికి ఎఫ్‌డీఏ అనుమతి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గ్లాకోమా సంబంధ కంటి సమస్య చికిత్సకు ఉపయోగపడే లాటనోప్రోస్ట్ ఆప్తాల్మిక్ సొల్యూషన్ ఔషధానికి అమెరికా ఎఫ్‌డీఏ అనుమతి లభించినట్లు గ్లాండ్ ఫార్మా వెల్లడించింది. ఇది అప్‌జాన్ సంస్థకు చెందిన జాలటాన్‌కి జనరిక్ వెర్షన్ అని తెలిపింది. తమ మార్కెటింగ్ భాగస్వాముల ద్వారా దీన్ని ఈ ఆర్థిక సంవత్సరం ప్రవేశపెట్టే అవకాశమున్నట్లు కంపెనీ వివరించింది. 2023 డిసెంబర్‌కి ముందు ఏడాది వ్యవధిలో ఈ ఔషధం అమ్మకాలు దాదాపు 111.6 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

పేటెంట్ దరఖాస్తుల వెల్లువ

- 2023–24లో 92,000 దరఖాస్తులు
- కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా గత ఆర్థిక సంవత్సరంలో సుమారు 92,000 పేటెంట్ దరఖాస్తులు నమోదయ్యాయి. ఇది సాంకేతిక, శాస్త్రీయ అభివృద్ధికి కేంద్రంగా భారత్‌లో పెరుగుతున్న పరిపక్వతను సూచిస్తుందని కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్, డిజైన్స్, ట్రేడ్‌మార్క్స్ ఉన్నత్ పండిట్ తెలిపారు. ప్రతి ఆరు నిమిషాలకు ఒక కొత్త టెక్నాలజీ భారత్‌లో ఐపీ రక్షణను కోరుతోందని అసోచాం సదస్సులో చెప్పారు. మేథో సంపత్తి (ఐపీ) హక్కులకు సంబంధించిన మార్గదర్శకాలను పునరుద్ధరిస్తున్నామని, కొత్త నిబంధనల కోసం వివిధ వాటాదారుల నుండి అభిప్రాయాలను కోరుతున్నామని అన్నారు. 'వివిధ రంగాలలో ఐపీ రక్షణ కోసం రూపొందించిన మార్గదర్శకాలను పునరుద్ధరిస్తున్నాం. ఈ కసరత్తు జరుగుతోంది. అటువంటి మార్గదర్శకాల ప్రభావాన్ని మరింత బలోపేతం చేయడానికి పరిశ్రమ సంఘాలు, ఐపీ వాటాదారులు కూడా సహకారం అందించవచ్చు. శక్తివంతమైన మేథో సంపత్తి (ఐపీ) హక్కుల వ్యవస్థను సృష్టించాల్సిన అవసరం ఉంది. సమర్థవంతమైన ఐపీ ఫైలింగ్‌ల దిశగా మేము పని చేస్తున్నాం. మంజూరైన పేటెంట్లలో ఈ వేగవంతమైన పెరుగుదల దరఖాస్తులను ప్రాసెస్ చేయడంలో, ఐపీ హక్కులను మంజూరు చేయడంలో భారత పేటెంట్ కార్యాలయ సామర్థ్యాన్ని నొక్కి చెబుతోంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అనేక ఆవిష్కరణలతో దరఖాస్తుల నాణ్యత పెరగడాన్ని కూడా ఇది ప్రతిబింబిస్తోంది' అని ఆయన అన్నారు.

ప్రారంభమైన ఆర్‌బీఐ పాలసీ సమీక్ష

- 6న కీలక నిర్ణయాలు
- యథాతథ రేటు కొనసాగింపునకే సెంట్రల్ బ్యాంక్ మొగ్గు



ముంబై: గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమీక్షా సమావేశం బుధవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశం కీలక నిర్ణయాలను గవర్నర్ శక్తికాంతదాస్ శుక్రవారం మీడియాకు వివరిస్తారు. భారత్ రిటైల్ ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో ఆందోళనకరంగా 14 నెలల గరిష్ట స్థాయిలో 6.2 శాతంగా (2023 ఇదే నెలతో పోల్చి) నమోదయిన నేపథ్యంలో కీలక రుణ రేటు రెపో యథాతథంగానే కొనసాగే అవకాశం ఉందన్నది మెజారిటీ ఆర్థికవేత్తలు అంచనా. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం 2 శాతం అటు ఇటుగా 4 శాతం వద్ద ఉండాలి. అంటే ఎగువదిశగా 6 శాతం పైకి పెరగకూడదు. అక్టోబర్‌లో నమోదయిన తీవ్ర ద్రవ్యోల్బణం గణాంకాల నేపథ్యంలో ఆర్‌బీఐ సమీప భవిష్యత్‌లో వడ్డీరేట్ల తగ్గుదలకు సంకేతాలు ఇవ్వకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం 6.5 శాతంగా ఉన్న రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు) తగ్గే అవకాశాలు లేవని వారు విశ్లేషిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం దిగువన కొనసాగింది. రిటైల్ ద్రవ్యోల్బణంలో కీలకమైన ఆహార ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో ఏకంగా 10.87 శాతంగా నమోదయ్యింది. ధరల స్థిరత్వమే ఎకానమీ స్థిరమైన వృద్ధికి పునాదిగా పని చేస్తుందని గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేస్తున్నారు. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని కేంద్రం నిర్దేశిస్తున్న విధంగా 4 శాతానికి తగ్గించడమే సెంట్రల్ బ్యాంక్ లక్ష్యమని ఆయన ఉద్ఘాటిస్తున్నారు.

రూ. 21 లక్షల కోట్లకు ఇన్విట్స్ ఏయూఎం

2030 నాటికి అంచనా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై మరింతగా దృష్టి పెడుతున్న నేపథ్యంలో 2030 నాటికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌ల (ఇన్విట్స్) నిర్వహణలోని ఆస్తుల పరిమాణం (ఏయూఎం) రూ. 21 లక్షల కోట్లకు చేరగలదని అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఇది రూ. 5 లక్షల కోట్లుగా ఉంది. అలాగే రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్స్) పోర్ట్‌ఫోలియోలోని 125 మిలియన్ చ.అ. ఆఫీస్ స్పేస్ వచ్చే కొన్నేళ్లలో 4 రెట్లు పెరిగి 400 మిలియన్ చ.అ.లకు చేరనుంది. బుధవారమిక్కడ ఈ సాధనాలపై రిటైల్ ఇన్వెస్టర్ల కోసం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో రీట్స్, ఇన్విట్స్ అసోసియేషన్ల ప్రతినిధులు ఈ విషయాలు తెలిపారు. సాధారణంగా రియల్టీ, ఇన్‌ఫ్రాలో పెట్టుబడులు పెట్టాలంటే పెద్ద మొత్తం అవసరమవుతుందని, కానీ రీట్స్, ఇన్విట్స్ ద్వారా చాలా తక్కువ మొత్తాన్నే ఇన్వెస్ట్ చేసి మెరుగైన ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు. రీట్స్‌లో కనిష్ఠంగా రూ. 100–400కి కూడా యూనిట్లను కొనుగోలు చేయొచ్చని పేర్కొన్నారు. మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ సీఎఫ్‌వో ప్రీతి ఛేడా, హైవే ఇన్‌ఫ్రా ట్రస్ట్ సీఎఫ్‌వో అభిషేక్ ఛాజర్, నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ సీఈవో రాజేష్ దేవ్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. దేశీయంగా 26 ఇన్విట్స్ ఉండగా, లిస్టెడ్ రీట్స్ నాలుగు ఉన్నాయి.



డైరెక్ట్ ఫ్లైట్స్ కోసం భారత్‌తో చర్చలు

దక్షిణాఫ్రికా పర్యాటక మంత్రి పచ్యూషా

ముంబై: పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో భాగంగా నేరుగా విమానాలను ప్రవేశపెట్టడానికి భారత ప్రభుత్వంతోపాటు మూడు విమానయాన సంస్థలతో చర్చలు జరుపుతున్నట్టు దక్షిణాఫ్రికా పర్యాటక మంత్రి పచ్యూషా డె లో తెలిపారు. ప్రస్తుతం భారత్, దక్షిణాఫ్రికా మధ్య కనెక్టింగ్ విమానాశ్రయాలతో ఎమిరేట్స్, కెన్యా ఎయిర్‌వేస్, ఎయిర్ మారిషస్, ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్, ఎతిహాద్ ఎయిర్‌వేస్, ఎయిర్ సీషెల్స్, రువాండ్ ఎయిర్, ఖతార్ ఎయిర్‌వేస్ ద్వారా విమాన సర్వీసులు నడుస్తున్నాయి. 'భారతీయ ప్రయాణికుల కోసం దక్షిణాఫ్రికాను పర్యాటక గమ్యస్థానంగా ప్రోత్సహించడానికి, ఏవైనా సమస్యలను పరిష్కరించేందుకు, పర్యాటకాన్ని పెంచడానికి మేము ఇక్కడ ఉన్నాము. దక్షిణాఫ్రికా-భారత్ మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసుల విషయంలో సమస్య ఉంది. భారతీయ విమానయాన సంస్థలు ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్‌తో రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసుల ప్రయోజనాలపై వారిని ఒప్పించబోతున్నాను. ఈ విమానయాన సంస్థలు పర్యాటకుల దృక్కోణం నుండి మాత్రమే కాకుండా వాణిజ్యం, వ్యాపార కోణం నుండి కూడా ఈ ప్రత్యక్ష విమానాలతో పొందగల ప్రయోజనాలను దక్షిణాఫ్రికా టూరిజం వివరిస్తుంది' అని ఆమె వివరించారు.

ఎలక్ట్రానిక్ వీసా సౌకర్యాలతో..

దక్షిణాఫ్రికా ప్రభుత్వం భారతీయ ప్రయాణికులకు ఎలక్ట్రానిక్ వీసా సౌకర్యాలతో సుదీర్ఘ ప్రక్రియ సమస్యను పరిష్కరించిందని పచ్యూషా వివరించారు. ఈ–వీసాతో భారతీయ యాత్రికులు ఇప్పుడు దక్షిణాఫ్రికాకు రావడం చాలా సులభం అని చెప్పారు. దక్షిణాఫ్రికాకు అగ్రస్థానంలో ఉన్న మార్కెట్లలో భారత్ ఒకటిగా ఉందని, ఈ ఏడాది చివరినాటికి కోవిడ్‌కు ముందున్న స్థాయికి చేరుకోవాలని తాము భావిస్తున్నామని తెలిపారు. '2019లో మేము 95,000 మంది భారతీయ ప్రయాణికులను స్వాగతించాము. 2023లో ఈ సంఖ్య 79,000కి తగ్గింది. ఈ సంవత్సరం జనవరి–సెప్టెంబర్ మధ్య 59,000 మంది భారతీయులు ఇప్పటికే దక్షిణాఫ్రికాను సందర్శించారు. పర్యాటకుల సంఖ్య పరంగా ఈ సంవత్సరం కోవిడ్ పూర్వ స్థాయికి దగ్గరగా ఉండాలని మేము ఆశిస్తున్నాము' అని ఆమె తెలిపారు.



నిస్సాన్ 5 లక్షల విక్రయ మైలురాయి

గురుగ్రామ్: నిస్సాన్ మోటార్ ఇండియా ఓ ప్రత్యేక మైలురాయిని అధిగమించింది. భారత మార్కెట్లో 5 లక్షల కార్ల విక్రయాలను పూర్తి చేసుకుంది. కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత ఇప్పటి వరకు 5,13,241 యూనిట్లను విక్రయించినట్టు తెలిపింది. ఇక ఈ ఏడాది నవంబర్ నెలలో 9,040 యూనిట్లను హోల్‌సేల్‌గా విక్రయించినట్టు (డీలర్లకు) వెల్లడించింది. ఇందులో దేశీయ మార్కెట్లో 2,342 యూనిట్లను విక్రయించగా, 6,698 యూనిట్లను ఎగుమతి చేసినట్టు పేర్కొంది. అక్టోబర్ నెలలో హోల్‌సేల్ విక్రయాలు 5,570 యూనిట్లతో పోల్చితే నెలవారీగా 62 శాతం వృద్ధి నమోదైందని వివరించింది. కొత్త నిస్సాన్ మ్యాగ్నైట్ సహా కంపెనీ కార్లకు స్థిరమైన డిమాండ్ కొనసాగుతున్నట్టు తెలిపింది. భారత మార్కెట్లో 5 లక్షల కార్ల విక్రయాల మైలురాయిని చేరుకోవడం గర్వకారణమని నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ సౌరభ్ వత్స అన్నారు. నిస్సాన్ వాహనాల నాణ్యత, మన్నిక, పనితీరు పట్ల కస్టమర్లలో ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. భారత్‌లో తయారైన మ్యాగ్నైట్‌కు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ నెలకొందని, 45 కొత్త మార్కెట్లకు చేరుకోవడంతో మొత్తం 65 దేశాలకు తమ కార్యకలాపాలు విస్తరించినట్టు తెలిపారు.



అందుబాటు ఇళ్లపై పీఎన్‌బీ హౌసింగ్ దృష్టి



రూ.5,000 కోట్లకు రుణ పుస్తకం విస్తరణ

ముంబై: పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ అందుబాటు ఇళ్ల విభాగంలో తన రుణ పుస్తకాన్ని 2025 మార్చి నాటికి రూ.5,000 కోట్లకు చేర్చనున్నట్టు ప్రకటించింది. 'రోషిణి' పేరుతో అందుబాటు ధరల ఇళ్లకు పీఎన్‌బీ రుణాలిస్తుంటుంది. దీనికింద రుణ పుస్తకం 2024 సెప్టెంబర్ నాటికి రూ.3,000 కోట్లుగా ఉంది. వచ్చే మార్చి నాటికి రూ.5,000 కోట్లకు, 2027 మార్చి నాటికి రూ.1,5,000 కోట్లకు చేరుకుంటుందని పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ ఎండీ, సీఈవో గిరీష్ కౌస్గి మీడియాకు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకంతోపాటు, శాఖల విస్తరణ ద్వారా ఈ లక్ష్యాలను చేరుకుంటామని చెప్పారు. ప్రాపర్టీ తనఖాపై రుణం ఇచ్చే (ఎల్ఏపీ) విభాగాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. 17 శాతం రుణ వృద్ధిని చేరుకునేందుకు గాను 100–125 మిలియన్ డాలర్ల నిధులను ఈసీబీల జారీ ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సమీకరించనున్నట్టు వెల్లడించారు. ఇందుకు సంబంధించి కంపెనీ బోర్డు ఇప్పటికే ఆమోదం తెలిపినట్టు గుర్తు చేశారు. మొత్తం రుణ ఆస్తుల విలువ ప్రస్తుతం రూ.70,000 కోట్లు ఉండగా, 2027 మార్చి నాటికి రూ.లక్ష కోట్లను చేరుకుంటుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి కొత్తగా మరో 40 శాఖలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. రిటైల్ రుణ ఉత్పత్తుల్లో నాన్ హౌసింగ్ పోర్ట్‌ఫోలియోని 30 శాతానికి చేర్చుకోవాలని అనుకుంటున్నట్టు.. ఎల్ఏపీని ఆఫర్ చేయడం ద్వారా దీన్ని చేరుకోనున్నట్టు వెల్లడించారు. అందుబాటు గృహాలకు రుణాలను మహిళలకు తక్కువ రేటుకే పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ అందిస్తుండడం గమనార్హం.

నిర్వహణలోలేని ఖాతాల దుమ్ము దులపండి


- వాటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోండి
- బ్యాంక్‌లను కోరిన ఆర్‌బీఐ



ముంబై: ఎలాంటి లావాదేవీలు లేకుండా ఇనాపరేటివ్‌గా(నిర్వహణలోలేని) మారిన ఖాతాల సంఖ్యను సత్వరమే తగ్గించుకోవాలని బ్యాంక్‌లను ఆర్‌బీఐ కోరింది. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇనాపరేటివ్ ఖాతాలకు సంబంధించి గణాంకాలను ప్రతీ త్రైమాసికానికి ఒకసారి ఆర్‌బీఐకి నివేదించాలని కోరింది. ఈ తరహా ఇనాపరేటివ్ ఖాతాల్లో పెద్ద మొత్తంలో నిధులు ఉండిపోవడం పట్ల ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. కొన్ని సమస్యల కారణంగా ఖాతాలు నిరుపయోగంగా లేదా స్తంభించిపోయినట్టు తమ తనిఖీల్లో తెలిసినట్టు వెల్లడించింది. ముఖ్యంగా కొన్ని బ్యాంకుల్లో ఈ తరహా ఖాతాల సంఖ్య అధికంగా ఉండడం, వాటిల్లో నిధులు ఉండిపోవడాన్ని ఆర్‌బీఐ గుర్తించింది. దీంతో వాటిని తగ్గించుకోవాలని, సులభంగా యాక్టివేట్ చేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడాన్ని సైతం పరిశీలించాలని పేర్కొంది. ప్రభుత్వరంగ ఎస్‌బీఐ ఇప్పటికే ఇందుకు సంబంధించి దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించడం గమనార్హం. ఇక కస్టమర్లకు సంబంధించి ఆధార్ అప్‌డేషన్ సేవలను సైతం అందించాలని, ఆధార్ ఆధారిత సేవలకు వీలు కల్పించాలని బ్యాంక్‌లను ఆర్‌బీఐ కోరింది. ఇనాపరేటివ్ ఖాతాలను యాక్టివేట్ చేసుకునేందుకు కస్టమర్లు బ్యాంక్ శాఖలను సంప్రదించినప్పటికీ, పేరు ఇతర వివరాలు సరిపోకపోవడం కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్నట్టు తమ దృష్టికి వచ్చినట్టు తెలిపింది.

15 ఏళ్ల తర్వాత...

● వెస్టిండీస్ గడ్డపై టెస్టు నెగ్గిన బంగ్లాదేశ్
● రాణించిన తైజుల్, తస్కీన్
● సిరీస్ 1–1తో సమం



తైజుల్

కింగ్‌స్టన్ (జమైకా): ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు... 15 ఏళ్ల తర్వాత వెస్టిండీస్‌లో టెస్టు మ్యాచ్ గెలిచింది. చివరిసారిగా 2009లో కరీబియన్ గడ్డపై టెస్టు మ్యాచ్ నెగ్గిన బంగ్లాదేశ్... ఏడు పరాజయాల తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు విజయం రుచి చూసింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం ముగిసిన రెండో టెస్టులో బంగ్లాదేశ్ 101 పరుగుల తేడాతో ఆతిథ్య విండీస్‌ను చిత్తు చేసింది. ఫలితంగా సిరీస్ 1–1తో 'డ్రా'గా ముగిసింది. 287 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ 50 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. కవెమ్ హడ్జ్ (75 బంతుల్లో 55; 6 ఫోర్లు), కెప్టెన్ బ్రాత్‌వైట్ (43; 2 ఫోర్లు, 1 సిక్స్) పోరాడినా ఫలితం లేకపోయింది. బంగ్లాదేశ్ బౌలర్లలో తైజుల్ ఇస్లామ్ 5 వికెట్లు పడగొట్టగా... హసన్ మహమూద్, తస్కీన్ అహ్మద్ చెరో రెండు వికెట్లు తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 193/5తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 59.5 ఓవర్లలో 268 పరుగులకు ఆలౌటైంది. జాకీర్ అలీ (106 బంతుల్లో 91; 8 ఫోర్లు, 5 సిక్సర్లు) భారీ షాట్లతో బంగ్లాకు మంచి ఆధిక్యం అందించాడు. సహచరుల నుంచి పెద్దగా సహకారం లేకపోయినా... బౌండ్రీలే లక్ష్యంగా విరుచుకుపడ్డాడు. విండీస్ బౌలర్లలో అల్జారీ జోసెఫ్, రోచ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 164 పరుగులు చేయగా... వెస్టిండీస్ 146 పరుగులు చేసింది. తైజుల్ ఇస్లామ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'... తస్కీన్ అహ్మద్, జేడెన్ సీల్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

'స్పిన్నర్లకు సహకరిస్తుంది'

అడిలైడ్ పిచ్‌పై క్యూరేటర్ వ్యాఖ్య



అడిలైడ్: 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య రెండో టెస్టు జరగనున్న అడిలైడ్ పిచ్ స్పిన్ బౌలింగ్‌కు సహకరించనుందని ప్రధాన క్యూరేటర్ డామియన్ హగ్ వెల్లడించాడు. శుక్రవారం నుంచి ఇరు జట్ల మధ్య 'డే అండ్ నైట్' టెస్టు ప్రారంభం కానుండగా... పిచ్‌పై 6 మిల్లీ మీటర్ల పచ్చిక ఉంటుందని పేర్కొన్నాడు. ఫ్లడ్ లైట్ల వెలుతురులో గులాబీ బంతిని ఎదుర్కోవడం కొంచెం కష్టమే అని... అయితే పిచ్ అటు బ్యాటర్లకు, ఇటు బౌలర్లకు సహకరిస్తుందని వెల్లడించాడు. 'రికార్డులు పరిశీలిస్తే అడిలైడ్‌లో ఫ్లడ్ లైట్ల వెలుతురులో బ్యాటింగ్ చేయడం కష్టమనేది సుస్పష్టం. పిచ్‌పై పచ్చిక ఉండనుంది. ఆరంభంలో పేస్‌కు సహకరించినా... మ్యాచ్ కొనసాగుతున్నకొద్దీ స్పిన్నర్లు ప్రభావం చూపగలరు. బంతి పాతబడే వరకు కుదురుకుంటే పరుగులు రాబట్టడం పెద్ద కష్టం కాదు. అడిలైడ్‌లో స్పిన్ కీలక పాత్ర పోషించడం పరిపాటి. ఇక్కడ ఆడేటప్పుడు ప్రధాన స్పిన్నర్ తుది జట్టులో ఉండాల్సిందే. మ్యాచ్ ఆరంభంలో పేసర్లు ప్రభావం చూపితే... రాత్రి పూట స్పిన్నర్లు ప్రమాదకరం' అని హగ్ వెల్లడించాడు.

ఈసారైనా...!

నేడు ఆస్ట్రేలియాతో భారత మహిళల జట్టు తొలి వన్డే
● ఇప్పటి వరకు ఆస్ట్రేలియాపై సిరీస్ నెగ్గని టీమిండియా
● ఉదయం గం. 8:50 నుంచి స్టార్ స్పోర్ట్స్–2లో ప్రత్యక్ష ప్రసారం

ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, వెస్టిండీస్, శ్రీలంక గడ్డపై వన్డే సిరీస్‌లు నెగ్గిన భారత మహిళల క్రికెట్ జట్టుకు ఆస్ట్రేలియాలో మాత్రం ఇప్పటి వరకు నిరాశే మిగిలింది. ద్వైపాక్షిక వన్డే సిరీస్ ఆడేందుకు ఇప్పటి వరకు నాలుగుసార్లు ఆస్ట్రేలియాలో పర్యటించిన టీమిండియా రెండు మ్యాచ్‌ల్లో మాత్రమే గెలిచింది. ఈ నేపథ్యంలో అందని ద్రాక్షగా ఉన్న ఆస్ట్రేలియాలో వన్డే సిరీస్‌ను సొంతం చేసుకునేందుకు భారత జట్టుకు మరో అవకాశం లభించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా రెండు జట్ల మధ్య ఈరోజు తొలి వన్డే జరగనుంది. వచ్చే ఏడాది స్వదేశంలో జరగనున్న వన్డే వరల్డ్‌కప్ సన్నాహాలు ఈ సిరీస్ నుంచే భారత్ మొదలుపెట్టనుంది.



బ్రిస్బేన్: ఇటీవల సొంతగడ్డపై న్యూజిలాండ్ జట్టును మట్టికరిపించిన భారత మహిళల క్రికెట్ జట్టు మరో సిరీస్‌కు సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య బ్రిస్బేన్ వేదికగా తొలి వన్డే జరగనుంది. వచ్చే ఏడాది స్వదేశంలో వన్డే ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో... ఈ సిరీస్ టీమిండియాకు కీలకం కానుండగా... మరోవైపు సొంతగడ్డపై ఆసీస్ జట్టు ఆధిపత్యం కొనసాగించాలని భావిస్తోంది. భారత జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం వహిస్తుండగా... స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న యువ ఓపెనర్ షఫాలీ వర్మను ఈ పర్యటనకు ఎంపిక చేయలేదు. జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్, దీప్తి శర్మలతో జట్టు బలంగానే ఉన్నా... వీరంతా కలిసికట్టుగా రాణించాల్సిన అవసరముంది. ఇప్పటి వరకు భారత్, ఆస్ట్రేలియా మహిళల జట్ల మధ్య 16 వన్డేలు జరగగా... అందులో భారత జట్టు కేవలం 4 విజయాలు మాత్రమే సాధించింది. 2021లో చివరిసారి ఆస్ట్రేలియాలో పర్యటించిన మన జట్టు 1–2తో సిరీస్ కోల్పోయింది. ఆస్ట్రేలియాపై విజయం సాధించాలంటే భారత జట్టు శక్తికి మించి పోరాడాల్సిన అవసరముంది. 2025లో భారత్ వేదికగా వన్డే ప్రపంచకప్ జరగనుండటంతో... దానికి ముందు ఈ సిరీస్ సన్నాహకంగా ఉపయోగపడుతుందని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మరోవైపు ఆస్ట్రేలియా రెగ్యులర్ కెప్టెన్ అలీసా హీలీ గాయం కారణంగా అందుబాటులో లేకపోవడంతో తహిలా మెక్‌గ్రాత్ జట్టుకు సారథ్యం వహించనుంది. 'భారత జట్టులో చాలా మంది స్టార్ ప్లేయర్లు ఉన్నారు. వారిపై పైచేయి సాధించడం అంత సులువు కాదు. స్వదేశంలో ఆడుతుండటంతో మాపై అంచనాలు ఎక్కువ ఉంటాయి. నేను పూర్తి స్థాయి కెప్టెన్‌గా తొలిసారి సిరీస్ ఆడుతున్నా. ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తా' అని తహిలా పేర్కొంది. ఇటీవల టి20 ప్రపంచకప్‌లో టీమిండియా పేలవ ప్రదర్శన కనబర్చడంతో హర్మన్‌ను కెప్టెన్‌గా తప్పించాలనే వాదనలు ఎక్కువైనా... మేనేజ్‌మెంట్ ఆమె సారథ్యంపై నమ్మకముంచింది. మరి స్వదేశంలో వన్డే వరల్డ్ కప్ జరగనున్న నేపథ్యంలో హర్మన్ తన సత్తా చాటాల్సిన అవసరముంది. ఇక స్వదేశంలో న్యూజిలాండ్‌తో సిరీస్‌లో కళ్లు చెదిరే ఫీల్డింగ్ విన్యాసాలతో ఆకట్టుకున్న రాధ యాదవ్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. బౌలింగ్‌లో హైదరాబాదీ పేసర్ అరుంధతి రెడ్డి, రేణుక సింగ్, దీప్తి శర్మ కీలకం కానున్నారు. ఆసీస్ జట్టులో స్టార్లకు కొదవ లేకపోగా... మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే అవకాశాలు ఉన్నాయి. అయితే ఆటకు పెద్దగా ఇబ్బంది కలగకపోవచ్చు.

> "షఫాలీ వర్మ చాలా ముఖ్యమైన ప్లేయర్. జాతీయ జట్టు తరఫున షఫాలీ ఎన్నో మంచి ఇన్నింగ్స్‌లు ఆడింది. తిరిగి పుంజుకొని జట్టులోకి వస్తుందని నమ్మకముంది. ప్రత్యర్థి ఎవరైనా విజయం సాధించాలనే తపనతోనే మైదానంలో అడుగు పెడతాం. వన్డేల్లో మా జట్టు మంచి ప్రదర్శన చేస్తోంది. దాన్నే ఇక్కడ కొనసాగించేందుకు ప్రయత్నిస్తాం. ప్రతి మ్యాచ్ ముఖ్యమే. ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని జట్టు కూర్పుపై కసరత్తు చేస్తాం. స్వదేశంలో న్యూజిలాండ్‌పై సిరీస్ విజయం సాధించాం. ఇక్కడ పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. వాటి కోసం సిద్ధంగా ఉన్నాం." – హర్మన్‌ప్రీత్ కౌర్, భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్

10 భారత్, ఆస్ట్రేలియా మహిళల జట్ల మధ్య ఇప్పటి వరకు 53 వన్డేలు జరిగాయి. ఇందులో భారత జట్టు 10 మ్యాచ్‌ల్లో గెలుపొందగా... ఆస్ట్రేలియా 43 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది.

9 భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఇప్పటి వరకు 9 ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లు జరిగాయి. తొమ్మిది సిరీస్‌లలోనూ ఆస్ట్రేలియానే గెలిచింది. ఆస్ట్రేలియా గడ్డపై భారత జట్టు నాలుగు వన్డే సిరీస్‌లు ఆడి నాలుగింటిలోనూ ఓటమి పాలైంది.

'ఎలాంటి సవాల్‌కైనా సిద్ధం'



● ఏ స్థానంలోనైనా ఆడుతా
● తుది జట్టులో ఉండటమే ముఖ్యం
● పదేళ్లు పాతికేళ్లలా అనిపిస్తున్నాయి
● భారత బ్యాటర్ రాహుల్ వ్యాఖ్య

అడిలైడ్: ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్టులో ఓపెనర్‌గా బరిలోకి దిగిన కేఎల్ రాహుల్ రెండో ఇన్నింగ్స్‌లో అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. అయితే రెండో టెస్టు కోసం రోహిత్ శర్మ అందుబాటులోకి రావడంతో అతని ఓపెనింగ్ స్థానంపై సందిగ్ధత నెలకొంది. అతను ఓపెనర్‌గా కొనసాగాలా లేక మిడిలార్డర్‌లో ఆడాలా అనేదానిపై చర్చ మొదలైంది. దీనిపై రాహుల్ స్పందించాడు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఈ అంశంపై అతను మాట్లాడాడు. 'అడిలైడ్ టెస్టులో నా బ్యాటింగ్ స్థానం ఏమిటనేది నాకు ఇప్పటికే చెప్పేశారు. అయితే మ్యాచ్ జరిగే వరకు దాని గురించి మాట్లాడవద్దని కూడా చెప్పారు. నేను దేనికైనా సిద్ధమే. ఏ స్థానమైనా తుది జట్టులో ఉండటమే నాకు అన్నింటికంటే ముఖ్యం. అవకాశం రాగానే బరిలోకి దిగి జట్టు కోసం ఆడటమే ప్రధానం. నేను వేర్వేరు స్థానాల్లో బ్యాటింగ్ చేశాను. ఆరంభంలో తొలి 20–25 బంతులు కొంత ఇబ్బందిగా అనిపించేవి. డిఫెన్స్ ఆడాలా లేక అటాక్ చేయాలనే అని సందేహ పడేవాడిని. అయితే ఇన్నేళ్ల అనుభవం తర్వాత నా ఇన్నింగ్స్‌ను ఎలా నడిపించాలో స్పష్టత వచ్చింది. తొలి 30–40 బంతులు సమర్థంగా ఎదుర్కోగలిగితే అది ఓపెనింగ్ అయినా మిడిలార్డర్ అయినా అంతా ఒకేలా అనిపిస్తుంది. దానిపైనే నేను దృష్టి పెడతా' అని రాహుల్ వెల్లడించాడు.

ముందే సమాచారం...

టెస్టు సిరీస్‌లో ఓపెనింగ్ చేయాల్సి రావచ్చని తనకు ఆస్ట్రేలియా బయల్దేరడానికి ముందే టీమ్ మేనేజ్‌మెంట్ చెప్పిందని... అందుకే అన్ని రకాలుగా సన్నద్ధమయ్యానని రాహుల్ చెప్పాడు. సరిగ్గా పదేళ్ల క్రితం రాహుల్ ఇదే ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. ఈ పదేళ్ల కెరీర్‌లో అతను 54 టెస్టులు ఆడాడు. ఈ క్రమంలో పలు గాయాలను అధిగమించిన అతను... మానసికంగా కూడా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నట్లు చెప్పాడు. 'పదేళ్లు కాదు...25 ఏళ్లు గడిచినట్లుగా అనిపిస్తోంది. ఇన్నేళ్లలో నాకు ఎదురైన గాయాలు, ఆటకు దూరమైన రోజులు అలా అనిపించేలా చేస్తున్నాయి. అయితే ఈ దశాబ్దపు కెరీర్‌ను ఆస్వాదించాననేది వాస్తవం. చిన్నప్పుడు నాన్నతో కలిసి ఉదయమే టీవీలో టెస్టులు చూసిన రోజులను దాటి అదే ఆసీస్ గడ్డపై తొలి టెస్టు ఆడే సమయంలో ఎంతో భావోద్వేగానికి లోనయ్యా. ఆ సమయంలో నా బ్యాటింగ్, చేయాల్సిన పరుగుల గురించి ఆలోచనే రాలేదు. కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. గుర్తుంచుకునే క్షణాలతో పాటు కఠిన పరిస్థితులను ఎదుర్కొన్నా. ఇన్నేళ్లలో ఏ స్థానంలో అయిన ఆడగలిగేలా మానసికంగా దృఢంగా తయారయ్యా. వచ్చే పదేళ్ల కెరీర్ కోసం ఎదురు చూస్తున్నా' అని రాహుల్ వివరించాడు.

'పింక్ బాల్' అంత సులువు కాదు!

రెండో టెస్టు కోసం సన్నద్ధమయ్యే క్రమంలో భారత జట్టు ప్రైమ్ మినిస్టర్ ఎలెవన్‌తో వన్డే ప్రాక్టీస్ మ్యాచ్ ఆడింది. ఆ తర్వాత అడిలైడ్ చేరుకున్న టీమ్ రెండు ప్రాక్టీస్ సెషన్లలో పాల్గొంది. ప్రస్తుత భారత జట్టులో ఎనిమిది మందికి డే అండ్ నైట్ టెస్టు ఆడిన అనుభవం ఉండగా... వీరిలో కోహ్లి, బుమ్రా, అశ్విన్ మాత్రమే ఆస్ట్రేలియా గడ్డపై ఆడారు. రాహుల్‌కు ఇదే తొలి 'పింక్ బాల్ టెస్టు' మ్యాచ్ కానుంది. ఈ నేపథ్యంలో ఎర్ర బంతికి, గులాబీ మధ్య తేడా తనకు స్పష్టంగా కనిపిస్తోందని... డే అండ్ నైట్ టెస్టులో 'పింక్ బాల్'ను ఎదుర్కోవడం అంత సులువు కాదని రాహుల్ వ్యాఖ్యానించాడు. 'బౌలర్ చేతినుంచి బంతి విడుదలయ్యే సమయంలో దానిని గుర్తించడం కష్టంగా ఉంది. ఎర్ర బంతితో పోలిస్తే చాలా గట్టిగా ఉండటంతో పాటు వేగంగా కూడా దూసుకొస్తోంది. ఫీల్డింగ్‌లో క్యాచ్ పట్టే సమయంలో కూడా తేడా స్పష్టంగా కనిపిస్తోంది. స్వింగ్ కూడా భిన్నంగా అవుతోంది కాబట్టి అదే మాకు పెద్ద సవాల్ కానుంది. నాకు ఇది కొత్త అనుభవం. క్రీజ్‌లోకి వెళ్లాకే దాని సంగతేమిటో చూస్తాను. ఎలాంటి స్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నా' అని రాహుల్ చెప్పాడు. అయితే ప్రాక్టీస్ ద్వారా అలవాటు పడేందుకు ప్రయత్నిస్తున్నామని అతను అన్నాడు. 'గులాబీ బంతి ఎలా స్పందిస్తోందో, ఆడటం ఎంత కష్టమో తెలుసుకునేందుకే మాకు కొంత సమయం పట్టింది. బౌలర్ చేతి నుంచి వచ్చే బంతిని గుర్తించడమే తొలి అడుగు. అప్పుడే సరైన షాట్ ఆడేందుకు తగిన అవకాశం ఉంటుంది. అందుకే మేమంతా ఎక్కువ బంతులను ఎదుర్కొనేందుకు ప్రయత్నించాం' అని రాహుల్ వెల్లడించాడు.



హద్దుమీరిన అభిమానులు!

ఇక నుంచి టీమిండియా ప్రాక్టీస్ సెషన్‌లకు అనుమతి నిరాకరణ

అడిలైడ్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టుకు చేదు అనుభవం ఎదురైంది. ప్రతిష్టాత్మక 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో భాగంగా తొలి టెస్టు గెలిచి టీమిండియా జోరు మీదుండగా... ఇరు జట్ల మధ్య శుక్రవారం నుంచి అడిలైడ్ వేదికగా 'పింక్ బాల్' టెస్టు ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో భారత ఆటగాళ్లు గులాబీ బంతితో ముమ్మర సాధన చేస్తుండగా... ప్రాక్టీస్ సెషన్స్‌కు హాజరైన కొందరు ఆస్ట్రేలియా అభిమానులు టీమిండియా ప్లేయర్లను ఎగతాళి చేశారు. దీంతో ఈ సిరీస్‌లో ఇకపై భారత జట్టు ప్రాక్టీస్ సెషన్స్ సమయంలో అభిమానులను అనుమతించబోవడం లేదు. మంగళవారం భారత ఆటగాళ్లు ప్రాక్టీస్ చేస్తుండగా... వేలాది మంది అభిమానులు స్టేడియానికి తరలివచ్చారు. అడిలైడ్ మైదానంలో నెట్స్‌కు చాలా సమీపం వరకు అభిమానులు వచ్చే వీలుండటంతో... అక్కడికి చేరుకున్న పలువురు పరుష పదజాలంతో భారత ఆటగాళ్లను తూలనాడారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న టీమ్ మేనేజ్‌మెంట్ క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ)కు ఫిర్యాదు చేసింది. ఇకపై టీమిండియా ప్రాక్టీస్ సెషన్స్‌కు అభిమానులను అనుమతించబోమని తేల్చిచెప్పింది.

ఇవేం లెక్కలు... ఇవేం శిక్షలు!

ఓవర్ రేట్ పెనాల్టీపై ఐసీసీని ప్రశ్నించిన ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్



క్రైస్ట్‌చర్చ్: 'చాలా మంచిది ఐసీసీ... మరో 10 గంటల ఆట మిగిలి ఉండగానే టెస్టు ముగిసింది'... స్లో ఓవర్ రేట్ కారణంగా 3 పాయింట్లు పెనాల్టీగా కోల్పోయిన అనంతరం ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ చేసిన వ్యంగ్య వ్యాఖ్య ఇది. ఓవర్ రేట్ విషయంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వ్యవహార శైలిని విమర్శిస్తూ అతను సోషల్ మీడియాలో ఈ వ్యాఖ్యను పెట్టాడు. స్లో ఓవర్ రేట్ కారణంగా ఇంగ్లండ్‌తో పాటు న్యూజిలాండ్‌కు కూడా 3 పాయింట్ల పెనాల్టీ పడింది. 2023–23 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో ఇంగ్లండ్ ఇదే కారణంగా ఏకంగా 22 పాయింట్లు కోల్పోయింది. గత ఏడాది యాషెస్ సిరీస్ ఫలితం తర్వాత ఇంగ్లండ్ ఖాతాలో 28 పాయింట్లు చేరగా... పెనాల్టీ రూపంలోనే 19 పాయింట్లు పోయాయి! సహజంగానే ఇది స్టోక్స్‌కు ఆగ్రహం తెప్పిస్తోంది. అసలు ఓవర్ రేట్ శిక్షలు అనేవే అత్యంత గందరగోళంగా ఉన్నాయని అతను అన్నాడు. గతంలోనూ తాను ఈ అంశాన్ని లేవనెత్తిన విషయాన్ని స్టోక్స్ గుర్తు చేశాడు. టెస్టు మ్యాచ్ నిర్ణీత సమయంకంటే చాలా ముందే ముగిసిపోయినా... ఓవర్ రేట్ శిక్షలు వేయడం ఏమిటని అతను ప్రశ్నించాడు. 'రెండు జట్ల కోణంలో ఈ మొత్తం వ్యవహారాన్ని చూస్తే టెస్టు మ్యాచ్ చాలా ముందుగానే ముగిసింది. మ్యాచ్‌లో ఫలితం కూడా వచ్చింది. అసలు ఏమాత్రం అవగాహన లేకుండా వేస్తున్న పెనాల్టీలు తీవ్ర అసహనం కలిగిస్తున్నాయి. ప్రపంచంలో మనం ఎక్కడ క్రికెట్ ఆడుతున్నామనేది కూడా ముఖ్యం. ఉపఖండంలో జరిగే మ్యాచ్‌లలో ఎప్పుడూ ఈ సమస్య రాదు. ఎందుకంటే అక్కడ స్పిన్నర్లు ఎక్కువ ఓవర్లు బౌల్ చేస్తారు. మైదానంలో బౌలర్‌తో మళ్లీ మళ్లీ మాట్లాడటంతో పాటు ఓవర్ల తర్వాత ఫీల్డింగ్ మార్పులు, వ్యూహాల్లో మార్పులు వంటి చాలా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఒక కెప్టెన్‌గా నేను ఇదే పని చేస్తాను. ఇవన్నీ పట్టించుకోకుండా తొందరపెడితే ఎలా. మేం అక్కడ ఉన్నది మ్యాచ్ ఆడటానికి అనే విషయం మరచిపోవద్దు. చాలా మంది ఆటగాళ్లది ఇదే అభిప్రాయం. ఐసీసీ ఈ విషయంలో మరింత స్పష్టతనివ్వాల్సిన అవసరం ఉంది. ఏడాది క్రితం కూడా నేను దీనిపై మాట్లాడాను. కానీ ఐసీసీ నుంచి స్పందన రాలేదు. అందుకే అప్పటి నుంచి ఓవర్ రేట్ పెనాల్టీ షీట్‌లపై సంతకం పెట్టలేదు కానీ ఐసీసీ జరిమానా విధించి పాయింట్లతో కోత ఎలాగూ విధిస్తుంది' అని స్టోక్స్ తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా వెల్లడించాడు.



బుధవారం పూరీలో గోపబంధు ఆయుర్వేద మహావిద్యాలయ 75వ వార్షికోత్సవంలో రాష్ట్రపతి ముర్ము

నౌకా నిర్మాణంలోనూ ఆత్మనిర్భర్

నేవీ డే వేడుకల్లో రాష్ట్రపతి ముర్ము

పూరీ: నౌకల తయారీలో 2047కల్లా ఆత్మ నిర్భరత సాధించడంపై నావికాదళం దృష్టి పెట్టాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సూచించారు. నేవీ డే సందర్భంగా బుధవారం ఒడిశాలోని పూరీ సాగర తీరంలో జరిగిన వేడుకల్లో త్రివిధదళాధిపతి హోదాలో ఆమె పాల్గొన్నారు. మహిళా సాధికారతకు నేవీ తన వంతు కృషి చేస్తోందని ప్రశంసించారు. ''ఐదు వేల ఏళ్లపై చిలుకు ఘన చరిత్ర భారత నావికా రంగం సొంతం. దేశంలో తొలి మహిళా అగ్నివీర్‌లు నేవీలోనే చేరారు'' అన్నారు. 15 యుద్ధనౌకలు, 37 వాయుసేన విమానాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఐఎన్‌ఎస్ జల్వా, మిసైల్, డిస్ట్రాయర్ ఐఎన్‌ఎస్ ఢిల్లీ, ఐఎన్‌ఎస్ శక్తి, ఐఎన్‌ఎస్ సూర్య, ఐఎన్‌ఎస్ అరిహంత్, ఐఎన్‌ఎస్ సతొపురా వంటి ప్రముఖ యుద్ధనౌకలతో పాటు జలాంతర్గాములూ ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. హాక్, సీ–కింగ్, మిగ్29కె వంటి యుద్ధవిమానాలు, చేతక్, ఎంఎస్ 60 హెలికాప్టర్లు, హాక్ విమానాల విన్యాసాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

థరూర్ ఒళ్లో వానరం

అరటిపళ్లు ఆరగించి ఒళ్లో పడుకున్న వైనం

న్యూఢిల్లీ: క్లిష్టమైన ఇంగ్లిష్ పదాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు పరిచయం చేస్తూ అందర్నీ తికమక పెట్టే తిరువనంతపురం కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌తో ఒక కోతి కాసేపు ఆట పట్టించింది. హఠాత్తుగా ప్రత్యక్షమై ఆయన్ను కలవరపాటుకు గురిచేసింది. తర్వాత ఆయన చేత్తో అరటి పళ్లు తింటూ, ఆడుకుంటూ సరదాగా గడిపింది. మెల్లిగా ఎంపీ ఒళ్లో కూర్చుంది. ఆయన స్వెట్టర్‌ను గట్టిగా పట్టుకుని కాసేపు నిద్ర కూడా పోయింది. అది గీకిందంటే రేబిస్ టీకా వేసుకోక తప్పదని భయపడిన థరూర్ కాసేపు కుర్చీలో కదలకుండా కూర్చుండిపోయారు. ప్రశాంతంగా కాసేపు నిద్రపోయాక కోతి తేచి తన దారిన తాను పోయింది. బుధవారం ఢిల్లీలో జరిగిన ఈ అనూహ్య ఘటనకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఘటనపై థరూర్ తన 'ఎక్స్' ఖాతాలో వివరాలు పోస్ట్‌చేశారు. ''ఇంట్లో ఉదయం ఆరుబయట హాయిగా కూర్చుని దినపత్రికలు చదువుతుంటే హఠాత్తుగా కోతి గెంతుతూ వచ్చి నేరుగా ఒళ్లో కూర్చుంది. ఆకలిగా ఉందని అర్థమై అరటి పళ్లు తెప్పించి పెట్టా. చకచకా తినేసి అలసిపోయి ఒళ్లో పడుకుంది. కదిలితే కరుస్తుందని నాకు తెలుసు. అయినా మూగజీవాలంటే నాకిష్టం. అందుకే నేనూ కదలకుండా ఉండిపోయా. పేపర్ చదువుతుంటే అరవకుండా ఒళ్లోనే కూర్చుంది. కాసేపటికి వెళ్లిపోయింది. వానరంతో నా భేటీ అలా ప్రశాంతంగా ముగిసింది'' అని రాసుకొచ్చారు. దీనిపై నెటిజన్లు స్పందించారు. 'మీకు హనుమాన్ జీ ఆశీస్సులు దక్కాయి' అని ఒకరు ట్వీట్ చేశారు. 'ప్రకృతితో మమేకం ఇలాగే అనూహ్యంగా, ఆశ్చర్యంగా, అద్భుతంగా ఉంటుంది. మాటలకందని అనుభూతిని మిగుల్చుతుంది. మీ మమకారానికి మంకీ సైతం ముగ్ధురాలైంది' అని ఇంకొకరు పోస్ట్ చేశారు.



డీఈఏ చీఫ్ పదవి నాకొద్దు: క్రోనిస్టర్

గ్సెత్‌పైనా ట్రంప్ పునరాలోచన!

రక్షణ మంత్రిగా డిశాంటిస్ పేరు

ఫ్లోరిడా: అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ (డీఈఏ) అధిపతి పదవి చేపట్టబోవడం లేదని చాడ్ క్రోనిస్టర్ ప్రకటించారు. ఫ్లోరిడాలోని హిల్స్‌బరో కౌంటీ షెరీఫ్ పదవిలోనే కొనసాగుతానని పేర్కొన్నారు. ''షెరీఫ్‌గా చేయాల్సింది చాలా ఉంది. అందుకే డీఈఏ పదవి చేపట్టొద్దని నిర్ణయించుకున్నా''అంటూ తాజాగా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనిపై కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గానీ, ఆయన బృందం గానీ ఎలాంటి ప్రకటనా చేయలేదు. మెక్సికో సరిహద్దు వెంబడి ఫెంటానిల్ అక్రమ ప్రవాహాన్ని నిరోధించేందుకు డీఈఏ చీఫ్‌గా క్రోనిస్టర్‌ను నామినేట్ చేస్తున్నట్టు ట్రంప్ ఆదివారమే ప్రకటించారు. న్యాయ శాఖలో స్టిస్‌లో భాగంగా పనిచేసే డీఈఏ డ్రగ్ చట్టాలను అమలు చేస్తుంది. 2020 కోవిడ్ సమయంలో ప్రజారోగ్య ఆదేశాలను విస్మరించారనే అభియోగంపై ఒక పాస్టర్‌ను అక్రమంగా అరెస్టు చేయడం వంటి పలు అభియోగాలు, విమర్శలు క్రోనిస్టర్‌పై ఉన్నాయి. అటార్నీ జనరల్‌గా ట్రంప్ నామినేట్ చేసిన మాట్ గేట్జ్ కూడా తనకా పదవి వద్దని ఇటీవలే ప్రకటించడం తెలిసిందే.

రక్షణ మంత్రిగా నామినేట్ చేసిన పీట్ హెగ్సెత్ విషయంలో కూడా ట్రంప్ తాజాగా పునరాలోచనలో పడ్డట్టు సమాచారం. లైంగిక వేధింపులతో పాటు ఆయనపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతుండటం తెలిసిందే. తాజాగా హెగ్సెత్ తల్లి కూడా ఆయనపై పలు ఆరోపణలు చేశారు! ఈ నేపథ్యంలో ఆయన నియామకానికి సెనేట్ ఆమోదం కష్టమేనని ట్రంప్ బృందం భావిస్తోంది. అందుకే హెగ్సెత్ స్థానంలో రక్షణ మంత్రిగా ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్ పేరును పరిశీలిస్తున్నట్టు సమాచారం. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష ఎన్నికల అభ్యర్థిత్వం కోసం ఆయన ట్రంప్‌తో పోటీ పడ్డారు.

డాలర్ డ్రీమ్స్ వేటలో.. కటకటాల పాలు!

- కెనడా సరిహద్దుల వద్ద భారీగా పట్టుబడుతున్న భారతీయులు
- అమెరికాలో చొరబడబోయి గతేడాది 40,000 మంది జైలుపాలు

అమెరికా కలను సాకారం చేసుకునేందుకు భారతీయులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. అమెరికాలోకి భారతీయుల అక్రమ వలసలు విపరీతంగా పెరిగినట్టు యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (యూఎస్ సీబీపీ) తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఇందుకు వాళ్లు ప్రధానంగా కెనడా సరిహద్దులను ఎంచుకుంటున్నారు. కెనడా గుండా అమెరికాలో ప్రవేశిస్తూ అరెస్టవుతున్న వారిలో భారతీయులే 22 శాతం కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది!

యూఎస్ సీబీపీ గణాంకాల ప్రకారం 2023 అక్టోబర్ నుంచి 2024 సెప్టెంబర్ మధ్య కెనడా సరిహద్దు గుండా అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్న భారతీయుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2022లో కెనడా గుండా అక్రమంగా అమెరికా వెళ్లేందుకు ప్రయత్నించిన 1,09,535 మందిలో భారతీయులు 16 శాతం కాగా 2023లో వారి సంఖ్య ఇంకా పెరిగింది. ఆ ఏడాది 1,89,402 మందిలో 30,010 మంది భారతీయులున్నారు. 2024లో 1,98,929 మంది సరిహద్దు దాటేందుకు అక్రమంగా ప్రయత్నించగా వారిలో 43,764 మంది భారతీయులే. లాటిన్ అమెరికా, కరేబియన్ వలసదారులతో పోలిస్తే ఈ సంఖ్య కాస్త తక్కువే. అయినా గత నాలుగేళ్లలో కెనడా గుండా అక్రమంగా అమెరికాలో ప్రవేశించేందుకు ప్రయత్నించిన వారిలో అతిపెద్ద సమూహం భారతీయులేనని వాషింగ్టన్‌కు చెందిన ఇమిగ్రేషన్ విశ్లేషకులు చెబుతున్నారు. భద్రతా దళాలకు చిక్కకుండా అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన భారతీయుల సంఖ్య తెలియదు.

కెనడా సరిహద్దే ఎందుకు?

అమెరికాలోకి అక్రమ చొరబాట్లకు భారతీయులు కెనడా సరిహద్దునే ఎంచుకోవడానికి అనేక కారణాలున్నాయి. కెనడా వీసా ప్రక్రియ సులువుగా ఉండటం వాటిలో ముఖ్యమైనది. కెనడా విజిటింగ్ వీసా ప్రాసెసింగ్ కేవలం 76 రోజుల్లో పూర్తవుతుంది. అదే అమెరికా వీసా ప్రాసెసింగ్ కోసమైతే కనీసం ఏడాది వేచి ఉండాల్సిందే. అమెరికాతో కెనడా సరిహద్దు చాలా పొడవైనది. దాంతో అక్కడ రక్షణ తక్కువ. దాంతో అంత సురక్షితమైన మార్గం కానప్పటికీ దీన్నే ఎంచుకుంటున్నారు.

పంజాబ్ నుంచే ఎక్కువ

ఇలా కెనడా గుండా అమెరికాలో చొరబడేందుకు ప్రయత్నిస్తున్న భారతీయుల్లో ఎక్కువ భాగం పంజాబ్, హరియాణాల వాళ్లే ఉంటున్నారు. తర్వాతి స్థానం గుజరాత్‌ది. విదేశాల్లో విద్య, ఉపాధి అవకాశాల కోసం పంజాబీ గ్రామీణ యువత బాగా ఆసక్తి చూపుతోంది. కానీ సరైన విద్యార్హతలు, ఆంగ్ల ప్రావీణ్యం లేని కారణంగా అమెరికా పర్యాటక, విద్యార్థి వీసాలు పొందడం వీరికి గగనంగా మారుతోంది. ప్రత్యామ్నాయంగా అక్రమంగా సరిహద్దులు దాటించే ముఠాలను ఆశ్రయిస్తున్నారు. ఈ ప్రయత్నంలో చాలామంది లక్షలకు లక్షలు పోగొట్టుకుంటున్నారు. మరికొందరు సరిహద్దులు దాటేందుకు అతి ప్రమాదకరమైన ప్రయాణాలు చేస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

'ప్రగతి' సూపర్ సక్సెస్

ప్రధాన మంత్రి ప్రతిష్టాత్మక పథకంపై ఆక్స్‌ఫర్డ్ కితాబు

సాక్షి బెంగళూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, ప్రాజెక్టులపై ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతూ సమయానికి పనులు పూర్తయ్యేలా చేసేందుకు నేరుగా ప్రధాని మోదీ పాల్గొని నిర్వహించే వర్చువల్‌సమావేశం ప్రో–యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్లీ ఇంప్లిమెంటేషన్ (ప్రగతి) కార్యక్రమం అద్భుత ఫలితాలనిస్తోందని ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం కితాబునిచ్చింది. రెండో తేదీన బెంగళూరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం 'ప్రగతి'కార్యక్రమంపై జరిపిన అధ్యయనాన్ని ఒక బిజినెస్ స్కూల్ కేస్ స్టడీ రూపంలో విడుదల చేసింది. 'గ్రిడ్‌లాక్ టూ గ్రోత్'పేరిట చేసిన అధ్యయనంలో ప్రగతి కార్యక్రమం అమలు, వాటి ఫలితాలను విశ్లేషించింది. దేశంలో భారీ ఎత్తున మౌలిక వసతులు, సామాజికాభివృద్ధి కార్యక్రమాలు ఈ ప్రగతి పథకం ద్వారా విజయవంతంగా అమలు చేస్తున్నారని ఆక్స్‌ఫర్డ్ ప్రశంసించింది. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ పరిశోధనలో 'ప్రగతి' కార్యక్రమం ద్వారా దేశంలో జరిగిన డిజిటల్ గవర్నెన్స్ అభివృద్ధిని ఆక్స్‌ఫర్డ్ ప్రస్తావించింది. 2015లో 'ప్రగతి'ప్రస్థానం మొదలైన నాటి నుంచి ఇప్పటివరకు 205 బిలియన్ డాలర్ల విలువైన 340 ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తిచేశారని వెల్లడించింది. 'ప్రగతి'కార్యక్రమంలో భాగంగా సుమారు 50 వేల కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని, రెట్టింపు స్థాయిలో విమానాశ్రయాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపింది. మౌలికవసతుల కల్పన కోసం ఖర్చు చేసిన ప్రతి రూపాయి జీడీపీలో రూ. 2.5 నుంచి రూ. 3.5 మేర తిరిగి లబ్ధి చేకూర్చినట్లు ఆక్స్‌ఫర్డ్ అధ్యయనం తెలిపింది. ప్రధాన మంత్రి మౌలికవసతుల అభివృద్ధి కోసం ఉద్దేశించిన పీఎం గతిశక్తి, పర్యావరణ అనుమతుల నిమిత్తం రూపొందించిన పరివేశ్‌లను నిర్వహించడంలో ఈ ప్రగతి ఎంతగానో దోహదపడిందని వర్సిటీ తెలిపింది. గతంలో పర్యావరణ అనుమతుల కోసం 600 రోజులు పడుతుండగా ప్రస్తుతం 'ప్రగతి'కారణంగా జీఐఎస్ మ్యాపింగ్, డ్రోన్ పర్యవేక్షణ ద్వారా ఆ గడువు దాదాపు 75 రోజులకు తగ్గిందని వెల్లడించింది. గ్రామాల్లోని కుళాయి కనెక్షన్స్ కూడా కేవలం ఐదేళ్లలో 17 శాతం నుంచి 79 శాతానికి పెరిగినట్లు తెలిపింది.



సీఎంగా హ్యాట్రిక్ కొడుతున్న బ్యాక్ బెంచర్

అంకితభావంతో ఎదిగిన ఫడ్నవీస్

ముంబై: ఏబీవీపీ కార్యకర్తగా బీజేపీలో ప్రస్థానం ఆరంభించిన దేవేంద్ర ఫడ్నవీస్ పార్టీ పట్ల విధేయత, అంకితభావం, పట్టుదలతో ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. ఆయన 1970 జూలై 22న మహారాష్ట్రలోని నాగపూర్‌లో జన్మించారు. తండ్రి దివంగత గంగాధర్ ఫడ్నవీస్ జనసంఘ్, బీజేపీలో కీలక నాయకుడిగా వ్యవహరించారు. దేవేంద్ర 1989లో ఏబీవీపీలో చేరారు. 22 ఏళ్ల వయసులో నాగపూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్‌గా గెలిచారు. 1997లో 27 ఏళ్ల పిన్న వయసులోనే నాగపూర్ మేయర్‌గా ఎన్నికై రికార్డు సృష్టించారు. తొలిసారిగా 1999 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి గెలిచారు. అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. గత నెలలో జరిగిన ఎన్నికల్లో నాగపూర్ సౌత్‌వెస్ట్ స్థానం నుంచి ఎన్నికయ్యారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా, ఒకసారి ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన ఫడ్నవీస్‌పై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకపోవడం విశేషం. మహారాష్ట్రలో మనోహర్ జోషీ తర్వాత రెండో బ్రాహ్మణ ముఖ్యమంత్రిగా చరిత్రకెక్కారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతికి ఎదురుదెబ్బ తగిలినప్పటికీ ఫడ్నవీస్ నిరుత్సాహపడలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమిని విజయపథంలో నడిపించారు.

సున్నిత మనస్కుడు

ఫడ్నవీస్ పాఠశాలలో చదువుకునేటప్పుడు బ్యాక్ బెంచర్ అని ఆయన గురువు సావిత్రి సుబ్రమణియం చెప్పారు. ఫడ్నవీస్ ఎనిమిది నుంచి పదో తరగతి దాకా సరస్వతి విద్యాలయలో చదువుకున్నారు. తన విద్యార్థి అయిన ఫడ్నవీస్ చిన్నప్పుడు సున్నిత మనస్కుడిగా ఉండేవాడని, అందరినీ చక్కగా గౌరవించేవాడని, ఇతరులకు చేతనైన సహాయం చేసేవాడని, చాలా మర్యాదస్తుడని సావిత్రి సుబ్రమణియం తెలిపారు. చదువులో సగటు విద్యార్థిగానే ఉండేవాడని అన్నారు. అసాధారణమైన విద్యార్థి కానప్పటికీ బాగానే చదివేవాడనని వెల్లడించారు. బాగా పొడగరి కావడంతో తరగతిలో చివర వరుసలో కూర్చొనేవాడని పేర్కొన్నారు.

దక్షిణ కొరియా అధ్యక్షుడిపై అభిశంసన!

పార్లమెంట్‌లో విపక్ష పార్టీల తీర్మానం • ముదిరిన రాజకీయ సంక్షోభం




సియోల్: దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను అధికార పీఠం నుంచి దించాలని విపక్ష ఎంపీలు కంకణం కట్టుకున్నారు. దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధిస్తూ నిర్ణయం తీసుకుని దేశంలో రాజకీయ సంక్షోభానికి తెరలేపారని ఆరోపిస్తూ ఆయనపై అభిశంసన తీర్మానాన్ని బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. రాజ్యాంగవిరుద్ధంగా అసాధారణ నిర్ణయాలతో దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని విపక్ష ఎంపీలు ఆయనపై కారాలుమిరియాలు నూరుతున్నారు. ''యూన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. లేదంటే అభిశంసనతో దింపేస్తాం' అని డెమొక్రటిక్ పార్టీ ప్రకటించింది.

మూడింట రెండొంతుల మద్దతు తప్పనిసరి

అభిశంసన తీర్మానం నెగ్గాలంటే జాతీయ అసెంబ్లీలో మూడింట రెండు వంతుల మంది సభ్యులు మద్దతు పలకాల్సి ఉంటుంది. తొమ్మిది మంది సభ్యులున్న రాజ్యాంగ ధర్మాసనంలోని కనీసం ఆరుగురు న్యాయమూర్తులు ఈ అభిశంసన తీర్మానానికి తమ సమ్మతి తెలపాల్సి ఉంటుంది. బుధవారం ప్రధాన డెమొక్రటిక్ పార్టీ, ఐదు చిన్న విపక్ష పార్టీలు ఉమ్మడిగా ఈ అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఈ తీర్మానంపై శుక్రవారం ఓటింగ్ జరిగే వీలుంది. రక్షణ శాఖ మంత్రి కిమ్ యాంగ్ హ్యాన్‌ను అభిశంసించాలని విపక్షాలు నిర్ణయించాయి. ఇందుకోసం ప్రత్యేకంగా మరో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. అధ్యక్షుడు మార్షల్ లా విధించేలా యూన్‌ను కిమ్ ఎగదోశారని విపక్ష పార్టీలు ఆగ్రహంతో ఉన్నాయి. పదవులకు రాజీనామా చేయాలని అధ్యక్షుడికి విధానపర నిర్ణయాలపై సలహాలిచ్చే నేతలకు విపక్ష పార్టీలు సూచించాయి. అభిశంసన నెగ్గాలంటే 300 సభ్యులకుగాను కనీసం 200 మంది మద్దతు పలకాల్సి ఉంటుంది. విపక్ష డెమొక్రటిక్ పార్టీకి, ఇతర చిన్న పార్టీలకు 192 మంది సభ్యుల మద్దతు ఉంది. మంగళవారం ఎమర్జెన్సీని ఎత్తేస్తూ చేపట్టిన ఓటింగ్‌లో అధ్యక్షుడు యూన్‌కు చెందిన అధికార పీపుల్స్ పవర్ పార్టీ నుంచి సైతం 18 మంది మద్దతివ్వడం విశేషం. ప్రజాస్వామ్య బాటలో దక్షిణకొరియా పయనించడం మొదలెట్టాక గత 40 ఏళ్లలో ఎమర్జెన్సీ విధించడం ఇదే తొలిసారి.

తోటి ఎంపీలను అడ్డుకోకండి

మకర ద్వారం వద్ద నిరసనలపై స్పీకర్



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ మకర ద్వారం వద్ద విపక్షాల నిరసనలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వెలిబుచ్చారు. తోటి సభ్యులకు అవరోధం సృష్టించరాదని, మహిళా ఎంపీలను అడ్డుకునేలా ప్రవర్తించరాదని స్పష్టం చేశారు. సభలోకి వచ్చేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని బీజేపీ మహిళా ఎంపీలతో పాటు మరికొందరు స్పీకర్‌కు వ్యక్తిగతంగా ఫిర్యాదు చేశారు. దాంతో సభలో జీరో అవర్‌కు ముందు ఆయన ఈ అంశంపై మాట్లాడారు. ''సమస్య ఉంటే నన్ను కలవండి. అంతేగాని ఈతోటి ఎంపీలు ప్రవేశ ద్వారం గుండా రాకుండా అడ్డుకోవద్దని పార్టీలను అభ్యర్థిస్తున్నా'' అన్నారు.

కొనసాగిన నిరసనలు

అదానీ అంశంపై పార్లమెంటులో విపక్ష పార్టీల నిరసనలు బుధవారమూ కొనసాగాయి. 'మోదీ–అదానీ ఒక్కటే' అంటూ బ్యానర్లు పట్టుకొని పార్లమెంట్ మకర ద్వారం వద్ద నినాదాలు చేశాయి. వీటిలో కాంగ్రెస్, ఆప్, ఆర్జేడీ, శివసేన (యూబీటీ), డీఎంకే, వామపక్షాలు పాల్గొనగా తృణమూల్ కాంగ్రెస్ దూరంగా ఉంది. అనంతరం రైతు సమస్యలపై చర్చకు విపక్ష సభ్యులు రాజ్యసభలో పట్టుబట్టగా చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఒప్పుకోలేదు. నినదిస్తున్న సభ్యులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ''నినాదాలిస్తూ మొసలి కన్నీరు కార్చినంత మాత్రాన రైతులకు లబ్ధి చేకూరదు. మీ ప్రాధాన్యతలు వేరు. రైతును చిట్టచివర్లో పట్టించుకుంటారు' అన్నారు. దాంతో విపక్షసభ్యులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలను పెంచారు. కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ(ఎస్పీ), ఆర్జేడీ సభ్యులు వాకౌట్ చేశారు. అనంతరం వందేళ్ల నాటి బాయిలర్స్ చట్టం స్థానంలో కొత్త బిల్లును రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. పాత చట్టం ప్రకారం శిక్షార్హమైన ఏడింటిని నేరాల జాబితా నుంచి తొలగించారు. పరిశ్రమల్లో బాయిలర్ల వినియోగంపై నియంత్రణ, స్టీమ్ బాయిలర్ల పేలుడు సందర్భాల్లో సిబ్బంది, ఆస్తుల పరిరక్షణ, బాయిలర్ల నమోదులో ఏకరూపతలను కొత్త చట్టంలో పొందుపరిచారు.

కొట్టేస్తే కొట్టేశారు గానీ.. పేదలకు పంచండి

తినుబండారాల దొంగలకు షెఫ్ విజ్ఞప్తి



లండన్: బ్రిటన్‌లోని యార్క్ నగరంలో క్రిస్మస్ మార్కెట్‌లో అమ్మడానికి రుచికరమైన పలు రకాల తాజా తినుబండారాలతో వ్యాన్ సిద్ధంగా ఉంది. వ్యాన్‌ను వాణిజ్యసముదాయానికి తరలించేలోపు దానిని ఎవరో దొంగలించారు. విషయం తెల్సుకున్న దాని యజమాని, పాకశాస్త్ర ప్రవీణుడు టామీ బ్యాంక్స్ ఒకింత బాధపడ్డారు. ప్రేమానురాగాలను కలిపి వంటచేసే చెఫ్‌లకు తాము వండిన ఆహార పదార్థాలను ఇతరులకు వడ్డించడంలోనే ఆనందం, తృప్తి ఉంటాయి. టామీకి సైతం ఆ ఆనందమే ఎక్కువ. అందుకే తాను తయారుచేసిన పదార్థాలను దొంగలు ఎక్కడ పడేస్తారోననే బాధ ఎక్కువైంది. అందుకే వాటిని నేలపాలు చేయకుండా క్షుద్బాధతో తల్లడిల్లే పేదలకు పంచాలని బహిరంగ ప్రకటన చేశారు. బ్యాంక్స్‌కు యార్క్‌షైర్ కౌంటీలో ఒక పబ్‌తోపాటు రెండు రెస్టారెంట్లు ఉన్నాయి. స్వతహాగా వంటవాడైన బ్యాంక్స్ తన రెస్టారెంట్లలో కొన్ని ప్రత్యేకమైన ఆహారపదార్థాలను స్వయంగా తయారుచేస్తారు. తమ వ్యాన్ దొంగతనంపై తాజాగా ఆయన ఒక వీడియోను ఇన్‌స్టా గ్రామ్‌లో పోస్ట్‌చేశారు. ''చిన్న వ్యాన్‌లో ఖరీదైన తినుబండారాలున్నాయి. స్టీక్, ఏల్, బీర్లు, టర్కీ, బట్టర్‌నట్ స్క్వాష్ పై, కేక్‌లు ఉన్నాయి. వాటి మొత్తం విలువ ఏకంగా రూ. 27,00,000 పైమాటే. వ్యాను అప్పనంగా దొరికిందన్న ఆనందంలో ఇంత ఖరీదైన ఆహారపదార్థాలను పోతూపోతూ దారిలో పడేయకండి. పేదలకు పంచి వారి ఆకలి మంటలు తీర్చండి'' అని వేడుకున్నారు. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ''ఆహారం విలువ తెలిసిన నిజమైన చెఫ్' అంటూ బ్యాంక్స్‌ను కొందరు నెటిజన్లు ప్రశంసల్లో ముంచెత్తారు. బ్రిటన్‌లో సర్వ్ చేయడానికి సిద్ధంగా ఉన్న ఆహారపదార్థాల చోరీలో ఇది తాజా ఘటనగా పేరొందింది. రెండు నెలల క్రితం లండన్‌లోని నీల్స్ యార్డ్ పాల ఉత్పత్తుల కేంద్రం వద్ద ఇలాంటి భారీ చోరీ జరిగింది. ఫ్రాన్స్‌కు చెందిన ఒక భారీ రిటైర్ సంస్థకు హోల్‌సేల్ పంపిణీదారుగా ప్రకటించుకుంటూ ఒక దొంగ ఈ డైరీకి వచ్చి ఏకంగా 48,488 పౌండ్ల బరువైన చీజ్‌ను దర్జాగా పట్టుకెళ్లిపోయాడు. దీని మార్కెట్ విలువ ఏకంగా రూ.3.30 కోట్లు. బ్రిటిష్, అంతర్జాతీయ పోలీసులు వేట మొదలెట్టి ఆ 63 ఏళ్ల పెద్దాయనను పట్టుకున్నాసరే చీజ్ జాడను మాత్రం కనిపెట్టలేకపోయారు.

బంగ్లాదేశ్‌లో ఉగ్ర ముప్పు

ఆ దేశానికి వెళ్లొద్దని పౌరులకు బ్రిటన్ హెచ్చరిక

లండన్: బంగ్లాదేశ్‌లో ఉగ్రవాదులు దాడులకు పాల్పడే ఆస్కారముందని బ్రిటన్ పేర్కొంది. ఆ దేశానికి వెళ్లొద్దని మంగళవారం తన పౌరులను హెచ్చరించింది. రద్దీ ప్రాంతాలు, మతపరమైన భవనాలు, రాజకీయ ర్యాలీలతో పాటు విదేశీయులు సందర్శించే ప్రదేశాల్లో పెద్దపెట్టున ఉగ్రవాద దాడులు జరగవచ్చని అంచనా వేసింది. దేశంలో మైనారిటీలపై పెరుగుతున్న హింస, దేశద్రోహం ఆరోపణలపై హిందూ సన్యాసి చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టు తదితరాల నేపథ్యంలో బ్రిటన్ ఈ మేరకు తాజా ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. ఇస్లాం విరుద్ధ అభిప్రాయాలు, జీవన విధానాలున్నాయని భావించే వ్యక్తులను బంగ్లాలో కొన్ని గ్రూపులు లక్ష్యంగా చేసుకున్నాయని అందులో పేర్కొంది. ప్రధాన నగరాల్లో ఐఈడీ దాడులు జరగొచ్చని తెలిపింది. ''బంగ్లాలో హిందూ వ్యతిరేక హింసపై బ్రిటన్ చట్టసభ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కీర్ స్టార్మర్ ప్రభుత్వం పరిస్థితిని పర్యవేక్షిస్తోంది'' అని అధికార లేబర్ ఎంపీ ఒకరు మంగళవారం హౌస్ ఆఫ్ కామన్స్‌కు తెలిపారు. తర్వాత కొన్ని గంటల్లోనే అడ్వైజరీ జారీ అయింది. చిన్మయి అరెస్టు తర్వాత పరిణామాలను బ్రిటన్ ఫారిన్, కామన్వెల్త్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీస్ నిశితంగా పరిశీలిస్తోందని ఎంపీ కేథరిన్ వెస్ట్ తెలిపారు.

ఫ్రాన్స్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం !?

ఓటింగ్ చేపట్టకుండా బడ్జెట్‌ను ఆమోదంపై విపక్షాల ఆగ్రహం

పారిస్: ఫ్రాన్స్‌లో మైనారిటీ ప్రభుత్వాన్ని నడపలేక తిప్పలు పడుతున్న ప్రధాని మైఖేల్ బార్నర్‌ను మరిన్ని సమస్యలు చుట్టుముడుతున్నాయి. ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి విపక్షాలు సిద్ధమవుతున్నాయి. దిగువసభలో ఓటింగ్ చేపట్టకుండానే బడ్జెట్‌ను ఆమోదింపజేసుకున్నారన్న ఆగ్రహంతో ఈ చర్యకు దిగుతున్నాయి. తీర్మానానికి అతివాద న్యూ పాపులర్ ఫ్రంట్ కూటమి, వామపక్ష నేషనల్ ర్యాలీ (ఎన్ఆర్) తదితరాలు మద్దతివ్వనున్నాయి. ఈ ప్రయత్నాలను బార్నర్ తీవ్రంగా ఖండించారు. ''దేశ భవిష్యత్తును పణంగా పెట్టి స్వప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకుంటున్న ఇలాంటి పార్టీలను ప్రజలు క్షమిస్తారనుకోను. మా ప్రభుత్వం కూలితే దేశ సామాజిక, ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారుతుంది'' అని హెచ్చరించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గితే గత 60 ఏళ్లలో ఫ్రాన్స్‌లో ఒక ప్రభుత్వం కూలడం తొలిసారి అవుతుంది. తాను మాత్రం 2027లో పదవీకాలం పూర్తయ్యేదాకా అధ్యక్షునిగా కొనసాగుతానని ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ స్పష్టం చేశారు. ప్రభుత్వం కూలితే ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ ముఖచిత్రం మారనుంది. ప్రస్తుత పార్లమెంట్ దిగువసభ అయిన నేషనల్ అసెంబ్లీలో మేక్రాన్‌కు చెందిన మధ్యేవాద కూటమి, అతివాద న్యూ పాపులర్ ఫ్రంట్ కూటమి, మరీన్ లీ పెన్ సారథ్యంలోని నేషనల్ ర్యాలీ పార్టీలు ఉన్నప్పటికీ ఏ పార్టీకి మెజారిటీ లేదు. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే మొత్తం 574 మంది సభ్యులకుగాను 288 మందికిపైగా సభ్యులు తీర్మానానికి అనుకూలంగా ఓటేయాలి. అయితే విపక్షాలు రెండూ కలిస్తే వాటి బలం 330కిపైగా ఉండటం విశేషం. ఈ నేపథ్యంలో తీర్మానం నెగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మరోవైపు విద్యుత్‌పై కొత్త పన్నులను తొలగించాలని మరీన్ లీ పెన్ డిమాండ్‌చేశారు.

10 వేల జనరల్ కోచ్‌లు: వైష్ణవ్

సాక్షి, న్యూఢిల్లీ: రైళ్లలో జనరల్ కోచ్ ప్రయాణికులకు సౌకర్యాలు పెంచడంపైనే ప్రధాని మోదీ దృష్టిసారించారని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం లోక్‌సభలో అన్నారు. సభ్యుల ప్రశ్నలకు ఈ మేరకు బదులిచ్చారు. ''ఈ నెలాఖరుకల్లా 1,000 జనరల్ కోచ్‌లను అందుబాటులోకి తెస్తాం. ముమ్ముందు 10,000 అదనపు జనరల్ కోచ్‌లు తేనున్నాం. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 1,300 రైల్వేస్టేషన్లను పునర్ నిర్మిస్తున్నాం'' అని మంత్రి చెప్పారు. ప్రతి రైల్వే టికెట్‌పై ప్రయాణికులకు 46 శాతం సబ్సిడీ ఇస్తున్నట్టు చెప్పారు. అన్ని తరగతుల ప్రయాణికులపై రైల్వే ఏటా రూ.56,993 కోట్ల సబ్సిడీ భారాన్ని మోస్తోందని వివరించారు.

భారతీయ సంగీత మూలాలు ఏ వేదంలో ఉన్నాయి?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ప్రాచీన భారతదేశ చరిత్ర



వేదకాల నాగరికత (క్రీపూ. 2000-1500)

ఆర్యులు ఆసియా మైనర్, మెసపటోమియా మీదుగా పర్షియాలోకి ప్రవేశించారు. ఆ తర్వాత బాక్ట్రియా, హిందూకుష్ పర్వత శ్రేణుల మీదుగా భారతదేశంలోకి వచ్చారు. పంజాబ్ ప్రాంతంలోని సప్తసింధు లోయను మొదటి స్థావరంగా చేసుకుని స్థిరపడ్డారు.

తొలివేద కాలం (క్రీపూ. 1500-1000)

ఈ కాలంలో ఆర్యులు సప్తసింధు ప్రాంతానికి మాత్రమే పరిమితమయ్యారు. ఈ కాలం గురించి తెలుసుకోవడానికి రుగ్వేదం ఒక్కటే ప్రధాన ఆధారంగా ఉంది.

ఆర్యులు భారతదేశంలో స్థిరపడ్డ తర్వాత రుగ్వేదం,యజుర్వేదం, సామవేదం,అధర్వణ వేదాలు సంకలనం చేశారు. వేదాలన్నింటిలో రుగ్వేదం ప్రాచీనమైంది. ఇందులో పది మండలాలున్నాయి. యజుర్వేదం క్రతువుల నిర్వహణకు ఆధార గ్రంథం . సామవేదం సంగీతానికి మూలం. అధర్వణ వేదం మంత్రతంత్రాలకు సంబంధించింది.

ఈ కాలంలో రాజ్యానికి రాజే అధిపతి. రాజరికం వంశపారంపర్యం. ప్రజల రక్షణ బాధ్యత రాజు చూసేవాడు. దీనికిగాను ప్రజలు రాజుకు గోవులను కానుకగా ఇచ్చేవారు. ఈ విధానాన్ని 'బలి' అని పిలిచేవారు. పాలనా వ్యవహారాల్లో 'సమితి', 'సభ' అనే సంస్థలు రాజుకు సాయపడేవి. సమాజంలో స్త్రీకి గౌరవప్రదమైన స్థానం ఉండేది. 'సమితి', 'సభ' సమావేశాల్లో మహిళలు సైతం పాల్గొనేవారు. వితంతు పునర్వివాహాలు జరిగేవి. సతీసహగమనం, పరదా పద్ధతి వీరికి తెలియదు. రుగ్వేదకాలంనాటి ఆర్యులకు పశుపోషణ, వ్యవసాయం ప్రధాన వృత్తులు. పశువులను.. ముఖ్యంగా ఆవులను ప్రాణప్రదంగా భావించేవారు. వీటిని వర్తకంలో మారకంగా ఉపయోగించేవారు. ఆర్యులు ప్రకృతి శక్తులను పూజించారు. ద్యూస్ (ఆకాశం), ఇంద్ర, వరుణ, వాయు, అగ్ని, సోమ తదితర పురుష దైవాలతో పాటు అతిథి, ఉషస్సు లాంటి స్త్రీ మూర్తులను కూడా ఆరాధించేవారు. ఇంద్రుడు వీరి ప్రధాన దైవం.

మలివేదకాల ఆర్య నాగరికత (క్రీపూ.1000-600)

ఈ కాలంలో ఆర్యులు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తర బిహార్ ప్రాంతాలకు విస్తరించారు. వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా స్వీకరించిన జాతులన్నీ స్థిర నివాసం ఏర్పరచుకున్నాయి. క్రమంగా ఆధిపత్యం కోసం తెగల మధ్య యుద్ధాలు ప్రారంభమయ్యాయి. విజయం సాధించిన తెగ నాయకుడు విశాల భూభాగానికి అధినేతగా మారాడు. అతడు సామ్రాట్ తదితర బిరుదులను వహించడం ఆరంభమైంది. అశ్వమేథ, రాజసూయ,బలి కర్మకాండలు ప్రారంభమయ్యాయి. సామ్రాజ్యాల విస్తరణ పెరిగింది. రాజు దైవాంశ సంభూతుడుగా మారాడు.

అహింసా సిద్ధాంతం బౌద్ధ మతం నుంచి ఆవిర్భవించిందే. తర్వాతి కాలంలో దీన్ని గాంధీ మహాత్ముడు అనుసరించారు. బుద్ధ విగ్రహాలు గాంధార శిల్ప కళారీతిలో ఉంటాయి. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా మానవ విగ్రహాల పూజ బౌద్ధ మతంలోనే ప్రారంభమైంది. స్థానిక భాషలకు ఈ మతం బాగా ప్రోత్సాహాన్ని అందించింది.

రుగ్వేదంలోని పురుష సూక్తం ఆధారంగా మలివేద కాలంలో వర్ణవ్యవస్థ ప్రారంభమైనట్లు తెలుస్తోంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు వర్ణాలుగా సమాజ విభజన జరిగింది. క్రమంగా వృత్తులు వంశపారంపర్యమయ్యాయి. ఈ యుగంలో స్త్రీ అంతకుముందున్న సామాజిక స్థాయిని కోల్పోయింది. సతీ సహగమన పద్ధతి మొదలైంది. వివాహ నిబంధనలు కఠినమయ్యాయి.

కొత్తగా భూములు సాగులోకి రావడంతో వ్యవసాయాభివృద్ధి అధికమైంది. వర్తకం, వాణిజ్యం, పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో పట్టణాలు ఏర్పడ్డాయి. తక్షశిల, హస్తినాపురం, కౌశాంబి, కాంపల్య, వైశాలి, శ్రావస్తి, వారణాసి మొదలైనవి నాటి ప్రసిద్ధ నగరాలు. వస్తుమార్పిడి స్థానంలో 'నిష్క', 'శతమాన', 'కర్షాపణం' అనే నాణేలు ప్రవేశించాయి. బంగారం, వెండి, రాగితో ఈ నాణేలను తయారు చేసేవారు. సృష్టికర్తగా 'ప్రజాపతి' ఈ యుగ ప్రధాన ఆరాధ్య దైవం. అగ్ని, ఇంద్రుడు లాంటి దైవాలకు ప్రాధాన్యం తగ్గి త్రిమూర్తుల (విష్ణు, బ్రహ్మ, శివుడు) ఆరాధన పెరిగింది.

రుగ్వేద సంహిత: ఇందులో 1028 శ్లోకాలున్నాయి. ఇది పురాతనమైంది. అగ్ని, ఇంద్రుడు, వరుణుడు లాంటి అనేక దేవతల స్తోత్ర పాఠాలు ఈ సంహితంలో ఉన్నాయి. ఇందులో ఇంద్రుడి గురించి ఎక్కువ శ్లోకాలు ఉన్నాయి.

సామవేద సంహిత: యజ్ఞాలు చేసేప్పుడు సంగీత బద్ధంగా శ్లోకాలను ఎలా ఆలపించాలో సామవేద సంహిత తెలుపుతుంది. భారతీయ సంగీత మూలాలు సామవేదంలో కనిపిస్తాయి.

యజుర్వేద సంహిత: ఇందులో యజ్ఞ సమయంలో అనుసరించాల్సిన నియమ నిబంధనలు, పఠించే మంత్రాల గురించి ఉన్నాయి.

అధర్వణ వేద సంహిత: రోగాలు,దుష్టశక్తులను పారదోలడానికి అవసరమైన మంత్రాలు, తంత్రాలు ఇందులో ఉన్నాయి. ఆర్యేతరుల విశ్వాసాల గురించి ఇది కొంతవరకు తెలుపుతుంది.

బ్రాహ్మణాలు: ఇవి వేదాల తర్వాత వచ్చాయి. కర్మకాండల విధానాన్ని వివరిస్తాయి. వీటిలో ప్రధానంగా యజ్ఞాలు, బలులకు సంబంధించిన విధివిధానాలు ఉన్నాయి.

అరణ్యకాలు: ఇవి తాత్విక చింతనకు చెందిన అంశాలతో కూడి ఉన్నాయి.

ఉపనిషత్తులు: ఉపనిషత్తులు తాత్విక గ్రంథాలు. వీటిలో ఆత్మ, అంతరాత్మ, ప్రకృతి రహస్యాల గురించి ఉన్నాయి. ఉపనిషత్తులు కర్మకాండలను నిరసించాయి. ఇవి సరైన జ్ఞానం, సన్మార్గానికి ప్రాముఖ్యం ఇస్తాయి.

సామాజిక మార్పులు (క్రీపూ. 600-300)

ఈ కాలంలో అనేక మత ఉద్యమాలు ఆవిర్భవించాయి. ఆర్థిక, సామాజిక, రాజకీయ మార్పులు అధికంగా జరిగాయి. 16 జనపదాలు, పట్టణాలు ఏర్పడ్డాయి. దీన్ని రెండో పట్టణీకరణ కాలంగా పేర్కొంటారు. ఇనుముతో రూపొందించిన పరికరాల వాడకం వల్ల వ్యవసాయంలో అధిక వృద్ధి సాధ్యమైంది.

ఈ కాలంలో చాతుర్ వర్ణ వ్యవస్థ బలపడింది. ద్విజులుగా పేర్కొనే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులకు.. ద్విజులు కాని శూద్రులకు మధ్య సాంఘిక వ్యత్యాసం ఎక్కువైంది. బ్రాహ్మణాధిపత్యం వైశ్యులకు, క్షత్రియులకు నచ్చలేదు. అస్పృశ్యులను ఒక ప్రత్యేక వర్గంగా చూడటం ఈ కాలంలోనే ప్రారంభమైంది. వ్యవసాయ రంగంలోని మిగులుతో రాజులు సైన్యాన్ని నిర్మించారు. రాజులు పన్ను వసూలు చేసేవారు. న్యాయ వ్యవస్థకు పునాది పడింది. జీవహింసకు వ్యతిరేకమైన బౌద్ధ, జైన మతాలు వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడ్డాయి.

బౌద్ధమతం (క్రీపూ. 563-483)

బౌద్ధమత స్థాపకుడు సిద్ధార్థుడు. ఈయన క్షత్రియ వంశానికి చెందినవారు. క్రీ.పూ. 563లో శాక్యరాజ్యాధిపతి శుద్ధోదనుడు, మాయాదేవికి రాజధాని 'కపిలవస్తు' సమీపంలోని 'లుంబినీ వనం'లో జన్మించారు. సిద్ధార్థుని భార్య పేరు 'యశోధర', కుమారుని పేరు 'రాహులుడు'. కపిలవస్తు నగరంలో కనిపించిన వృద్ధుడు, వ్యాధిగ్రస్థుడు, శవం, సన్యాసి దృశ్యాలు ఆయన్ని కదల్చివేశాయి. దీంతో భవబంధాల నుంచి బయటపడ్డారు. దీన్నే 'మహాభినిష్క్రమణం' అంటారు. గయ సమీపంలో బోధి వృక్షం కింద నలభై రోజుల తపస్సు తర్వాత 'సంబోధి'ని పొంది 'బుద్ధుడై' పరిపూర్ణ జ్ఞానంతో ఉద్దీప్తుడయ్యాడు. మొదటగా సారనాథ్‌లోని 'మృగదావనం'లో అయిదుగురు శిష్యులకు జ్ఞానబోధ చేశాడు. ఈ ప్రబోధాన్ని 'ధర్మచక్ర ప్రవర్తనం' అంటారు. బుద్ధుడు తన 80వ ఏట క్రీ.పూ.483లో మహాపరి నిర్యాణం పొందారు. బుద్ధుడి శిష్యుడు ఆనందుడు.

ఆర్య సత్యాలు

1) ప్రపంచం దుఃఖమయం.
2) దుఃఖాలకు కోర్కెలే కారణం.
3) కోర్కెలను నిరోధిస్తే దుఃఖం అంతమవుతుంది.
4)దుఃఖాన్ని అంతమొందించడానికి మార్గం ఉంది.

అజ్ఞానమే దుఃఖానికి కారణమని పేర్కొని, దీన్ని తొలగించడానికి 'అష్టాంగమార్గం' రూపొందించాడు. అవి.. సరైన వాక్కు, క్రియ, జీవనం, శ్రమ, ఆలోచన, ధ్యానం, నిశ్చయం, దృష్టి. పునర్జన్మ రహితమైన మోక్షమే నిర్యాణం అని చెప్పారు. బౌద్ధమతం హేతుబద్ధమైంది. బుద్ధుడు ఆత్మ, భగవంతుడి ఉనికిని గుర్తించలేదు. వైదిక కర్మకాండలను, వేదాలను నిరసించారు.

మొదటి 'బౌద్ధ సంగీతి' రాజగృహంలో అజాత శత్రువు పాలనా కాలంలో జరిగింది. దీని అధ్యక్షుడు మహాకాశ్యప. ఈ సంగీతిలో 'వినయ', 'సుత్త' అనే పీఠికల (నియమావళి గ్రంథాలు)ను సంకలనం చేశారు. రెండో సంగీతి 'వైశాలి'లో జరిగింది. ఈ సంగీతిలో బౌద్ధసంఘం 'థెరవాదులు', 'మహాసాంఘికులు' అనే రెండు వర్గాలుగా చీలిపోయింది. మూడో సంగీతి అశోకుడి కాలంలో పాటలీపుత్రంలో జరిగింది. ఈ సంగీతిలో అభిదమ్మ పీటకాన్ని రచించారు. నాలుగో సంగీతి కనిష్కుడి పాలనా కాలంలో వసుమిత్రుడి అధ్యక్షతన జరిగింది. సాంచి, బార్హుత్, అమరావతి ఈ కాలంనాటి శిల్పకళకు ప్రతీకలైన స్తూపాలు. చైత్య గృహాల నిర్మాణానికి అజంతా, ఎల్లోరా ఉదాహరణలు. బుద్ధుని సందేశాన్ని భిక్షకులు విదేశీయులకు అందించారు. బౌద్ధ మతం ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చెందింది. చైనా, జపాన్, శ్రీలంక, బర్మా మొదలైన తూర్పు, ఆగ్నేయాసియా దేశాల్లో బౌద్ధ మతం విస్తరించింది. కాశ్మీర్‌లో జరిగిన నాలుగో బౌద్ధ సంగీతిలో బౌద్ధమతం మహాయాన, హీనాయాన శాఖలుగా చీలిపోయింది.

మహాయానం: ఈ శాఖకు చెందినవారు బుద్ధ విగ్రహాలను ఆరాధించేవారు. బుద్ధుడు, బోధిసత్వుల ద్వారా మానవులు మోక్షం పొందొచ్చని భావించారు. ఈ శాఖ ఇండియా, చైనా, జపాన్‌లో బాగా ప్రాచుర్యం పొందింది. నాగార్జునుడు మాధ్యమిక చింతనను ప్రవేశపెట్టాడు. ప్రపంచమంతా మిథ్య, భ్రమ అని నాగార్జునుడి వాదన.

హీనాయానం: బర్మా, థాయిలాండ్, కాంబోడియాలో ఈ శాఖ బాగా వ్యాపించింది. బుద్ధుడి ప్రవచనాలను మాత్రమే తీసుకుని ధ్యానం ద్వారా మోక్షం పొందొచ్చని వీరు భావించారు. విగ్రహారాధనకు వీరు వ్యతిరేకం. పాళీ భాషలో సుత్త, వినయ, అభిదమ్మగా పేర్కొనే త్రిపీఠకాలను వీరు రచించారు. క్రీ.శ 8వ శతాబ్దంలో వజ్రాయానం అనే కొత్త శాఖ వెలిసింది.

స్తూపాలు: బుద్ధుడు లేదా ఇతర ప్రముఖ సన్యాసుల అవశేషాలను నిక్షిప్తం చేసి నిర్మించారు. వీటినే స్తూపాలు అంటారు.

చైత్యం: ఇందులో ప్రధానంగా ప్రార్థనాలయం ఉంటుంది.

ప్రధాన బౌద్ధ గుహాలయాలు, చైత్యాలయాలు:

1) కార్లే	2) నాసిక్
3) భాజ	4) బార్హుత్
5) సాంచి	6) అమరావతి
7) నాగార్జున కొండ	8) భట్టిప్రోలు

విహారం: బౌద్ధ సన్యాసులు నివసించే ప్రాంతమైన అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ ఆసియాలో అతిపెద్ద బౌద్ధ విహార కేంద్రం.

వేదాలు:

1) రుగ్వేదం	2) యజుర్వేదం
3) సామవేదం	4) అధర్వణ వేదం

ఉపవేదాలు:

1) ధనుర్వేదం	2) ఆయుర్వేదం
3) శిల్పవేదం	4) గాంధార వేదం

వేదాంగాలు:

1) శిక్ష 2) కల్పం 3) జ్యోతిషం
4) వ్యాకరణం 5) నిరుక్తం 6) చంధస్సు

దర్శనాలు - అందులో ప్రసిద్ధులు:

1) సంఖ్య - కపిలుడు
2) వైశేషికం - కణాదుడు
3) న్యాయం - గౌతముడు
4) యోగ - పతంజలి
5) మీమాంస - జెమిని
6) ఉత్తర మీమాంస - బాదరాయణుడు

బుద్ధుడికి సంబంధించిన అంశాలు

తండ్రి	శుద్ధోదనుడు
తల్లి	మాయాదేవి
సవతి తల్లి	గౌతమి
బంధువు	దేవదత్త
భార్య	యశోధర
కుమారుడు	రాహుల్
రథ చోదకుడు	చెన్నుడు
గుర్రం	కంఠక
గురువు	అలారకలామ
బుద్ధగయలో పరిచర్యలు చేసినది	సుజాత

మహా జనపదాలు - పట్టణాలు

1) మగధ	- పాటలీపుత్రం
2) కాశీ	- వారణాసి
3) అంగ	- చంపా
4) చేది	- భుక్తిమతి
5) కోసల	- అయోధ్య
6) కురు	- ఇంద్రప్రస్థం
7) వత్స	- కౌశాంబి
8) పాంచాల	- అవిచ్ఛత్రము
9) మత్స్య	- విరాటనగరం
10) అస్మక	- పూతన్
11) సూరసేన	- మధుర
12) అవంతి	- ఉజ్జయిని
13) కాంభోజ	- రాజపురం
14) గాంధార	- తక్షశిల
15) వజ్జి	- విదేహ
16) మల్ల	- కుశి

విద్య, ఉద్యోగ సమాచారం

నార్త్ వెస్టర్న్ రైల్వే, జైపూర్‌లో 1,791 యాక్ట్ అప్రెంటిస్‌లు

జైపూర్(రాజస్థాన్)లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)-నార్త్ వెస్టర్న్ రైల్వే ఎన్‌డబ్ల్యూఆర్ పరిధిలోని వర్క్‌షాప్/యూనిట్‌లలో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 1,791.
» **వర్క్‌షాప్‌లు/యూనిట్లు:** డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(అజ్మీర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(బికనీర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(జైపూర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(జోధ్‌పూర్), బీటీసీ క్యారేజ్(అజ్మీర్), బీటీసీ లోకో(అజ్మీర్), క్యారేజ్ వర్క్స్‌షాప్(బికనీర్), క్యారేజ్ వర్క్స్‌షాప్(జోధ్‌పూర్).
» **ట్రేడ్‌లు:** కార్పెంటర్, పెయింటర్, మేసన్, పైప్ ఫిట్టర్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, వెల్డర్, మెకానికల్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, మెకానిక్ మెషిన్ టూల్ మెయింటెనెన్స్ తదితరాలు.
» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** 10.12.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**10.12.2024
» **వెబ్‌సైట్:** https://rrcjaipur.in

కృష్ణా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో 14 పోస్టులు

కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14.
» **పోస్టుల వివరాలు:** అవుట్ రీచ్ వర్కర్-01, మేనేజర్/కోఆర్డినేటర్(మహిళ)-01, డాక్టర్-01, ఆయా(మహిళ)-01, చౌకీదార్(మహిళ)-01, కుక్(మహిళ)-01, హెల్పర్ కమ్ నైట్ వాచ్‌మెన్(మహిళ)-01, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా ట్రైనర్(పార్ట్ టైమ్)(మహిళ)-01, విద్యావేత్త(పార్ట్‌టైమ్) (మహిళ)-01, పారా మెడికల్(మహిళ)-01, సెక్యూరిటీ గార్డ్/నైట్ గార్డ్-03, బ్లాక్ కోఆర్డినేటర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డీఈడీ, బీఈడీ, సర్టిఫికేట్ కోర్సు, ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** గరిష్ట వయోపరిమితి 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, ఉమాశంకర్ నగర్, అకాడమీ రోడ్, కానూరు, కృష్ణా జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 07.12.2024.
» **వెబ్‌సైట్:** https://krishna.ap.gov.in

బెల్, బెంగళూరులో 84 పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. శాశ్వత ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 84.
» **పోస్టుల వివరాలు:**ఇంజినీరింగ్ అసిస్టెంట్(ట్రైనీ)-47,టెక్నీషియన్ సీ-37
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎస్ఎస్ఎల్‌సీ, ఐటీఐ,ఇంజినీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు అప్రెంటిస్‌షిప్ సర్టిఫికేట్ కోర్సు చేసి ఉండాలి.
» **గరిష్ట వయో పరిమితి:** 01.11.2024 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**17.12.2024.
» **రాతపరీక్ష తేది:** డిసెంబర్ 2024.
» **వెబ్‌సైట్:** https//bel-india.in

హాల్ బెంగళూరులో మెడికల్ ఆఫీసర్ పోస్టులు

బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్).. ఒప్పంద ప్రాతిపదికన ఇండస్ట్రియల్ హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ మెడికల్ ఆఫీసర్-05, మెడికల్ ఆఫీసర్-02
» **విభాగాలు:** ఈఎన్‌టీ, మెడికల్, జెరియాట్రిక్ మెడిసిన్, ఆర్థో,ఓబీ అండ్ జీ,జనరల్ డ్యూటీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎంఎస్,డీఎన్‌బీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వయసు:** గ్రేడ్ 2 పోస్టులకు 30 ఏళ్లు, గ్రేడ్ 3 పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు గ్రేడ్ 2 పోస్టులకు రూ.40,000 నుంచి రూ.1,40,000, గ్రేడ్ 3 పోస్టులకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును చీఫ్ మేనేజర్ హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఇండస్ట్రియల్ హెల్త్ సెంటర్,సురంజన్‌దాస్ రోడ్,విమానపుర పోస్ట్, బెంగళూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 21.12.2024.
» **వెబ్‌సైట్:** https://hal-india.co.in

శాతవాహనుల రాజ్యభాష ఏది?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలంగాణ హిస్టరీ

శాతవాహనుల చరిత్ర



శ్రేణులు - ప్రాధాన్యం

జున్నార్ శాసనాల్లో 'ధమ్నక', 'కాసాకార', 'తెసకార' శ్రేణుల గురించి పేర్కొన్నారు. గోవర్ధనలో 'కాలీకసికాయ' శ్రేణులుండేవి. నాసిక్ శాసనాల్లో 'కులరిక', 'తెలపిషిక', 'ఒదయంత్రిక' మొదలైన శ్రేణుల గురించి పేర్కొన్నారు. ప్రతి శ్రేణికి అధ్యక్షుడిగా శ్రేష్ఠి ఉండేవాడు. శ్రేణుల కార్యాలయాలు పురమందిరంలో లేదా నిగమసభలో ఉండేవి. ఉషవదత్తుడు శ్రేణుల్లో పెట్టిన పెట్టుబడులు 'నిగమసభ'లో రిజిస్టర్ చేశారు.

బ్యాంకులు - రుణపరపతి విధానాలు

శాతవాహనుల కాలంలో వడ్డీకి అప్పులు ఇచ్చే పద్ధతి ఉండేది. స్వల్ప వడ్డీ మాత్రమే వసూలు చేసేవారు. అప్పుల మీద వడ్డీరేటు సాధారణంగా ఏడాదికి 12 శాతం ఉండేది. దీన్ని నెలకు ఒకసారి గణించే పద్ధతిలో నిర్ణయించేవారు. నాటి సంస్థలు, బ్యాంకులు ఈ విధానాన్ని అనుసరించాయని పశ్చిమ దక్కన్‌లో దొరికిన శాసనాలు ధ్రువపరుస్తున్నాయి. ఉషవదత్తుని నాసిక్ శాసనంలో గోవర్ధనలోని చేనేత పనివారి శ్రేణి రెండు డిపాజిట్లు స్వీకరించినట్లుగా పేర్కొన్నారు. అందులో మొదటిది నెలకు ఒక శాతం వడ్డీ రేటుతో 2,000 కార్షాపణలు, రెండోది నెలకు 3/4 శాతం వడ్డీ రేటు మీద 1,000 కార్షాపణలు ఉన్నాయి. మొదటి డిపాజిట్ మీద వచ్చే వడ్డీ మొత్తాన్ని నాసిక్‌లోని గుహలో వర్షాకాలంలో నివాసం ఏర్పాటు చేసుకున్న బౌద్ధ సన్యాసులకు ప్రతి ఒక్కరికి ఏడాదికి వస్త్రాలు ఖరీదు చేసేందుకు గాను 12 కార్షాపణలుగా ఖర్చు పెట్టడానికి నిర్దేశించారు. రెండో డిపాజిట్‌పై వచ్చే మొత్తాన్ని ఆ బౌద్ధ సన్యాసుల ఇతర అవసరాలకు కేటాయించారు.

సాంస్కృతిక విధానం

దక్కన్ పీఠభూమికి చెందిన పాతరాతి యుగం నిర్మాతలకు ఇనుము, వ్యవసాయానికి సంబంధించిన పరిజ్ఞానం ఉందని వివిధ ఆధారాల ద్వారా తెలుస్తోంది. కరీంనగర్ జిల్లాలోని ఒక ప్రాంతంలో కమ్మరి కొలిమి బయటపడింది. కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని ఇనుప ఖనిజ నిక్షేపాలను శాతవాహనులు ఉపయోగించుకున్నట్లుగా ఆధారాలున్నాయి. రాతి యుగంలోనే ఇనుము పరిశ్రమ ఉన్నట్లుగా ఆయా ప్రాంతాల్లో ఆధారాలు లభించాయి. శాతవాహనులు బంగారాన్ని ఆభరణాల్లో మాత్రమే ఉపయోగించి ఉండవచ్చు. కుషాణులలా వీరు బంగారు నాణేలను ముద్రించలేదు. వీరు ప్రధానంగా సీసంతో చేసిన నాణేలను ముద్రించారు. ఇవి దక్కన్ పీఠభూమి ప్రాంతంలో లభించాయి. వీరు రాగి, కంచు నాణేలను కూడా ముద్రించారు.

ప్లీని ((క్రీ.శ. మొదటి శతాబ్దంలో వచ్చిన గ్రీకు యాత్రికుడు) కథనం ప్రకారం ఆంధ్ర సామ్రాజ్యం లక్ష మంది కాల్బలం, రెండువేల గుర్రాలు, వెయ్యి ఏనుగులను కలిగిన సైన్యాన్ని పోషించేది. దీని వెనుక పెద్ద సంఖ్యలో గ్రామీణ ప్రజానీకం ఉండేదని, వారు పెద్ద సైన్యాన్ని పోషించగలిగే అదనపు ఆహారాన్ని ఉత్పత్తి చేసేవారని ఊహించవచ్చు.

కరీంనగర్ జిల్లాలోని పెద్ద బంకూరులో క్రీ.పూ. 200-క్రీ.శ. 200 మధ్యకాలంలో కాల్చిన ఇటుకలు, ఇంటి పైకప్పుల్లో సమతలంగా ఉన్న పెంకులను వినియోగించినట్లు ఆధారాలున్నాయి. ఈ ప్రాంతంలో మురుగునీటిని సంబంధిత గుంటల్లోకి తీసుకువెళ్లే మూతమూసిన కాలువలు కూడా బయటపడ్డాయి. ఆంధ్రప్రాంతంలో 30 కోటలు కలిగిన పట్టణాలు, అసంఖ్యాక గ్రామాలు ఉన్నట్లుగా మెగస్తనీస్ పేర్కొన్నాడు. రెండో, మూడో శతాబ్దాలకు చెందిన అనేక పట్టణాల వివరాలు కూడా శాసనాలు, తవ్వకాల ద్వారా తెలుస్తోంది.

యజ్ఞశ్రీ శాతకర్ణి చేనేత పనివారి శ్రేణికి 1,000 కార్షాపణలు, వడ్రంగి పనివారి శ్రేణికి 2,000 కార్షాపణలు, నూనె గానుగ పనివారి శ్రేణికి 5,000 కార్షాపణాలు డిపాజిట్ చేసినట్లుగా శాసనాల ద్వారా తెలుస్తోంది.

మత విధానాలు

దేవతలు, ఆరాధ్య వృక్ష జంతుగణాలు, వైదిక క్రతువుల వివరాలు క్రీ.శ.2వ శతాబ్ది నాటి బౌద్ధ మత వికాసం గురించి తెలుపుతున్నాయి. నాగానిక వేయించిన శాసనంలో తనను తాను 'దీఖవ్రత యజ్ఞసుంద', 'యజ్ఞహుత ధూపన సుగంధాయ'గా వర్ణించుకుంది. అదేవిధంగా గౌతమీ బాలశ్రీ నాసిక్ శాసనంలో రాజర్షి వధువు (వైదిక మతానుయాయ అయిన రాజుకు ధర్మపత్ని)గా ప్రకటించుకుంది. నానాఘాట్ శాసనం ప్రారంభంలో ఇంద్ర, ధర్మ,లోకపాలక, సంకర్షణ,వాసుదేవులను, సూర్య, చంద్రులను స్తుతించే అంశాలున్నాయి. శాతకర్ణి కుమారుల్లో ఒకరికి వేదసిరి అనే పేరుండటం, తర్వాతి రాజులకు యజ్ఞశ్రీ తదితర పేర్లు ఉండటం లాంటివి వైదిక మతం పట్ల శాతవాహనుల గౌరవ, ఆదరణలను సూచిస్తున్నాయి. రామాయణ, మహాభారతంలోని ఘట్టాలను గృహాల్లో చిత్రపటాలుగా అలంకరించుకున్నట్లు ఆధారాలు లభించాయి. గాథాసప్తశతిలో కృష్ణలీలలను వర్ణిస్తూ రాసిన కొన్ని కథలు పౌరాణికం, ఇతిహాసం, మతానికి ఉన్న ప్రజాదరణ గురించి తెలుపుతున్నాయి. ఉషవదత్తుని శాసనాలు కూడా అతడి వైదిక మతాభిమానం ; బ్రాహ్మణ పోషణ; ప్రభాస, పుష్కర మొదలైన తీర్థయాత్రల సందర్శన గురించి వివరిస్తున్నాయి.

జైనమతం: శాతవాహన వంశ స్థాపకుడైన సిముకుడు జైన మతాన్ని ఆదరించేవాడని అనేక ప్రాచీన జైన గ్రంథాల ద్వారా తెలుస్తోంది. తర్వాత కాలంలో రెండో శాతకర్ణి జైనమతాచార్యుడైన కొండ కుందాచార్యుని ఆగ్రహానికి గురయ్యాడనీ, జైనాచార్యుడు శాతవాహనుల అధికారాన్ని నిర్మూలించడానికి భారతదేశానికి శకులను ఆహ్వానించాడని కొన్ని జైన గ్రంథాల్లో పేర్కొన్నారు.

బౌద్ధమతం: భద్రయానీయ శాఖకు చెందిన బౌద్ధుల కోసం గౌతమీ బాలశ్రీ నాసిక్‌లో గుహాలయాన్ని తొలిపించింది. క్షత్రియుడైన ఉషవదత్తుడు నాసిక్ వద్ద కొన్ని గుహలను తొలిపించి వాటి నిర్వహణ కోసం వేలాదిగా కార్షాపణాలను దానం చేశాడు. మహా సాంఘికుల్లోని చైత్యాక, శైల, పూర్వశైల, అపరశైల శాఖలు కూడా తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రజాదరణ పొందాయి. నాటి హీనయాన బౌద్ధం లేదా మహాథేర వాదం కూడా తెలంగాణలో నేటికీ కొనసాగుతూనే ఉంది. వీరికి, సాంఘికవాదులకు మధ్య వీరిద్దరినీ సమీకరించే దృష్టితో బహుశృతీయ అనే మరోశాఖ కూడా తెలంగాణ బౌద్ధుల్లో కనిపిస్తుంది.

శిల్పకళ - సేవలు

గుడిమల్లం (చిత్తూరు జిల్లా)లో ఇటీవల జరిపిన తవ్వకాల్లో బయటపడిన దేవాలయ శిథిలాలు శాతవాహన యుగానికి చెందినవే అనే అభిప్రాయం ఉంది. బౌద్ధశిల్పాలకు బుద్ధుని జీవితంలోని పంచ కల్యాణాలు, బుద్ధ జాతక కథలు, సామాన్య జీవిత దృశ్యాలు కథా వస్తువులు. కృష్ణాలోయలోని స్తూపాల్లో చాలావాటికి నాలుగు దిక్కుల్లో వేదికలు, వాటిపై విదేశీ 'ఆయక స్తంభాలు' ఉండేవి. ఇవి పంచ కల్యాణాలను (బుద్ధుని జననం, మహాభినిష్క్రమణ, సంబోధి, ధర్మచక్ర పరివర్తనం, మహా పరినిర్యాణం) సూచిస్తాయి.

విహారం: వర్షాకాలంలో బౌద్ధ బిక్షువుల నివాసానికి ఉద్దేశించినవి విహారాలు.

చైత్యం: పూజా వస్తువుగా చైత్యం లేదా బుద్ధ విగ్రహం ఉండి నిత్యార్చనకు ఉపయోగించే ఆలయమే చైత్యగృహం లేదా చైత్యాలయం.

సంఘారామం: ఒకే ఆవరణలో మూడు, నాలుగు విహారాలుండి, అధ్యయనానికి అనుకూలమైనది సంఘారామం.

చిత్ర కళలు

అజంతా 10వ గుహలోని 'శ్వేతగజ జాతక' చిత్రం శాతవాహన యుగానిదే. నాటి ప్రజలు రామాయణ భాగవతాది పురాణ గాథలను ఇళ్ల గోడలపై చిత్రించుకునే వారని గాథాసప్తశతి ద్వారా తెలుస్తోంది.

సాహిత్య సేవ

శాతవాహన రాజులు సాహిత్య ప్రియులు. వీరి రాజ్యభాష ప్రాకృతం. ప్రాకృత భాషా వికాసానికి వీరు చాలా కృషి చేశారు. కుంతల శాతకర్ణి అంతఃపురంలో ప్రాకృతభాషను ఉపయోగించినట్లు రాజశేఖరుడు తన 'కావ్య మీమాంస'లో పేర్కొన్నాడు. హాలుడు సంకలితపరిచిన 'గాథాసప్తశతి' ద్వారా నాటి సామాన్య ప్రజలు కూడా ప్రాకృత భాషలో కవితలు చెప్పగలిగేవారని, కేవలం రాజాదరణ వల్లే కాకుండా ప్రజాదరణ వల్ల కూడా సాహిత్య వికాసం జరిగిందని తెలుస్తోంది. శక-క్షత్రువుల శాసనాలు చాలావరకు సంస్కృత భాషలో ఉన్నాయి. యజ్ఞశ్రీ శాతకర్ణికి సంబంధించిన ద్విభాషిక నాణేలపై ప్రాకృతం కాకుండా ఉన్న మరో భాష తెలుగేనని డి.సి. సర్కార్ నిర్ణయించారు. ఆచార్య నాగార్జునుడు (భారతదేశ ఐన్‌స్టీన్) రచించిన సుహృల్లేఖ (స్నేహితునికి లేఖ) గ్రంథాన్ని నాటి పాఠ్యాంశాల్లో భాగంగా చేర్చి, విద్యార్థులతో కంఠస్థం చేయించేవారని ఇత్సింగ్ రచనల ద్వారా తెలుస్తోంది.

ఆర్యమంజూశ్రీ రాసిన'కల్పసూత్రం',గుణాఢ్యుడి 'బృహత్కథ', శర్వవర్మ రాసిన 'కాతంత్ర వ్యాకరణం', ఆర్యదేవుడు రాసిన 'చిత్తశుద్ధి' మొదలైనవి శాతవాహనుల కాలంనాటి ప్రముఖ గ్రంథాలు.

రాజ్యాంగ వికాసంలో భాగమైన చట్టాలు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత రాజ్యాంగం - చారిత్రక నేపథ్యం

భారతదేశంలో 1773–1857 మధ్యకాలంలో ఈస్టిండియా కంపెనీ వ్యాపారం, ఇతర వ్యవహారాలను నిర్వహించింది. వీటిని నియంత్రిచడానికి బ్రిటిష్ పార్లమెంటు కొన్ని చట్టాలను రూపొందించింది. వీటినే 'చార్టర్ చట్టాలు' అంటారు. వీటి గురించి పరిశీలిద్దాం..

రెగ్యులేటింగ్ చట్టం-1773

రెగ్యులేటింగ్ చట్టానికి రాజ్యాంగ వికాసపరంగా చాలా ప్రాముఖ్యం ఉంది. ఇంగ్లండ్ నుంచి భారతదేశానికి వ్యాపార రీత్యా వచ్చిన ఈస్టిండియా కంపెనీ వ్యవహారాలను నియంత్రించడానికి బ్రిటిష్ పార్లమెంట్ చేసిన తొలి చట్టం ఇదే. అందువల్ల దీన్ని భారతదేశానికి సంబంధించి 'మొట్టమొదటి లిఖిత చట్టం' (First Written Charter) గా పేర్కొంటారు. అంతకుముందు వరకు వ్యాపార కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈస్టిండియా కంపెనీకి ఈ చట్టం ద్వారా మొదటిసారిగా రాజకీయ పరిపాలన, అధికారాలు సంక్రమించాయి. దీంతో భారతదేశంలో 'కేంద్రీకృత పాలన'కు బీజం పడిందని చెప్పవచ్చు.

ముఖ్యాంశాలు

- ఈ చట్టాన్ని 1773 మే 18న నాటి బ్రిటన్ ప్రధాని లార్డ్ నార్త్ ఆ దేశ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. కంపెనీ వ్యవహారాలను నియంత్రించే ఉద్దేశంతో రూపొందించడం వల్ల దీన్ని 'రెగ్యులేటింగ్ చట్టం' అంటారు.
- బెంగాల్ గవర్నర్ హోదాను 'గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్'గా మార్చారు. ఇతడికి సలహాలు ఇవ్వడానికి నలుగురు సభ్యులతో కార్యనిర్వాహక మండలిని ఏర్పాటు చేశారు. 'వారన్ హేస్టింగ్స్'ను తొలి గవర్నర్ జనరల్‌గా నియమించారు.
- బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీల గవర్నర్లను బెంగాల్ గవర్నర్ జనరల్‌కు ఆధీనులుగా చేశారు.
- కలకత్తాలో సుప్రీంకోర్టు ఏర్పాటుకు ప్రతిపాదించారు. 1774లో ఒక ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు సాధారణ న్యాయమూర్తులతో కలకత్తాలో సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు మొదటి ప్రధాన న్యాయమూర్తి 'ఎలిజా ఇంఫే'.
- ఈస్టిండియా కంపెనీపై బ్రిటిష్ ఆధిపత్యాన్ని మరింతగా పెంచడానికి తమ రెవెన్యూ, పౌర, సైనిక వ్యవహారాల్లో కంపెనీ కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ నేరుగా ప్రభుత్వానికి బాధ్యత వహించేలా మార్పులు చేశారు.
- కంపెనీ అధికారుల వ్యాపార లావాదేవీలను నిషేధించారు. వారు ప్రజల నుంచి లంచాలు, బహుమతులను స్వీకరించకుండా కట్టడి చేశారు.
- ఇరవై ఏళ్ల వరకు ఈస్టిండియా కంపెనీకి వ్యాపార అనుమతి ఇచ్చారు.

రెగ్యులేటింగ్ చట్టం ద్వారా ఈస్టిండియా కంపెనీని ఆశించినంతగా నియంత్రించలేకపోయారు. కేంద్రీకృత పాలనను నిరోధించడం, అధికార సమతౌల్యం లాంటి ప్రయోజనాలు నెరవేరలేదు. అదేవిధంగా గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక పరిధిపై స్పష్టత ఏర్పడలేదు.

పిట్-ఇండియా చట్టం-1784

రెగ్యులేటింగ్ చట్టంలోని లోపాలను సవరించడానికి బ్రిటిష్ పార్లమెంటు ఈ చట్టాన్ని 1784లో ఆమోదించింది. నాటి బ్రిటన్ ప్రధాని 'విలియం పిట్' ఈ చట్టాన్ని ప్రతిపాదించారు. అందువల్ల దీన్ని 'పిట్ ఇండియా చట్టం'గా వ్యవహరిస్తారు.

ముఖ్యాంశాలు

- ఈస్టిండియా కంపెనీ కార్యకలా పాలను వాణిజ్య, రాజకీయ విధులుగా విభజించారు.
- 'బోర్డ్ ఆఫ్ కంట్రోల్' అనే నూతన విభాగాన్ని ఏర్పాటు చేసి కంపెనీ రాజకీయ వ్యవహారాలను దీనికి అప్పగించారు. అప్పటికే ఉన్న కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్‌ను వాణిజ్య వ్యవహారాలకే పరిమితం చేశారు.
- గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలికి ప్రెసిడెన్సీ ప్రాంతాలపై ప్రత్యక్ష నియంత్రణ అధికారాన్ని ఇచ్చారు. గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలిలోనూ కొన్ని మార్పులు చేశారు.
- కార్యనిర్వాహక మండలి సభ్యుల సంఖ్య నాలుగు నుంచి మూడుకు తగ్గించారు.

ఈ చట్టం వల్ల కంపెనీ పాలనపై ఒక విధమైన అదుపు ఏర్పడింది. కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్, బోర్డ్ ఆఫ్ కంట్రోల్ అనే రెండు స్వతంత్ర సంస్థలను ఏర్పాటు చేయడం వల్ల పిట్ ఇండియా చట్టాన్ని ద్వంద్వ పాలనకు నాంది పలికిన చట్టంగా చెప్పవచ్చు. 'పార్లమెంటేతర నియంత్రణకు తొలి అడుగు'గా ఈ చట్టాన్ని ప్రస్తావిస్తారు. భారతదేశంలో కొల్లగొట్టిన ధనాన్ని పంచుకోవడానికి చేసిన చట్టంగా మార్క్స్, ఎంగిల్స్ అభివర్ణించారు.

చార్టర్ చట్టం-1793

- ఈ చట్టం ద్వారా గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా అధికారాలను విస్తృతం చేశారు.
- కంపెనీ వ్యాపార గుత్తాధిపత్యాన్ని మరో 20 ఏళ్లకు పొడిగించారు.
- బోర్డు కార్యదర్శిని పార్లమెంటులో కూర్చోవడానికి అనుమతించారు.

చార్టర్ చట్టం-1813

- ఈస్టిండియా కంపెనీ చార్టర్‌ను మరో ఇరవై ఏళ్లు పొడిగించారు.
- భారతదేశ వర్తకంపై కంపెనీ గుత్తాధిపత్యాన్ని తొలగించి కేవలం పాలనాపరమైన సంస్థగా మార్చారు.
- పన్నులు విధించడం, అవి చెల్లించని వారిపై చర్యలను తీసుకునే అధికారాన్ని స్థానిక సంస్థలకు ఇచ్చారు.
- భారతీయులకు మత, విద్యాపరమైన అధ్యయనం కోసం లక్ష రూపాయలతో నిధి ఏర్పాటు చేశారు. సివిల్ సర్వెంట్లకు శిక్షణా సదుపాయాన్ని కల్పించారు.

ఈ చట్టం ద్వారా భారత్‌లో వర్తకం చేయడానికి అందరికీ అవకాశం కల్పించారు. భారత్‌లో మిషనరీలు ప్రవేశించి చర్చిలు, ఆసుపత్రులు, విద్యాలయాలు స్థాపించడం వల్ల మతమార్పిడులకు వెసులుబాటు కలిగింది.

చార్టర్ చట్టం-1833

- ఈస్టిండియా కంపెనీ పాలనను మరో 20 ఏళ్లకు పొడిగించారు.
- బెంగాల్ గవర్నర్ జనరల్ హోదాను ఈ చట్టం ద్వారా 'ఇండియన్ గవర్నర్ జనరల్'గా మార్చారు. ఈ హోదాలో మొదటి భారత గవర్నర్ జనరల్ విలియం బెంటింగ్.
- రాష్ట్ర ప్రభుత్వాల శాసనాధికారాలు రద్దయ్యాయి. కార్యనిర్వాహక మండలి సమేతుడైన గవర్నర్ జనరల్‌కు పూర్తి శాసనాధికారాలు లభించాయి.
- కంపెనీ వ్యాపార లావాదేవీలను రద్దుచేసి, పరిపాలనా సంస్థగా మార్చారు.
- సివిల్ సర్వీసుల నియామకాల్లో సార్వజనిక పోటీ పద్ధతిని ప్రతిపాదించారు. కానీ కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ వ్యతిరేకించడం వల్ల ఇది అమల్లోకి రాలేదు.
- భారతీయ శాసనాలను క్రోడీకరించడానికి భారతీయ 'లా' కమిషన్‌ను నియమించారు. దీనికి తొలి అధ్యక్షుడు లార్డ్ మెకాలే.
- ఈ చట్టాన్ని భారతదేశంలో 'కేంద్రీకృత పాలనకు తుదిమెట్టు'గా అభివర్ణిస్తారు.

చార్టర్ చట్టం-1853

చార్టర్ చట్టాల్లో చివరిది. అతి తక్కువ కాలం అమల్లో ఉన్న చార్టర్ చట్టం ఇదే. ప్రతి 20 ఏళ్లకు ఒకసారి చార్టర్ చట్టాలను పొడిగించడం అనే ఆనవాయితీ ప్రకారం దీన్ని రూపొందించారు. కానీ దీని ద్వారా కంపెనీ పాలనను పొడిగించలేదు. దీంతో కంపెనీ పాలన త్వరలోనే అంతమవుతుందని సూచించినట్లయింది.

ముఖ్యాంశాలు

- గవర్నర్ జనరల్ సాధారణ మండలి అధికారాలను శాసన, కార్యనిర్వాహక విధులుగా విభజించారు. శాసనాలు రూపొందించే ప్రక్రియ కోసం 'ఇండియన్ సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్'ను ఏర్పాటు చేశారు. ఇది బ్రిటిష్ పార్లమెంటులా విధులు నిర్వర్తిస్తుంది. అందువల్ల దీన్ని 'మినీ పార్లమెంట్'గా పేర్కొంటారు.
- కేంద్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో మొదటిసారిగా స్థానిక ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించారు. మొత్తం ఆరుగురు శాసన సభ్యుల్లో.. మద్రాసు, బొంబాయి, బెంగాల్, ఆగ్రా ప్రాంతాల నుంచి ఒక్కొక్కరి చొప్పున నలుగురిని తీసుకున్నారు.
- సివిల్ సర్వీసు నియామకాల్లో 'సార్వజనిక పోటీ విధానం' ప్రవేశపెట్టారు. దీనికోసం 1854లో లార్డ్ మెకాలే కమిటీని ఏర్పాటు చేశారు.
- వివిధ 'లా కమిషన్'ల సిఫారసుల ద్వారా సివిల్ ప్రొసీజర్ కోడ్ (1859), ఇండియన్ పీనల్ కోడ్ (1860), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (1861)ను రూపొందించారు.

కంపెనీ పాలనకు సంబంధించి నిర్దిష్ట వ్యవధి పేర్కొనకపోవడం వల్ల కంపెనీ పాలన చక్రవర్తి చేతుల్లోకి మారడానికి చార్టర్ చట్టం మార్గం సుగమం చేసిందని భావిస్తారు. భారతీయులకు ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించకపోవడం వల్ల తర్వాత జరిగిన పరిణామాలు సిపాయిలు తిరుగుబాటుకు దారితీశాయి.

బ్రిటిష్ రాణి లేదా రాజు పాలన (1858 -1947)

1858 నుంచి రాజు లేదా రాణి నేరుగా అధికారాన్ని చేపట్టడం వల్ల ఆ తర్వాత చేసిన చట్టాలను/సవరణలను 'భారత ప్రభుత్వ చట్టాలు' లేదా 'కౌన్సిల్ చట్టాలు' అంటారు.

భారత రాజ్యాంగ చట్టం-1858

1857 సిపాయిల తిరుగుబాటుతో భారతదేశంలో కంపెనీ పాలన అంతమై చక్రవర్తి (బ్రిటిష్ రాజు/రాణి) పరిపాలన వచ్చింది. ఇది భారత



భారత రాజ్యాంగ వికాసానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ప్రస్తుతం అమలవుతున్న రాజ్యాంగం ఈ రూపం సంతరించుకోవడానికి అనేక చట్టాలు, ఉద్యమాలు, సంస్కరణలు దోహదం చేశాయి. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు భారత రాజ్యాంగ పరిణామ క్రమం, రాజ్యాంగ చరిత్రలోని ముఖ్య ఘట్టాల గురించి సమగ్రంగా తెలుసుకోవాలి.

రాజ్యాంగ చరిత్రలో ఒక నూతన అధ్యాయం. బ్రిటిష్ రాణి 1858 నవంబర్ 1న భారత పరిపాలనా అధికారాన్ని నేరుగా చేపడుతూ ఒక ప్రకటన జారీ చేసింది.

ముఖ్యాంశాలు

- గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా హోదాను వైస్రాయ్ ఆఫ్ ఇండియాగా మార్చారు. మొదటి వైస్రాయ్ చార్లెస్ కానింగ్.
- దేశంలో బ్రిటిష్ రాణి మొదటి ప్రత్యక్ష ప్రతినిధి వైస్రాయ్. ఇతడు బ్రిటిష్ రాణి పేరుపై దేశ పాలన నిర్వహిస్తాడు.
- 1784లో ప్రవేశపెట్టిన బోర్డ్ ఆఫ్ కంట్రోల్, కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ అనే ద్వంద్వ పాలన రద్దయింది.
- భారతదేశంలో అత్యున్నత స్థానాన్ని కలిగిన వైస్రాయ్‌ని రాజ ప్రతినిధిగా 5 ఏళ్ల కాలానికి నియమించారు. ఇతడికి సహాయంగా ఒక కార్యనిర్వాహక మండలి ఉండేది.
- 'భారత రాజ్య కార్యదర్శి' అనే కొత్త పదవిని సృష్టించారు. ఇతడు బ్రిటిష్ మంత్రివర్గానికి చెందిన వ్యక్తి. అన్ని విషయాల్లో ఇతడిదే తుది నిర్ణయం. ఇతడికి సహాయంగా 15 మంది సభ్యులతో సలహా మండలి ఏర్పాటు చేశారు. మొదటి కార్యదర్శి చార్లెస్ వుడ్.

ప్రత్యేక వివరణ

వైస్రాయ్, గవర్నర్ జనరల్ అనే రెండు హోదాలు ఒకరికే ఉంటాయి. బ్రిటిష్ రాజు/రాణి ప్రతినిధిగా ఉంటే వైస్రాయ్‌గా, భారతదేశ పాలనాపరంగా అధిపతిగా ఉంటే గవర్నర్ జనరల్‌గా వ్యవహరిస్తారు.

దేశంలో పాలనాపరమైన అంశాలను.. ముఖ్యంగా ప్రభుత్వాన్ని నియంత్రించడానికి 1858 చట్టాన్ని చేశారని, వీటికి సంబంధించిన మార్పులను ఇంగ్లండులో చేశారేగానీ, భారత్‌లోని పాలనా వ్యవస్థలకు ఎలాంటి మార్పులు చేయలేదని విమర్శకుల అభిప్రాయం.


గతంలో అడిగిన ప్రశ్నలు

1. భారతప్రభుత్వ చట్టం 1935 ప్రకారం కార్యనిర్వహణ అధికారం ఎవరికి ఉండేది?
   ఎ) బ్రిటిష్‌రాణి/ రాజు
   బి) ఇంగ్లండు పార్లమెంటు
   సి) సమాఖ్య శాసనసభ
   డి) కౌన్సిల్‌లోని గవర్నర్ జనరల్
2. 1773 నుంచి 1857 వరకు చేసిన చట్టాలను ఏమని పిలుస్తారు?
   ఎ) చార్టర్ చట్టాలు బి) కౌన్సిల్ చట్టాలు
   సి) క్రౌన్ చట్టాలు డి) పైవేవీకావు
3. 1946 సెప్టెంబరు 2న ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వాన్ని మొదటిసారి ప్రతిపాదించింది?
   ఎ) సైమన్ కమిషన్
   బి) క్రిప్స్‌మిషన్
   సి) వేవెల్ ప్లాన్
   డి) కేబినెట్ మిషన్ ప్లాన్
4. స్టాఫర్డ్ క్రిప్స్ కిందివాటిలో ఎందులో సభ్యుడు?
   ఎ) కన్జర్వేటివ్ పార్టీ బి) లిబరల్ పార్టీ
   సి) లేబర్ పార్టీ డి) అధికార శ్రేణి
5. బ్రిటిషర్లు ఏ సంవత్సరంలో బెంగాల్‌లో సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు?
   ఎ) 1776 బి) 1775
   సి) 1777 డి) 1774

సమాధానాలు

1) డి; 2) ఎ; 3) డి; 4) సి; 5) డి.

కాంతి పరిక్షేపణం దేనిపై ఆధారపడుతుంది?



పోటీ పరీక్షల ప్రత్యేకం

భౌతిక శాస్త్రం

కాంతి దృష్టి లోపాలు- రకాలు

హ్రస్వదృష్టి: కంటికి దగ్గరగా ఉన్న వస్తువులను మాత్రమే చూడగలిగి, దూరంగా ఉన్న వాటిని సరిగా చూడలేకపోవడాన్ని 'హ్రస్వదృష్టి' అంటారు. తగిన నాభ్యంతరం ఉన్న వికేంద్రీకరణ (పుటాకార) కటకాన్ని ఉపయోగించి ఈ లోపాన్ని నివారించవచ్చు.

దూరదృష్టి(లేదా)దీర్ఘదృష్టి: కంటికి దూరంగా ఉన్న వస్తువులను మాత్రమే చూడగలిగి దగ్గరగా ఉన్న వాటిని చూడలేకపోవడాన్ని 'దూరదృష్టి' అంటారు. తగిన నాభ్యంతరం ఉన్న కేంద్రీకరణ(కుంభాకార) కటకాన్ని ఉపయోగించి ఈ లోపాన్ని నివారించవచ్చు.

అసమదృష్టి: కంటిలోని కార్నియాలో లోపం వల్ల ఈ సమస్య వస్తుంది. ఈ లోపం ఉన్న వ్యక్తులు ఒక వస్తువును చూసినప్పుడు అది అడ్డుగీతలు లేదా నిలువు గీతలుగా మాత్రమే కనిపిస్తుంది. ఈ లోపాన్ని సవరించడానికి స్థూపాకార కటకం వాడతారు.

చత్వారం: కొంత మందిలో వయసు పెరుగుతున్న కొద్దీ కన్ను దాని నేత్రానుగున్యతను కోల్పోతుంది. ఫలితంగా దగ్గరగా ఉన్న వస్తువును లేదా కొంత దూరంలో ఉన్న వస్తువును చూడటం వీలుకాదు. ఈ దృష్టి లోపాన్ని సవరించడానికి ద్వినాభి కటకాన్ని ఉపయోగిస్తారు.

రేచీకటి: విటమిన్-ఎ లోపం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. రేచీకటితో బాధపడే వారు పగటి సమయంలో మాత్రమే చూడగలుగుతారు. రాత్రివేళలో కృత్రిమ కాంతి జనకాల నుంచి వచ్చే కాంతి తీవ్రత వీరిలో దృష్టిజ్ఞానాన్ని ప్రేరేపించదు. ఈ సమస్య నివారణకు విటమిన్-ఎ ఎక్కువగా లభించే ఆహారాన్ని తీసుకోవాలి.

వర్ణాంధత్వం: కంటిలోని కోన్లలో తలెత్తే లోపం వల్ల వర్ణాంధత్వం కలుగుతుంది. ఈ సమస్య ఉన్నవారు అన్ని రంగులను గుర్తించలేరు. తల్లిదండ్రుల జన్యువుల ద్వారా పిల్లలకు సంక్రమిస్తుంది. ఈ దృష్టి లోపాన్ని నివారించడానికి ఎలాంటి ఔషధాలు, చికిత్సా విధానం అందుబాటులో లేదు.

అదృశ్య వికిరణాలు

పరారుణ కిరణాలు: వీటిని విలియం హెర్షెల్ కనుగొన్నాడు. వీటి తరంగదైర్ఘ్య అవధి 7,500 **Å- 40,00,000Å**. అన్ని రకాల గాజు పదార్థాలు ఈ కిరణాలను శోషించుకుంటాయి. రాతి ఉప్పుతో తయారైన పట్టకాలు, కటకాల ద్వారా ఈ తరంగాలు చొచ్చుకొని వెళ్లలేవు. కాబట్టి ఈ కటకాలను ఉపయోగించి పరారుణ కిరణాల ఉనికిని తెలుసుకోవచ్చు.

పరారుణ కిరణాలు తమ వెంట ఉష్ణాన్ని మోసుకెళుతూ ఎదురుగా ఉన్న వస్తువులను తాకినప్పుడు వాటికి ఉష్ణాన్ని బదిలీ చేస్తాయి. అందువల్ల ఈ కిరణాలను ఉష్ణ వికిరణాలు అని కూడా అంటారు. ఉష్ణ వికిరణ సూత్రం ఆధారంగా థర్మోపైల్, బోలోమీటర్ సాధనాలను ఉపయోగించి పరారుణ కిరణాల ఉనికిని తెలుసుకోవచ్చు.

అనువర్తనాలు:

- కండరాల నొప్పి, బెణకడం వల్ల వచ్చే నొప్పుల నివారణకు పరారుణ కిరణాలను ఉపయోగిస్తారు. పక్షవాతానికి చికిత్సలో, టీవీ, రేడియో కార్యక్రమాల ప్రసారాల్లో వీటిని వినియోగిస్తారు.
- ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి రహస్య సాంకేతికాలను ప్రసారం చేయడానికి ఈ కిరణాలు ఉపయోగపడతాయి.
- రిమోట్ సెన్సింగ్ విధానంలో వాడతారు.
- గోడలపై ఉన్న పాత చిత్రలేఖనాలను తొలగించడానికి ఉపయోగిస్తారు.
- పరారుణ కిరణాల తరంగదైర్ఘ్యం ఎక్కువ. అందువల్ల పొగమంచు, దుమ్ము, ధూళి కణాల ద్వారా ఈ తరంగాలు తక్కువ పరిక్షేపణం చెందుతాయి. రుజుమార్గంలో ఎక్కువ దూరం ప్రయాణిస్తాయి. కాబట్టి ఇలాంటి పదార్థాల ద్వారా వస్తువులను చూడటానికి, ఫొటోలు తీయడానికి ఈ కిరణాలను వాడతారు.
- భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహాలను నియంత్రించడానికి వాడతారు.
- నైట్ విజన్ కెమెరా, బైనాక్యులర్లలో ఈ కిరణాలను వాడతారు. రాత్రి వేళల్లో ఈ పరికరాలతో వస్తువులను స్పష్టంగా చూడవచ్చు.
- పరిశ్రమల బట్టీలు, కొలిమిల్లో ఎక్కువ ఉష్ణోగ్రతలను సృష్టించడానికి వాడతారు.
- పరారుణ కిరణాల ఆధారంగా వస్తువుల ఉష్ణోగ్రతను కొలిచే పద్ధతిని థర్మోగ్రఫీ అంటారు.
- గ్లోబల్ వార్మింగ్‌ను, ఒక ప్రదేశంలోని శీతోష్ణస్థితులను అధ్యయనం చేయడానికి ఈ తరంగాలను ఉపయోగిస్తారు.
- టెలిస్కోప్ పనిచేయడానికి కూడా ఈ కిరణాలను ఉపయోగిస్తారు.

అతినీలలోహిత కిరణాలు: వీటిని రిట్టర్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. వీటి తరంగదైర్ఘ్య అవధి **100Å- 4000Å**. క్వాంటం సిద్ధాంతం ప్రకారం ఈ కిరణాల శక్తి చాలా ఎక్కువ. క్వార్ట్జ్ గాజు మినహా మిగతా గాజు పదార్థాలన్నీ ఈ కిరణాలను శోషించుకుంటాయి. అందువల్ల క్వార్ట్జ్‌తో నిర్మించిన కటకాలు, పట్టకాలను ఉపయోగించి ఈ కిరణాల ఉనికిని తెలుసుకోవచ్చు.

గమనిక: అతినీలలోహిత కిరణాలను తేనెటీగలు చూడగలుగుతాయి.

అనువర్తనాలు:

- పాలు, నీళ్లలో ఉన్న హానికర బ్యాక్టీరియాను నశింపజేయడానికి, ఆహార పదార్థాలను మన్నికగా ఎక్కువ కాలం నిల్వ చేయడానికి అతినీలలోహిత కిరణాలను ఉపయోగిస్తారు.

గమనిక: ఆహార పదార్థాలను నిల్వ చేయడం కోసం వాటిలో సోడియం బెంజోయేట్‌ను కలుపుతారు.

- వైద్య రంగంలో స్టెరిలైజేషన్ కోసం (హానికరమైన బ్యాక్టీరియాను నశింపజేయడానికి) ఈ కిరణాలను ఉపయోగిస్తారు.
- పాడైన కోడిగుడ్లను గుర్తించడానికి వాడతారు.
- సహజ, కృతిమ దంతాల మధ్య తేడాలను తెలుసుకోవడానికి వీటిని ఉపయోగిస్తారు.
- టీవీ, రేడియో కార్యక్రమాల ప్రసారాల్లోనూ వినియోగిస్తారు.
- తొలిదశలో ఉన్న కేన్సర్ గడ్డలను కరిగించడానికి వీటిని వాడతారు.
- వేలిముద్రలను విశ్లేషించడానికి వాడతారు.
- వృక్షాలు కిరణజన్య సంయోగక్రియ జరపడానికి వీటిని ఉపయోగించుకుంటాయి.
- అతినీలలోహిత కిరణాలు మన శరీరంపై పడినప్పుడు 1 మి.మీ. లోతుకు చొచ్చుకెళ్లి విటమిన్-డిని ప్రేరేపిస్తాయి. రికెట్స్ వ్యాధి రాకుండా విటమిన్-డి తోడ్పడుతుంది.
- నకిలీ డాక్యుమెంట్లు, కరెన్సీ నోట్లను గుర్తించడానికి వినియోగిస్తారు.

నష్టాలు: సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల శక్తి అధికంగా ఉంటుంది. వీటి ద్వారా చర్మ కేన్సర్ సోకుతుంది. ఈ కిరణాలు నేరుగా భూమిని చేరకుండా వాతావరణంలోని ఓజోన్ పొర శోషించుకుంటుంది. కానీ క్లోరోఫ్లోరో కార్బన్‌లు, ఫ్రియాన్ వాయువుల వల్ల ఓజోన్ పొరకు రంధ్రాలు ఏర్పడుతున్నాయి. వీటి ద్వారా అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిని చేరుతాయి.

రేడియో తరంగాలు: వీటి తరంగదైర్ఘ్య అవధి 1 మిల్లీమీటరు నుంచి 100 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఇవి ఒక రకమైన విద్యుదయస్కాంత కిరణాలు. కాబట్టి శూన్యంలో, గాలిలో రేడియో తరంగాల వేగం కాంతి వేగానికి **(C = 3´108 m/s)** సమానంగా ఉంటుంది.

అనువర్తనాలు:

- రేడియో కార్యక్రమాల ప్రసారాల్లో వినియోగిస్తారు.
- టెలిస్కోప్‌లు పనిచేయడానికి వాడతారు.
- రాడార్‌లు పనిచేయడానికి ఉపయోగిస్తారు.
- వాతావరణంలోని మార్పులను ముందుగా గుర్తించడానికి ఈ తరంగాలను ఉపయోగిస్తారు.

మైక్రోవేవ్స్: వీటి తరంగదైర్ఘ్య అవధి 1 మీటరు - 1 మిల్లీ మీటరు. మైక్రో తరంగాలు ఒక రకమైన విద్యుదయస్కాంత తరంగాలు. గాలిలో, శూన్యంలో వీటి వేగం కాంతి వేగానికి సమానం.

అనువర్తనాలు:

- నావిగేషన్ విధానంలో (వాహనాలు, నౌకలు, విమానాల మార్గాలను తెలుసుకోవడానికి) ఉపయోగిస్తారు.
- టెలిమెట్రీ విధానంలో వాడతారు. భూమి నుంచి ఒక అంతరిక్ష నౌక మధ్య ఉండే దూరాన్ని కొలిచే పద్ధతిని టెలిమెట్రీ అంటారు.
- భూమి ఉపరితలం నుంచి మేఘాల ఎత్తు, అవి కదిలే దిశను తెలుసుకోవడానికి ఉపయోగిస్తారు.
- ఆప్టికల్ ఫైబర్ ద్వారా సమాచార ప్రసారం కోసం వీటిని వినియోగిస్తారు.
- మైక్రో ఓవెన్‌లో ఆహార పదార్థాలను వేడిచేయడానికి వాడతారు.
- ఈ తరంగాలు ఆహార పదార్థంలోని అణువుల లోపలికి చొచ్చుకెళ్లి వాటి కంపనాలను పెంచుతాయి. అందువల్ల ఈ కణాల కంపన శక్తి ఉష్ణశక్తిగా మారుతుంది. ఫలితంగా ఆహార పదార్థాలు వేడుక్కుతాయి.

అల్యూమినియం, రాగి, ఇనుము తదితర లోహాల ద్వారా మైక్రోవేవ్స్ చొచ్చుకెళ్లలేవు. కానీ అలోహాలైన గాజు, ప్లాస్టిక్, పేపర్ తదితరాల ద్వారా చొచ్చుకెళతాయి. కాబట్టి అలోహ పదార్థాలతో తయారుచేసిన పాత్రల్లో మాత్రమే ఆహార పదార్థాలను ఉంచి మైక్రోవేవ్ ఓవెన్‌లో వేడి చేయాలి. మైక్రో ఓవెన్‌ను స్పెన్సర్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.

మాదిరి ప్రశ్నలు

1. ట్రాఫిక్ సిగ్నళ్లు పనిచేయడంలో ఇమిడి ఉన్న ధర్మం?
   1) రుజువర్తనం 2) వ్యతికరణం
   3) సంపూర్ణాంతర పరావర్తనం
   4) వివర్తనం
2. కాంతి వ్యతికరణాన్ని కనుగొన్నది ఎవరు?
   1) హైగెన్స్ 2) థామస్ యంగ్
   3) న్యూటన్ 4) గ్రిమాల్డి
3. కాంతి పరిక్షేపణం దేనిపై ఆధారపడుతుంది?
   1) కాంతి కిరణాల కోణం
   2) కాంతి తరంగ దైర్ఘ్యం
   3) కాంతి కిరణం ఢీకొంటున్న కణాల పరిమాణం
   4) పైవన్నీ
4. ఆకాశం నిజమైన రంగు ఏది?
   1) నీలం 2) నలుపు
   3) తెలుపు 4) వర్ణ రహితం
5. నీటిపై నూనెను వెదజల్లినప్పుడు రంగులు కనిపించడానికి కారణం?
   1) వ్యతికరణం 2) వక్రీభవనం
   3) రుజువర్తనం 4) విశ్లేషణం
6. సీడీ, డీవీడీలపై కాంతి పతనమైనప్పుడు భిన్న రంగులు కనిపించడానికి కారణం?
   1) రుజువర్తనం 2) వివర్తనం
   3) విశ్లేషణం 4) ధ్రువణం
7. ఇంద్రధనస్సు ఏర్పడటానికి కారణమయ్యే కాంతి ధర్మం?
   1) వక్రీభవనం 2) విశ్లేషణం
   3) సంపూర్ణాంతర పరావర్తనం
   4) పైవన్నీ
8. హోలోగ్రఫీ విధానాన్ని ఆవిష్కరించింది ఎవరు?
   1) గేబర్ 2) ఫెర్మీ
   3) ఫారడే 4) బ్రటేయిన్
9. రామన్ ఫలితంలోని కాంతి ధర్మం ఏది?
   1) రుజువర్తనం 2) పరిక్షేపణం
   3) విశ్లేషణం 4) ధ్రువణం

సమాధానాలు

1) 3; 2) 2; 3) 4; 4) 4; 5) 1; 6) 2; 7) 4; 8) 1; 9) 2.